సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15

సంచిక: 352

మంగళవారం 14-3-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రజల జీవన ప్రమాణాలు ఇంకా మెరుగు పడాలి. అందుకు అధికారులు నిబద్ధత, పారదర్శకత, కార్యదీక్షతో పనిచేయాలి.'



సిరీస్ మనదే...

భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య నాలుగో టెస్ట్ 'డ్రా'గా ముగిసింది. దాంతో రోహిత్ శర్మ సారథ్యంలోని టీమిండియా 'బోర్డర్–గావస్కర్ ట్రోఫీ' సిరీస్‌ను 2–1తో సొంతం చేసుకుంది. మరోవైపు న్యూజిలాండ్ చేతిలో శ్రీలంక ఓడిపోవడంతో... భారత జట్టు వరుసగా రెండోసారి ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌కు అర్హత సాధించింది.

-12లో

సాక్షి బిజినెస్
మంగళవారం
14-3-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
897	259
58,238	17,154

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (రాత్రి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	11,215	△	76
డోజోన్స్	31,904	▽	6
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,549	▽	200
డాక్స్	14,959	▽	469
షాంఘై	3,269	△	39
నికాయ్	27,833	▽	311

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై	
బంగారం (24 క్యారెట్)	56,968
బంగారం (22 క్యారెట్)	56,740
వెండి (కిలో)	63,666

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎకటం	81.03	82.70
£	బ్రిటన్ పౌండ్	ఎకటం	97.67	100.96
€	యూరో	ఎకటం	86.29	89.34
¥	జపాన్ ఎన్ (100)	ఎకటం	60.16	62.13
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎకటం	53.47	55.79
S$	సింగపూర్ డాలర్	ఎకటం	59.97	61.92
SAR	సౌదీ రియాల్	రాయనకటం	20.90	22.58
UAE D	యూఏఈ దిర్హామ్	రాయనకటం	21.46	23.26
¥	చైనా యువాన్	రాయనకటం	10.82	12.89



బ్యాంక్.. క్రాష్

ఉన్నట్టుండి యూఎస్ సంస్థ సిలికాన్ వ్యాలీ బ్యాంక్(ఎస్‌వీబీ)ను మూసివేయడంతో మరోసారి ప్రపంచ స్టాక్ మార్కెట్లకు షాక్ తగిలింది. దీంతో యూరప్, ఆసియాసహా దేశీయంగానూ అమ్మకాలు వెల్లువెత్తాయి. వెరసి వరుసగా మూడో రోజు దేశీ స్టాక్ మార్కెట్లు క్షీణించగా.. ప్రధాన ఇండెక్సులు సెన్సెక్స్, నిఫ్టీ 5 నెలల కనిష్టాలకు చేరాయి.

- అమ్మకాల వెల్లువ.. 5 నెలల కనిష్టం
- సెన్సెక్స్ 897 పాయింట్లు పతనం
- ఇంట్రాడేలో 1,416 పాయింట్లు డౌన్
- చివరికి 58,238 వద్ద ముగింపు
- 259 పాయింట్లు కోల్పోయిన నిఫ్టీ
- బ్యాంకింగ్, మీడియా, ఆటో వీక్

ప్రధానంగా బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగ కౌంటర్లలో అమ్మకాలు ఊపందుకోవడంతో దేశీ స్టాక్ మార్కెట్లు పతనమయ్యాయి. సెన్సెక్స్ 897 పాయింట్లు కోల్పోయి 58,238 వద్ద నిలిచింది. నిఫ్టీ సైతం 259 పాయింట్లు దిగజారి 17,154 వద్ద ముగిసింది. ఇది ఐదు నెలల కనిష్టంకాగా.. ఒక దశలో సెన్సెక్స్ 1,040 పాయింట్లు పడిపోయి 58,095 దిగువకు చేరింది. నిఫ్టీ 300 పాయింట్లు క్షీణించి 17,113ను తాకింది. 2008 ఆర్థిక సంక్షోభం తదుపరి యూఎస్‌లో తిరిగి ఒక పెద్ద బ్యాంకు దివాలా స్థితికి చేరడంతో ఇన్వెస్టర్లలో ఆందోళనలు పెరిగినట్లు విశ్లేషకులు పేర్కొన్నారు. సిల్వర్‌గేట్ క్యాపిటల్ కార్ప్ ఇప్పటికే మూతపడటానికితోడు సిగ్నేచర్ బ్యాంక్‌లో సంక్షోభం సెంటిమెంటును దెబ్బతీసినట్లు తెలిపారు. కాగా.. తొలుత మార్కెట్లు లాభాలతో ప్రారంభమయ్యాయి. సెన్సెక్స్ 375 పాయింట్లు ఎగసి 59,511కు చేరింది. తదుపరి అమ్మకాలతో పట్టుతప్పి ఆ స్థాయి నుంచి మధ్యాహ్నానికల్లా 1,416 పాయింట్లు జారింది. మార్కెట్ పతనం నేపథ్యంలో సోమవారం ఇన్వెస్టర్ల సంపదగా పిలిచే బీఎస్ఈ మార్కెట్ విలువలో రూ. 4.43 లక్షల కోట్లకు పైగా ఆవిరైంది. రూ. 2,58,56,296 కోట్లకు పరిమితమైంది.

ఎన్ఎస్ఈలో అన్ని రంగాలూ డీలాపడగా.. బ్యాంకింగ్, మీడియా, ఆటో 2.5 శాతం చొప్పున నష్టపోయాయి. రియల్టీ, ఐటీ, కన్జూమర్ డ్యురబుల్స్, మెటల్, ఎఫ్ఎంసీజీ, ఆయిల్ గ్యాస్ 2-1 శాతం మధ్య నీరసించాయి. సెన్సెక్స్‌లో కేవలం టెక్ మహీంద్రా(7%) జంప్‌చేయగా.. నిఫ్టీలో అపోలో హాస్పిటల్స్, బ్రిటానియా, ఓఎన్‌జీసీ సైతం నిలదొక్కుకున్నాయి. అయితే ఇండస్ఇండ్ బ్యాంక్ 7% కుప్పకూలింది. ఎస్‌బీఐ, టాటా మోటార్స్, ఎంఅండ్ఎం, ఐషర్, యాక్సిస్, బజాజ్ ఫిన్, ఇన్ఫోసిస్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, హీరోమోటో, గ్రాసిమ్, అ్రల్టాటెక్, ఐసీఐసీఐ, టైటాన్, ఆర్ఐఎల్ 3-1.5% మధ్య క్షీణించాయి.

యస్ బ్యాంక్ డౌన్

మూడేళ్ల లాకిన్ గడువు ముగియడంతో సోమవారం యస్ బ్యాంక్ కౌంటర్లో అమ్మకాలు పెరిగాయి. తొలుత 13% క్షీణించి రూ.14.4కు చేరింది. చివరికి 5.3% నష్టంతో రూ.15.65 వద్ద క్లోజైంది.

విదేశీ బ్యాంకులు వెలవెల..

ఎస్‌వీబీ వైఫల్యం నేపథ్యంలో సోమవారం ట్రేడింగ్‌లో పలు బ్యాంకింగ్ స్టాక్స్ కుప్పకూలాయి. రీజనల్ బ్యాంకు స్టాక్స్‌లో వెస్టర్న్ అలయెన్స్ 75 శాతం, ఫస్ట్ రిపబ్లిక్ బ్యాంక్ 65 శాతం, పాక్‌వెస్ట్ బ్యాంక్‌కార్ప్ 46 శాతం చొప్పున పడిపోయాయి. ఇక యూరోపియన్, అమెరికన్ దిగ్గజాలలో క్రెడిట్ స్వీస్, డాయిష్ బ్యాంక్, యూబీఎస్, బార్‌క్లేస్, ఐఎన్‌జీ, లాయిడ్స్, హెచ్ఎస్‌బీసీ 8-3 శాతం మధ్య క్షీణించాయి. బ్యాంక్ ఆఫ్ అమెరికా, వెల్స్ ఫార్గో, సిటీగ్రూప్, జేపీ మోర్గాన్ చేజ్, గోల్డ్‌మన్ శాక్స్ 6-3 శాతం మధ్య డీలాపడ్డాయి.

పసిడి జోరు



బ్యాంకింగ్ వ్యవస్థపై భయాలతో రక్షణాత్మక పెట్టుబడిగా భావించే పసిడికి గిరాకీ పెరిగింది. దీంతో కామెక్స్‌లో ఔన్స్(31.1 గ్రాములు) 2.4 శాతంపైగా(44 డాలర్లు) ఎగసి 1,911 డాలర్లను అధిగమించింది. దేశీయంగా(న్యూఢిల్లీ) 10 గ్రాముల ధర రూ. 970 బలపడి రూ. 56,550ను తాకింది. వెండి సైతం కేజీ రూ. 1,600 పుంజుకుని రూ. 63,820కు చేరింది. అయితే యూఎస్ ట్రెజరీ ఈల్డ్స్ క్షీణించాయి. పదేళ్ల బాండ్ల ఈల్డ్ 3.7 శాతం నుంచి 3.46 శాతానికి, రెండేళ్ల బాండ్ల ఈల్డ్ 3.7 శాతం నుంచి 3.46 శాతానికి నీరసించింది. ఫెడ్ చైర్మన్ పావెల్ వడ్డీ రేట్ల పెంపు సంకేతాలివ్వగా.. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో రేట్లలో అత్యవసర కోతలు అవసరమంటూ కొంతమంది ఆర్థికవేత్తలు పేర్కొంటున్నారు.

అమెరికాలో మరో బ్యాంక్ డౌన్

- ఈసారి సిగ్నేచర్ బ్యాంకు వంతు
- నియంత్రణ సంస్థ అధీనంలోకి సంస్థ
- బ్రిడ్జ్ బ్యాంకుకు కార్యకలాపాల బదిలీ



వాషింగ్టన్: అమెరికాలో బ్యాంకుల మూసివేత పరంపర కొనసాగుతోంది. సిలికాన్ వ్యాలీ బ్యాంకు (ఎస్‌వీబీ) ఉదంతం జరిగి మూడు రోజులు కూడా గడవకుండానే తాజాగా సిగ్నేచర్ బ్యాంకు కూడా మూతబడింది. నియంత్రణ సంస్థ న్యూయార్క్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ .. బ్యాంకును తన అధీనంలోకి తీసుకుంది. బ్యాంకు ఆస్తులను విక్రయించి డిపాజిటర్లకు చెల్లింపుల జరిపే ప్రక్రియను పర్యవేక్షించేందుకు ఫెడరల్ డిపాజిట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎఫ్‌డీఐసీ)ని రిసీవర్‌గా నియమించింది. అప్పటి వరకూ డిపాజిటర్లకు యథాప్రకారంగా సేవలు అందేలా చూసేందుకు బ్యాంకు కార్యకలాపాలు, కొన్ని అసెట్లను సిగ్నేచర్ బ్రిడ్జ్ బ్యాంకుకు బదలాయించారు. సాధారణంగా ఏదైనా బ్యాంకు విఫలమైన పక్షంలో ప్రత్యేకంగా ఇలాంటి బ్రిడ్జ్ బ్యాంకు ఏర్పాటు చేసి సదరు బ్యాంకు కార్యకలాపాలను బదలాయిస్తారు. ఎఫ్‌డీఐసీ నియమించిన బోర్డు సారథ్యంలో ఈ బ్యాంకు పని చేస్తుంది. ఈ బ్రిడ్జ్ బ్యాంకు ద్వారా సిగ్నేచర్ ఖాతాదారులంతా యథాప్రకారం లావాదేవీలు నిర్వహించుకోవచ్చని ఎఫ్‌డీఐసీ తెలిపింది. ఎస్‌వీబీ సంక్షోభ నేపథ్యంలో సిగ్నేచర్ బ్యాంకు ఖాతాదారులు కూడా విత్‌డ్రాయల్స్‌కు ఎగబడటం.. బ్యాంకు మూసివేతకు దారితీసింది. ప్రధానంగా న్యాయ సేవల సంస్థలు, రియల్టీ, క్రిప్టో సంస్థలకు సేవలందించే సిగ్నేచర్ బ్యాంకుకు అమెరికావ్యాప్తంగా 40 శాఖలు ఉన్నాయి. 110.4 బిలియన్ డాలర్ల అసెట్లు, 82.6 బిలియన్ డాలర్ల డిపాజిట్లు ఉన్నాయి.

క్రిప్టో సంస్థలకు కష్టకాలం..

సిగ్నేచర్, ఎస్‌వీబీ మూసివేతతో క్రిప్టో కంపెనీల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. క్రిప్టో ఎక్స్ఛేంజీ కాయిన్‌బేస్‌కు సిగ్నేచర్ బ్యాంకులో 240 మిలియన్ డాలర్ల డిపాజిట్లు ఉన్నాయి. ఇక సర్కిల్ అనే క్రిప్టో సంస్థకు ఎస్‌వీబీలో 3.3 బిలియన్ డాలర్లు, దివాలా తీసిన క్రిప్టో రుణాల సంస్థ బ్లాక్‌ఫైకి 227 మిలియన్ డాలర్లున్నాయి. సిగ్నేచర్ బ్యాంకు కూడా మూతబడటంతో తమ కార్యకలాపాలపై ప్రభావం పడనున్నట్లు సర్కిల్ తెలిపింది. దీన్ని అధిగమించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొంది.

హెచ్ఎస్‌బీసీ చేతికి ఎస్‌వీబీ బ్రిటన్..



ఎస్‌వీబీ బ్రిటన్ విభాగాన్ని నామమాత్రంగా 1 పౌండుకు కొనుగోలు చేసినట్లు బ్యాంకింగ్ దిగ్గజం హెచ్ఎస్‌బీసీ వెల్లడించింది. బ్రిటన్‌లో తమ వ్యాపారాన్ని పటిష్టం చేసుకునేందుకు ఇది తోడ్పడగలదని పేర్కొంది. ఈ లావాదేవీ సజావుగా పూర్తయ్యేందుకు తగు చర్యలు తీసుకున్నట్లు బ్రిటన్ ప్రభుత్వం వెల్లడించింది. తద్వారా 3,000 మంది ఖాతాదారులకు చెందిన 6.7 బిలియన్ పౌండ్ల డిపాజిట్లకు భద్రత లభిస్తుందని పేర్కొంది.

ఎన్ఎండీసీ తాత్కాలిక సీఎండీగా అమితవ ముఖర్జీ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మైనింగ్ రంగ దిగ్గజం ఎన్ఎండీసీ తాత్కాలిక సీఎండీగా సంస్థ ఫైనాన్స్ డైరెక్టర్ అమితవ ముఖర్జీ అదనపు బాధ్యతలు స్వీకరించారు. మూడు నెలలు లేదా కొత్త సీఎండీ నియామకం పూర్తి అయ్యే వరకు ఆయన ఈ పదవిలో ఉంటారు. 1995 బ్యాచ్ ఇండియన్ రైల్వేస్ అకౌంట్స్ సర్వీస్‌కు చెందిన ముఖర్జీ 2017లో ఎన్ఎండీసీలో చేరారు. ఎన్ఎండీసీ సీఎండీ పదవి కోసం పోటీ పడుతున్న ఏడుగురిలో ముఖర్జీ కూడా ఉన్నారు.

ఫిబ్రవరి రిటైల్ ద్రవ్యోల్బణం 6.44 శాతం



న్యూఢిల్లీ: వినియోగ ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం 2023 ఫిబ్రవరిలో 6.44 శాతంగా (2022 ఇదే నెల ధరల బాస్కెట్‌తో పోల్చి) నమోదయ్యింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ)కి కేంద్రం నిర్దేశిస్తున్న 6 శాతం కన్నా ఇది ఎగువన కొనసాగుతుండడం గమనార్హం. అయితే 2023 జనవరి 6.52% కన్నా ద్రవ్యోల్బణం కొంత తగ్గింది. ఆర్‌బీఐ పాలసీకి ప్రాతిపదిక అయిన రిటైల్ ద్రవ్యోల్బణం 2022 నవంబర్, డిసెంబర్ మినహా 2022 జనవరి నుంచి 6 శాతం ఎగువనే కొనసాగుతోంది.

- ఫుడ్ బాస్కెట్ రిటైల్ ద్రవ్యోల్బణం 5.95%గా నమోదైంది. కూరగాయల ధరలు వార్షిక ప్రాతిపదికన చూస్తే, 11.61% తగ్గాయి. సుగంధ ద్రవ్యాల ధరలు 20%, తృణ ధాన్యా లు, ఉత్పత్తుల ధరలు 17% పెరిగాయి.
- ఫ్యూయెల్ అండ్ లైట్ సెగ్మెంట్‌లో ద్రవ్యోల్బణం 9.90 శాతంగా ఉంది.

రెపో మరింత పెరుగుదల: డీబీఎస్ రిసెర్చ్

ఇదిలాఉండగా, రిటైల్ ద్రవ్యోల్బణం 6 శాతం ఎగువనే కొనసాగుతున్న నేపథ్యంలో, వచ్చే నెల జరగనున్న ద్వైమాసిక ద్రవ్య పరపతి విధానం సందర్భంగా ఆర్‌బీఐ రెపో రేటును మరో 25 బేసిస్ పాయింట్లు పెంచే అవకాశం ఉందని డీబీఎస్ రిసెర్చ్ తన తాజా నివేదికలో అంచనావేసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

14-3-2023	
విశాఖ	440-00
చిత్తూరు	473-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	431-00
విజయవాడ	431-00
రిటైల్ ధర (డజను)	66.00
13-3-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	430-00
వరంగల్	432-00
రిటైల్ ధర	4.90

హ్యుందాయ్ చేతికి జీఎం ప్లాంట్!

ఇరు సంస్థల మధ్య ఒప్పందం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: హ్యుందాయ్ మోటార్ ఇండియా.. మహారాష్ట్రలోని పుణే సమీపంలో ఉన్న జనరల్ మోటార్స్ (జీఎం) ఇండియాకు చెందిన తాలేగావ్ ప్లాంటును కొనుగోలు చేయనుంది. డీల్ పూర్తయితే స్థలం, భవనాలు, యంత్రాలు హ్యుందాయ్ పరం కానున్నాయి. ఇందుకోసం జీఎం ఇండియాతో టెర్మ్ షీట్ ఒప్పందం చేసుకున్నట్లు దక్షిణ కొరియాకు చెందిన హ్యుందాయ్ సోమవారం ప్రకటించింది. అయితే డీల్ విలువను వెల్లడించలేదు. ప్లాంటు చేతికి వచ్చిన తర్వాత తొలుత వెన్యూ ఎస్‌యూవీని ఈ కేంద్రంలో తయారు చేసి ఎగుమతి చేయాలన్నది హ్యుండై ఆలోచన. 2028 నాటికి భారత్‌లో రూ.4,000 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు హ్యుందాయ్ ఇప్పటికే ప్రకటించింది. అలాగే 6 ఎలక్ట్రిక్ కార్లను ప్రవేశపెట్టనున్నట్లు పేర్కొంది. చెన్నై సమీపంలోని శ్రీపెరుంబుదూరు వద్ద ఉన్న హ్యుందాయ్ ప్లాంటు దాదాపు పూర్తి సామర్థ్యంతో నడుస్తోంది. భారత్‌తోపాటు విదేశాల నుంచి కంపెనీ కార్లకు పెరుగుతున్న డిమాండ్ నేపథ్యంలో అదనపు తయారీ సామర్థ్యం ఇప్పుడు సంస్థకు తప్పనిసరి.

విద్య, ఉద్యోగ సమాచారం

ఏపీ ఈఏపీసెట్-2023

ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్-2023 (ఏపీ ఈఏపీసెట్) నోటిఫికేషన్‌ను ఏపీ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి విడుదల చేసింది. ఈ పరీక్షను జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ అనంతపురం (జేఎన్‌టీయూఏ) నిర్వహించనుంది. 2023 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, ప్రైవేట్ అన్‌ఎయిడెడ్, అఫిలియేటెడ్ ప్రొఫెషనల్ కళాశాలల్లో అండర్ గ్రాడ్యుయేట్ ప్రొఫెషనల్ ఇంజనీరింగ్, అగ్రికల్చర్ /హార్టికల్చర్, ఫార్మసీ, వెటర్నరీ/ఫిషరీస్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు.

కోర్సుల వివరాలు

- ఇంజనీరింగ్, బయో టెక్నాలజీ, బీటెక్(డెయిరీ టెక్నాలజీ), బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్), బీటెక్(ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ); బీఎస్సీ(అగ్రికల్చర్), బీఎస్సీ(హార్టికల్చర్), బీవీఎస్సీ అండ్ ఏహెచ్, బీఎఫ్ఎస్సీ; బీఫార్మసీ, ఫార్మ్-డి.
- **అర్హత:** కనీసం 45 శాతం మార్కుల(రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులకు 40 శాతం)తో ఇంటర్మీడియట్(ఎంపీసీ/బైపీసీ) లేదా ఇంటర్ ఒకేషనల్ కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. చివరి సంవత్సరం ఇంటర్ పరీక్షలకు హాజరైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. లేదా డిప్లొమా(ఇంజనీరింగ్) ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:** ఇంజనీరింగ్,ఫార్మసీ కోర్సుల అభ్యర్థులు 31.12.2023నాటికి 16 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ట వయోపరిమితి లేదు. **ఫార్మ్-డి కోర్సు:** 31.12.2023 నాటికి 17 ఏళ్లు నిండి ఉండాలి.
- **పరీక్ష మాధ్యమం:** ఇంగ్లిష్, తెలుగు మీడియంలో ప్రశ్నలు ఉంటాయి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆలస్య రుసుము లేకుండా దరఖాస్తుల సమర్పణ:** మార్చి11 నుంచి ఏప్రిల్ 15 వరకు.
- **రూ.500 నుంచి రూ.10,000 వరకు ఆలస్య రుసుముతో దరఖాస్తు తేదీ:** ఏప్రిల్ 30 నుంచి మే 14 వరకు.
- **దరఖాస్తుల తప్పుల సవరణ:** మే 4 నుంచి 6 వరకు;
- **వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లు:** మే 09 నుంచి
- **ప్రవేశ పరీక్షలు:** మే 15 నుంచి మే 18 తేదీల్లో ఇంజనీరింగ్; మే 22 నుంచి 23 తేదీల్లో అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ.
- **వెబ్‌సైట్:** https://cets.apsche.ap.gov.in

సీఎస్ఐఆర్-యూజీసీ నెట్ డిసెంబర్ 2022/జూన్ 2023

సీఎస్ఐఆర్ యూజీసీ నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్(నెట్) డిసెంబర్-2022 /జూన్-2023కు నోటిఫికేషన్ విడుదలైంది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) పరీక్షను నిర్వహించనుంది. ఈ పరీక్ష ద్వారా జేఆర్ఎఫ్ అర్హత పొందితే సీఎస్ఐఆర్ పరిధిలోని రీసెర్చ్ సెంటర్లలో, విశ్వవిద్యాలయాల్లో పీహెచ్‌డీకి దరఖాస్తు చేసుకోవచ్చు. లెక్చరర్‌షిప్‌కు అర్హత పొందితే విశ్వవిద్యాలయాలు లేదా డిగ్రీ కళాశాలల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఎంపికకావచ్చు.

- **సబ్జెక్టులు:** పరీక్ష ను ఐదు సబ్జెక్టుల్లో నిర్వహిస్తారు. కెమికల్ సైన్సెస్, ఎర్త్, అట్మాస్ఫియరిక్, ఓషన్ అండ్ ప్లానెటరీ సైన్సెస్,లైఫ్ సైన్సెస్,మ్యాథమేటికల్ సైన్సెస్,ఫిజికల్ సైన్సెస్.
- **అర్హత:** కనీసం 55 శాతం మార్కులతో ఎమ్మెస్సీ తత్సమాన ఉత్తీర్ణులు/నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఎస్ఎంఎస్/బీఈ/బీటెక్/బీఫార్మసీ/ఎంబీబీఎస్ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఓబీసీ(ఎన్‌సీఎల్),ఎస్సీ,ఎస్టీ,థర్డ్‌జెండర్,దివ్యాంగ అభ్యర్థులు అర్హత పరీక్షలో కనీసం 50 శాతం మార్కులు పొందాలి.
- **వయసు:** జేఆర్ఎఫ్‌కు అర్హతకు సంబంధించి జనరల్ కేటగిరీ అభ్యర్థులకు 01.07.2022 నాటికి 28 ఏళ్లు మించకుండా ఉండాలి. ఎస్సీ/ఎస్టీ /దివ్యాంగులు /మహిళ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీ(నాన్‌క్రిమిలేయర్)లకు మూడేళ్ల గరిష్ట వయసు సడలింపు లభిస్తుంది. అసిస్టెంట్ ప్రొఫెసర్/లెక్చరర్‌షిప్‌కు ఎలాంటి గరిష్ట వయోపరిమితి నిబంధన లేదు.
- **పరీక్ష విధానం:** పరీక్ష 200 మార్కులకు నిర్వహిస్తారు. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో పరీక్ష జరుగుతుంది.మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నల పద్ధతిలో పరీక్ష ఉంటుంది. పరీక్ష వ్యవధి 3 గంటలు. ప్రశ్నపత్రంలో మొత్తం మూడు విభాగాలు ఉంటాయి.

ముఖ్యసమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఫీజు చెల్లింపు,ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేదీ:** 10.04.2023.
- **దరఖాస్తు సవరణ తేదీలు:** 12.04.2023 నుంచి 18.04.2023 వరకు. **పరీక్ష తేదీలు:** 6.06.2023, 7.06.2023, 8.06.2023.
- **వెబ్‌సైట్:** csirnet.nta.nic.in

జీపీటీబీ-బీఈటీ పరీక్ష-2023

గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్-బయోటెక్నాలజీ(జీఏటీబీ)/బయో టెక్నాలజీ ఎలిజిబిలిటీ టెస్ట్ (బీఈటీ)-2023 జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌ల కోసం ప్రకటన వెలువడింది. ఈ పరీక్షను పోస్టు గ్రాడ్యుయేట్ బయోటెక్నాలజీ విభాగాల్లో ప్రవేశాలకు నిర్వహిస్తారు. జీఏటీబీ-బీఈటీ-2023ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) నిర్వహిస్తోంది.

- **జీఏటీ-బీ కోర్సులు:**ఎమ్మెస్సీ(బయో టెక్నాలజీ,అగ్రి బయోటెక్నాలజీ,సంబంధిత విభాగాలు),ఎంటెక్(బయోటెక్నాలజీ, సంబంధిత విభాగాలు),ఎంవీఎస్సీ(యానిమల్ బయోటెక్నాలజీ)
- **అర్హత:** కనీసం 55 శాతం మార్కులతో సంబంధిత విభాగంలో బీఎస్సీ, ఎంబీబీఎస్, బీడీఎస్, బీవీఎస్సీ, బీఎఫ్ఎస్సీ, బీఏఎంఎస్, బీహెచ్ఎంఎస్, బీపీటీ, బీటెక్, ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ఉత్తీర్ణులై ఉండాలి.
- **బీఈటీ కోర్సులు:** ఈ పరీక్షలో ప్రతిభ ఆధారంగా పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు.
- **అర్హత:** కనీసం 60 శాతం మార్కులతో సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్, ఎంబీబీఎస్, ఎంటెక్, ఎంఎస్సీ, ఎంవీఎస్సీ, ఎంఫార్మసీ, ఇంటిగ్రేటెట్ ఎంఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:** జనరల్ అభ్యర్థులకు 28 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 33 ఏళ్లు, దివ్యాంగులు, మహిళలు 31 ఏళ్లు మించకూడదు.
- **పరీక్ష విధానం:** కంప్యూటర్ ఆధారిత విధానంలో మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష వ్యవధి: 180 నిమిషాలు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరితేదీ:** 31.03.2023.
- **పరీక్ష తేది:** 23.04.2023. **వెబ్‌సైట్:** dbt.nta.ac.in

ఐసెట్‌తో ఎంబీఏ, ఎంసీఏ

- మొదలైన టీఎస్ ఐసెట్ 2023 దరఖాస్తు ప్రక్రియ
- మే 26, 27 తేదీల్లో నాలుగు స్లాట్లలో ఎంట్రన్స్ టెస్ట్
- ఈ ర్యాంకు ఆధారంగా ఎంబీఏ, ఎంసీఏల్లో ప్రవేశం

మేనేజ్‌మెంట్ ప్రొఫెషన్.. ఐటీ ప్రొఫెషనల్స్. ప్రస్తుతం డిగ్రీ చదువుతున్న లక్షల మంది విద్యార్థుల లక్ష్యం! భవిష్యత్ మేనేజర్లుగా, ఐటీ ప్రొఫెషనల్స్‌గా మారేందుకు మార్గం.. ఎంబీఏ, ఎంసీఏ కోర్సులు!! వీటిల్లో చేరేందుకు ఐసెట్‌లో ర్యాంకు తప్పనిసరి. తాజాగా.. తెలంగాణ ఉన్నత విద్యా మండలి టీఎస్ ఐసెట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దరఖాస్తు ప్రక్రియ కూడా మొదలైంది. ఈ నేపథ్యంలో.. టీఎస్ ఐసెట్-2023 వివరాలు, అర్హతలు, పరీక్ష విధానం, బెస్ట్ ర్యాంకుకు ప్రిపరేషన్ గైడెన్స్..



ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్.. సంక్షిప్తంగా ఐసెట్! ఇందులో సాధించిన ర్యాంకు ఆధారంగా..మాస్టర్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్(ఎంబీఏ), మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్(ఎంసీఏ) కోర్సుల్లో ప్రవేశం లభిస్తుంది. మేనేజ్‌మెంట్, ఐటీ విభాగాల్లో కొలువులు కోరుకునే విద్యార్థులు ఎంబీఏ, ఎంసీఏల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు.

అర్హతలు

- గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. • ఎంసీఏ అభ్యర్థులు ఇంటర్మీడియెట్‌లో మ్యాథమెటిక్స్ గ్రూప్ సబ్జెక్ట్‌గా చదివుండాలి.
- బ్యాచిలర్ డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

ఆన్‌లైన్ పరీక్ష

- టీఎస్ ఐసెట్-2023 పరీక్ష మే 26, 27 తేదీల్లో ఆన్‌లైన్ విధానంలో ఉంటుంది. మొత్తం మూడు సెక్షన్లుగా 200 ప్రశ్నలు-200 మార్కులకు పరీక్ష జరుగుతుంది. -విభాగం-ఏలో డేటా సఫిషియన్సీ 20 ప్రశ్నలు-20 మార్కులు, ప్రాబ్లమ్ సాల్వింగ్ 55 ప్రశ్నలు-55 మార్కులకు; విభాగం-బిలో మ్యాథమెటికల్ ఎబిలిటీ 75 ప్రశ్నలు-75 మార్కులకు, విభాగం-సిలో కమ్యూనికేషన్ ఎబిలిటీ 50 మార్కులకు ఉంటాయి.
- సెక్షన్-ఎలోని డేటా సఫిషియన్సీ విభాగంలో 15 ప్రశ్నలు మ్యాథమెటికల్, మరో అయిదు ప్రశ్నలు వెర్బల్ ఆధారిత ప్రశ్నలు ఉంటాయి. సెక్షన్-ఎలోని ప్రాబ్లమ్ సాల్వింగ్ విభాగంలో.. సిరీస్ కొశ్చన్స్ 25; డేటా అనాలిసిస్ సంబంధిత ప్రశ్నలు 10; కోడింగ్ అండ్ డీ కోడింగ్ సంబంధిత ప్రశ్నలు 10, డేట్, టైమ్ అండ్ అరేంజ్‌మెంట్‌కు సంబంధిత 10 ప్రశ్నలు అడుగుతారు.
- సెక్షన్-బిలో అర్థమెటికల్ ఎబిలిటీ నుంచి 35 ప్రశ్నలు; అల్జీబ్రికల్ అండ్ జామెట్రికల్ ఎబిలిటీ నుంచి 30 ప్రశ్నలు; స్టాటిస్టికల్ ఎబిలిటీ నుంచి 10 ప్రశ్నలు ఉంటాయి.
- సెక్షన్-సిలోని కమ్యూనికేషన్ ఎబిలిటీలో.. మీనింగ్స్,సినానిమ్స్ అండ్ యాంటానిమ్స్,వెర్బ్స్, ఫ్రేజల్ వెర్బ్స్ అండ్ ఇడియమ్స్, ఆర్టికల్స్ అండ్ ప్రిపొజిషన్స్, కంప్యూటర్ టెర్మినాలజీ, బిజినెస్ టెర్మినాలజీ, కాంప్రహెన్షన్‌ల నుంచి అయిదు ప్రశ్నలు చొప్పున అడుగుతారు. కాంప్రహెన్షన్ నుంచి మూడు ప్యాసేజ్‌లు ఉంటాయి. ఒక్కో ప్యాసేజ్ నుంచి అయిదు ప్రశ్నలు అడుగుతారు.
- మొత్తం పరీక్షకు కేటాయించిన సమయం రెండున్నర గంటలు.

22 వేలకు పైగా సీట్లు

గత ఏడాది కౌన్సెలింగ్ గణాంకాల ప్రకారం-టీఎస్ ఐసెట్ ద్వారా కన్వీనర్ కోటాలో ఎంబీఏ, ఎంసీఏలకు సంబంధించి 272 కళాశాలల్లో దాదాపు 25 వేల సీట్లు ఉన్నాయి. 231 కళాశాలల్లో 20,481 ఎంబీఏ సీట్లు, 40 కళాశాలల్లో 2,370 ఎంసీఏ సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఐసెట్ ర్యాంకు ఆధారంగా మలి దశలో ఆన్‌లైన్ వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించి సీట్ల కేటాయిస్తారు.

విజయం సాధించేలా

రాష్ట్రంలోని యూనివర్సిటీ క్యాంపస్ కళాశాలలు,అనుబంధ కళాశాలల్లో ఎంబీఏ,ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఐసెట్‌కు పోటీ కూడా పెరుగుతోంది.గత ఏడాది ఐసెట్‌కు 62 వేల మంది దరఖాస్తు చేసుకోవడమే ఇందుకు నిదర్శనంగా చెప్పొచ్చు. కాబట్టి ఇందులో బెస్ట్ ర్యాంకు సాధించేందుకు సిలబస్ అంశాలపై గట్టి పట్టు సాధించాల్సి ఉంటుంది.

అనలిటికల్ ఎబిలిటీ

విశ్లేషణాత్మక నైపుణ్యాలను పరీక్షించే విభాగం ఇది. ఇందులో రాణించడానికి డేటా సఫిషియెన్సీ; ప్రాబ్లమ్ సాల్వింగ్ అంశాల్లో నైపుణ్యం సాధించాలి. డేటాను ఇచ్చి దాని ఆధారంగా సమస్య సాధించేవిగా, స్టేట్‌మెంట్ ఆధారితంగా ప్రశ్నలు ఉంటాయి. వీటికి సమాధానాలు గుర్తించేందుకు బేసిక్ అర్థమెటిక్ అంశాల్లో పట్టు సాధించాలి. ఇది విభాగం-బిలోనూ రాణించేందుకు దోహదపడుతుంది. స్టేట్‌మెంట్ ఆధారిత ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలంటే..గణితంపై ప్రాథమిక అవగాహన అవసరం. ప్రాబ్లమ్ సాల్వింగ్ విభాగంలో రీజనింగ్ ఆధారిత ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థులు కోడింగ్, డీ-కోడింగ్, బ్లడ్ రిలేషన్, సిరీస్, సిలాజిజమ్, సీటింగ్ అరేంజ్‌మెంట్ వంటి అంశాలపై పూర్తి అవగాహన పెంచుకోవాలి.

మ్యాథమెటికల్ ఎబిలిటీ

ఈ విభాగం కోసం హైస్కూల్ స్థాయి మ్యాథమెటిక్స్ పుస్తకాలను అధ్యయనం చేయాలి. ప్రశ్నల శైలి కొంత క్లిష్టంగా ఉండే స్టాటిస్టికల్ ఎబిలిటీ కోసం ఇంటర్మీడియెట్ స్థాయి పుస్తకాలను అనుసరించాలి. అర్థమెటిక్ విభాగంలోని ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలంటే.. శాతాలు, లాభ నష్టాలు, నిష్పత్తులు, మెన్సురేషన్, పని-కాలం, పని-సమయం వంటి అంశాలు ముఖ్యమైనవి. అల్జీబ్రికల్ అండ్ జామెట్రికల్ ఎబిలిటీ కోసం ట్రిగ్నోమెట్రిక్ రేషియోస్ ఆఫ్ యాంగిల్స్, సెట్స్, లీనియర్ ఈక్వేషన్స్, కోఆర్డినేట్ జామెట్రీలపై పట్టు సాధించాలి.

కమ్యూనికేషన్ ఎబిలిటీ

- ఈ విభాగంలో కొంత ఎక్కువ మార్కులు సొంతం చేసుకునే అవకాశం ఉంది. ప్రాక్టీస్, విశ్లేషణ సామర్థ్యం, కంపేరిటివ్ అప్రోచ్ ఉంటే.. మొత్తం 50 ప్రశ్నల్లో 40 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించొచ్చు. బేసిక్ ఇంగ్లిష్ గ్రామర్‌పై అవగాహన పెంచుకోవాలి. వొకాబ్యులరీ పెంచుకునేందుకు కృషి చేయాలి. ప్రతి రోజు కనీసం 20 కొత్త పదాలు నేర్చుకోవడం , వాటి వినియోగాన్ని ప్రాక్టీస్ చేయాలి. బిజినెస్ అండ్ కంప్యూటర్ టెక్నాలజీలో.. సామాజిక వ్యాపార-వాణిజ్య అంశాలు, అదే విధంగా తాజా పరిణామాలు, కంప్యూటర్ బేసిక్స్‌పై అవగాహనను పరీక్షించే విధంగా ప్రశ్నలు ఉంటాయి. వీటిలో రాణించాలంటే.. బిజినెస్ టెర్మినాలజీ, కొత్త వ్యాపార విధానాలు, ఆయా సంస్థలు-వాటి క్యాప్షన్లు వంటివి తెలుసుకోవాలి. కంప్యూటర్ టెర్మినాలజీకి సంబంధించి బేసిక్ ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్ టూల్స్, అదే విధంగా కంప్యూటర్ హార్డ్‌వేర్‌కు సంబంధించిన ముఖ్య భాగాలు, వాటి పనితీరుకు సంబంధించి ప్రాథమిక నైపుణ్యం కలిసొస్తుంది.
- రీడింగ్ కాంప్రహెన్షన్ విభాగంలో.. ప్యాసేజ్‌ల ఆధారంగా అడిగే 15 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలంటే.. ముందుగా అభ్యర్థులు ఆయా అంశాన్ని, అందులోని కీలక పదాలను, ముఖ్య సారాంశాన్ని గుర్తించే నేర్పు పెంచుకోవాలి. ఇందుకోసం దినపత్రికల వ్యాసాలు, ఇంగ్లిష్ స్టోరీ బుక్స్ చదవాలి. ఫంక్షనల్ గ్రామర్‌లో మంచి మార్కుల కోసం బేసిక్ గ్రామర్ అంశాలుగా పేర్కొనే సినానిమ్స్, యాంటానిమ్స్, కొశ్చన్ ట్యాగ్స్, డైరెక్ట్-ఇన్‌డైరెక్ట్ స్పీచ్‌లను ప్రాక్టీస్ చేయాలి. ఇందుకోసం ఆరు నుంచి పదో తరగతి వరకు ఇంగ్లిష్ గ్రామర్ బుక్స్ చదవడం ఉపయుక్తంగా ఉంటుంది.

ప్రాక్టీస్‌తో పదును

ఐసెట్‌లో మంచి స్కోర్ సాధించేందుకు చక్కటి మార్గం.. ప్రాక్టీస్. కాబట్టి అభ్యర్థులు ఆయా టాపిక్స్ అధ్యయనంతో పాటు ప్రతి రోజూ కొంత సమయం ప్రాక్టీస్‌కు కేటాయించాలి. దీంతోపాటు పరీక్షకు నిర్దేశించిన సిలబస్ అంశాలను అప్లికేషన్ ఓరియెంటేషన్ కోణంలో అధ్యయనం చేయాలి.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు:**మార్చి 6-మే6, 2023
- రూ.250 అపరాధ రుసుముతో మే 12 వరకు, రూ.500 అపరాధ రుసుముతో మే 18 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.
- **హాల్ టికెట్ డౌన్‌లోడ్ సదుపాయం:**మే22, 2023
- **ఐసెట్ పరీక్ష తేదీలు:** మే 26, 27, 2023
- **వెబ్‌సైట్:** https://icet.tsche.ac.in

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15
సంచిక: 352

మంగళవారం 14-3-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'పారిశ్రామిక రంగానికి దీటుగా సేద్యరంగం ఎదగాలి. వ్యవసాయ ఫలాలు పదింతలు పెరగాలి'



'ది ఎలిఫెంట్ విస్పరర్స్' షార్ట్‌ఫిల్మ్‌కు అవార్డు అందుకున్న దర్శకురాలు కార్తీకి, నిర్మాత గునీత్ మోంగా



అదరగొట్టిన ఎవ్రీవేర్ ఎవ్రీథింగ్..

'ఎవ్రీవేర్ ఎవ్రీథింగ్ ఆల్ ఎట్ వన్స్' ఉత్తమ చిత్రంగా నిలిచింది. ఇదే చిత్రానికి ఉత్తమ దర్శకుడిగా డానియల్ క్వాన్, డానియల్ స్కీనెర్ట్.. ఉత్తమ నటిగా మిషెల్ యో అవార్డులను అందుకున్నారు.






ఉత్తమ నటుడు: బ్రెండెన్ ఫ్రాసెర్

('దివేల్' సినిమాలో నటనకు..)

నటనలో మూడు దశాబ్దాల చరిత్ర ఉన్న బ్రెండెన్‌కు ఇదే తొలి ఆస్కార్ కావడం విశేషం.



తెలుగు పాటకు ఆస్కార్ డ్యాన్స్

'నాటు నాటు'పాటకు బెస్ట్ ఒరిజినల్ సాంగ్ విభాగంలో పురస్కారం





లాస్ ఏంజెలిస్‌లో అవార్డు అందుకున్న కీరవాణి, చంద్రబోస్

- దేశానికి తొలి ఆస్కార్‌తో రికార్డు సృష్టించిన 'ఆర్‌ఆర్‌ఆర్'
- బెస్ట్ డాక్యుమెంటరీ షార్ట్ ఫిల్మ్ విభాగంలో మన దేశానికే చెందిన 'ది ఎలిఫెంట్ విస్పరర్స్'కు ఆస్కార్
- 'ఎవ్రీవేర్ ఎవ్రీథింగ్ ఆల్ ఎట్ వన్స్'కు ఏడు అవార్డులు..
- బెస్ట్ ఇంటర్నేషనల్ ఫీచర్ ఫిల్మ్ సహా నాలుగు అవార్డులతో అలరించిన 'ఆల్ క్వైట్ ఆన్ ది వెస్ట్రన్ ఫ్రంట్'

'సెవులు సిల్లు పడేలా కీసు పిట్ట కూసినట్టు..'
..ఆ కూత ప్రపంచానికి వినిపించింది
'కాలు సిందు తొక్కేలా దుమారం రేగినట్టు.. నాటు నాటు నాటు ఊర నాటు'..
..ఆ సిందు ప్రపంచాన్ని కాలు కదిపేలా చేసింది

అంతగా 'నాటు నాటు'పాట మనసుకి పట్టేసింది. 95వ ఆస్కార్ అవార్డ్స్‌లో 'ఊర నాటు...'పాట వీర విజయం సాధించింది. దేశానికి తొలి ఆస్కార్ అవార్డ్‌ను నాటిన చిత్రం 'ఆర్‌ఆర్‌ఆర్'. తెలుగుకి తొలి ఆస్కార్‌ని తెచ్చింది కూడా ఈ చిత్రమే. గతంలో 'గాంధీ', 'స్లమ్ డాగ్ మిలియనీర్'వంటి చిత్రాలకు గాను భారతీయులకు ఆస్కార్ దక్కినప్పటికీ అవి భారతీయ చిత్రాలు కావు. అందుకే ఆస్కార్ సాధించిన తొలి భారత చిత్రంగా 'ఆర్‌ఆర్‌ఆర్' చరిత్ర సాధించింది. ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మించిన 'ఆర్‌ఆర్‌ఆర్'లోని 'నాటు నాటు..' పాట 'బెస్ట్ ఒరిజినల్ సాంగ్' విభాగంలో ఆస్కార్ సాధించింది. చిత్ర సంగీత దర్శకుడు కీరవాణి, పాట రచయిత చంద్రబోస్ ఈ అవార్డు అందుకున్నారు.

ఆదివారం రాత్రి 8 గంటల (భారతీయ కాలమానం ప్రకారం సోమవారం ఉదయం 5.30 గంటల)కు లాస్ ఏంజెలిస్‌లోని డాల్బీ థియేటర్లో ప్రారంభమైన ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవాన్ని భారతదేశం మొత్తం ఆసక్తిగా తిలకించింది. 'అండ్ ది అవార్డ్ గోస్ టు.. నాటు నాటు' అనే శబ్దం సెవులు సిల్లు పడేలా విని పించాలనే సినీ ప్రేమికుల ఆకాంక్ష నెరవేరింది. సౌండ్ బలంగా వినిపించింది. విశ్వ వేదికపై దేశం మెరిసింది. తెలుగు నేల మురిసింది. 'నాటు నాటు..' సృష్టించిన చరిత్రకు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుతున్నాయి.

మన దేశానికి మరో ఆస్కార్ కూడా..: మన దేశానికి చెందిన 'ది ఎలిఫెంట్ విస్పరర్స్'కు బెస్ట్ డాక్యుమెంటరీ

మిగతా 2వ పేజీలో ▶

చల్లగరిగలో పండుగ..

14లో

- 'నాటు నాటు' రచయిత చంద్రబోస్ స్వగ్రామంలో వేడుకలు
- బాణసంచా పేల్చి, మిఠాయిలు పంచిన స్నేహితులు, గ్రామస్తులు

ఊర నాటు ఆస్కార్ హిట్టు

ఉక్రెయిన్‌లో 17 రోజుల కష్టం

అంబారీ ఎక్కి ఆస్కార్ వచ్చింది

- ఫ్యామిలీలో ▶

న్యూస్‌రీల్

రేపట్నుంచి ఇంటర్ పరీక్షలు



బుధవారం నుంచి మొదలయ్యే ఇంటర్ పరీక్షలు ఏప్రిల్ 4వ తేదీ వరకూ కొనసాగనున్నాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష ఉంటుంది. ఈ మేరకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తెలిపారు.

- వివరాలు 3లో ▶

పిళ్లై ఈడీ కస్టడీ పొడిగింపు



లిక్కర్ కేసులో అరుణ్ పిళ్లై ఈడీ కస్టడీని ప్రత్యేక కోర్టు పొడిగించింది. సౌత్‌గ్రూపులో కీలక వ్యక్తికి నోటీసులు జారీ చేయగానే పిళ్లై తన వాంగ్మూలం ఉపసంహరణ పిటిషన్ వేశారని పరోక్షంగా కవితకు నోటీసులపై ఈడీ ధర్మాసనానికి తెలిపింది.

- వివరాలు 13లో ▶

'స్వలింగ వివాహం'పై ధర్మాసనం



స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కల్పించాలంటూ దాఖలైన పిటిషన్లను ఐదుగురు న్యాయమూర్తుల సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం విచారించనుంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ నిర్ణయం తీసుకుంది.

- వివరాలు 6లో ▶

అవినాశ్‌పై ఎలాంటి చర్యలొద్దు



ఏపీ మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై వాదనలు విన్న అనంతరం అరెస్టు సహా ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోవద్దని సీబీఐని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది.

- వివరాలు 10లో ▶

ఇదండీ సంగతి



రేపట్నుంచి చాయ్ తాగడానికి కూడా ఎవరూ ఉండటం లేద్సార్!
యాత్రకు మీతో పాటు నేనూ వస్తాను!!

చందాదారుల సొమ్ముతో దందా!



సేకరించిన డబ్బులను దారి మళ్లించిన మార్గదర్శి

- సొమ్ములు మన చందాదారులవి.. పెత్తనం పక్క రాష్ట్రాల వారిది
- ఇదో పోంజీ స్కామ్.. అక్రమాలకు ఆధారాలున్నాయన్న కోర్టులు
- పలువురు చందాదారుల నుంచి ఫిర్యాదులూ అందాయి
- విచారణకు సహకరించని యాజమాన్యం
- చందాదారుల సొమ్ముకు భద్రత కల్పించడం మా విధి
- ఈ కేసులో విచారణ కొనసాగిస్తాం
- మీడియాతో ఏపీ సీఐడీ అదనపు డీజీ సంజయ్, స్టాంపులు–రిజిస్ట్రేషన్ల ఐజీ వి.రామకృష్ణ

సాక్షి, అమరావతి: మార్గదర్శి యాజమాన్యం చందాదారుల డబ్బులను నిబంధనలకు విరుద్ధంగా మళ్లించినట్లు తమ తనిఖీల్లో వెల్లడైందని ఏపీ సీఐడీ అదనపు డీజీ సంజయ్, స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ వి.రామకృష్ణ వెల్లడించారు. చట్ట ప్రకారం చిట్‌ఫండ్ సంస్థల వ్యవహారాలను పర్యవేక్షించే చిట్స్ రిజిస్ట్రార్‌కు మార్గదర్శి యాజమాన్యం సహకరించడం లేదని తెలిపారు. చందాదారుల ప్రయోజనాలను పరిరక్షించడం తమ బాధ్యతని, ఇదే ధోరణి కొనసాగితే మార్గదర్శి చిట్‌ఫండ్స్‌పై కఠిన చర్యలకు సైతం వెనుకాడబోమన్నారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో నిధుల దుర్వినియోగం, మోసం, చట్ట ఉల్లంఘనలకు సంబంధించి తాము నమోదు చేసిన కేసులో ప్రాథమిక ఆధారాలున్నట్లు న్యాయస్థానం కూడా రిమాండ్‌కు అనుమతిస్తూ ఇచ్చిన ఉత్తర్వుల్లో పేర్కొందని గుర్తు చేశారు. 'మన రాష్ట్రంలో చందాదారుల సొమ్మును ఇతర రాష్ట్రాలకు అక్రమంగా బదిలీ చేస్తున్నారు. అందుకు ఇక్కడ బాధ్యులు ఉండరు. ఇతర రాష్ట్రాల్లో అడిగితే మీకు సంబంధం లేదంటున్నారు. అంటే చందాదారులు

మిగతా 10వ పేజీలో ▶

ఏఈ పేపర్ లీక్..

- ఈ నెల 5న జరిగిన పరీక్ష రెండు పేపర్లు ముందే లీక్
- టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీర్ పేపర్ కూడా బయటికి..
- టీచర్ రేణుక, ఆమె భర్తతో కలసి ప్రవీణ్ వ్యవహారం
- ఏఈ పేపర్ పలువురికి విక్రయం.. టౌన్‌ప్లానింగ్ పేపర్ అమ్మేందుకు ప్రయత్నం.. తొమ్మిది మంది అరెస్టు..
- ఫోరెన్సిక్ విశ్లేషణ తర్వాతే లీకేజీలపై పూర్తి స్పష్టత: డీసీపీ

ఇద్దరు ఉద్యోగులపై టీఎస్‌పీఎస్సీ వేటు

ఏ బోర్డు.. ఎంత భద్రం

- వివరాలు 13లో ▶

దర్యాప్తు ప్రారంభించొద్దు

తెలంగాణ ఎమ్మెల్యేలకు ఎర కేసులో సీబీఐకి సుప్రీంకోర్టు ఆదేశం

- 2లో

కమలంలో అసంతృప్త స్వరాలు!

- ఇప్పటికే బండి సంజయ్‌పై ఎంపీ అర్వింద్ విమర్శలు
- తాజాగా బండి విధానాలను తప్పుబట్టిన ఆ పార్టీ నేత పేరాల శేఖర్‌రావు
- సంజయ్‌పై ఎంపీ అర్వింద్ వ్యాఖ్యలకు సమర్థన
- జిల్లాల్లోనూ నేతల మధ్య లుకలుకలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర బీజేపీలో అసంతృప్త స్వరాలు ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయి. బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఉద్దేశించి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యల వివాదం కమలదళంలో దుమారం రేపుతోంది. బండి వ్యాఖ్యలను బీజేపీ నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఇప్పటికే తప్పుబట్టగా తాజాగా అర్వింద్ వ్యాఖ్యలు వంద శాతం సరైనవేనంటూ బీజేపీ మాజీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, సీనియర్ నేత పేరాల శేఖర్‌రావు సోషల్ మీడియా వేదికగా పేర్కొనడం పార్టీ నేతల్లో మరింత కలకలానికి కారణమయ్యాయి. రాష్ట్ర పార్టీలోని కొందరు నేతలు అర్వింద్, శేఖర్‌రావు వ్యాఖ్యలను సమర్థిస్తుండగా అసెంబ్లీ ఎన్నికల వేళ ఇలాంటివి పార్టీకి నష్టం చేస్తాయని మరికొందరు చెబుతున్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో కవితపై సంజయ్ చేసిన

మిగతా 2వ పేజీలో ▶

క్లుప్తంగా...

నేడు ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద వైఎస్సార్‌టీపీ ధర్నా

'కాళేశ్వరంలో అవినీతి'కి నిరసనగా... వైఎస్సార్‌టీపీ అధినేత్రి షర్మిల పిలుపు



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.70 వేల కోట్ల అవినీతి జరిగిందని, అయినా ఇప్పటివరకు దీనిపై ఎటువంటి విచారణ చేపట్టలేదని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల ధ్వజమెత్తారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై పోరాడేందుకు ఎంపీలు కూడా తనతో కలసి రావాలని ఆమె సోమవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ ప్రాజెక్టులో జరిగిన అవినీతికి వ్యతిరేకంగా వైఎస్సార్ తెలంగాణ పార్టీ మంగళవారం ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహించనుందని వెల్లడించారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి చేసిన ఎస్సారెస్పీ ఫేజ్–2, ఎల్లంపల్లి, వరద కాలువ, దేవాదుల, మిడ్‌మానేర్ లాంటి ప్రాజెక్టులు నీళ్లు ఇస్తుంటే అవి కాళేశ్వరం నుంచి వస్తున్నట్లు చూపించే ప్రయత్నం చేస్తున్నారని తీవ్రస్థాయిలో దుయ్యబట్టారు. ఒక మహిళ బతుకమ్మ ముసుగులో లిక్కర్ స్కాంలో ఇరుక్కుంటే మంత్రులు, ఎంపీలు, ఎమ్మె ల్యేలు సిగ్గు లేకుండా మద్దతిస్తున్నారని మండిపడ్డారు.

ఆరునెలల ముందే అభ్యర్థులను ప్రకటించండి

ఠాక్రేకు ఎంపీ కోమటిరెడ్డి వినతి



సాక్షి, న్యూఢిల్లీ: ఈ ఏడాది జరగనున్న తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి కనీసం 70 శాతం మంది ఎమ్మెల్యే అభ్యర్థులను ఆరు నెలల ముందే ప్రకటించేలా అధిష్టానం చర్యలు చేపట్టాలని కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కోరారు. ఢిల్లీలో సోమవారం తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్ రావు ఠాక్రేను కలిసిన ఎంపీ కోమటిరెడ్డి.. సుమారు గంటన్నర పాటు రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితిపై మాణిక్ రావు ఆరా తీశారు. రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క పాదయాత్రల గురించి ఉభయులం మాట్లాడుకున్నట్టు ఎంపీ కోమటిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా తాను కొన్ని సూచనలు చేసినట్లు పేర్కొన్నారు.


లిక్కర్ స్కాంకు తెలంగాణ ప్రజలకు ఏం సంబంధం?

మాజీ ఎంపీ మల్లు రవి



సాక్షి, హైదరాబాద్: ఢిల్లీ రాష్ట్రంలో జరిగిన లిక్కర్ కుంభకోణానికి, తెలంగాణ ప్రజలకు సంబంధమేంటని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ మల్లురవి ప్రశ్నించారు. లిక్కర్ స్కాంలో డబ్బులు ఆమ్‌ఆద్మీ పార్టీకి ఇచ్చారనే ఆరోపణలున్నాయని, వాటిపై విచారణ జరుగుతున్న సందర్భంలో తెలంగాణ రాష్ట్రానికి ముడిపెట్టి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. గాంధీ భవన్‌లో ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ నేత అనిల్‌కుమార్‌యాదవ్‌లతో కలిసి సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం, విభజన హామీల అమలు కోసం బీజేపీ మీద పోరాటం చేయాల్సిన బీఆర్‌ఎస్ నేతలు ఎమ్మెల్సీ కవితపై వచ్చిన ఆరోపణలపై పోరాటం చేస్తూ ప్రజలను గాలికి వదిలేశారని వ్యాఖ్యానించారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్కల మధ్య ఎలాంటి విభేదాలు లేవని, అవగాహనతోనే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పాదయాత్రలు జరుగుతున్నాయని చెప్పారు.

70 అసెంబ్లీ సెగ్మెంట్లలో ఇంటింటికీ టీడీపీ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 17 పార్లమెంటు నియోజకవర్గాలలోని 70 అసెంబ్లీ సెగ్మెంట్లలో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు టీటీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ తెలిపారు. మిగతా 49 నియోజకవర్గాల్లో కూడా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాలని పార్టీ పార్లమెంటు పరిశీలకులు, అసెంబ్లీ కో–ఆర్డినేటర్లను ఆదేశించారు. సోమవారం ఎన్టీఆర్ భవన్ నుంచి పార్టీ నేతలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఏయే నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమం ఎలా సాగుతోందో అడిగి తెలుసుకున్నారు.

బండి వ్యాఖ్యలపై మహిళా కమిషన్ విచారణ 15న

వ్యక్తిగత హాజరుకు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవితపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కుమార్ చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ తీవ్రంగా స్పందించింది. ఈనెల 15న ఉదయం 11 గంటలకు రాష్ట్ర మహిళా కమిషన్ ఎదుట విచారణకు హాజరు కావాలని బండిని ఆదేశించింది. మరోవైపు ఈ అంశాన్ని సుమోటోగా స్వీకరిస్తూ కేసు నమోదు చేసింది. దీనిపై వ్యక్తిగతంగా విచారణ జరిపి నివేదిక సమర్పించాలని డీజీపీని తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి ఆదేశించారు.

ఎక్కువ వాడేశారు!

కృష్ణా జలాల వినియోగంపై తెలంగాణ, ఏపీల మధ్య వివాదం

- కోటాకి మించి వాడినట్టు పరస్పరం ఆరోపణలు
- 66% కోటాకి బదులు ఏపీ 75% వాడిందన్న తెలంగాణ
- 34 శాతానికి బదులు తెలంగాణ 48% వాడిందంటూ ఏపీ ఎదురుదాడి
- కృష్ణా బోర్డుకు లేఖలు రాసిన రెండు రాష్ట్రాల ఈఎన్సీలు



సాక్షి, హైదరాబాద్: కృష్ణా జలాల వినియోగంపై తెలంగాణ, ఏపీ రాష్ట్రాల మధ్య మళ్లీ వివాదం తలెత్తింది. తాత్కాలిక కోటా ప్రకారం కృష్ణా జలాల్లో ఏపీకి 66 శాతం, తెలంగాణకు 34 శాతం వాటాలున్నాయి. అయితే ఈ వాటాలకు మించి కృష్ణా జలాలను వాడుకున్నట్టు రెండు రాష్ట్రాలు ఒకదానిపై మరొకటి ఆరోపణలు చేసుకున్నాయి. ఇకపై కృష్ణా జలాలను తరలించుకోకుండా ఏపీని నిలువరించాలని తెలంగాణ, తెలంగాణను నిలువరించాలని ఏపీ డిమాండ్ చేశాయి. కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) ఆధ్వర్యంలోని త్రిసభ్య కమిటీ సోమవారం హైదరాబాద్‌లోని జలసౌధలో సభ్య కార్యదర్శి డీఎం రాయిపురే అధ్యక్షతన సమావేశమయ్యింది. ఏపీ ఈ భేటీకి గైర్హాజరైనప్పటికీ తెలంగాణపై ఆరోపణలు చేస్తూ లేఖను పంపింది. తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్సీ సి.మురళీధర్ సమావేశానికి హాజరై ఏపీ కోటాకి మించి జలాలను వాడుకున్నట్టు ఆరోపించారు.

మా మిగిలిన నీళ్లను పరిరక్షించండి: తెలంగాణ ప్రస్తుత నీటి సంవత్సరంలో ఫిబ్రవరి 28 నాటికి 971.29 టీఎంసీల కృష్ణా జలాలు రాగా, ఏపీ 619.047 టీఎంసీలు (74.45 శాతం), తెలంగాణ 212.885 టీఎంసీలు (25.55) వాడినట్టు మురళీధర్ చెప్పారు. ఉమ్మడి జలాశయాలైన శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో ఏపీ ఇప్పటికే 38.723 టీఎంసీలను అదనంగా వినియోగించిందంటూ.. తెలంగాణకు మిగిలిన ఉన్న 108.901 టీఎంసీల వాటాను పరిరక్షించాలని కోరారు. ఇకపై శ్రీశైలం, నాగార్జునసాగర్ నుంచి నీటిని తరలించుకోకుండా ఏపీని అడ్డుకోవాలని చెప్పారు. నాగార్జునసాగర్ కుడికాల్వ నుంచి జలవిద్యుదుత్పత్తి ద్వారా కృష్ణా డెల్టాకు రోజుకు టీఎంసీ నీటిని ఏపీ తరలిస్తోందని, దీనిని తక్షణమే నిలుపుదల చేయించాలని విజ్ఞప్తి చేశారు. వరద జలాల వినియోగాన్ని విస్మరించినా, ఏపీ కోటాకు మించి నీళ్లను వాడిందని తెలంగాణ ఈఎన్సీ వివరించారు. బచావత్ ట్రిబ్యునల్ తీర్పుకు లోబడి నాగార్జునసాగర్ అవసరాలను తీర్చడానికి మాత్రమే తాము జలవిద్యుత్ ఉత్పత్తి చేశామని, ఆ నీరంతా సాగర్‌లోకి చేరిందని వాదించారు. ఈ మేరకు ఆయన ఇటీవల కృష్ణాబోర్డుకు లేఖ కూడా రాశారు.

ఆ నీటిని మా కోటాలో లెక్కించొద్దు: ఏపీ

ఏపీ లేఖలో లేవనెత్తిన అంశాలను రాయిపురే సమావేశంలో వివరించారు. 'జలవిద్యుదుత్పత్తి ద్వారా తెలంగాణ నీటిని వృథా చేసింది. వరదల సమయంలో శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల, ప్రకాశం బ్యారేజీలు నిండిన తర్వాత సముద్రంలోకి నీరు వెళ్తున్నప్పుడు తరలించే నీటిని మా కోటాలో లెక్కించరాదు. ఈ సమావేశాన్ని వాయిదా వేసి మళ్లీ ఏప్రిల్ తొలివారంలో నిర్వహించండి..' అని ఏపీ కోరినట్లు తెలిపారు. అయితే సమావేశం జరిగినట్టు పరిగణించి తాము లేవనెత్తిన అంశాలను రికార్డు చేయాలని మురళీధర్ కోరారు.

201 టీఎంసీలు సముద్రం పాలు

గత ఫిబ్రవరి 28 నాటికి 972.46 టీఎంసీల కృష్ణా జలాల లభ్యత ఉండగా, తాత్కాలిక కోటాల ప్రకారం అందులో తమకు 641.82 టీఎంసీలు, తెలంగాణకు 330.64 టీఎంసీల వాటా ఉందని ఏపీ జలవనరుల శాఖ ఈఎన్సీ సి.నారాయణ రెడ్డి తెలిపారు. అందులో ఏపీ 442.52 టీఎంసీలు (52.2శాతం), తెలంగాణ 404.2 టీఎంసీలు (47.8 శాతం) వాడినట్టు పేర్కొన్నారు. వాటా ప్రకారం ఏపీకి 199.31 టీఎంసీలు మిగిలి ఉండాల్సి ఉండగా, 125.75 టీఎంసీలు మాత్రమే మిగిలి ఉన్నాయని తెలిపారు. తెలంగాణ కోటాకు మించి 82.08 టీఎంసీలను వాడినట్టు ఆరోపించారు. ఈ మేరకు కృష్ణా బోర్డుకు ఆయన తాజాగా లేఖ రాశారు. ఉమ్మడి జలాశయాల్లో ఏపీకి ఇంకా 148.06 టీఎంసీలు మిగిలి ఉన్నాయన్నారు. వరదలు లేని సమయంలో ఇండెంట్ లేకుండా విద్యుదుత్పత్తి ద్వారా 201 టీఎంసీలను తెలంగాణ సముద్రంలో వృథాగా కలిపిందని, ఈ నీళ్లను సైతం ఆ రాష్ట్రం కోటాలో లెక్కించాలని డిమాండ్ చేశారు.

కమలంలో అసంతృప్త స్వరాలు!

▶ మొదటి పేజీ తరువాయి

వ్యాఖ్యలపై స్పందించాల్సిన అవసరం లేకపోయినా అర్వింద్ ఖండించడాన్ని కొందరు తప్పుబడుతున్నారు. అదే సమయంలో సంజయ్ వ్యవహారశైలి, రాష్ట్ర అధ్యక్ష పదవి అంటే పవర్ సెంటర్ కాదని, అందరినీ సమన్వయం చేయాల్సిన బాధ్యత ఉంటుందని అర్వింద్ చేసిన వ్యాఖ్యలను మరికొందరు సమర్థిస్తున్నారు. అర్వింద్ చేసిన వ్యాఖ్యలకు కొనసాగింపుగా సంజయ్‌పై శేఖర్‌రావు మరిన్ని తీవ్ర విమర్శలు, ఆరోపణలు సంధించడంతో పార్టీలో అంతర్గతంగా గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయని నేతలు ఆందోళన వెలిబుచ్చు తున్నారు. మరోవైపు వివిధ జిల్లాల్లోనూ పార్టీ ముఖ్య నేతల మధ్య పొసగక గ్రూపుల గందరగోళం కూడా పెరిగినట్లు పార్టీలో చర్చ సాగుతోంది.

అర్వింద్‌కు అధిష్టానం నోటీసులు?

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌పై పార్టీ ఎంపీ అర్వింద్ బహిరంగ విమర్శలు చేయడంపై ఇప్పటికే పంచాయితీ ఢిల్లీ అధిష్టానం వద్దకు చేరింది. ఈ వ్యవహారంపై అర్వింద్‌కు క్రమశిక్షణ ఉల్లంఘించారంటూ అధిష్టానం నోటీసులు జారీ చేసే అవకాశాలున్నాయని పార్టీ వర్గాల సమాచారం.

శేఖర్‌రావు ఏమన్నారంటే...

రాష్ట్ర పార్టీ ముఖ్య నేతలైన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, పార్టీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డా. కె.లక్ష్మణ్ వంటి పెద్దలు చేయాల్సిన పనినే అర్వింద్ చేశారని శేఖర్‌రావు సోషల్ మీడియా పోస్ట్‌లో పేర్కొన్నారు. అధ్యక్షుడి పరిణతిలేని అసందర్భ మాటలు, నియంతృత్వం, అప్రజాస్వామిక చేష్టలు బీజేపీలో ప్రస్తుత పరిస్థితి కారణమని దుయ్యబట్టారు. బ్లాక్‌మెయిల్, అంతర్గత సెటిల్‌మెంట్లు, కార్యకర్తలకు అవమానం, ఒంటెద్దు పోకడలు, సమన్వయలోపం, వ్యక్తిగత ఆర్థిక స్వార్థం బీజేపీ సంస్కృతి కాదని శేఖర్‌రావు స్పష్టం చేశారు. అయినప్పటికీ ఇవన్నీ పార్టీలో నడుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కరీంనగర్‌లో గ్రానైట్ క్వారీల్లో అక్రమ తవ్వకాలంటూ ప్రచారం చేసి యజమానులతో అంతర్గత ఒప్పందాలు కుదుర్చుకోవడం, ఓ వార్తా చానల్‌లో ఓ ప్రముఖుడి మైనింగ్ అక్రమాలపై వరుస కథనాలు ప్రసారం చేసి ఆపై సెటిల్‌మెంట్లు చేసుకోవడం, ఆ చానల్‌లో నలుగురు పార్టీ నేతలతో రూ. కోట్లలో పెట్టుబడి పెట్టించి నట్టేట ముంచడం, సికింద్రాబాద్ కంటోన్మెంట్ వైస్‌చైర్మన్ పదవిని ఆర్థిక కారణాలతో కొత్తవారికి కట్టబెట్టడం, హుజూరాబాద్‌లో ఈటల గెలుపు అనంతరం ఏర్పడిన వాతావరణాన్ని ఖతం చేయడం వంటి చర్యలకు బండి సంజయ్ పాల్పడ్డారంటూ ఆరోపణలు గుప్పించారు. వాటన్నింటినీ ఉదాహరణలతో సహా నిరూపించేందుకు తాను సిద్ధమని ప్రకటించారు. పార్టీలో వినే సంస్కృతి, చర్చించే పద్ధతి మాయ మైనప్పుడు సోషల్ మీడియానే ఆధారమవుతోందని తెలిపారు.

సంజయ్‌కు రాజాసింగ్ మద్దతు

సాక్షి, హైదరాబాద్: బీజేపీ నుంచి సస్పెన్షన్‌కు గురైన బీజేఎల్పీ నేత టి.రాజాసింగ్ నుంచి ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కు మద్దతు లభించింది. ఇటీవల సంజయ్ చేసిన వ్యాఖ్యలు వ్యక్తిగతం కాదని, పార్టీ అధ్యక్షుడిగానే మాట్లాడారని సమర్థించారు. సోమవారం రాజాసింగ్ మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలపై నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు ఏదైనా అనుమానం ఉంటే నేరుగా సంజయ్‌తోనే మాట్లాడవచ్చని సూచించారు. పార్టీ అధ్యక్షుడి వ్యాఖ్యలపై మీడియా ముందుకు వచ్చి మాట్లాడటం తప్పు అని పేర్కొన్నారు. సంజయ్‌పై చేసిన వ్యాఖ్యలను అర్వింద్ వెంటనే ఉపసంహరించుకోవాలని సూచించారు. కవితపై ఈడీ విచారణ విషయంలో సంజయ్ తప్పు ఏమీ మాట్లాడలేదన్నారు.

తెలుగు పాటకు ఆస్కార్ డ్యాన్స్

▶ మొదటి పేజీ తరువాయి

షార్ట్ ఫిల్మ్ విభాగంలో ఆస్కార్ అవార్డు దక్కింది. దేశం నుంచి శౌనక్‌సేన్ డైరెక్షన్‌లో రూపొందిన 'ఆల్ దట్ బ్రీత్స్' డాక్యుమెంటరీ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో నామినేషన్ దక్కించుకున్నా అవార్డును సొంతం చేసుకోలేకపోయింది. ఏది ఏమైనా రెండు ఆస్కార్‌లతో 'ఆర్‌ఆర్‌ఆర్'లోని 'ఎత్తర జెండా' పాటలా దేశ జెండా విశ్వవ్యాప్తంగా ఎగిరింది. దేశం సాధించిన ఘనతకు ప్రధాని నరేంద్ర మోదీ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, తెలంగాణ ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుతోపాటు పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు 'ఆర్‌ఆర్‌ఆర్' బృందానికి శుభాకాంక్షలు తెలియజేశారు.

అదరగొట్టిన ఎవ్రీవేర్ ఎవ్రీథింగ్..

మొత్తం 23 విభాగాల్లో ఆస్కార్ అవార్డులను ప్రకటించారు. 'ఎవ్రీవేర్ ఎవ్రీథింగ్ ఆల్ ఎట్ వన్స్' చిత్రం ఏడు ప్రధాన విభాగాల్లో (ఉత్తమ చిత్రం, దర్శకుడు, నటి, సహాయ నటుడు, సహాయ నటి, ఎడిటింగ్, ఒరిజినల్ స్క్రీన్‌ప్లే) అవార్డులను కొల్లగొట్టింది. ఉత్తమ చిత్రానికిగాను దీని నిర్మాతలు ఆంథోనీ రుస్సో, జో రుస్సో, మైక్ లరోకా, జోనాథన్, ఉత్తమ దర్శకుడి అవార్డును డానియల్ క్వాన్, డానియల్ స్కీనెర్ట్ అందుకున్నారు.

- ఇదే చిత్రంలోని నటనకుగాను మిషెల్ యోహ్ ఉత్తమ నటి అవార్డును స్వీకరించారు. పలు యాక్షన్ చిత్రాల్లో నటించిన ఆమెకు దక్కిన తొలి ఆస్కార్ అవార్డు ఇదే. అంతేకాదు ఉత్తమ నటిగా ఆస్కార్ గెలిచిన తొలి ఏషియన్ మహిళ మిచెల్ యోనే కావడం మరో విశేషం.
- ఇక 'దివేల్' చిత్రంలోని నటనకుగాను బ్రెండెన్ ఫ్రాసెర్‌ను ఆస్కార్ బెస్ట్ యాక్టర్ అవార్డు వరించింది. నటనలో మూడు దశాబ్దాల చరిత్ర ఉన్న బ్రెండెన్‌కు ఇదే తొలి ఆస్కార్ కావడం విశేషం.
- అలాగే తొమ్మిది నామినేషన్లు దక్కించుకున్న జర్మన్ ఫిల్మ్ 'ఆల్ క్వైట్ ఆన్ ది వెస్టర్న్ ఫ్రంట్'కు నాలుగు విభాగాల్లో (బెస్ట్ ఇంటర్నేషనల్ ఫీచర్ ఫిల్మ్, బెస్ట్ సినిమాటోగ్రఫీ, బెస్ట్ ఒరిజినల్ స్కోర్, బెస్ట్ ప్రొడక్షన్ డిజైన్) అవార్డులు దక్కాయి.
- తొమ్మిది నామినేషన్లు దక్కించుకున్న 'ది బన్షీస్ ఆఫ్ ఇనిషెరిన్', ఏడు నామినేషన్లు దక్కించుకున్న 'ది ఫేబుల్‌మ్యాన్స్', ఆరు నామినేషన్లు పొందిన 'టార్', మూడు నామినేషన్లు దక్కించుకున్న 'బ్యాట్‌మన్' చిత్రాలకు ఒక్క ఆస్కార్ అవార్డు కూడా దక్కలేదు.

మంత్రుల హర్షం

'నాటు నాటు'పాటకు ఆస్కార్ అవార్డు లభించడంపై మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హర్షం వ్యక్తం చేశారు.

దర్యాప్తు ప్రారంభించొద్దు

ఎమ్మెల్యేలకు ఎర కేసులో సీబీఐకి సుప్రీంకోర్టు ఆదేశం.. విచారణ వాయిదా



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ ఎమ్మెల్యేలకు ఎర కేసులో దర్యాప్తు ప్రారంభించొద్దని సీబీఐకి సుప్రీం కోర్టు ఆదేశాలు ఇచ్చింది. తదుపరి విచారణ జూలై 31న ప్రారంభమయ్యే వారంలో నాన్ మిస్‌లీనియస్ డే నాడు చేపడతామని పేర్కొంది. ఎమ్మెల్యేల కొనుగోలు కేసు సీబీఐకి అప్పగిస్తూ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సోమవారం జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎంఎం సుందరేశ్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. కేసును విచారించాల్సిన నేపథ్యంలో విచారణను తర్వాత చేపడతామని ధర్మాసనం తొలుత వ్యాఖ్యానించింది. అయితే, సీబీఐ ఇంకా విచారణ చేపట్టలేదని తెలంగాణ పోలీసుల తరఫు సీనియర్ న్యాయవాది దుష్యంత్ దవే తెలిపారు. ఈ అంశంపై ప్రభుత్వ ప్రధానకార్యదర్శిని అడగ్గా సీబీఐ ఇంకా కేసు స్వాధీనం చేసుకోలేదని చెప్పారని వివరించారు. అయితే కేసు కోర్టు పరిధిలో ఉన్నందున విచారణ కొనసాగించకూడదని ధర్మాసనం స్పష్టం చేసింది. కొనసాగించినా నిరుపయోగమనేది ఒక రూల్ ఉందని, లేదంటే మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాల్సి వస్తుందని పేర్కొంది. తదుపరి విచారణ వరకూ గతంలోని స్టేటస్ ఆదేశాలు అమలు అవుతాయని తెలిపింది. దర్యాప్తునకు సంబంధించిన పత్రాలు సీబీఐకి అందజేయాల్సిన అవసరం లేదంది.

బీఆర్‌ఎస్ జిల్లా సమన్వయకర్తల నియామకం

- జాబితా విడుదల చేసిన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- పెద్దఎత్తున పార్టీ కార్యక్రమాల నిర్వహణకు దిశానిర్దేశం



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు అసెంబ్లీ నియోజకవర్గాల్లో విస్తృతంగా చేపట్టే పార్టీ కార్యక్రమాలను సమన్వయం చేసే బాధ్యతలను జిల్లాలవారీగా నాయకులకు అప్పగించారు. ఈ మేరకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు ఆయా జిల్లాల సమన్వయకర్తల జాబితాను సోమవారం విడుదల చేశారు. నియోజకవర్గాలలోని పార్టీ శ్రేణులను ఏకతాటిపైకి తెచ్చి ఆత్మీయ సమ్మేళనాలు మొదలుకొని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాలు, పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు, నియోజకవర్గ ప్రతినిధుల సభ, విద్యార్థి విభాగం సమావేశాలు.. ఇలా అనేక కార్యక్రమాలను రాబోయే నాలుగు నెలల్లో పెద్ద ఎత్తున చేపట్టాలని పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో కేసీఆర్ ఆదేశించారు. ఈ నేపథ్యంలో వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదివారం పార్టీ జిల్లాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో ప్రత్యేకంగా టెలికాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు. అందులో భాగంగా ఆయా నియోజకవర్గాలకు చెందిన వివిధ స్థాయిల నాయకులు, ఎమ్మెల్యేలు, జిల్లాల పార్టీ అధ్యక్షులను సమన్వయం చేసేందుకు వీరిని నియమించినట్టు కేటీఆర్ తెలిపారు. ఈ కార్యక్రమాలను అమలు చేసేందుకు ప్రత్యేకంగా పార్టీ తరఫున ఏర్పాటు చేసిన ఈ బృందం, జిల్లా అధ్యక్షులు, స్థానిక ఎమ్మెల్యేలతో ఆయా కార్యక్రమాల అమలును సమన్వయం చేస్తుందని తెలిపారు. ఈ మేరకు పార్టీ నియమించిన నాయకులు తమకు బాధ్యతలు అప్పజెప్పిన జిల్లాల మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలతో వెంటనే సమావేశమై పార్టీ కార్యక్రమాలకు సంబంధించిన ప్రణాళిక, అమలుపై చర్చించాలని సూచించారు. ఈ మేరకు పార్టీ శ్రేణులు ఈ బృందంతో కలిసి సమన్వయం చేసుకోవాలని స్పష్టం చేశారు.

జిల్లాలవారీగా బీఆర్‌ఎస్ సమన్వయకర్తలు వీరే..

జిల్లా	-	సమన్వయకర్త
హైదరాబాద్	-	దాసోజు శ్రవణ్
వనపర్తి, జోగుళాంబ గద్వాల	-	తక్కళ్లపల్లి రవీందర్ రావు
మేడ్చల్	-	పల్లా రాజేశ్వర్ రెడ్డి
కరీంనగర్, రాజన్న సిరిసిల్ల	-	బస్వరాజు సారయ్య
నల్లగొండ	-	కడియం శ్రీహరి
వికారాబాద్	-	పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి
రంగారెడ్డి	-	ఎల్.రమణ
భద్రాద్రి కొత్తగూడెం	-	టి.భానుప్రసాద్ రావు
సంగారెడ్డి	-	వెంకట్రాంరెడ్డి
మెదక్	-	ఎగ్గే మల్లేశం
మహబూబ్‌నగర్, నారాయణపేట	-	కసిరెడ్డి నారాయణరెడ్డి
యాదాద్రి భువనగిరి	-	యాదవరెడ్డి
నాగర్ కర్నూల్	-	పట్నం మహేందర్ రెడ్డి
భూపాలపల్లి, ములుగు	-	అరికెల నర్సారెడ్డి
సిద్దిపేట	-	బోడకుంటి వెంకటేశ్వర్లు
హనుమకొండ, వరంగల్	-	ఎమ్.ఎస్.ప్రభాకర్
నిర్మల్, ఆదిలాబాద్	-	వి.గంగాధర్ గౌడ్
మంచిర్యాల, ఆసిఫాబాద్	-	నారదాసు లక్ష్మణ్
జనగామ	-	కోటిరెడ్డి
మహబూబాబాద్	-	పురాణం సతీశ్
కామారెడ్డి	-	దండే విఠల్
నిజామాబాద్	-	బండ ప్రకాశ్
జగిత్యాల	-	కోలేటి దామోదర్
పెద్దపల్లి	-	ఎర్రోళ్ల శ్రీనివాస్
ఖమ్మం	-	శేరి సుభాష్‌రెడ్డి
సూర్యాపేట	-	మెట్టు శ్రీనివాస్

అమరుల స్తూపం నిర్మాణంలో అవినీతి

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆరోపణ



కార్నర్ మీటింగ్‌లో ప్రసంగిస్తున్న రేవంత్‌రెడ్డి

మోర్తాడ్ (బాల్కొండ): తెలంగాణ కోసం ప్రాణాలు అర్పించిన అమర వీరులను స్మరించుకోవడానికి నిర్మిస్తున్న స్మారక స్తూపం విషయంలోను మంత్రి ప్రశాంత్‌రెడ్డి భారీ అవినీతికి పాల్పడ్డారని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆరోపించారు. 2018లో రూ.62 కోట్లతో ప్రతిపాదన చేస్తే ఈ ఐదేళ్లలో బడ్జెట్‌ను రూ.200 కోట్లకు పెంచారని ఆయన వెల్లడించారు. ఇందులో ప్రశాంత్‌రెడ్డి రూ.50 కోట్ల కమీషన్ దండుకున్నారని రేవంత్‌రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. సోమవారం హాథ్ సే హాథ్ జోడో పాదయాత్రలో భాగంగా నిజామాబాద్ జిల్లా ఏర్గట్ల మండల కేంద్రంలో నిర్వహించిన కార్నర్ సమావేశంలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు రూ.100 కోట్లు అవసరం అని ప్రతిపాదించి రూ.200 కోట్లకు అంచనాలు పెంచారన్నారు. సచివాలయం నిర్మాణానికి రూ.400 కోట్లు అవసరం అని చెప్పి రూ.1,200 కోట్లు ఖర్చు చేసినా ఇంకా నిర్మాణం పూర్తి కాలేదన్నారు. ఈ నిర్మాణాల కాంట్రాక్టులపై విచారణ జరిపించాలన్నారు.

వేతనాలు సకాలంలో చెల్లించాలి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని గ్రామ పంచాయతీ కార్మికులతో గొడ్డు చాకిరీ చేయించుకోవడమే తప్ప వారి హక్కులను పరిరక్షించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. వారికి సకాలంతో వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం కేసీఆర్‌కు సోమవారం లేఖ రాశారు.

ఐక్యంగా ముందుకు సాగుదాం

- ఏప్రిల్ 9న మండల, జిల్లా, రాష్ట్రస్థాయి నాయకుల ఉమ్మడి సమావేశం
- ఉభయ కమ్యూనిస్టు పార్టీల నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: ఐక్యంగా ముందుకు సాగాలని ఉభయ కమ్యూనిస్టు పార్టీలు నిర్ణయించుకున్నాయి. సీపీఐ, సీపీఎంల రాష్ట్ర నాయకత్వం ఆదివారం ఎంబీ భవన్‌లో సమావేశమై భవిష్యత్తు కార్యాచరణ గురించి కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు ఆ రెండు పార్టీలు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నాయి. ఈ సమావేశంలో సీపీఎం, సీపీఐల రాష్ట్ర కార్యదర్శులు తమ్మినేని వీరభద్రం, కూనంనేని సాంబశివరావులతో పాటు, సీపీఐ నుంచి చాడ వెంకటరెడ్డి, పల్లా వెంకటరెడ్డి, శ్రీనివాసరావు, సీపీఎం నుంచి చెరుపల్లి సీతారాములు, జూలకంటి రంగారెడ్డి, జాన్‌వెస్లీ, పోతినేని సుదర్శన్ పాల్గొన్నారు. దేశంతో పాటు, రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులు, కమ్యూనిస్టు ఉద్యమం ఎదుర్కొంటున్న సవాళ్లు, బాధ్యతల గురించి చర్చించినట్లు పేర్కొన్నారు. రాబోయే కాలంలో ఉభయ కమ్యూనిస్టు పార్టీలు దృఢంగా, ఐక్యంగా వ్యవహరించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ నెలలో సీపీఎం, ఏప్రిల్, మే నెలల్లో సీపీఐ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా జరిగే ప్రచారోద్యమాలను జయప్రదం చేయాలని, కేంద్ర పార్టీలు విడిగా పిలుపునిచ్చినప్పటికీ పరస్పరం సహకారంతో రాష్ట్రంలో ఈ ఉద్యమం ద్వారా ప్రజల్లోకి చొచ్చుకుపోవాలని భావిస్తున్నట్లు నాయకులు ఆ ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 9న హైదరాబాద్‌లో సీపీఎం, సీపీఐ మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకుల ఉమ్మడి భేటీ నిర్వహించాలని తీర్మానించారు.

నా యాత్రలో అందరూ భాగస్వాములు కావాలి

- సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క
- 'హాథ్ సే హాథ్ జోడో' యాత్ర వివరాలు వెల్లడి



మధిర: రాష్ట్రంలోని పలు జిల్లాల్లో నిర్వహించనున్న హాథ్ సే హాథ్ జోడో పాదయాత్రలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని సీఎల్పీ నేత, మధిర ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క కోరారు. సోమవారం ఆయన ఖమ్మం జిల్లా మధిరలోని తన క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ ముఖ్యనాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా భట్టివిక్రమార్క మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గం బజారహత్నూర్ మండలం పిప్పిరి నుంచి ప్రారంభమయ్యే తన పాదయాత్ర 39 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 1,365 కిలోమీటర్ల మేర సాగి ఖమ్మంలో ముగుస్తుందని తెలిపారు. ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త శక్తి మేరకు తనతో నాలుగు అడుగులు వేసి పార్టీకి జవసత్వాలు తీసుకొచ్చేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. నీళ్లు, నిధులు, నియామకాలు, ఆత్మగౌరవమే నినాదాలుగా సాధించుకున్న తెలంగాణలో సమస్యలు కాంగ్రెస్‌తోనే పరిష్కారమవుతాయన్న విషయాన్ని పాదయాత్ర ద్వారా ప్రజలకు వివరిస్తానని భట్టి తెలిపారు.

మూడు బహిరంగ సభలు


పాదయాత్రలో భాగంగా మూడు భారీ బహిరంగ సభలను నిర్వహించనున్నట్లు భట్టి తెలిపారు. మంచిర్యాల, హైదరాబాద్ శివారుతో పాటు ఖమ్మంలో పాదయాత్ర ముగింపు సందర్భంగా ఈ సభలు ఉంటాయని చెప్పారు. తెలంగాణ ప్రజల గుండెచప్పుడు, అవసరాలు, ఆశయాలను కాంగ్రెస్ ఎజెండాగా మార్చుకుని ముందుకెళ్తోందని.. తన యాత్రలో ప్రగతిశీల ప్రజాస్వామిక వాదులు, మేధావులు, కవులు, కళాకారులు, తెలంగాణ ఉద్యమకారులు పాల్గొనాలని కోరారు.

ఇదీ రూట్ మ్యాప్

ఈనెల 16వ తేదీన మొదలుకానున్న తన పాదయాత్ర రూట్ మ్యాప్ వివరాలను భట్టి వెల్లడించారు. ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గం నుంచి ప్రారంభమయ్యే యాత్ర ఖానాపూర్, ఆసిఫాబాద్, బెల్లంపల్లి, చెన్నూరు, మంచిర్యాల, ధర్మపురి, పెద్దపల్లి, హుజూరాబాద్, హుస్నాబాద్, వర్ధన్నపేట, వరంగల్ పశ్చిమ, స్టేషన్ ఘన్‌పూర్, జనగాం, ఆలేరు, భువనగిరి, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, రాజేంద్రనగర్, చేవెళ్ల, షాద్‌నగర్, జడ్చర్ల, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, దేవరకొండ, మునుగోడు, నల్లగొండ, నకిరేకల్, సూర్యాపేట, కోదాడ, ముదిగొండ, వైరా, సత్తుపల్లి, అశ్వారావుపేట, కొత్తగూడెం, ఇల్లెందు మీదుగా ఖమ్మం వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌తో పాటు నాయకులు చావా వేణు, సూరంశెట్టి కిషోర్, మిర్యాల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌పై కేంద్రం | కక్షపూరితంగా వ్యవహరిస్తోంది

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని



చౌటుప్పల్: తెలంగాణలో తమకు వ్యతిరేకంగా ఉన్నారన్న కారణంతో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుపై కేంద్రంలోని బీజేపీ సర్కారు కక్షపూరితంగా వ్యవహరిస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆరోపించారు. లిక్కర్ కేసులో ఎమ్మెల్సీ కవిత తప్పు చేసిందో..లేదో..కోర్టు విచారణలో తేలాల్సిన విషయమని, ఆమె దోషిగా తేలితే శిక్షించడంలో తమకెలాంటి అభ్యంతరమూ లేదని ఆయన స్పష్టం చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో సోమవారం జరిగిన సీపీఎం జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ నాయకులపై వచ్చిన ఆరోపణలతో పోలిస్తే కవితపై వచ్చిన ఆరోపణలు చాలా చిన్నవన్నారు. దేశానికి ప్రమాదకరంగా పరిణమించిన బీజేపీపై, మోదీ సర్కారు ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఎం ఆధ్వర్యంలో జనచైతన్య యాత్ర పేరిట మూడు బస్సు యాత్రలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 17న వరంగల్‌లో ప్రారంభమయ్యే మొదటి పాదయాత్రను జాతీయ ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి, 23న ఆదిలాబాద్‌లో యాత్రను పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, 24న నిజామాబాద్‌లో ప్రారంభమయ్యే యాత్రను మరో పొలిట్‌బ్యూరో సభ్యుడు విజయరాఘవన్ ప్రారంభిస్తారన్నారు. ఈ నెల 29న హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద నిర్వహించే ముగింపుసభకు ప్రకాష్‌కారత్ హాజరవుతారని చెప్పారు.

క్లుప్తంగా...

రేపట్నుంచి ఒంటిపూట బడులు

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 15 నుంచి ఒంటిపూట బడులు నిర్వహించాలని విద్యాశాఖ సోమవారం ఆదేశాలు జారీ చేసింది. అన్ని కేటగిరీల తరగతులకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకూ క్లాసులు నిర్వహించాలని ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లకు సూచించింది. ఒంటిపూట బడులు ఏప్రిల్ 24 వరకూ కొనసాగుతాయని, పదోతరగతి పరీక్షలను దృష్టిలో ఉంచుకుని టెన్త్ విద్యార్థులకు మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ప్రత్యేక క్లాసులు ఉంటాయని పేర్కొంది.

మేలో ఓయూ బీఈడీ పరీక్షలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలో మే నెలలో మొదటి సంవత్సరం బీఈడీ రెగ్యులర్ కోర్సు ఫస్ట్ సెమిస్టర్ పరీక్షలు జరగనున్నట్లు కంట్రోలర్ ప్రొఫెసర్ రాములు సోమవారం తెలిపారు. వచ్చేనెల 11 వరకు పరీక్ష రుసుము చెల్లించవచ్చని, రూ.200 అపరాధ రుసుముతో ఏప్రిల్ 15 వరకు ఫీజు చెల్లించవచ్చునని వివరించారు.

మే 10న బీసీ గురుకులాల్లో బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి అర్హత పరీక్ష

వచ్చేనెల 20 వరకు దరఖాస్తులు

సాక్షి, హైదరాబాద్: మహాత్మా జ్యోతిభా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతులు సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ(ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్) పరిధిలోని గురుకుల పాఠశాలల్లో 6,7,8 తరగతుల్లో బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి మే 10న అర్హత పరీక్ష నిర్వహిస్తున్నట్లు సొసైటీ కార్యదర్శి మల్లయ్యబట్టు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందుకు దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతోందని, ఏప్రిల్ 20 వరకు దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా స్వీకరించనున్నట్లు వివరించారు. ఇంటర్మీడియెట్, డిగ్రీ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు సంబంధించిన ప్రకటనలు వెలువడ్డాయని, ఇందుకు దరఖాస్తులు ఏప్రిల్ 16వరకు స్వీకరిస్తామని, అర్హత పరీక్ష ఏప్రిల్ 29న నిర్వహిస్తామని పేర్కొన్నారు.

అజ్మీర్ దర్గాలో తెలంగాణవాసులకు వసతి సదుపాయం


సాక్షి, హైదరాబాద్: అజ్మీర్ దర్గాను సందర్శించే తెలంగాణవాసుల కోసం వసతి సదుపాయం కల్పించే విషయమై స్థానిక అధికారులతో రాష్ట్ర హోంమంత్రి మహ్మద్ మహమూద్ అలీ సోమవారం సమీక్ష నిర్వహించారు. రాజస్తాన్ మైనార్టీ శాఖ మంత్రి సలేహ్ మహమ్మద్, కలెక్టర్ అన్షదీప్, ఇతర అధికారులతో కలిసి వసతి సదుపాయానికి అవసరమైన నిధుల గురించి అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం రూ.2.40 కోట్లకుపైగా నిధులు కేటాయించిందని హోంమంత్రి తెలిపారు. ఈ నిధులను ఉపయోగించి వసతి సదుపాయానికి అవసరమైన భూమి కొనుగోలు, రిజిస్ట్రేషన్ చేపట్టాలన్నారు.

విద్యుత్ ఆందోళనలు మరో వారం వాయిదా

సాక్షి, హైదరాబాద్: విద్యుత్ ఉద్యోగుల వేతన సవరణ, ఇతర సమస్యల పరిష్కారానికి చేపట్టనున్న ఆందోళనలను.. విద్యుత్ సంస్థల యాజమాన్యాల విజ్ఞప్తి మేరకు మరో వారం రోజుల పాటు వాయిదా వేసుకున్నామని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ జేఏసీ, తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ జేఏసీలు ప్రకటించాయి. తెలంగాణ ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావు నేతృత్వంలో ఉత్తర, దక్షిణ డిస్కంల సీఎండీలు ఎ.గోపాల్ రావు, జి.రఘుమారెడ్డి సోమవారం విద్యుత్‌సౌధలో జేఏసీల నేతలతో క్లుప్తంగా మరో దఫా చర్చలు జరిపారు. కాగా, ఈ నెల 24న జరగాల్సిన విద్యుత్ సౌధ ముట్టడి యథావిధిగా జరుగుతుందని పవర్ జేఏసీ చైర్మన్ సాయిబాబు ప్రకటించారు.

జీవో 111 ట్రబుల్ వన్..

111 జీవో రద్దు చేసినా తప్పని ఇబ్బందులు



- కొత్త మాస్టర్ ప్లాన్ దిశగా ముందుకు పడని అడుగులు
- ఒక్కసారి మాత్రమే భేటీ అయిన సర్కారు కమిటీ
- ఆ 84 గ్రామాల పరిధిలో నిర్మాణాలపై కొనసాగుతున్న ఆంక్షలు
- జీవో నంబర్ 69 అమలుపై నీలినీడలు

సాక్షి, హైదరాబాద్: ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జంట జలాశయాల పరిరక్షణ కోసం జారీ చేసిన 111 జీవోను రద్దు చేసి కొత్త మాస్టర్ ప్లాన్‌ను రూపొందిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించి ఏడాది కావస్తున్నా.. నేటికీ అడుగు ముందుకుపడలేదు. ప్రస్తుతం రాజధాని దాహార్తిని తీర్చేందుకు ఈ జంట జలాశయాల మీద ఆధారపడాల్సిన అవసరం లేదని భావించిన రాష్ట్ర ప్రభుత్వం.. 1996లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకొచ్చిన 111 జీవోను రద్దు చేస్తూ గతేడాది ఏప్రిల్ 19న జీవో నంబర్ 69ను విడుదల చేసింది. జీవో పరిధిలోని 84 గ్రామాలకు ప్రత్యేకంగా మాస్టర్ ప్లాన్‌ను రూపొందిస్తామని ప్రకటించింది. కానీ నేటికీ ఆయా గ్రామాలు హెచ్‌ఎండీఏ మాస్టర్‌ప్లాన్ ప్రకారం జీవసంరక్షణ మండలి(బయో కన్జర్వేషన్ జోన్)లోనే కొనసాగుతున్నాయి. గతంలో ఉన్న ఆంక్షలే ఇప్పటికీ అమలులో ఉండడంతో నిర్మాణదారులకు ఇక్కట్లు తప్పడంలేదు.

కొత్త మాస్టర్ ప్లాన్‌ను సాధ్యమైనంత త్వరగా రూపొందిస్తామని చెప్పిన ప్రభుత్వం ఇందుకోసం సీఎస్ నేతృత్వంలో కమిటీని వేసింది. పురపాలక, ఆర్థిక, నీటిపారుదల శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, జలమండలి ఎండీ, కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శి, హెచ్‌ఎండీఏ డైరెక్టర్ (ప్లానింగ్) సభ్యులుగా ఉండే ఈ కమిటీ.. ఏయే అంశాలను పరిశీలించి నివేదిక ఇవ్వాలన్న దానిపై విధివిధానాలను కూడా ఖరారు చేసింది. రెండు రిజర్వాయర్ల పరిరక్షణ, కాలుష్య నివారణకు అవసరమైన చర్యలను

చిత్తశుద్ధిలేని కమిటీ..

సూచించాలని అలాగే ప్రధాన మౌలిక సదుపాయాల కల్పనకు విధానాలను రూపొందించాలని ఆదేశించింది. మురుగు, వరద కాల్వల నిర్మాణం, మురుగునీటి నిర్వహణ ప్లాంట్ల (ఎస్టీపీలు) ఏర్పాటు, నిధుల సమీకరణ, లేఅవుట్లు, నిర్మాణాల అనుమతికి సంబంధించిన విధివిధానాలతో పాటు న్యాయపరమైన అంశాలనూ పరిశీలించాలని సూచించింది. ఈ మేరకు తొలిసారి భేటీ అయిన కమిటీ కేవలం ప్రాథమిక అంశాలను మాత్రమే చర్చించి మమ అనిపించింది. మాస్టర్‌ప్లాన్ రూపకల్పన బాధ్యతను కన్సల్టెన్సీకి అప్పగించాలని సూత్రప్రాయంగా నిర్ణయించినా ఇప్పటివరకు కార్యరూపం దాల్చలేదు. దీంతో జీవో 69 అమలుపై ఒక్కడుగు కూడా ముందుకు పడలేదు.



జంట జలాశయాల చుట్టూ 10 కిలోమీటర్ల పరిధిలోని 84 గ్రామాల పరిధిలో 1.32 లక్షల ఎకరాల భూమి అందుబాటులో ఉంది. ఆయా భూముల్లో ఇప్పటికే సంపన్న వర్గాలు, పారిశ్రామికవేత్తలు, సినీ, రాజకీయ ప్రముఖులు, ఉన్నతాధికారులు తక్కువ ధరకు పెద్ద ఎత్తున స్థలాలను కొనుగోలు చేసి ఫామ్‌హౌస్‌లు, రిసార్ట్‌లను నిర్మించుకున్నారు. ఇవే కాకుండా అనధికారిక లే–అవుట్లు వేల సంఖ్యలోనే ఉన్నాయి. అయితే ప్రస్తుతం 111 జీవో ఎత్తివేసినందున నిర్మాణాలపై ఆంక్షల్లేవని భావించి అనుమ

నిర్మాణదారులకు ఇక్కట్లు

తుల కోసం స్థానిక పట్టణ, పంచాయతీలను ఆశ్రయిస్తున్న రియల్టర్లు/భవన నిర్మాణదారులకు నిరాశే మిగులుతోంది. పర్మిషన్లు జారీ చేయకపోవడంతో అభ్యంతరం వ్యక్తం చేస్తూ కొందరు ఏకంగా న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అయితే, 111 జీవో ఇంకా మనుగడలోనే ఉందని హైకోర్టుకు ప్రభుత్వం నివేదించడంతో 69 జీవో అమలుపై నీలినీడలు కమ్ముకున్నాయి. గ్రామస్తులు ఏదైనా నిర్మాణం చేపట్టేందుకు అనుమతులు కోసం వెళితే ఆంక్షల నెపంతో దరఖాస్తులను తిరస్కరిస్తున్నారని, అదే పలుకుబడి ఉన్న నాయకులు, ఆమ్యామ్యాలు సమర్పించుకునే డెవలపర్లకైతే ఎలాంటి అడ్డంకులు లేకుండా అనుమతులు ఇస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

హాట్‌కేక్ ప్రాంతాలపై ప్రభావం

జీవో రద్దుతో ఆయా గ్రామాలను ఆనుకొని ఉన్న ప్రాంతాల్లోని స్థిరాస్తి వ్యాపారంలో స్తబ్ధత నెలకొంది. అప్పటివరకు మంచి డిమాండ్ ఉన్న కొల్లూరు, తెల్లాపూర్, నల్లగండ్ల, గోపనపల్లి, నానక్‌రాంగూడ, నార్సింగి, కోకాపేట, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, పుప్పాలగూడ, కొండాపూర్, వంటి ప్రాంతాలలోని అపార్ట్‌మెంట్ల నిర్మాణ పనులు మందకొడిగా సాగుతున్నాయి. పశ్చిమ హైదరాబాద్‌లోని హైరైజ్, లగ్జరీ ప్రాజెక్టులలో విక్రయాలు తగ్గిపోయాయి. ఇక్కడ కోట్ల రూపాయలు వెచ్చించి ఫ్లాట్ కొనుగోలు చేసే బదులు.. కాస్త వేచి చూస్తే 111 జీవో పరిధిలో వ్యక్తిగత గృహం, విల్లా వంటివి సొంతం చేసుకోవచ్చని కొనుగోలుదారులు భావిస్తున్నట్టు తెలుస్తోంది.

నిర్మాణ సంస్థలకూ భాగస్వామ్యం కల్పించాలి

111 జీవో రద్దు చేసి ప్రత్యేకంగా మాస్టర్ ప్లాన్ రూపొందిస్తామన్న నిర్ణయం ఆహ్వానించదగ్గ పరిణామమే. అయితే మాస్టర్ ప్లాన్ విధివిధానాల రూపకల్పనలో డెవలపర్లు, నిర్మాణ సంస్థలకు కూడా భాగస్వామ్యం కల్పించాలి. దీంతో స్థానిక అవసరాలకు తగ్గట్టు జోన్ల వారీగా అభివృద్ధి పనులకు, నిర్మాణాలకు అవకాశం కల్పించే వీలుంటుంది.



ఎం.ప్రేమ్‌కుమార్,
ప్రెసిడెంట్ వెస్ట్ జోన్ బిల్డర్స్ అసోసియేషన్

ఎన్నికల స్టంట్ మాత్రమే

111 జీవో ఎత్తివేత వ్యవహారం ఒక ప్రహసనంలా మారింది. కేవలం ఎన్నికల హామీగా మాత్రమే రాజకీయ పార్టీలు ఈ అంశాన్ని వాడుకుంటున్నాయి. ఈ జీవో ఎత్తివేసి..దాని స్థానే 69 జీవో జారీ చేసినా ఇప్పటివరకు మార్గదర్శకాలు జారీ చేయకపోవడం చూస్తే ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి అర్థం అవుతుంది. ఇప్పటికైనా ప్రత్యేక మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించి 84 గ్రామాల ప్రజల ఇబ్బందులను తొలగించాలి.

– చింపుల సత్యనారాయణరెడ్డి, తెలంగాణ పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు

ఇండ్లు నిర్మించాలంటే ఇబ్బందులు

111 జీవో పరిధిలో ఇండ్లు కడదామంటే ఇబ్బందులు తప్పడం లేదు. ప్రభుత్వం జీవో ఎత్తివేశామని చెప్పింది. కానీ ఆయా గ్రామాల్లో ఇండ్లు కట్టుకునేందుకు పనులు చేపడితే అధికారులు నిలిపివేస్తున్నారు. దీంతో ప్రజలు అయోమయంలో ఉన్నారు.



– రవి, బాకారం గ్రామస్తుడు

రేపట్నుంచే ఇంటర్ పరీక్షలు

హాజరుకానున్న 9.47 లక్షల మంది విద్యార్థులు

- రాష్ట్రవ్యాప్తంగా 1,473 పరీక్షాకేంద్రాల ఏర్పాటు
- ఉదయం 9 దాటితే నో ఎంట్రీ
- అన్ని పరీక్షాకేంద్రాల్లో సీసీ కెమెరాల నిఘా
- ప్రతీ జిల్లాలోనూ ప్రత్యేక బస్సులు



సమీక్షలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి, నవీన్ మిత్తల్, వాకాటి కరుణ

సాక్షి, హైదరాబాద్: ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలకు సర్వం సిద్ధమైంది. రాష్ట్రవ్యాప్తంగా బుధవారం నుంచి మొదలయ్యే పరీక్షలు ఏప్రిల్ 4వ తేదీ వరకూ కొనసాగనున్నాయి. మొత్తం 1,473 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష ఉంటుంది. ప్రథమ, ద్వితీయ సంవత్సరం కలిపి మొత్తం 9,47,699 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఇంటర్ బోర్డ్ వెల్లడించింది. పరీక్షల ఏర్పాట్లపై బోర్డ్ కార్యదర్శి నవీన్ మిత్తల్, విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, ఇతర ఉన్నతాధికారులతో కలిసి మంత్రి సబితాఇంద్రారెడ్డి సోమవారం సమీక్షించారు. అన్ని జిల్లాల కలెక్టర్లతో హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంత్రి మాట్లాడారు. పరీక్షల కోసం తీసుకున్న జాగ్రత్తలు, విద్యార్థులకు ఇచ్చే సూచనలను పరీక్షల విభాగం డైరెక్టర్ జయప్రదాభాయ్ మీడియాకు వివరించారు.

పకడ్బందీ ఏర్పాట్లు: మంత్రి సబిత

ఇంటర్ పరీక్షల్లో ఎలాంటి సమస్య తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మంత్రి సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. జిల్లా స్థాయి కమిటీ చైర్మన్లుగా కలెక్టర్లు పరీక్షల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా చూడాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు తాగునీరు, ఓఆర్ఎస్ అందుబాటులో ఉంచాలని సూచించారు. విద్యార్థులు సకాలంలో చేరేందుకు వీలుగా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను కోరారు. సమస్యలకు సత్వర పరిష్కారం లభించే విధంగా ప్రత్యేకంగా కంట్రోల్ రూంలు ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు.

తక్షణమే స్పందిస్తాం: నవీన్ మిత్తల్

''ఇంటర్ పరీక్షలు రాసే విద్యార్థులకు ఏ సమస్య వచ్చినా తక్షణమే అధికారుల దృష్టికి తీసుకువస్తే స్పందించేందుకు సిద్ధంగా ఉంటాం. అవసరమైన సలహాలు, సూచనలు ఇచ్చేందుకు ప్రత్యేక యంత్రాంగం పని చేస్తోంది. ఎలాంటి మానసిక ఒత్తిడి అన్పించినా విద్యార్థులు కౌన్సెలింగ్ తీసుకోవాలి.. మనోధైర్యం ప్రతీ విద్యార్థికి అవసరం'' అని ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిత్తల్ అన్నారు.

గంట ముందే పరీక్ష హాలుకు...

- విద్యార్థులను ఉదయం 8 గంటల నుంచే పరీక్షహాలులోకి అనుమతిస్తారు. 9 తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరు. విద్యార్థులు హాల్ టికెట్లపై పేరు, మీడియం ఇతర వివరాలను ముందే సరిచూసుకోవాలి. ఏదైనా సమస్య ఉంటే ప్రిన్సిపాల్ చేత సరిచేయించుకోవాలి. హాల్‌టికెట్లను tsbie.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చు. డౌన్‌లోడ్ చేసుకున్న హాల్ టికెట్లపై ప్రిన్సిపాల్ సంతకం లేకున్నా అనుమతిస్తారు.
- ఏ విధమైన ప్రింటింగ్, చేతిరాత మెటీరియల్, సెల్‌ఫోన్లు, క్యాలిక్యులేటర్, ఇతర ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లను పరీక్ష హాలులోకి అనుమతించరు.
- జిల్లా పరీక్షల కమిటీ(డీఈసీ)ని ప్రతీ జిల్లాలో నియమించారు. జిల్లా ఇంటర్ విద్యాధికారి, నోడల్ అధికారి, ఇద్దరు ప్రిన్సిపాళ్లు, జూనియర్ లెక్చరర్ ఇందులో ఉంటారు. వీరితోపాటు జిల్లా స్థాయి హైపవర్ కమిటీని ఏర్పాటు చేశారు.
- రెవెన్యూ, విద్య, పోలీసు శాఖల నుంచి ఒకరు చొప్పున 75 ఫ్లైయింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు చేశారు. పరీక్షాకేంద్రాల్లో 200 సిట్టింగ్ స్క్వాడ్స్ ఉంటాయి.
- జిల్లా కో–ఆర్డినేషన్ కమిటీలో అన్ని శాఖల అధికారులుంటారు. వారు ఆర్టీసీ, హెల్త్, విద్యుత్ సేవలు అందిస్తారు. అన్ని ప్రాంతాల్లో విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. పరీక్షకేంద్రాలకు సమీపంలో జిరాక్స్ కేంద్రాలను మూసివేస్తారు. ప్రతీ కేంద్రంలోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

మొత్తం పరీక్షా కేంద్రాలు	1,473
ప్రభుత్వ జూనియర్ కాలేజీలు	614
ప్రైవేటు కాలేజీలు	859
పరీక్షల సిబ్బంది...	
చీఫ్ సూపరింటెండెంట్లు	1,473
డిపార్ట్‌మెంట్ల అధికారులు	1,473
ఇన్విజిలేటర్లు	26,333
ఫ్లైయింగ్ స్క్వాడ్స్	75
సిట్టింగ్ స్క్వాడ్స్	200
హాజరయ్యే విద్యార్థులు మొత్తం	**9,47,699**
మొదటి సంవత్సరం	4,82,677
ద్వితీయ సంవత్సరం	4,65,022

గ్రూపులవారీగా పరీక్ష రాసేవారు

గ్రూప్	ఫస్టియర్	సెకండియర్	మొత్తం
ఎంపీసీ	2,07,756	1,65,634	3,73,390
ఎంఈసీ	14,675	19,559	34,234
బైపీసీ	1,00,332	1,11,128	2,11,460
సీఈసీ	98,598	1,11,760	2,10,358
హెచ్ఈసీ	11,295	10,263	21,558

విజయరామారావు కన్నుమూత



బంజారాహిల్స్, ఏటూరునాగారం: సీబీఐ మాజీ డైరెక్టర్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మంత్రిగా పనిచేసిన కాకులమర్రి విజయరామారావు(85) సోమవారం బ్రెయిన్ స్ట్రోక్ తో కన్నుమూశారు. బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 3 లోని నివాసంలో మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో బ్రెయిన్ స్ట్రోక్ కు గురైన ఆయనను కుటుంబ సభ్యులు హుటాహుటిన జూబ్లీహిల్స్ లోని అపోలో ఆసుపత్రిలో చేర్పించారు. వైద్యులు ఒక వైపు చికిత్స అందిస్తుండగానే రాత్రి 7:15 నిమిషాలకు ఆయన తుది శ్వాస విడిచారు. ఆయనకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు శ్రీనివాస కల్యాణ్, కుమార్తె అన్నపూర్ణ నగరంలోనే ఉండగా, చిన్న కుమారుడు ప్రసాదరావు అమెరికాలో ఉన్నారు. భార్య వసుమతి గతేడాది అనారోగ్యంతో కన్నుమూశారు. విజయ రామారావు పార్థివ దేహాన్ని సోమవారం రాత్రి అపోలో ఆసుపత్రి నుంచి ఆయన స్వగృహానికి తరలించారు. రెండో కుమారుడు అమెరికా నుంచి రానున్న నేపథ్యంలో అంత్యక్రియలను బుధవారం జూబ్లీహిల్స్ లోని మహాప్రస్థానంలో నిర్వహించనున్నారు.

సీబీఐ డైరెక్టర్ గా... మంత్రిగా..

విజయరామారావు వరంగల్ జిల్లాలోని ఏటూరు నాగారంలో జన్మించారు. పాఠశాల విద్యాభ్యాసం నెల్లూరు జిల్లా వెంకటగిరిలో జరిగింది. ఆయన తాత కల్యాణరావు స్వాతంత్ర్య సమరయోధుడు. వెంకటగిరిలో విద్యాభ్యాసం పూర్తయ్యాక పైచదువులకు మద్రాసు యూనివర్సిటీలో చేరారు. బి.ఎ. పూర్తవగానే 1958 అక్టోబరులో కరీంనగర్ ఎస్.ఆర్.ఆర్.కాలేజీలో లెక్చరర్ ఉద్యోగంలో చేరారు. 1959 అక్టోబరు నాటికి ఐ.పి.ఎస్. ట్రైనీగా శిక్షణ పొంది చిత్తూరు ఎ.ఎస్పీ.గా చేరారు. సీబీఐ డైరెక్టర్‌గా హవాలా కుంభకోణం, బాబ్రీమసీదు విధ్వంసం, ఇస్రో గూఢచర్యం కేసు, ముంబై బాంబు పేలుళ్ల మొదలైన కేసుల్లో దర్యాప్తు నిర్వహించారు. సర్వీసులో ఉండగానే ఎల్.ఎల్.బి. పూర్తి చేశారు. రిటైరైయిన తర్వాత పోలీస్ మాన్యువల్ రాశారు. రాజకీయ అరంగ్రేటం చేసి టీడీపీలో చేరి 1999లో జరిగిన ఎన్నికల్లో ఖైరతాబాద్ నుంచి శాసన సభ్యుడిగా గెలిచారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన తొలిసారే మంత్రి పదవి దక్కించుకున్నారు. 2004 అసెంబ్లీ ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ తరపున అదే నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. 2009 అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి పరాజయం పాలయ్యారు. అనంతరం 2016లో టీఆర్ఎస్‌లో చేరారు.

ఏటూరునాగారంలో విషాదఛాయలు

విజయరామారావు మృతితో స్వగ్రామం ములుగు జిల్లా ఏటూరునాగారంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు..

సాక్షి, హైదరాబాద్: కె.విజయరామారావు మృతిపై ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికారిగా, ప్రజా ప్రతినిధిగా ఆయన అందించిన ప్రజాసేవలు గొప్పవన్నారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. ఆయన అంత్యక్రియలను ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో నిర్వహించాలని నిర్ణయించారు. ఇందుకు ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారిని ఆదేశించారు. కాగా, విజయరామారావు మృతిపై మంత్రులు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఇంద్రకరణ్ రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, బీజేపీ నేత ఈటల రాజేందర్ తదితరులు సంతాపం తెలిపారు.

విదేశీ వర్సిటీలతో విధ్వంసమే!

సాక్షి, హైదరాబాద్: భారత్‌లో విదేశీ విశ్వవిద్యాలయాల ఏర్పాటు చేయడం స్వీయ విధ్వంసానికి దగ్గరి మార్గమని ఇన్ఫినిటీ ఫౌండేషన్ అధ్యక్షుడు, 'స్నేక్స్ ఇన్ ద గంగ' పుస్తక రచయిత రాజీవ్ మల్హోత్ర అభిప్రాయపడ్డారు. దేశం ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేదెలా అనే అంశంపై అవగాహన కల్పించేందుకు ఆయన దేశవ్యాప్తంగా పర్యటిస్తున్నారు.





నిఖితది ముమ్మాటికీ హత్యే

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



మన్ననూర్: సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో మృతిచెందిన నిఖితది ముమ్మాటికి హత్యే అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ స్పష్టం చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా మన్ననూర్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/ కళాశాలలో 7వ తరగతి విద్యార్థిని తరగతి గదిలో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషయమై సోమవారం ఆయన పాఠశాలను సందర్శించారు. పాఠశాలకు చెందిన కొందరు ఉపాధ్యాయులు అమ్మాయిపై దాడి చేసి ప్రాణం ఉండగానే ఫ్యాన్‌కు కట్టి ఉరితీసి ఆత్మహత్యగా చిత్రీకరించారని ఆరోపించారు. విద్యార్థిని నుదుటిపై గాయమే ఇందుకు సాక్ష్యం అన్నారు. ఉరి వేసుకోవడానికి అమ్మాయి ఎత్తు సరిపోదని, బెంచీ మీద చెప్పుల అడుగు జాడలు ఉండగా, అమ్మాయికి మాత్రం చెప్పులు లేవన్నారు. చున్నీ సైతం విద్యార్థిని కాదని, పోస్టుమార్టం సరిగ్గా చేయకుండా హడావుడిగా తెల్లవారుఝామున 3 గంటల సమయంలో పాక్షికంగా చేశారన్నారు. ఈ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించడంతో పాటు ఉస్మానియా, గాంధీ వైద్యులతో రీ పోస్టుమార్టం చేయించాలని డిమాండ్ చేశారు. ప్రిన్సిపల్ లలితాకుమారి, క్లాస్ టీచర్ గీతారాణితోపాటు ఆర్‌సీఓ వనజలను ప్రధాన నిందితులుగా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థిని హత్యకు నిరసనగా మంగళవారం ఉమ్మడి అమ్రాబాద్ మండలం, బుధవారం అచ్చంపేట పరిసర గ్రామాలు, గురువారం అచ్చంపేట పట్టణంలో బంద్‌కు పిలుపునిచ్చారు.

ఫారెస్ట్ అధికారులను తరిమిన గొత్తికోయలు

కత్తులు, గొడ్డళ్లతో దాడికి యత్నం

కొత్తగూడ: ట్రెంచ్ పనులు చేసేందుకు వెళ్లిన ఫారెస్ట్ అధికారులను గొత్తికోయలు కత్తులు, గొడ్డళ్లతో తరిమారు. ఈ ఘటన సోమవారం మహబూబాబాద్, ములుగు జిల్లాల పరిధి తాడ్వాయి – కొత్తగూడ మండలాల సరిహద్దు అటవీ ప్రాంతంలో జరిగింది. ఇక్కడ బూడిదగడ్డ ప్రాంతంలో కొందరు గొత్తికోయలు పోడు వ్యవసాయం చేసుకుంటున్నారు. ఆ భూమిని తిరిగి స్వాధీనం చేసుకునేందుకు కొత్తగూడ అటవీ శాఖ అధికారులు దట్టమైన అడవిని దాటి వెళ్లారు. ఇది గమనించిన గొత్తికోయలు కత్తులు, గొడ్డళ్లు, కొడవళ్లతో దాడికి యత్నించడంతో అధికారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెనుదిరిగినట్లు సమాచారం. కాగా, ఎలాంటి రక్షణ లేకుండా పంపిన ఎఫ్ఆర్వోపై కింది స్థాయి సిబ్బంది ఆగ్రహంగా ఉన్నట్లు తెలుస్తోంది.

కొత్త మెడికల్ కాలేజీల్లో ఎన్‌ఎంసీ తనిఖీలు

- మౌలిక సదుపాయాలు లేకపోవడంపై అసంతృప్తి
- మరోసారి తనిఖీలకు వచ్చేనాటికి అన్నీ సరిచేసుకోవాలని సూచన

సాక్షి, హైదరాబాద్: 2023–24 వైద్య విద్యా సంవత్సరంలో కామారెడ్డి, ఖమ్మం, వికారాబాద్, జనగాం, భూపాలపల్లి జిల్లాల్లో కొత్తగా ఏర్పాటు చేయబోయే మెడికల్ కాలేజీలను జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) బృందాలు సోమవారం తనిఖీ చేశాయి. కాలేజీ భవనాలు, సదుపాయాలు, సిబ్బంది వంటి అన్ని రకాల వసతులను పరిశీలించాయి. అనేకచోట్ల మౌలిక సదుపాయాలు సక్రమంగా లేవని ఎన్‌ఎంసీ అధికారులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కాలేజీలను ఎన్‌ఎంసీ బృందాలు తనిఖీ చేయడం ఇది రెండోసారి కాగా, మొదటిసారి వచ్చినప్పుడు గుర్తించిన లోపాలు ఇప్పటికీ అలాగే కొనసాగడంపై ఎన్‌ఎంసీ అధికారులు అసంతృప్తి వ్యక్తం చేసినట్టుగా తెలిసింది. ప్రొఫెసర్లు, నాన్ టీచింగ్ ఫ్యాకల్టీ కొరత, ఆసుపత్రుల్లో ఎన్‌ఎంసీ రూల్స్ ప్రకారం ఉండాల్సిన మౌలిక సదుపాయాలు లేకపోవడంపై కాలేజీల ప్రిన్సిపాళ్లను హెచ్చరించారు. ఫైనల్ ఆడిట్‌కు వచ్చేవరకూ ఇప్పుడు గుర్తించిన లోపాలు అన్నింటినీ సరిచేసుకోవాలని సూచించారు. లేదంటే కాలేజీలకు అనుమతి ఇవ్వడం సాధ్యం కాదని తేల్చిచెప్పారు. ఈ ఏడాది మొత్తం 9 కాలేజీల కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి దరఖాస్తు చేసుకున్న సంగతి తెలిసిందే. ఇందులో కామారెడ్డి, ఖమ్మం, వికారాబాద్, జనగాం, భూపాలపల్లితోపాటు ఆసిఫాబాద్, నిర్మల్, సిరిసిల్ల, కరీంనగర్ కూడా ఉన్నాయి. ఈ కాలేజీలన్నీ రప్పించేందుకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ భారీ కసరత్తు చేస్తోంది. ఈ విషయమై వైద్య విద్యా సంచాలకులు డాక్టర్ రమేష్‌రెడ్డి బిజీబిజీగా ఉన్నారు. ఆయన ఈ పని మీదే ఢిల్లీకి వెళ్లారని సమాచారం.





నేను హింసకు ఎందుకు అభ్యంతరం చెబుతానంటే – అది మంచి చేసినట్టుగా కనబడినప్పుడు, ఆ మంచి కేవలం తాత్కాలికం, కానీ అది చేసే చెడు మాత్రం శాశ్వతం.
– మహాత్మా గాంధీ

సాక్షి

మంగళవారం, మార్చి, 14

చెయ్యెత్తి జైకొట్టిన ఆస్కార్

అనుకున్నదే అయింది. ఆశించినది దక్కింది. ప్రతిష్ఠాత్మక అకాడెమీ అవార్డుల (ఆస్కార్) విశ్వ వేదికపై భారతీయ సినిమా వెలుగులీనింది. తెలుగు సినిమా 'ఆర్.ఆర్.ఆర్' తొలిసారిగా మన వెండితెరకు 'బెస్ట్ ఒరిజినల్ సాంగ్' విభాగంలో కీర్తి కిరీటధారణ చేసింది. హాలీవుడ్‌లో సినీ శిఖరమని భావించే ఆస్కార్‌ను పూర్తి స్వదేశీ నిర్మాణంతో అందుకోవాలన్న భారతీయ సినిమా దీర్ఘకాల స్వప్నం నెరవేరింది. ఉత్తమ డాక్యుమెంటరీ షార్ట్ ఫిల్మ్‌గానూ మన దక్షిణ భారతీయురాలు అనాథ ఏనుగు సంరక్షణపై తమిళనాట తీసిన చిత్రమే (కార్తికీ గొంజాల్వెజ్ తొలియత్నం 'ది ఎలిఫెంట్ విష్పరర్స్') ఆస్కార్ సాధించింది. వెరసి కమర్షియల్ సినిమానే కాదు, కదిలించే డాక్యుమెంటరీతోనూ విదేశాలతో పోటీపడగలమని ఒకటికి రెండు ఆస్కార్ ప్రతిమల సాక్షిగా 95వ అకాడెమీ అవార్డుల ప్రకటన నిరూపించింది. ప్రధానంగా అమెరికన్ల వ్యవహారమైన ఆస్కార్ కోటలో మన సినిమా పాగావేసింది.

రెండు విభిన్న పార్శ్వాలకు ప్రతీకగా, మూడు విభాగాల్లో ఆస్కార్ తుది జాబితాకు నామినేటై, అందులో ఏకంగా రెండింటిలో పురస్కార విజేతగా నిలవడం భారతీయ సినిమా కనీవినీ ఎరుగని విషయం. ఇది యావద్భారత సినీ ప్రపంచం రొమ్ము విరుచుకొనే సమయం. శతాధిక వసంత భారతీయ సినీ చరిత్రలో సువర్ణాక్షర లిఖిత సందర్భం. స్వాతంత్ర్యం సిద్ధించే నాటికి వివిధ భాషల్లో ఏటా 283 ఫీచర్ ఫిల్మ్స్ తీస్తున్న మన భారతీయ చిత్ర పరిశ్రమ ఇవాళ ఏటా 2 వేల సినిమాలకి ఎదిగింది. మూకీల రోజుల్లోనే విదేశాలకు వెళ్ళిన మన సినిమాకు ఉత్తమ విదేశీ చిత్ర విభాగమంటూ 1956లో కొత్త కేటగిరీ పెట్టినప్పటి నుంచి గత 67 వత్సరాలుగా ఆస్కార్ అందని ద్రాక్షపండే. ఇన్నేళ్ళలో మన సినిమాలు మూడే తుది జాబితా దాకా వెళ్ళినా, ఒక్క ఓటుతో అవార్డు మిస్సయిన మదర్ ఇండియా (1957), ఆ తర్వాత మీరా నాయర్ 'సలామ్ బాంబే' (1988), ఆమిర్‌ఖాన్ 'లగాన్' (2001)– ఏవీ అవార్డు తేలేకపోయాయి. ఇప్పటికి వేరే కేటగిరీలోనైతేనేం ఆ కోరిక తీరింది.

ఆస్కార్ మనకు మరీ కొత్త కాదు. విదేశీయులు తీసిన చిత్రాల్లో మనం ఆస్కార్ అందుకోవడం అటెన్‌బరో 'గాంధీ' (1982) నుంచి ఉంది. 'ప్యాసా', 'ఆమ్రపాలి', 'గైడ్'లకు పనిచేసిన కాస్ట్యూమ్ డిజైనర్ స్వర్గీయ భానూ అతయ్యా 'గాంధీ'తో తొలి భారతీయ ఆస్కార్ విజేతయ్యారు. ఆ పైన గౌరవంగా ఇచ్చే జీవన సాఫల్య పురస్కారాన్ని దిగ్దర్శకుడు సత్యజిత్ రాయ్ (1991) అందుకున్నారు. ఇక, భారత్‌లోని పట్టణ ప్రాంత పేదరికంపై విదేశీయులు తీసిన 'స్లమ్‌డాగ్ మిలియనీర్' (2008) సంగీత దిగ్గజం రెహమాన్‌కు రెండు (బెస్ట్ ఒరిజినల్ సాంగ్, ఒరిజినల్ స్కోర్) ఆస్కార్లు తెచ్చింది. పాటకు రెహమాన్‌తో కలసి గీత రచయిత గుల్జార్ గౌరవం పంచుకున్నారు. అదే చిత్రంలో బెస్ట్ సౌండ్ మిక్సింగ్‌కు మరో ఇద్దరితో కలసి రసూల్ పూకుట్టి విజేతగా నిలిచారు. షార్ట్ ఫిల్మ్‌లకొస్తే – ఉత్తరప్రదేశ్ నేపథ్యంలో తీయగా 2018లో ఆస్కార్ గెలిచిన షార్ట్ ఫిల్మ్ 'పీరియడ్. ఎండ్ ఆఫ్ ఎ సెంటెన్స్'కు నిర్మాతల్లో ఒకరు భారతీయ వనిత గునీత్ మోంగా. అయితే, దర్శకురాలు విదేశీయురాలు. ఇలా ఇప్పటిదాకా అన్నీ విదేశీ భాగస్వామ్యంలో మనవాళ్ళు ఎగరేసిన జెండాలు. తొలిసారి పూర్తి స్వదేశీ దర్శక, నిర్మాణాలైన 'ఆర్‌ఆర్‌ఆర్', 'ఎలిఫెంట్' రెండూ ఆస్కార్లు తేవడం మరువలేని ఘనత.

బ్రిటీషు పాలనా కాలపు నేపథ్యంలో వేర్వేరు కాలఘట్టాలకు చెందిన పోరాటయోధుడు అల్లూరి, ఆదివాసీ ముద్దుబిడ్డ కొమురం భీమ్ కలిస్తే ఎలా ఉంటుందనే కాల్పనిక కథ 'ఆర్‌ఆర్‌ఆర్' తెరపై సినిమాటిక్ భావోద్వేగాలకు పరాకాష్ఠ. అసలు చరితను సైతం ఆలోచింప జేయనివ్వని రాజమౌళీంద్రజాలం. కీరవాణి బాణీలో నృత్యప్రధాన గీతం 'నాటు నాటు' దేశదేశాల్లో అభిమానుల్ని సంపాదించుకుంది. దానికి చంద్రబోస్ కూర్చిన తేటతెలుగు మాటలు, ప్రేమ్ రక్షిత్ సమకూర్చిన స్టెప్పులు, రెండు నెలల కఠోరసాధన– 20 రోజుల షూటింగ్‌తో జూనియర్ ఎన్టీఆర్ – రామ్‌చరణ్‌ల సమన్వయ నృత్య విన్యాసం – అన్నీ కలిసొచ్చాయి. ఆస్కార్ విజేతల్ని నిర్ణయించే 9 వేల పైచిలుకు సభ్యుల్నీ ఊపేశాయి. భారతదేశం తరపున ఉత్తమ విదేశీ చిత్ర విభాగంలో అధికారిక ఎంట్రీగా గుజరాతీ 'ఛెల్లో షో' వెళ్ళినా, అది తుదిపోరు దాకా చేరుకోనే లేదు. ఆ మాట కొస్తే, గత 21 ఏళ్ళలో ఏ ఇతర భారతీయ ఎంట్రీ తుది 5 చిత్రాల జాబితాలో నిలవలేదు. ఈసారి 'ఆర్‌ఆర్‌ఆర్' అమెరికన్ డిస్ట్రిబ్యూటర్ వేరియన్స్ ఫిల్మ్స్– రాజమౌళి బృందం పట్టుదలగా 'ఫర్ యువర్ కన్సిడరేషన్' క్యాంపెయిన్‌లో 14 కేటగిరీల్లో సినిమాను ప్రమోట్‌చేసింది. ప్రచారమూల్యం మాటెలా ఉన్నా, చివరకు ఒక కేటగిరీలో ఆస్కార్ కల నిజమైంది. తుది జాబితా నాటికే 'నాటు నాటు'పై పెరిగిన అంచనాలు ఫలించాయి.

పాపులర్ హాలీవుడ్ ఎంట్రీలను పక్కకు నెట్టి మరీ మన 'నాటు నాటు' ఈ ఘనత సాధించింది. ఇప్పటికే గోల్డెన్ గ్లోబ్, క్రిటిక్స్ ఛాయిస్ అవార్డ్‌లూ వరించేసరికి తెలుగు పాటకు విశ్వకీర్తి దక్కింది. క్రిటిక్స్ ఛాయిస్ అవార్డ్ ఈ చారిత్రక ఫ్యాంటసీకి, న్యూయార్క్ ఫిల్మ్ క్రిటిక్స్ వారి బెస్ట్ డైరెక్టర్ అవార్డ్ రాజమౌళికీ దక్కాయి. ఇంతకన్నా గొప్ప పాటలు, సినిమాలొచ్చాయన్న కొందరి సన్నాయి నొక్కులు సినిమా జోరు, అవార్డుల హోరులో కలసిపోయాయి. 'ఈ నక్కలవేట ఎంతసేపు? కుంభస్థలాన్ని బద్దలుకొడదాం పద' అని ఈ చిత్రంలో ఓ హీరో డైలాగ్. అవును. రాజమౌళి బృందం ఇప్పుడు అంతర్జాతీయ అవార్డుల కుంభస్థలాన్ని బద్దలుకొట్టింది. పక్కా ప్రణాళికతో అడుగేస్తే అసాధ్యమే లేదని మన ఫిల్మ్ మేకర్స్‌లో నమ్మకం కలిగించింది. వ్యాపారంలోనూ, వ్యవహారంలోనూ కొత్త తలుపులు తెరిచి, కొత్త ఎత్తులు చూపిన మన సినిమాకు స్వాగతం. అందుకు ఇది ఓ శుభారంభం.

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, తిథి: బ.సప్తమి సా.5.06 వరకు, తదుపరి అష్టమి, నక్షత్రం: జ్యేష్ఠ తె.4.34 వరకు (తెల్లవారితే బుధవారం), తదుపరి మూల, వర్జ్యం: ఉ.10.53 నుండి 12.25 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.35 నుండి 9.24 వరకు, తదుపరి రా.10.56 నుండి 11.44 వరకు, అమృతఘడియలు: రా.8.04 నుండి 9.37 వరకు.

సూర్యోదయం : 6.14
సూర్యాస్తమయం: 6.06
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

ఏ ప్రభుత్వమైనా ఇదే తంతు!



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

నిష్పక్షపాతంగా ఉండాల్సిన దర్యాప్తు సంస్థలు పాలకుల చేతి చిలకలుగా ఉంటున్నాయన్న ఆరోపణలు కొత్తవి కాదు. ఈ సంస్కృతికి ఏ ఒక్క పార్టీనో నిందించి ప్రయోజనం లేదు. సీబీఐ, ఈడీ, ఆదాయ పన్ను శాఖ ఉన్నతాధికారుల చేతులు మెలిపెట్టి వారిని వాడుకోవడంలోనూ; రాజనీతికి, దేశ విశిష్ట రాజ్యాంగ చట్ట నిబంధనలకు యథేచ్ఛగా తిలోదకాలివ్వడంలోనూ పాలకుల మధ్య ఎత్తుగడలలో తేడాలే తప్ప వ్యవహారం మొత్తం ఒకే రకం. అలాగే ఇవాళ ప్రతిపక్ష నాయకుల్ని, పాత్రికేయుల్ని, ప్రజా సమస్యలకు న్యాయమైన పరిష్కారాన్ని కోరుతూ ఉద్యమాలు నిర్వహిస్తున్న పౌర హక్కుల ఉద్యమకారులపై పోలీసు జులుం వినియోగించే సంస్కృతికి కూడా పాలక పార్టీలు సమాన స్థాయిలో మూల విరాట్టులేనని మరచిపోరాదు.

నిష్పక్షపాతంగా ఉండాల్సిన సంస్థలను కేంద్ర ప్రభుత్వం వాడుకుంటోందన్న రొడ్డ కొట్టుడు ప్రకటనలను ప్రజలు వినలేక చస్తున్నారు. ఎందుకంటే, 'అందరూ శాకాహారులే అయితే రొయ్యల బుట్ట కాస్తా ఎలా ఖాళీ అయిపోయిం'దన్న ప్రశ్నకు సమాధానం వారికి ఇంతవరకూ దొరకలేదు కాబట్టి! దేశ స్వాతంత్ర్య అమృతోత్సవాలు జరుపుకొంటున్న ముహూర్త కాలంలో కూడా ఈ ప్రశ్నకు సమాధానం దొరకడం లేదు. ఎందుకని? నాయకులకన్నా స్వాతంత్ర్యం కోసం ఆస్తులు, ప్రాణాలు సహా దేశ ప్రజా బాహుళ్యం అనంతమైన త్యాగాలు చేసి ఉన్నారు గనుక.

ఇవాళ ప్రతిపక్ష నాయకుల్ని, వారి అనుయాయుల్ని, పాత్రికేయుల్ని, పౌర సమాజాన్ని, ప్రజా సమస్యలకు న్యాయమైన పరిష్కారాన్ని కోరుతూ ఉద్యమాలు నిర్వహిస్తున్న పౌర హక్కుల ఉద్యమకారులను హింసిస్తూ, వారిపై పోలీసు జులుం వినియోగించే పాలక సంస్కృతికి కాంగ్రెస్, బీజేపీ పార్టీలు సమాన స్థాయిలో మూల విరాట్టులేనని మరచిపోరాదు. అంతేగాదు, కోర్టుల్ని ధిక్కరించి, వాటి చేతుల్ని మెలిపెట్టి పనులు నిర్వహించుకునే సంస్కృతికి తెరలేపినవీ కూడా ఈ రెండు పార్టీలేనని నిద్రలోనూ మరవరాదు.

అలహాబాద్ హైకోర్టు సాహసించి ఇందిరాగాంధీ 'ఎమర్జెన్సీ రాకెట్' బాగోతాన్ని బట్టబయలు చేస్తూ శపిస్తూ చెప్పిన చరిత్రాత్మక తీర్పును ఆమోదిస్తూనే సుప్రీంకోర్టు ప్రసిద్ధ న్యాయమూర్తి కృష్ణయ్యర్ ఉదార దృక్పథంతో ఇందిరా గాంధీ 'విషయాన్ని చక్కబెట్టుకోవడానికి' వెసులుబాటు కల్పించబట్టి తక్షణం ఆమె రాజీనామా వాయిదా పడింది. సీబీఐ, ఈడీ, ఆదాయ పన్ను శాఖ ఉన్నతాధికారుల చేతులు మెలిపెట్టి వారిని వాడుకోవడంలోనూ; రాజనీతికి, దేశ విశిష్ట రాజ్యాంగ చట్ట నిబంధనలకు యథేచ్ఛగా తిలోదకాలివ్వడంలోనూ కాంగ్రెస్, బీజేపీ పాలకుల మధ్య ఎత్తుగడలలో తేడాపాడాలే తప్ప వ్యవహారం మొత్తం ఒకే రకం. ప్రజాబాహుళ్యాన్ని, వారి సంక్షేమాన్ని ప్రజాస్వామిక పద్ధతుల్లో తీర్చిదిద్దుతూ వచ్చిన ఉదాహరణలు తక్కువ. స్వతంత్ర సంస్థలుగా ఉండవలసిన సీబీఐ, ఈడీ, ఆదాయపు పన్ను శాఖలను గతంలో 'చేతివాటు' పనిముట్లుగా వాడుకున్న తీరు చివరికి సుప్రీంకోర్టు దృష్టికి వెళ్లడమూ, కోర్టు సీబీఐ, ఈడీ అధికారులను చీవాట్లు పెడుతూ, ఇకమీదట 'మీరు కేంద్ర ప్రభుత్వానికే కాదు, సుప్రీం న్యాయస్థానానికి బాధ్యులై ఉండాల'ని కఠినంగా ఆదేశించడమూ జరిగింది.

బహుశా ఈ పరిణామాలను గమనించిన తరువాతనే కేంద్ర సీబీఐ మాజీ ఉన్నతాధికారి, గూఢచార శాఖ మాజీ అధిపతి రామేశ్వర్ నాథ్ కావ్ కూడా పాలకుల ప్రలోభాల ఫలితంగా గూఢచార శాఖ అధికారులు చూసి రమ్మంటే కాల్చి వచ్చే బాపతులుగా తయారు కావడం విచారకరమని ఒక పుస్తకమే రాసి విడుదల చేశారు. ఈ

రెండో మాట



బాగోతం ఇప్పుడు కూడా పెద్ద ఎత్తున సాగుతోంది. ఇలాంటి ఉదాహరణలను పెక్కింటిని 'హిందూ' దినపత్రిక మేటి పక్ష పత్రిక అయిన 'ఫ్రంట్ లైన్' ప్రత్యేక ప్రతినిధి, విశిష్ట విశ్లేషకుడైన అశుతోష్ శర్మ పేర్కొన్నారు: "రూ. 300 కోట్ల మనీ లాండరింగ్ కుంభకోణం కేసులో నిందితుడైన కేంద్ర మంత్రి నారాయణ్ రానే, అధికార పక్షంలో చేరడంతోనే అతనిపై అంతకుముందున్న కేసు కాస్తా మాఫీ అయిపోయింది. అదే తరహాలో పశ్చిమ బెంగాల్‌లో 'నారదా' కుంభకోణంలో నిందితుడైన సువేందు అధికారిపై విచారణ కాస్తా రద్దయిపోయింది. మధ్యప్రదేశ్ షిండే సేనకు చెందిన భావనా గవ్లీకి 'ఈడీ' జారీ చేసిన అయిదు సమన్లను ఖాతరు చేయకపోయినా ప్రస్తుత లోక్‌సభలో 'షిండే సేన'కు ఛీఫ్ విప్‌గా ఉన్నారు. అలాగే, విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్ట (ఫెమా) ఉల్లంఘన కేసులో ఈడీ విచారణలో ఉన్న యశ్వంత్ యాదవ్, ఎమ్మెల్యే యామినీ యాదవ్ దంపతులిద్దరూ ఇప్పుడు 'షిండే సేన'లో సభ్యులుగా ఉన్నారు. మనీ లాండరింగ్ కేసులో శివ సేన సభ్యుడుగా ఉన్న ప్రతాప్ సర్ నాయిక్‌పై 'ఈడీ' సోదా నిర్వహించితే ఇప్పుడతను షిండే సేనలోకి చేరడంతోనే కేసు కాస్తా మాఫీ అయిపోయింది.

ఈ సందర్భంలోనే ఢిల్లీ ముఖ్యమంత్రి, 'ఆప్' జాతీయ నాయకుడైన అరవింద కేజ్రీవాల్ (మార్చి 1న) ఒక ప్రశ్న సంధిస్తూ 'ఈ రోజున ఆప్ మంత్రి మనీష్ సిసోడియా బీజేపీలో చేరితే, రేపంటి రేపే విడుదలైపోడా?' అని ఓ జోక్ వదిలారు. అంతేగాదు, సుప్రీంకోర్టు న్యాయవాది కాశీశ్వరం రాజ్ – 'భారతదేశంలో న్యాయ వ్యవస్థ ఎంత బలహీనంగా ఉందంటే, కోర్టు నిర్ణయించిన న్యాయమూర్తుల నియామకాల్ని కూడా తిమ్మినిబమ్మిని చేసి తారుమారు చేయగల శక్తి పాలక వర్గానికి ఉందని అర్థమవుతోంది' అని చురక వేశారు. అయితే, ఎప్పుడయితే సుప్రీం కోర్టుకు ప్రగతిశీల ప్రధాన న్యాయమూర్తిగా డీవై చంద్రచూడ్ పదవీ స్వీకారం చేశారో అప్పటినుంచీ సుప్రీంకోర్టు నుంచి వెలువడుతున్న ప్రజాహిత నిర్ణయాలు దేశ ప్రజలకు మంగళకర సూచనగా భావించాలి. ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ పాలనా కాలంలో సుప్రీం న్యాయమూర్తి హోదాలో జస్టిస్ ఖన్నా దేశవ్యాప్తంగా పౌర హక్కుల వినాశానికి, పాలక నియంతృత్వ ధోరణులకు 'ఫుల్‌స్టాప్' పెట్టించి రాజకీయ ఖైదీల విడుదలకు ఉత్తర్వులు జరూరుగా జారీ చేసి, దేశంలోనూ, విదేశాలలోనూ ఖ్యాతి గడించారు. తాను సుప్రీం ప్రధాన న్యాయమూర్తి కానున్న సమయంలో ఆ పదవిని త్యాగం చేసిన జస్టిస్ ఖన్నాను విదేశాలు మరచిపోలేదుగానీ, మన దేశంలో అలాంటి న్యాయమూర్తికి ఏటా నివాళులర్పించగల కనీస సంస్కారం కూడా మనలో కరువై పోయింది.

ఒక దేశం, ఒకే ఎన్నిక, ఒకే నాయకుడు అన్న ధోరణి రాజ్యాంగం నిర్దేశించి, గ్యారంటీ చేసిన ఫెడరల్ (సమాఖ్య) వ్యవస్థకు చేటు కల్గిస్తుందని దేశ ప్రజలు స్వాతంత్ర్య అమృతోత్సవ వేళ గుర్తించాల్సిన సమయం వచ్చింది. ఈ సందర్భంగా కవయిత్రి మాయా ఏంజెలో (శివలక్ష్మి అనువాదం) స్వేచ్ఛా పక్షికీ, 'పంజరంలోని పక్షి'కీ గల తేడాను వర్ణిస్తూ చెప్పిన మాటల్ని విందాం:

"స్వేచ్ఛా పక్షి తన శక్తి మేరకు
ఆకాశాన్ని సైతం శుభ్రం చేయడానికి
ధైర్యం చేస్తుంది...
పంజరంలో పక్షి
భయంకరంగా వణికే గొంతుతో పాడుతుంది
కానీ, చాలాకాలంగా
సుదూరపు కొండలనుంచి
శ్రుతి తప్పిన రాగం అస్పష్టంగా
పంజరం నుంచి విముక్తి కోసం
పక్షి స్వర రాగం
విషాదంగా వినపడుతూనే ఉంటుంది
స్వేచ్ఛా పక్షులు ఆహ్లాదకరమైన ఇతర పక్షుల
గురించి ఆలోచిస్తాయి
చెట్లు వదిలే వాణిజ్య వాయువుల్ని మృదువుగా ఆస్వాదిస్తాయి
ఆ పక్షులు ఆకాశానికి తమ పేరు పెట్టుకుంటాయి!
కానీ పంజరంలోని పక్షి తన కలల సమాధిపై నిలబడి ఉంటుంది
ఆ పక్షి రెక్కలు కత్తిరించబడ్డాయి, పాదాలు కట్టివేయబడ్డాయి
కాబట్టి పంజరంలో పక్షి పాడటానికి తన గొంతు
సవరించుకుంటుంది
పంజరంలో పక్షి పాడుతుంది
భయకంపితమైన స్వరంతో
తన స్వేచ్ఛను ఎలుగెత్తి చాటే
పక్షి స్వర రాగం విషాదంగా వినబడుతూనే ఉంది!"

abkprasad2006@yahoo.co.in

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

అద్భుత క్షణం



'నాటు నాటు' పాట ఆస్కార్ పురస్కారం గెలుచుకుంది. భారతీయ సినిమాకూ, సంగీతానికీ, డాన్స్‌కూ ఎంత అద్భుతమైన క్షణం.

– రాజీవ్ కుమార్, ఇన్వెస్టర్

నవ్వుకో అవార్డు



మనకొచ్చిన ఆస్కార్ అవార్డులు అలా ఉండనీ. దయచేసి దీపికా పదుకోణ్ నవ్వుకు ఒక ఆస్కార్ ఇవ్వండి. ఉఫ్! ఆ వేడుకల్లో అందరినీ ఎలా సంభ్రమానికి గురి చేసింది!

– పూజా త్రిపాఠీ, వైద్యురాలు

దేనికి అభ్యంతరం?



'సేమ్‌– సెక్స్' (ఒకే లింగ) వివాహాలను భిన్న లింగ వివాహితులు ఎందుకు వ్యతిరేకిస్తున్నారో నాకు అర్థం కావడం లేదు. మిమ్మల్ని ఎవరూ మీ భార్యకు విడాకులు ఇచ్చి, ఇంకో అబ్బాయిని పెళ్లి చేసుకొమ్మని కోరడం లేదు కదా! ఎవరో ఇంకెవరినో పెళ్లి చేసుకుంటే మీదేం పోతుంది?

– సామిత్ర పఠారే, సైకియాట్రిస్ట్

అందరం అంతే!



ఇండియాలోని ప్రతి సమస్యకూ కారణం ఉత్తరాదివాళ్లే అని చెప్పే ఈ చెత్తవాగుళ్లను కొంచెం ఆపుదామా? మనం(దక్షిణ భారతీయులు) మాత్రం ఏమైనా సాధువులమా?

– ప్రియాస్మిత, ఆంత్రప్రెన్యూర్

మొదటి అవార్డు



ఉత్తమ నటిగా ఆస్కార్ అవార్డును మిషెల్ యోకు నటి హాలీ బెర్రీ కళ్లనీళ్ల పర్యంతమవుతూ బహూకరించారు. 95 ఏళ్లలో ఈ అవార్డును అందుకున్న 'వర్ణవు' (కలర్: శ్వేతజాతేతరులు అన్న అర్థంలో) మహిళలు వీళ్లిద్దరు మాత్రమే!(మిషెల్ ఈ పురస్కారం గెలుచుకున్న మొదటి ఆసియా మహిళ కూడా!)

– స్పెన్సర్ ఆల్ట్‌హౌజ్, జర్నలిస్ట్

దేశానికి అంకితం



ఒక ఇండియా నిర్మాణానికి మేము మొట్టమొదటి ఆస్కార్ అవార్డు గెల్చుకున్నాం. ఇద్దరం మహిళలం దీన్ని సాధించాం. నేను ఇంకా వణుకుతూనే ఉన్నాను. నా హృదయం మొత్తం ప్రేమ, ఉద్వేగాలతో నిండిపోయింది; అదంతా కూడా మా గెలుపు కోసం మమ్మల్ని ఇండియాలో ఉత్సాహపరిచిన ప్రతి ఒక్కరినుంచీ పీల్చుకున్నది. అందమైన, వైవిధ్య భరితమైన నా భారతదేశానికి ఈ పురస్కారం అంకితం.

– గునీత్ మోంగా, 'ది ఎలిఫెంట్ విష్పరర్స్' నిర్మాత

అవార్డుల ఏనుగు



ఆసియాకు మరో చారిత్రక తొలి అవార్డు: దర్శకురాలు కార్తికీ గొంజాల్వెజ్, నిర్మాత గునీత్ మోంగా 'ది ఎలిఫెంట్ విష్పరర్స్'కు గానూ ఉత్తమ లఘు డాక్యుమెంటరీ విభాగంలో ఆస్కార్ గెలుచుకున్న తొలి భారతీయ ఫిలింమేకర్స్. వాళ్లకు అభినందనలు.

– నాన్సీ యాంగ్ యువెన్, రచయిత్రి

ఇన్‌బాక్స్

బీడీకార్మికులకు అండగుందాం

తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమం 'ముంబాయి–దుబాయి–బొగ్గుబాయి' అంటూ చర్చించిన విధంగా... దాదాపు పది లక్షల మందితో విస్తరించిన బీడీ కార్మికుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించ లేకపోయింది. నూటికి 99 శాతం మహిళా కార్మికులతో నిండి ఉన్న బీడీ పరిశ్రమ కార్మికులు దశాబ్దాల తరబడి హక్కుల కోసం పోరాడుతున్నారు. సమైక్యాంధ్ర ప్రభుత్వ హయాంలో 40 రోజులు సమ్మె చేసి 2012లో జీఓఎంఎస్ నంబర్ 41 ద్వారా కనీస వేతనాలు సాధించుకున్నారు. కానీ యాజమాన్యాలు... పాలకులపై ఒత్తిడి తెచ్చి సదరు జీఓను నిలుపుదల చేయించారు. పైగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇస్తానన్న బీడీ కార్మికుల జీవన భృతిని కూడా 2014 ఫిబ్రవరి 28 నాటికి ప్రావిడెంట్ ఫండ్ కలిగి ఉన్న కార్మికులకే పరిమితం చేశారు.

ఇటీవల మునుగోడు ఉప ఎన్నికల సందర్భంగా బీడీ కార్మికులందరికీ జీవనభృతి అమలు చేస్తానన్న ముఖ్యమంత్రి కేసీఆర్ మాట నిలుపుకోవాలని... హైదరాబాద్‌తో పాటు రాష్ట్రమంతటా కార్మికులు రోడ్ల మీదకి వచ్చారు. ఫలితంగా అనేకమంది లీడర్లపై కేసులు నమోదు చేసి వేధిస్తున్నారు. సిగరెట్ అండ్ అదర్ టొబాకో ప్రొడక్ట్స్ (సీఓటీపీఏ) కు 2019లో చేసిన సవరణల ద్వారా మొత్తం బీడీ పరిశ్రమ పైనే కేంద్రం వేటు వేయాలని చూస్తోంది. బీడీ కార్మికులకు కనీస వేతనాలు అందించాలనీ, అర్హత గల బీడీ కార్మికులందరికీ ప్రత్యామ్నాయ జీవనోపాధి చూపకుండా బీడీ పరిశ్రమ మూసివేయరాదనీ కోరుతూ సుదీర్ఘ కాలంగా బీడీ కార్మికులు ఆందోళన చేస్తున్నారు. అందుకు అదిరింపులు, బెదిరింపులు, నిర్బంధాలు ఎదుర్కొంటున్నారు. బీడీ కార్మికుల ఉద్యమానికి సంఘీభావంగా మార్చి 8 నుండి 15 వరకు వివిధ జిల్లాల్లో సభలు, సమావేశాలు నిర్వహిస్తూ... 2013 మార్చి15న హైదరాబాదులోని ఓంకార్ భవన్‌లో బహిరంగ సభ నిర్వహిస్తున్నం. విజయవంతం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాం.

– ప్రజా సంఘాల ఉమ్మడి వేదిక
(రేపు హైదరాబాద్ ఓంకార్ భవన్‌లో బీడీ కార్మికుల బహిరంగ సభ)

మహిళా మనుగడ కోసం మరో ఉద్యమం

అభిప్రాయం



కోగంటి వెంకటేశ్వర రావు

బాధంటే అలా ఉంటుంది. భరించలేని దుఃఖం అంటే అలా ఉంటుంది. ఆ కన్నీళ్లు గుండెల్లోంచి వస్తున్నట్లు అనిపించింది. 16 డిసెంబరు 2012 నాడు జరిగిన 'నిర్భయ' ఘటన తలచుకుంటే ఇప్పటికీ ఒళ్లంతా జలదరిస్తుంది. జనానికి విపరీతమైన ఆవేశం వచ్చింది. అందరూ రోడ్లపైకి వచ్చారు. కొవ్వొత్తుల ర్యాలీలు తీశారు. నిందితులకు ఉరిశిక్ష పడాలని ఉద్యమించారు. క్రమంగా ప్రజలు దైనందిన జీవితంలో మునిగిపోయారు. మళ్లీ 2019లో దిశ సంఘటన... అదే అంతులేని దుఃఖం, అదే ఆవేశం. నిందితులను ఉరి తీయాలని ర్యాలీలు తీశారు. చివరికి నిందితుల ఎన్‌కౌంటర్ జరిగింది. పోలీసులపై పూల వర్షం కురిసింది. అందరి ఆవేశమూ చల్లారింది.

ఒక సంఘటనకు పరిష్కారం లభించింది. కానీ మనకు కావలసింది ఏదో ఒక సంఘటనకు పరిష్కారం కాదు. సమస్యకు శాశ్వత పరిష్కారం. 'జాతీయ నేర గణాంక నమోదు సంస్థ' తాజా నివేదిక ప్రకారం 2013లో నిర్భయ చట్టాన్ని తీసుకు వచ్చాక ఈ అత్యాచారాలు మరింత పెరిగినట్లు తెలుస్తోంది. అంటే ఈ సమస్యను పెంచిపోషించే పరిస్థితులు సమాజంలో పెరిగాయన్నమాట. సమస్యకు పరిష్కారం తొందరగా సాధించక పోయినట్లయితే ఇటువంటి సంఘటనలు పునరావృతం అవుతూనే ఉంటాయి.

సింగరేణి కాలనీలో ఆరేళ్ల గిరిజన బాలికపై అత్యాచారం, ముంబైలో మరో నిర్భయ, చెన్నైలో 20 ఏళ్ల యువతిపై సామూహిక అత్యాచారం, మహారాష్ట్రలో 15 ఏళ్ల బాలికపై 8 నెలల పాటు 33 మంది సామూహిక అత్యాచారం... ఈ వార్తలన్నీ సమస్య ఎంత భయంకరంగా వుందో తెలియజేస్తాయి.

మనం ఎలాంటి సమాజంలో ఉన్నాము అని అనిపిస్తుంది. కానీ వీళ్లు ఎందుకు అంత దుర్మార్గంగా, పశువుల కంటే, మృగాల కంటే హీనంగా తయారవుతున్నారు? రేప్ కేసులో శిక్షను అనుభవిస్తున్న ఇద్దరు ఖైదీలను ఎందుకు అంత దుర్మార్గంగా ప్రవర్తించారని



అడిగి నప్పుడు వారు 'ఆ సమయంలో ఎందుకు అలా ప్రవర్తించామో మాకు తెలియదు' అని బదులిచ్చారు. దోషులందరి విషయంలో ఈ సమాధానాలు ఉండవు. రకరకాల కారణాల వల్ల వాళ్లు ఆ విధంగా తయారవుతారు. జాతీయ నేర గణాంక నమోదు సంస్థ లెక్కల ప్రకారం మహిళలపై జరుగుతున్న నేరాల్లో 75 నుండి 85 శాతం వరకు మద్యం మత్తులో జరుగుతున్నవే. పోర్నోగ్రఫీ, మాదకద్రవ్యాలదీ తక్కువ పాత్ర కాదు.

పరిష్కార మార్గాల వైపు ఆలోచించినట్లయితే... వైన్స్ దుకాణాలను, బెల్టు షాపులను సాధ్యమైనంత అదుపు చేయాలి. ప్రభుత్వానికి అదే ప్రధాన ఆదాయ మార్గం కాబట్టి పూర్తిగా బంద్ చేయరు. కానీ మద్యం సేవించిన వాళ్లు బయట తిరగకుండా పూర్తిగా కట్టడి చేయవచ్చు. డ్రగ్స్ దొరకకుండా కఠినమైన చర్యలు చేపట్టాలి. ర్యాగింగ్‌ను కఠినంగా అణచివేయాలి. అన్ని రకాల పోర్నోగ్రఫీ సైట్‌లను నిషేధించాలి. సమాజంలో అన్ని స్థాయిల్లోనూ పేరుకుపోయిన పురుషాధిక్య భావనను కూకటి వేళ్లతో పెకలించాలి. రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలూ, అన్ని సామాజిక సంస్థలూ, స్వచ్ఛంద సంస్థలూ, మత గురువులూ ఈ విషయంలో ఒక ఉద్యమ చైతన్యంతో పని చేయాలి. ఆడపిల్లలకు ఆత్మరక్షణ పద్ధతుల్లో శిక్షణ తప్పనిసరి చేయాలి.

మహిళలపై 70 శాతం నేరాలు జాగ్రత్తలు తీసు కోకపోవడం వల్లనే జరుగుతున్నాయంటారు. కాబట్టి మహిళలు ఎప్పుడూ అప్రమత్తతతో ఉండాలి. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన కొన్ని కాల్ సెంటర్ల నంబర్లను దగ్గర ఉంచుకొని సమస్యలు ఎదురవుతున్న సమయంలో వాటిని ఉపయోగించి రక్షణ పొందాలి.

తెలంగాణ సర్కారు ఏర్పాటు చేసిన 'షీ'టీం నంబర్స్‌తో మెరుగైన ఫలితాలున్నాయి. అలాగే ఇలాంటి 'ఉమెన్ సేఫ్టీ', 'మై సేఫ్టీ పిన్', 'స్మార్ట్ 247', 'షీరోస్' లాంటి యాప్స్‌ను లాగిన్ అయి అత్యవసర సమయాల్లో ఉపయోగించుకోవాలి.

వ్యాసకర్త కమ్యూనిటీ కోఆర్డినేటర్, టీసెర్ప్, నిజామాబాద్ | 87909 90248

భ్రమ

ఒక వర్తకుడు తన పరివారంతో ఒంటెల మీద సరకులు వేసుకుని ఎడారి దాటుతున్నాడు. కనుచూపుమేరలో ఎదురుగా ఎత్తైన పట్నపు గోడలు, ఆకాశపు రంగుతో ఉన్న సరస్సుని చూశాడు. వాటిని చేరుకోవాలని ఆశతో పరివారాన్ని ఆ దిక్కుకి నడిపించాడు. అక్కడికి వెళ్లేసరికి పట్నపు గోడలు, నీటి ఛాయలేవీ కనిపించలేదు.

'అవి ఎండమావులు. అదంతా భ్రమ' అన్నారు పరివారం. వ్యాపారిలోని ఆశ , భ్రమ వినిపించుకోనివ్వలేదు. అక్కడే గుడారం వేసి తరువాత రోజు కోసం వేచి చూద్దామన్నాడు. మరునాడు కూడా



జ్యోతిర్మయం

ఎప్పటిలాగే గోడలు, సరస్సు కనబడగా పరివారాన్ని పరుగులు తీయించాడు. దగ్గరికెళ్తే ఏమీ కనబడలేదక్కడ.

సేవకుల మాటలు వినిపించుకోకుండా ఎండమావుల వెంట పరుగులు తీయించాడు వ్యాపారి. ఆ భ్రాంతిలో పడి నిజ ప్రపంచాన్ని మరచిపోయాడు.

కొన్నాళ్లకు ఒంటెల మీదున్న సరకులన్నీ పాడైపోగా, తెచ్చిన ఆహారపదార్థాలు, నీళ్లు అడుగంటాయి. వ్యాపారితో ఉంటే చావు తప్పదని అతన్ని వదిలేసి వెళ్లిపోయారు సేవకులు. కొద్దిరోజులకే వ్యాపారి ఒంటెలన్నీ చనిపోయాయి. ఆకలిదప్పులు తాళలేక అతడూ మరణించాడు.

ఈ కథలో ఎండమావుల్ని చూసి మోసపోయిన వ్యాపారిని చూసి జనులు నవ్వుకుంటారు. అతడొక పిచ్చివాడని ఎగతాళి చేస్తారు. కానీ జనులకు తెలియని విషయమేమంటే... తాము కూడ అశాశ్వతాలైన సంపద, ఐశ్వర్యం, అందాల వెనుక భ్రాంతితో పరుగులు తీస్తున్నామనీ, వాటినే శాశ్వతమైనవని భ్రమపడుతూ తాత్కాలిక ఆనందం పొందుతున్నామనీ గ్రహించకపోవడం. వ్యాపారి ఎండమావుల్ని వెంబడించినట్టే అనిత్యాలను వెంబడిస్తూ తాము మోసపోతున్నామని జనులు గ్రహించాలి. నిజమైన ఆనందాన్నీ, ముక్తినీ ఇచ్చేదేదో గ్రహించి, సద్గురువు శిక్షణలో ఉత్తమ మార్గంలో పయనించాలి.

– అమ్మాజీ ఉమామహేశ్వర్

క్లుప్తంగా...

పాత కలెక్టర్‌పై కొత్త కలెక్టర్‌కు ఫిర్యాదు


కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్ నర్సయ్య

జగిత్యాల: చేపట్టిన అభివృద్ధి పనికి బిల్లు చెల్లించలేదంటూ ఒక సర్పంచ్ పాత కలెక్టర్‌పై ప్రస్తుత కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం దమ్మయ్యపేట సర్పంచ్ తునికి నర్సయ్య కథనం ప్రకారం.. కలెక్టర్ రవి జగిత్యాల జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న సమయంలో దమ్మయ్యపేటలోని వడ్డెర కాలనీ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. బడికి ప్రహరీ నిర్మించాలని ఆ సమయంలో సర్పంచ్‌కు సూచించి.. బిల్లులు సైతం వెంటనే చెల్లిస్తామని హామీ ఇచ్చారు. వెంటనే 150 మీటర్ల పొడవుతో సర్పంచ్ గోడ నిర్మించి మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు బిల్లులు విడుదల కాలేదు. ఈలోగా కలెక్టర్ రవి బదిలీపై వేరే జిల్లాకు వెళ్లిపోయారు. దీంతో ప్రహరీ నిర్మాణ బిల్లులు ఇంకా తనకు రాలేదని సర్పంచ్ నర్సయ్య సోమవారం ప్రజావాణిలో అప్పటి కలెక్టర్ రవిపై ప్రస్తుత కలెక్టర్ యాస్మిన్ బాషాకు ఫిర్యాదు చేశారు.

లీకుల సూత్రధారి ఎవరో తేల్చాలి



కరీంనగర్ కల్చరల్: రాష్ట్ర ప్రభుత్వం 80వేల ఉద్యోగాల పేరిట నోటిఫికేషన్లు ఇచ్చినట్టే ఇచ్చి.. టీఎస్‌పీఎస్సీ ద్వారా ప్రశ్నపత్రాలను లీక్ చేయిస్తోందని, ఆ లీకుల వెనుక ఎవరి హస్తం ఉందో తేల్చాల ని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. కరీంనగర్ రెవెన్యూ గార్డెన్‌లో సోమవారం జరిగిన మాలల రాజకీయ చైతన్య సదస్సులో ఆయన మాట్లాడారు. తొమ్మిదేళ్లుగా ప్రభుత్వం నిరుద్యోగులను విస్మరించిందని విమర్శించారు. ఎన్నికల సమయం రావడంతో ఆగమేఘాలపై నోటిఫికేషన్లు ఇస్తోందని ఆరోపించారు.

కేటీఆర్‌పై వెయ్యి మందిని పోటీ చేయిస్తాం



హనుమకొండ: టీఎస్ఎన్పీడీసీఎల్‌లో ఖాళీగా ఉన్న జూనియర్ లైన్‌మెన్ పోస్టులు భర్తీ చేయకపోతే వచ్చే ఎన్నికల్లో మంత్రులు, కె.తారకరామారావు, హరీశ్‌రావుపై వెయ్యి మంది నిరుద్యోగులు పోటీ చేస్తారని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ హెచ్చరించారు. జేఎల్‌ఎం పోస్టులు భర్తీ చేయాలని అర్హులైన నిరుద్యోగ అభ్యర్థులు సోమవారం హనుమకొండలోని టీఎస్ఎన్పీడీసీఎల్ కార్యాలయం వద్ద చేసిన ధర్నాకు ఎన్ఎస్‌యూఐ సంఘీభావం తెలిపింది. ఈ సందర్భంగా బల్మూరి వెంకట్ మాట్లాడుతూ... ఉద్యోగాలు సాధించేందుకు డబ్బులు ఖర్చు పెట్టి కోచింగ్ తీసుకుంటుంటే.. ప్రభుత్వ కార్యదర్శులు అక్రమ సంపాదనకు అలవాటుపడి పరీక్ష పేపర్లు అమ్ముకుని నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని ధ్వజమెత్తారు.

పని చేసుకోమని తల్లి మందలించిందని..


రాజేందర్(ఫైల్)

లింగంపేట: ఏ పని చేయకుండా ఇంటివద్ద కాలక్షేపం చేస్తే ఎలా? అని తల్లి మందలించడంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కామారెడ్డి జిల్లా లింగంపేటలో సోమవారం ఈ ఘటన జరిగింది. ఎస్‌ఐ శంకర్ కథనం ప్రకారం.. తొడెంగల భాగ్యకు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. 13 ఏళ్ల క్రితం భర్త సాయిలు చనిపోవడంతో పిల్లలతో లింగంపేటలోని తల్లిగారింటికి వచ్చి కూలి పనులు చేసుకుంటూ బతుకుతోంది. పెద్ద కొడుకు రాజేందర్ (19) బైక్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. 15 రోజులపాటు పని చేయడానికి హైదరాబాద్ వెళ్లి.. ఈ నెల 10న తిరిగి ఇంటికి వచ్చి ఖాళీగా ఉంటున్నాడు. దీంతో ఏదైనా పని చేసుకోవాలని తల్లి భాగ్య కొడు కును మందలించింది. దీంతో రాజేందర్ ఫ్యానుకు ఉరి వేసుకున్నాడు. స్థానికులు రాజేందర్‌ను ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

ఐస్‌క్రీం కోసం డబ్బులివ్వలేదని..

- ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య


వేదశ్రీ

రామారెడ్డి (ఎల్లారెడ్డి): ఐస్‌క్రీం కొనుక్కునేందుకు తల్లి రూ.100 ఇవ్వలేదన్న క్షణికావేశంతో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం అన్నారంలో జరిగిన ఈ సంఘటనపై పోలీసులు అందించిన వివరాలివి.. పుల్లూరి వేదశ్రీ (17) రామారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. వేదశ్రీ సోమవారం కళాశాలకు వెళ్తున్నప్పుడు.. ఐస్‌క్రీం కొనుక్కోడానికి తల్లి శారదను డబ్బులు అడిగింది. తల్లి రూ.10 ఇవ్వగా, ఆ మొత్తంతో ఏం వస్తుందని.. రూ.100 ఇవ్వాల్సిందేనని పట్టుబట్టింది. గతంలోనూ కుమార్తె కళాశాలకు వెళ్లకపోవడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో పాటు ఐస్‌క్రీంకు అడిగిన డబ్బులు ఇవ్వకపోవడంతో మనస్తాపానికి గురైన వేదశ్రీ ఇంట్లో దూలానికి చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అనిల్ తెలిపారు.

ఆ ఐదుగురినీ విడుదల చేయండి

- దుబాయ్‌లో శిక్ష అనుభవిస్తున్న సిరిసిల్లకు చెందిన ఐదుగురు
- వారి విడుదల కోసం యూఏఈ రాయబారి అబ్దుల్ నసీర్ అల్మాలికి మంత్రి కేటీఆర్ విజ్ఞప్తి
- కేటీఆర్‌తో ప్రగతిభవన్‌లో అల్మాలి భేటీ
- తెలంగాణలోని అభివృద్ధి పట్ల ప్రశంసలు


అబ్దుల్ నసీర్‌కు జ్ఞాపిక అందిస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో జీవన్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జయేశ్ రంజన్

సాక్షి, హైదరాబాద్, సిరిసిల్లటౌన్: దుబాయి జైల్లో మగ్గుతున్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ఐదుగురు తెలంగాణ వాసులను విడుదల చేయాలని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కె.తారక రామారావు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ రాయబారి అబ్దుల్ నసీర్ అల్మాలిని కోరారు. భారత పర్యటనలో భాగంగా అబ్దుల్ నసీర్ సోమవారం హైదరాబాద్ ప్రగతిభవన్‌లో మంత్రి కేటీఆర్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా దుబాయ్‌లో శిక్ష అనుభవిస్తున్న వారి వివరాలతో కూడిన వినతిపత్రాన్ని కేటీఆర్ అందజేశారు. నేపాల్‌కు చెందిన దిల్‌ప్రసాద్‌రాయ్ మృతి కేసులో రాజన్నసిరిసిల్ల జిల్లాకు చెందిన శివరాత్రి మల్లేశ్, రవి, నాంపల్లి వెంకటేశ్, దండుగుల లక్ష్మణ్, హనుమంతులు ప్రస్తుతం దుబాయ్ జైల్లో శిక్షను అనుభవిస్తున్నారని రాయబారి దృష్టికి తీసుకెళ్లారు. యూఏఈ చట్టాల మేరకు రూ.15 లక్షల పరిహారాన్ని బాధితుని కుటుంబం స్వీకరించేందుకు అంగీకరించిందని, ఈ మేరకు 2013లో తానే స్వయంగా నేపాల్ వెళ్లి బాధితుడి కుటుంబాన్ని కలిసినట్లు తెలిపారు. బాధిత కుటుంబం నుంచి అన్నిరకాల పత్రాలను 2013లోనే దుబాయ్ ప్రభుత్వానికి అందించిన విషయాన్ని కేటీఆర్ గుర్తు చేశారు. అయితే యూఏఈ కోర్టు వీరి క్షమాభిక్ష పిటిషన్ తిరస్కరించిందని, ఇక దుబాయ్ రాజు షేక్ మహమ్మద్ బిన్ రషీద్ అల్ మక్తుమ్ క్షమాభిక్ష పెడితేనే బాధితులకు విముక్తి లభిస్తుందని చెప్పారు. ఈ విషయంలో చొరవచూపాలని కోరారు.

హైదరాబాద్ భేష్: యూఏఈ రాయబారి ప్రశంసలు
కేటీఆర్‌తో జరిపిన భేటీలో తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పట్ల యూఏఈ రాయబారి అబ్దుల్ నసీర్ అల్మాలి ప్రశంసలు కురిపించారు. హైదరాబాద్‌లో ఉన్న స్టార్టప్ ఈకో సిస్టం, ఐటీ దాని అనుబంధ రంగాల్లో తెలంగాణ బలం గురించి ప్రస్తావించారు. తెలంగాణ రాష్ట్రంలో వివిధ పారిశ్రామిక రంగాల్లో పెట్టుబడి అవకాశాలు, తెలంగాణ ప్రభుత్వ పాలసీలను మంత్రి కేటీఆర్ ఈ సందర్భంగా యూఏఈ రాయబారికి వివరించారు. ఇప్పటికే హైదరాబాద్ నగరంలోని స్టార్టప్ ఈకో సిస్టంతో ఫ్రాన్స్, అమెరికా వంటి దేశాల్లోని వెంచర్ క్యాపిటలిస్టులు, ఇన్నోవేషన్ ఈకో సిస్టం భాగస్వాములు కలిసి పనిచేసేందుకు ముందుకు వచ్చారని, ఇదే రీతిన యూఏఈలోని వెంచర్ క్యాపిటలిస్టులను టీ హబ్‌కు పరిచయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కేటీఆర్ విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన యూఏఈ రాయబారి... తమ దేశంలోని ఔత్సాహిక వెంచర్ క్యాపిటలిస్టులను, హైదరాబాద్ ఈకో సిస్టంలోని స్టార్టప్ సంస్థలను అనుసంధానించేలా ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు.

వంద రోజుల్లో అందరికీ కంటి పరీక్షలు

- ఇప్పటివరకు 70 లక్షల మందికిపైగా పూర్తి
- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు వెల్లడి


కంటివెలుగు శిబిరాన్ని తనిఖీ చేస్తున్న హరీశ్‌రావు

గజ్వేల్: వందరోజుల్లో అందరికీ కంటి పరీక్షలు పూర్తి చేయడమే లక్ష్యంగా ముందుకుసాగుతున్నామని ఆర్థిక, వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సోమవారం ఆయన సిద్దిపేట జిల్లా గజ్వేల్ – ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పాత మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డితో కలసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కంటి పరీక్షల తీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటివెలుగు శిబిరాల నిర్వహణ తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటివరకు 70 లక్షల పైచిలుకు మంది కంటి పరీక్షలు చేయించుకున్నారని తెలిపారు. వారిలో 32 లక్షలమంది పురుషులు, 37 లక్షల పైచిలుకు మంది మహిళలు ఉన్నట్లు వెల్లడించారు. ఇప్పటివరకు కంటి పరీక్షలు చేయించుకున్నవారిలో 48.91 లక్షల మందికి ఎలాంటి సమస్యల్లేవని తేలిందన్నారు. కంటి సమస్యలు ఉన్న 12 లక్షల మందికి రీడింగ్ అద్దాలు ఇప్పటికే పంపిణీ చేయగా, మరో 8 లక్షల మందికి 15 రోజుల్లో డాక్టర్లు సూచించిన అద్దాలను పంపిణీ చేయనున్నట్లు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని 4,565 పంచాయతీలు, 1,616 మున్సిపల్ వార్డుల్లో శిబిరాల నిర్వహణ పూర్తయ్యిందన్నారు. తనిఖీ సందర్భంగా శిబిరాల్లో మెరుగైన సేవలందుతున్నాయని మహిళలు చెప్పడం తనకు ఆనందాన్నిచ్చిందని మంత్రి చెప్పారు. వైద్య, ఆరోగ్య శాఖ, మున్సిపల్, పంచాయతీరాజ్ సిబ్బంది, ప్రజాప్రతినిధులను ఈ సందర్భంగా మంత్రి అభినందించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి, ఎంపీపీ అమరావతి, మున్సిపల్ వైస్ చైర్మన్ జకీయొద్దీన్, బీఆర్ఎస్ గజ్వేల్ మండల శాఖ అధ్యక్షులు బెండె మధు, గజ్వేల్ పట్టణ శాఖ అధ్యక్షుడు నవాజ్‌మీరా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మోటార్‌కు మరమ్మతులు చేస్తూ..

- విద్యుదాఘాతంతో రైతు మృతి


గోతిలో రాజు మృతదేహం

జనగామ రూరల్: పంటకు సాగునీరందించే మోటార్‌కు మరమ్మతులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై ఒక రైతు ప్రాణా లు కోల్పోయాడు. జనగామ జిల్లా బొమ్మకూర్ జలాశయం కుడి కాలువ సమీపంలో సోమవారం ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం మేరకు.. జనగామ మండలం అడవికేశవాపూర్ గ్రామానికి చెందిన గూడురు రాజు (28) బొమ్మకూర్ కుడి కాలువకు సమీపంలో తన రెండు ఎకరాల్లో వరి సాగు చేశాడు. ప్రస్తుతం జలాశయంలో నీరు లేకపోవడంతో కొందరు రైతులు కలిసి కాలువ బయట పెద్ద గొయ్యి తవ్వి అందులో నీటిని నిల్వ చేసుకుని మోటార్ల ద్వారా పంటకు సాగునీరు అందిస్తున్నారు. ఈ క్రమంలో రాజు కూడా నీటిని తరలించేందుకు సోమవారం మోటార్‌ను గోతిలోకి దించాడు. మోటార్లలో ఒకదాని వైర్లు బయటకు తేలి ఉండడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్‌ఐ జీనత్ సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని బయటికి తీశారు.

18 మోటార్లు ఒకేచోట..: బొమ్మకూరు జలాశయం ఎండిపోవడంతో కుడికాలువ ద్వారా అడవికేశాపూర్‌కు వచ్చే మార్గంలో 18 మంది రైతులు పెద్ద గొయ్యిని తవ్వి నీటిని నిల్వ చేస్తున్నారు. వాగు పిల్లకాలువ నీటిని కూడా మళ్లించుకుని అవసరమైనప్పుడు వాడుకుంటున్నారు. గొయ్యిలో మోటార్లు ఏర్పాటు చేసుకుని రెండు కిలోమీటర్ల మేర పైపులైన్ వేసుకున్నారు.

కన్న బిడ్డలే కడతేర్చారు!

- ఆస్తి కోసం తండ్రిని హతమార్చిన కూతుళ్లు, మనవడు
- నిందితులను శిక్షించాలని గ్రామస్తుల ఆందోళన
- కామారెడ్డి జిల్లాలో ఘటన


ఆంజనేయులు

రాజంపేట: ఆస్తికోసం కన్న తండ్రినే కడతేర్చిన ఘటన కామారెడ్డి జిల్లా రాజంపేట మండల కేంద్రంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. రాజంపేటకు చెందిన కొప్పుల ఆంజనేయులు (80)కు ఇద్దరు భార్యలు ఉండగా, మొదటి భార్య లక్ష్మికి ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. కొడుకు 25 సంవత్సరాల క్రితమే మరణించాడు. మొదటి భార్య తనని సక్రమంగా చూడకపోవడంతో ఆంజనేయులు 20 సంవత్సరాల క్రితం బాలమణిని రెండో పెళ్లి చేసుకున్నాడు. ఆంజనేయులుకు నాలుగు ఎకరాల వరకు వ్యవసాయ భూమి ఉండగా గ్రామంలో నివసిస్తున్న రెండో కూతురు లీలావతి పేరిట ఇదివరకే రెండెకరాలు పట్టా చేయించాడు. కూతురు లీలావతి, మొదటి భార్య లక్ష్మి తరచూ ఆంజనేయులుతో ఆస్తికోసం గొడవపడేవారు. మిగిలిన రెండెకరాల భూమి తనకే చెందాలని లీలావతి, ఆమె కొడుకు భానుప్రసాద్ కలసి ఆంజనేయులును వేధింపులకు గురిచేసేవారు. ఆదివారం ఉదయం లీలావతి, తన పెద్ద సోదరి లక్ష్మీ నర్సవ్వ, కొడుకు భానుప్రసాద్‌తో కలసి పథకం ప్రకారం ఆంజనేయులును ఇంట్లోనే చంపేసింది. అనంతరం తమ చెల్లెలు గంగమణి కూతురు విందు కార్యక్రమానికి హాజరై రాత్రి 12.30 గంటల ప్రాంతంలో తిరిగివచ్చారు. తర్వాత ఆంజనేయులు ఉంటున్న ఇంటిని తగులబెట్టి ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు ప్రయత్నించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఫైర్ ఇంజన్ సహాయంతో మంటలు అదుపు చేశారు. సోమవారం ఉదయం విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఘటనా స్థలానికి భారీగా తరలివచ్చారు. కుటుంబ సభ్యులే ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటారని, నిందితులను శిక్షించే వరకూ ఊరుకునేది లేదని రోడ్డుపై ధర్నాకు దిగారు. దీంతో సీఐ తిరుపయ్య, డీఎస్పీ సురేశ్ పరిస్థితిని నియంత్రించి, నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు. మృతుని అన్న కొడుకు కొప్పుల పెద్ద స్వామి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

డిగ్రీ విద్యార్థి ఆత్మహత్య

- ప్రాణస్నేహితుల మరణంతో మనస్తాపం


కార్తీక్ (ఫైల్)

ఎల్కతుర్తి: ప్రాణస్నేహితులిద్దరూ చనిపోయారన్న బెంగతో ఒక డిగ్రీ విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలకేంద్రంలో సోమవారం సాయంత్రం జరిగిన ఈ సంఘటనపై గ్రామస్తులు తెలిపిన వివరాలివి. తంగళ్లపెల్లి సంపత్, సుమలత దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. కార్తీక్(21) హనుమకొండలో డిగ్రీ ప్రథమ సంవత్సరం, చిన్న కుమారుడు వినయ్ 8వ తరగతి చదువుతున్నారు. కార్తీక్ మేనమామ కుమారుడు అఖిల్ ఆరేళ్ల క్రితం క్యాన్సర్‌తో చనిపోయాడు. మరో స్నేహితుడు రాకేష్ రెండేళ్ల క్రితం మృతి చెందాడు. ఈ ముగ్గురు చిన్ననాటి స్నేహితులు కావడంతో.. వారు చనిపోయినప్పటి నుంచి కార్తీక్ దిగాలుగా ఉండేవాడు. తాను కూడా వారి వద్దకు వెళ్తానంటూ.. అప్పుడప్పుడు తల్లిదండ్రులకు చెప్పేవాడు. దీంతో వారు అధైర్యపడొద్దని కుమారుడికి సర్దిచెప్పేవారు. కాగా, కార్తీక్ సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో 'నా చావుకు ఎవరూ కారణం కాదని' సూసైడ్ నోట్ రాసి ఉరి వేసుకున్నాడు. ఎస్‌ఐ పరమేశ్ కేసు నమోదు చేశారు.

బాబోయ్ కుక్కలు..

- ఖమ్మం జిల్లా పుటానీ తండాలో రేబిస్ లక్షణాలతో ఓ బాలుడి మృత్యువాత
- పెద్దపల్లి జిల్లా ఓదెలలో మూడేళ్ల చిన్నారిపై కుక్కల దాడి.. తీవ్ర గాయాలు


భరత్

రఘునాథపాలెం, ఓదెల(పెద్దపల్లి), డోర్నకల్: ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం పుటానీ తండాకు చెందిన బానోత్ భరత్(5) రేబిస్ లక్షణాలతో మృత్యువాత పడ్డాడు. ఆదివారం సాయంత్రం స్నేహితులతో కలిసి ఆడుకుంటుండగా వీధికుక్కలు కరిచాయి. దీంతో తల్లిదండ్రులు వెంటనే ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా, పరిస్థితి గమనించిన వైద్యులు హైదరాబాద్ నిమ్స్ హాస్పిటల్ తీసుకెళ్లాలని సూచించారు. ఈమేరకు ఆర్టీసీ బస్సులో బయలుదేరగా, సూర్యాపేట సమీపాన బస్సులోనే బాలుడు మృతి చెందాడు. ఈ విషయమై గ్రామపంచాయతీ కార్యదర్శి నరేష్ వాదన మరోలా ఉంది. భరత్‌ను గత జనవరిలో కుక్క కరవగా, అదే సమయంలో నాలుగు చక్రాల తోపుడు బండి పైనుంచి కింద పడ్డాడని తెలిపారు. అయితే అతని తల్లిదండ్రులు కేవలం కిందపడటం వల్లనే గాయాలయ్యాయని భావించి అప్పట్లో రేబిస్ వ్యాక్సిన్ వేయించలేదని చెప్పారు. ఈ నేపథ్యంలో బాలుడు ఆదివారం ఒక్కసారిగా గట్టిగా అరవడం, రక్కడం చేస్తూ రేబిస్ లక్షణాలతో అస్వస్థతకు గురయ్యాడని, ఆ తర్వాత ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడని తెలిపారు. పెద్దపల్లి జిల్లా ఓదెల మండల కేంద్రంతోపాటు కొమిరలో మూకుమ్మడిగా కుక్కలు దాడి చేసిన ఘటనలో ఓదెలకు చెందిన మినుగు కొంరయ్య, సాత్తూరి మహేశ్, కొట్టె భవాని, కొమిరకు చెందిన నూనె శంకరయ్య, మొండయ్య, శ్రీనివాస్, రమేశ్, నాగమ్మ తీవ్రంగా గాయపడ్డారు. ఓదెలలో ఆరుబయట ఆడుకుంటున్న మూడేళ్ల చిన్నారి కినికిరెడ్డి నివాసిని పై కుక్కలు మూకుమ్మడిగా దాడిచేయడంతో ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండటంతో కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. పొత్కపల్లిలో కోతుల దాడిలో వేపూరి సరోజన, మధురమ్మ గాయపడ్డారు. వారిని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఇక మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని అంబేడ్కర్ నగర్‌కు చెందిన కోదాటి ఎల్లాబాయి సోమవారం రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా కుక్క దాడి చేయడంతో కాలికి గాయమైంది.

జరిమానా విధించారని మహిళ ఆత్మహత్య

కారేపల్లి: పక్కింటి వారితో జరిగిన గొడవకు పంచాయితీ నిర్వహించిన పెద్దమనుషులు రూ.60వేలు జరిమానా విధించడంతో మనస్తాపానికి గురైన ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం దుబ్బతండాకు చెందిన తేజావత్ కవిత(36)కు పక్కింట్లో ఉండే మాలోతు ప్యాంటీతో ఈనెల 8న ఘర్షణ జరిగింది. పరస్పరం కొట్టుకోవడంతో ప్యాంటీ చేయి విరిగిపోయింది. మాజీ సర్పంచ్ శ్రీరాములు ఆధ్వర్యంలో పంచాయితీ నిర్వహించి కవితకు రూ.60వేల జరిమానా విధించారు. మనస్తాపానికి గురైన కవిత ఆదివారం సాయంత్రం పురుగు మందు తాగింది. ఆమెను ఖమ్మం ఆస్పత్రికి తరలించగా... సోమవారం మృతి చెందింది. కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు మృతి

- చంద్రాయన్‌పల్లి వద్ద భారీ ట్రక్కును ఢీకొన్న కారు.. నలుగురు దుర్మరణం
- రామాజీపేట వద్ద స్కూటీని ఢీకొట్టిన ట్రాక్టర్ – తండ్రీకుమారుడి మృతి
- ప్రైవేట్ బస్సు బోల్తా పడిన ఘటనలో ఇద్దరికి గాయాలు


అభిషేక్


రమేష్


ప్రకాశ్


గణేశ్

డిచ్‌పల్లి (నిజామాబాద్ రూరల్), యాదగిరిగుట్ట రూరల్, సూర్యాపేట రూరల్: రాష్ట్రంలో వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాలు ఆరుగురిని బలిగొన్నాయి. నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలం చంద్రాయన్‌పల్లి శివారులో 44వ నంబరు జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు యువకులు మృతి చెందారు. మహారాష్ట్రలోని కొండల్‌వాడి గ్రామానికి చెందిన నీరడి గణేశ్ (28), నీరడి ఆదిత్య (25), ఎ ప్రకాశ్ (28) మొబైల్ స్పేర్ పార్ట్స్ విక్రయిస్తూ నిజామాబాద్‌లో నివసిస్తున్నారు. ఈ ముగ్గురూ దుబ్బ ప్రాంతానికి చెందిన బి సాయిరాం (27)తో కలిసి హోల్‌సేల్‌లో మొబైల్ స్పేర్‌పార్ట్స్ కొనుగోలు కోసం ఆదివారం ఉదయం హైదరాబాద్‌కు వెళ్లారు. రాత్రికి తిరిగి నిజామాబాద్‌కు వస్తుండగా అర్ధరాత్రి సుమారు 1 గంటకు చంద్రాయన్‌పల్లి వద్ద ముందు వెళుతున్న భారీ ట్రక్కును వెనుక నుంచి వీరి కారు వేగంగా ఢీ కొట్టింది. దీంతో కారులో ఉన్న నలుగురూ అక్కడికక్కడే మృతి చెందారు.

రాంగ్ రూట్‌లో వచ్చిన ట్రాక్టర్ ఢీకొని...
హైదరాబాద్ ఉప్పల్‌కి సమీపంలోని చిలకనగర్‌కు చెందిన పెద్ది రమేష్ (38) ఈయన కుమారుడు పెద్ది అభిషేక్ (14) వరంగల్ జిల్లా నల్లబెల్లిలోని బంధువుల గృహప్రవేశానికి వెళ్లి సోమవారం స్కూటీపై తిరిగి వస్తుండగా మార్గమధ్యలో యాదగిరిగుట్ట మండలం రామాజీపేట వద్ద గ్రామ పంచాయతీ ట్రాక్టర్ రాంగ్ రూట్లో వచ్చి వీరి స్కూటీని ఢీకొట్టింది. ప్రమాదంలో అభిషేక్ తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందగా, రమేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గాంధీ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందారు. హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్తున్న ఓ ప్రైవేట్ బస్సు సూర్యాపేట జిల్లా టేకుమట్ల గ్రామం వద్ద టాటాఏస్ వాహనాన్ని వెనుక నుంచి స్వల్పంగా ఢీకొట్టి కంట్రోల్ చేసే క్రమంలో రోడ్డు పక్కకు పల్టీ కొట్టింది. ఆ సమయంలో బస్సులో 30మంది ప్రయాణికులు ఉన్నారు. ఇద్దరికి గాయాలు కావడంతో సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించారు.

ఉరి వేసుకుని రైతు ఆత్మహత్య

చందంపేట : పంట సాగుకు పెట్టిన పెట్టుబడి రాదన్న దిగులుతో ఓ రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. నల్లగొండ జిల్లా నేరెడుగొమ్ము మండలం చర్లతండాకు చెందిన నేనావత్ పూల్‌సింగ్ (55) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తనకున్న ఏడెకరాలతో పాటు మరో ఆరెకరాల భూమిని కౌలుకు తీసుకుని వేరుశనగ పంట సాగు చేశాడు. పొలంలోని మూడు బోర్లు ఎండిపోవడంతో దిగుబడి, సాగుకు తెచ్చిన పెట్టుబడి రావన్న ఆందోళనతో మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలోనే సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించేలోపే మృతి చెందాడు.

క్లుప్తంగా...

అమెరికా తుపాకీ సంస్కృతికి నాలుగేళ్ల చిన్నారి బలి

హూస్టన్: ఇంటికో తుపాకీ పథకం అమల్లో ఉందా అన్నట్లు కనిపించే అమెరికాలో గన్ కల్చర్.. నాలుగేళ్ల చిన్నారి ప్రాణాలను తోడేసింది. టెక్సాస్ రాష్ట్రంలోని హూస్టన్ నగర సమీపంలోని హ్యారిస్ కౌంటీలో ఆదివారం ఈ దుర్ఘటన జరిగింది. కౌంటీ పోలీసు అధికారి ఎడ్ గోంజాల్వేజ్ తెలిపిన వివరాల ప్రకారం 'బామెల్ నార్త్ హూస్టన్ రోడ్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లోని ఇంట్లో ఐదుగురు పిల్లలు ఆడుకుంటున్నారు. వీరిలో నాలుగు, మూడేళ్ల అక్కాచెల్లెళ్లు ఇంటి పడకగదిలోకెళ్లి అక్కడే ఉన్న సెమీ ఆటోమేటిక్ పిస్టల్‌ను చూశారు. పిస్టల్‌ను చేతిలోకి తీసుకున్న చెల్లెలు వెంటనే అక్కకు గురిపెట్టి కాల్చింది. తుపాకీ శబ్దంతో కుటుంబసభ్యులు హుటాహుటిన అక్కడికొచ్చి చూసేసరికి నాలుగేళ్ల అమ్మాయి రక్తమోడుతూ కనిపించింది. 911కు ఫోన్‌చేసి అత్యవసర సిబ్బంది వచ్చి వైద్యంచేసేలోపే చిన్నారి ప్రాణాలు విడిచింది. లోడ్ చేసిన తుపాకులను జాగ్రత్త చేయాలని ఎంతగా విజ్ఞప్తి చేస్తున్నా తుపాకీ యజమానుల నిర్లక్ష్యం ఇలా ఎందరో అమాయకుల ప్రాణాలను బలికోరుతోంది' అని ఆయన విచారం వ్యక్తంచేశారు.

విమానంలో మెడికల్ ఎమర్జెన్సీ ప్రయాణికుని మృతి

న్యూఢిల్లీ/కరాచీ: ఢిల్లీ నుంచి దోహాకు బయల్దేరిన ఇండిగో విమానంలో ప్రయాణికుడు హఠాత్తుగా అనారోగ్యానికి గురై ప్రాణాలు కోల్పోయారు. ఆదివారం రాత్రి జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మృతున్ని నైజీరియాకు చెందిన 60 ఏళ్ల అబ్దుల్లాగా గుర్తించారు. విమానం ఆదివారం ఢిల్లీ నుంచి దోహా (ఖతార్) వెళ్తుండగా మార్గమధ్యంలో అబ్దుల్లా ఆరోగ్యం క్షీణించింది. మెడికల్ ఎమర్జెన్సీ కారణంగా వెంటనే విమానాన్ని పాకిస్తాన్‌లోని కరాచీ ఎయిర్‌పోర్ట్‌లో దింపేసి వైద్య బృందాన్ని రప్పించారు. కానీ అప్పటికే అతను మృతి చెందాడు.

నేపాల్ అధ్యక్షుడిగా పౌడెల్ ప్రమాణం

కఠ్మాండు: నేపాల్ మూడో అధ్యక్షుడిగా రాం చంద్ర పౌడెల్(78) సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఇటీవలి ఎన్నికల్లో నేపాలీ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత పౌడెల్ సీపీఎన్‌–యూఎంఎల్ సారథ్యంలోని ప్రతిపక్ష కూటమి బలపరిచిన సుభాష్ చంద్ర నెంబంగ్‌పై సునాయాస విజయం సాధించిన విషయం తెలిసిందే. ఆయనకు 8 పార్టీలు మద్దతు ప్రకటించాయి. పౌడెల్ గతంలో పార్లమెంట్ స్పీకర్‌గా, ఐదు పర్యాయాలు మంత్రిగా పనిచేశారు.

ప్రకృతి రమణీయత ఉట్టిపడే అందమైన దేశం, ప్రపంచ పర్యాటకులకు స్వర్గధామమైన థాయ్‌లాండ్‌ను వాయు కాలుష్యం ముంచెత్తుతోంది. గాలి నాణ్యత దారుణంగా పడిపోతుండడంతో జనం ఇళ్లకే పరిమితం కావాల్సి వస్తోంది. గాలి నాణ్యతను ఎప్పటికప్పుడు తెలియజేసే యాప్‌లను జనం ఫోన్లలో ఇన్‌స్టాల్ చేసుకుంటున్నారు. యాప్ ఇచ్చే సూచనల ప్రకారం నడుచుకుంటున్నారు. ఎర్ర మార్క్ కనిపిస్తే ఇంట్లో ఉండిపోవాల్సిందే. ఉదయం పూట వ్యాయామం చేయాలన్నా బయటకు వెళ్లలేని పరిస్థితి. థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో కాలుష్యం బెడద మరింత తీవ్రంగా ఉండడం కలవరం సృష్టిస్తోంది. ఎయిర్ పొల్యూషన్ దెబ్బకు టూరిస్టుల సంఖ్య తగ్గిపోతోంది. ప్రధాన పర్యాటక ప్రాంతాలు వెలవెలబోతున్నాయి.



విషపు గాలి!

14.49 లక్షల మంది బాధితులు

థాయ్‌లాండ్ ప్రజారోగ్య శాఖ గణాంకాల ప్రకారం.. కాలుష్యం వల్ల దేశంలో ఈ ఏడాది జనవరి 1 నుంచి ఇప్పటిదాకా 14,49,716 మంది అస్వస్థతకు గురయ్యారు. రాజధాని బ్యాంకాక్‌లో 31,695 మంది అనారోగ్యం బారినపడ్డారు. శ్వాస పీల్చుకోవడంలో ఇబ్బందులకు గురయ్యారు. బాధితుల్లో క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్, నిమోనియా, బ్రాంకైటీస్, ఆస్తమా, ఇన్‌ఫ్లూయెంజా, ఊపిరితిత్తుల క్యాన్సర్ వంటి లక్షణాలు కనిపించాయి. బ్యాంకాక్‌లో తాజాగా 50కిపైగా ప్రాంతాల్లో పీఎం 2.5 స్థాయిలు క్యూబిక్ మీటర్‌కు 51 నుంచి 78 మైక్రోగ్రాములు ఉన్నట్లు తేలిందని కాలుష్య నియంత్రణ విభాగం డైరెక్టర్ జనరల్ పిన్సాక్ సురాస్వాడీ చెప్పారు. ఇంటి నుంచి బయటకు వెళ్లినప్పుడు కాలుష్యం నుంచి ఉపశమనం కోసం ప్రజలు ముఖానికి మాస్కు తప్పనిసరిగా ధరించాలని థాయ్ ఎయిర్ క్వాలిటీ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రఫాన్ సూచించారు. కాలుష్యం తీవ్రత తగ్గుముఖం పట్టకపోతే ఇళ్ల నుంచే పనిచేయాలని ఉద్యోగులకు సూచిస్తామని థాయ్‌లాండ్ మంత్రి అనుపోంగ్ పావోజిండా చెప్పారు. బ్యాంకాక్‌లో వాహనాల రాకపోకలపై ఆంక్షలు విధించాలని భావిస్తున్నట్లు తెలిపారు.



ప్రత్యేక వైద్యశాలలు

కాలుష్యం, తద్వారా అనారోగ్య సమస్యలు పెరిగిపోతుండడంతో థాయ్‌లాండ్ ప్రజారోగ్య శాఖ ప్రత్యేక వైద్యశాలలు ఏర్పాటు చేసింది

థాయ్‌లాండ్‌ను ముంచెత్తుతున్న వాయు కాలుష్యం

ఈ ఏడాది ఇప్పటిదాకా 14,49,716 మందికి అస్వస్థత

పంట వ్యర్థాల దహనం, ట్రాఫిక్‌తో సమస్య తీవ్రం

నానాటికీ క్షీణిస్తున్న వాయు నాణ్యత

కాలుష్యం బారినపడిన వారిలో శ్వాస ఆడకపోవడం, చర్మంపై దద్దుర్లు, గుండె సంబంధిత వ్యాధులు తలెత్తున్నాయి.

బాధితులకు చికిత్స అందించడానికి దేశవ్యాప్తంగా 66 ప్రత్యేక క్లినిక్‌లు ఏర్పాటు చేశారు.

వాయు కాలుష్యంతో ముడిపడి ఉన్న వ్యాధులు, నివారణ చర్యలపై సమగ్ర అధ్యయనం చేయాలని బ్యాంకాక్‌లోని 22 ప్రధాన ఆసుపత్రులకు వ్యాధుల నియంత్రణ విభాగం సూచించింది.

–సాక్షి, నేషనల్ డెస్క్

ఎందుకీ తీవ్ర కాలుష్యం?

థాయ్‌లాండ్‌లో ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ దాకా ప్రభుత్వం తరచుగా కాలుష్య హెచ్చరికలు జారీ చేయడం సాధారణమే. అయితే, ఈసారి మాత్రం కాలుష్య తీవ్రత మరింత పెరిగింది. ఉత్తర థాయ్‌లాండ్‌లో రైతులు పంట వ్యర్థాలను దహనం చేస్తుంటారు. మూడు నెలల పాటు ఈ సీజన్ కొనసాగుతుంది. ఈ సమయంలో తీవ్ర కాలుష్యం ఉత్పన్నమవుతుంది. ప్రమాదకరమైన సూక్ష్మ ధూళి రేణువులు వెలువడుతాయి. విషపూరిత కార్బన్ మోనాక్సైడ్ వాయువు విడుదలవుతుంది. పంట వ్యర్థాల దహనం కారణంగా రైతులు శ్వాస సంబంధిత వ్యాధుల బారినపడుతున్నట్లు, మానసిక సమస్యలు ఎదుర్కొంటున్నట్లు గుర్తించామని థాయ్‌లాండ్ డెవలప్‌మెంట్ రీసెర్చ్ సెంటర్ సీనియర్ పరిశోధకుడు కనికా థాంపానిష్‌వోంగ్ చెప్పారు. దేశంలో 2021లో వాయు కాలుష్యం వల్ల 29,000 మంది మరణించారని అంచనా. ఇక రాజధాని బ్యాంకాక్‌లో తీవ్రరూపం దాలుస్తున్న ట్రాఫిక్ సమస్య వల్ల కాలుష్యం పెరిగిపోతోంది. చలికాలం కావడంతో పరిస్థితి భీతావహంగా మారుతోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌ఓ) సూచించిన దానికంటే థాయ్‌లాండ్ ప్రజలు సగటున నాలుగు రెట్లు అధికంగా సూక్ష్మ ధూళి కణాలను(పీఎం 2.5) పీలుస్తున్నట్లు అధ్యయనంలో తేలింది. కాలుష్యం వల్ల దేశంలో ప్రజల జీవిత కాలం సగటున రెండేళ్లు తగ్గినట్లు థాయ్‌లాండ్ 'ఎయిర్ క్వాలిటీ లైఫ్ ఇండెక్స్' అంచనా వేసింది.

వేధిస్తున్న నిధుల కొరత

మరోవైపు కాలుష్యాన్ని తగ్గించడంపై థాయ్‌లాండ్ సర్కారు దృష్టిపెట్టింది. ఈ దిశగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయడానికి అంతర్జాతీయ సంస్థలు, పరిశోధనా కేంద్రాలతో కలిపి పనిచేస్తోంది. కాలుష్య నియంత్రణ కోసం కొత్త కొత్త విధానాలు రూపొందిస్తున్నప్పటికీ నిధుల కొరత వల్ల అవి ఆశించిన ఫలితాలు ఇవ్వడం లేదని నిపుణులు చెబుతున్నారు. ఎయిర్ క్వాలిటీ పాలసీల అమలుకు బడ్జెట్‌లో ప్రభుత్వం తగినన్ని నిధులు కేటాయించకపోవడం పెద్ద అవాంతరంగా మారింది. స్వచ్ఛమైన గాలిని పీల్చడం ప్రజల హక్కు, ఆ హక్కును కాపాడడంలో థాయ్‌లాండ్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆరోపిస్తూ గ్రీన్‌పీస్ థాయ్‌లాండ్, ఎన్విరాన్‌మెంటల్ లా ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సంస్థలు గత ఏడాది మార్చి నెలలో కోర్టులో పిటిషన్లు దాఖలు చేశాయి. 'క్లీన్ ఎయిర్ బిల్లు'ను ఆమోదించాలంటూ థాయ్‌లాండ్ క్లీన్ ఎయిర్ నెట్‌వర్క్ అనే మరో సంస్థ పోరాడుతోంది. ఈ బిల్లు చట్టరూపం దాలిస్తే.. కాలుష్యానికి కారణమయ్యే వారికి పెద్ద మొత్తంలో జరిమానాలు విధించవచ్చు. మరోవైపు పంట వ్యర్థాలను దహనం చేయకుండా కొన్ని స్వచ్ఛంద సంస్థలు రైతుల్లో అవగాహన పెంచేందుకు ప్రయత్నిస్తున్నాయి.

ఇరాన్‌లో వేలాది నిరసనకారులకు క్షమాభిక్ష

దుబాయ్: ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనల్లో అరెస్టయిన 22 వేల మందికి ఇరాన్ క్షమాభిక్ష ప్రకటించింది. గత ఏడాది సెప్టెంబర్‌లో ఓ యువతి పోలీస్ కస్టడీలో మృతి చెందినప్పటి నుంచి దేశవ్యాప్తంగా ఆందోళనలు చెలరేగడం, అణచివేత చర్యల్లో భాగంగా పోలీసుల కాల్పుల్లో వందల మంది చనిపోవడం తెలిసిందే. వేలాది మందిని జైల్లో వేయడంతో జైళ్ల పాలయ్యారు. ఈ నేపథ్యంలోనే 22 వేల మందికి సుప్రీం నేత అయతొల్లా అలీ ఖమేనీ క్షమాభిక్ష ప్రసాదించినట్లు ఇరాన్ న్యాయశాఖ అధిపతి జి.ఎం.ఎజెహి సోమవారం తెలిపారు. వీరితోపాటు వివిధ ఆరోపణలను ఎదుర్కొంటున్న మొత్తం 82 వేల మందికి సుప్రీం నేత క్షమాభిక్ష ప్రకటించారన్నారు. వచ్చే వారం నుంచి ప్రారంభం కానున్న రంజాన్ నెల సందర్భంగా సుప్రీం నేత ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు వివరించారు. తాజా చర్యతో ప్రభుత్వ విధానాలపట్ల దేశ ప్రజల్లో పెల్లుబుకుతున్న ఆగ్రహం తీవ్రతను పాలకులు గుర్తించినట్లయింది.

అమెరికాలో కాలిఫోర్నియాను వరదలు ముంచెత్తుతున్నాయి. రాష్ట్రంలో పలు ప్రాంతాలు ఇలా వరద నీటిలో మునిగాయి. మరో తుపాను రావచ్చన్న హెచ్చరికలు భయపెడుతున్నాయి.



చైనాలో ఇన్‌ఫ్లూయెంజా పంజా

బీజింగ్: చైనాలో ఇన్‌ఫ్లూయెంజా (హెచ్3ఎన్2) కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. గత వారం రోజుల వ్యవధిలో ఫ్లూ పాజిటివ్ కేసుల రేటు 41.6 శాతం పెరిగినట్లు చైనీస్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ తాజాగా ఒక నివేదికలో వెల్లడించింది. మునుపటి వారంతో పోలిస్తే 25.1 శాతం ఎక్కువ పెరుగుదల నమోదైనట్లు తెలియజేసింది. షాంగ్జీ ప్రావిన్స్‌లోని జియాన్ నగరంలో ఇన్‌ఫ్లూయెంజా కేసుల పట్ల అధికారులు అప్రమత్తమయ్యారు. ఫ్లూ వ్యాప్తి మరింతగా పెరిగితే లాక్‌డౌన్ తరహా ఆంక్షలు విధించాలని ప్రతిపాదించారు. హాంకాంగ్ వైరస్‌గా పిలిచే హెచ్3ఎన్2 వల్ల ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో మరణాలు సైతం నమోదయ్యాయి. ఈ వైరస్ సోకిన వారిలో జ్వరం, దగ్గు, జలుబు, శ్వాసకోశ సమస్యలు, శరీరంలో నొప్పులు, వికారం, వాంతులు, అతిసారం వంటి లక్షణాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా, చైనాలో కోవిడ్‌–19 పాజిటివిటీ రేటు 5.1 శాతం నుంచి 3.8 శాతానికి తగ్గడం విశేషం.

భారీ సైనిక విన్యాసాలు.. అణుక్షిపణుల ప్రయోగం

వేడెక్కుతున్న కొరియా ద్వీపకల్పం

సియోల్: కొరియా ద్వీపకల్పం వేడెక్కుతోంది. ఒకవైపు అమెరికా– దక్షిణకొరియా భారీ సైనిక విన్యాసాలు ప్రారంభం కాగా, వీటిని సవాల్ చేస్తూ జలాంతర్గామి నుంచి అణు సామర్థ్యమున్న క్షిపణులను ఉత్తరకొరియా ప్రయోగించింది. దక్షిణకొరియా, అమెరికా సైనిక బలగాలు సోమవారం నుంచి భారీ స్థాయిలో సైనిక విన్యాసాలు మొదలుపెట్టాయి. 2018 తర్వాత పెద్ద ఎత్తున చేపట్టిన ఈ ఉమ్మడి విన్యాసాలు 11 రోజుల పాటు కొనసాగనున్నాయి. అయితే, దక్షిణకొరియా, అమెరికాల చర్యలు తమ దేశ దురాక్రమణకు రిహార్సల్ వంటివని ఆరోపిస్తున్న ఉత్తరకొరియా దీనికి నిరసనగా ఆదివారం జలాంతర్గామి నుంచి రెండు క్షిపణులను ప్రయోగించింది. ఈ రెండు క్షిపణులు వ్యూహాత్మక ఆయుధాలని అధికార వార్తాసంస్థ కేసీఎన్‌ఏ అభివర్ణించింది. దేశ అణు సామర్థ్యాన్ని ఇవి చాటుతున్నాయని తెలిపింది. ఇవి రెండు గంటలపాటు గాలిలోనే ఉన్నాయని, 1,500 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించే సత్తా ఉందని తెలిపింది. అయితే, ఉత్తరకొరియా జలాంతర్గామి నుంచి అణు వార్‌హెడ్లను మోసుకెళ్లే క్షిపణుల పరిజ్ఞానాన్ని సాధించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అవి పాత నగలు: తేజస్వీ

పట్నా: ''మా ఇంట్లో ఈడీ అధికారులు సోదాలను అరగంటలోనే పూర్తి చేశారు. అయినా పైనుంచి రావాల్సిన ఆదేశాల కోసం అంతకుముందు గంటల తరబడి ఎదురు చూపులు చూశారు'' అంటూ ఆర్జేడీ నేత, బిహార్ డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. తమ అక్క, చెల్లెళ్ల నివాసాల్లో సోదాల అనంతరం స్వాధీనం చేసుకున్నట్లుగా ఈడీ చెబుతున్నవి వారి, అత్తింటి వారి సొంత పాత నగలేనన్నారు. రైల్వే జాబ్స్ కుంభకోణంలో రూ.600 కోట్ల మేర విలువైన నేరపత్రాలు లభించాయన్న ఈడీ వాదనలను కొట్టిపారేశారు.

నియంతలా మోదీ పాలన: ఖర్గే

హస్తినలో విపక్షాలతో కలిసి కాంగ్రెస్ నిరసన ర్యాలీ



నిరసన ర్యాలీ సందర్భంగా మీడియాతో ఖర్గే, విపక్ష పార్టీల ఎంపీలు

న్యూఢిల్లీ: ప్రధాని మోదీ ఒక నియంతలాగా పాలిస్తున్నారంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ధ్వజమెత్తారు. ''బీజేపీ నేతలు ప్రజాస్వామ్యాన్ని అణచివేస్తూ దాన్ని రక్షిస్తున్నామని చెప్పుకుంటున్నారు. వాళ్ల డిక్షనరీలో రాజ్యాంగానికి స్థానం లేకుండా పోయింది'' అంటూ దుయ్యబట్టారు. పార్లమెంటు అధికార పార్టీ తీరుకు నిరసనగా విపక్ష సభ్యులతో కలిసి పార్లమెంట్ నుంచి విజయ్ చౌక్ వరకూ ర్యాలీ నిర్వహించారు. బీఆర్‌ఎస్, ఆమ్ ఆద్మీ పార్టీ, వామపక్షాల సభ్యులు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ.. ప్రతిపక్షాలను వేధించడమే లక్ష్యంగా దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తున్నారని, పైగా ప్రజాస్వామ్యం, జాతీయవాదం, దేశ గౌరవం గురించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. అధికార పార్టీ పెద్దల తీరు దొంగే దొంగ.. దొంగ అని అరిచినట్లుగా ఉందన్నారు. ప్రధాని మోదీ గతంలో చైనా, దక్షిణ కొరియా, కెనడా, యూఏఈలో పర్యటించినప్పుడు ఏం మాట్లాడారో గుర్తుకు తెచ్చుకోవాలని ఖర్గే హితవు పలికారు. లోక్‌సభలో కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, ప్రహ్లాద్ జోషీ చేసిన వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని కోరుతూ కాంగ్రెస్ ఎంపీ అధిర్ రంజన్ చౌదరి లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాశారు.

అందుకే పార్లమెంట్ వాయిదా: జైరామ్ రమేశ్

పార్లమెంట్ సమావేశాలు జరగడం ప్రభుత్వానికి ఇష్టం లేదని, అందుకే వాయిదా వేశారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ విమర్శించారు. ఈ మేరకు ట్వీట్ చేశారు. అదానీ కుంభకోణం నుంచి ప్రజల దృష్టిని మళ్లించాలన్నదే ప్రభుత్వ కుతంత్రమని ఆరోపించారు.

దద్దరిల్లిన పార్లమెంట్

రాహుల్ గాంధీ 'ప్రజాస్వామ్యంపై దాడి' వ్యాఖ్యలపై దుమారం

- క్షమాపణ చెప్పాలని లోక్‌సభ, రాజ్యసభలో అధికార పక్షం డిమాండ్
- అదానీ అంశంపై జేపీసీ ఏర్పాటు చేయాలన్న విపక్షాలు
- ఉభయ సభలు నేటికి వాయిదా

న్యూఢిల్లీ: భారత్‌లో ప్రజాస్వామ్యంపై దాడి జరుగుతోందంటూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఇటీవల యూకేలో చేసిన వ్యాఖ్యల పట్ల సోమవారం పార్లమెంట్ ఉభయ సభలు దద్దరిల్లాయి. రాహుల్ వెంటనే క్షమాపణ చెప్పాలని కేంద్ర మంత్రులు డిమాండ్ చేయగా, గౌతమ్ అదానీ వ్యవహారంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయాల్సిందేనని కాంగ్రెస్ పునరుద్ఘాటించింది. ఇరు పక్షాల నడుమ వాగ్వాదాలతో ఉభయ సభలు స్తంభించాయి. నినాదాలు, అరుపులు కేకలతో హోరెత్తిపోయాయి. ఎలాంటి కార్యకలాపాలు జరక్కుండానే లోక్‌సభ, రాజ్యసభ మంగళవారానికి వాయిదా పడ్డాయి.

రాహుల్‌కు కొంతైనా సిగ్గుంటే..

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు సోమవారం ఉదయం పునఃప్రారంభమయ్యాయి. ఇటీవల మరణించిన మాజీ సభ్యులకు లోక్‌సభలో సంతాపం ప్రకటించారు. అనంతరం రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడారు. రాహుల్ గాంధీపై విరుచుకుపడ్డారు. భారత ప్రజాస్వామ్యంపై ఇష్టానుసారంగా నోరుపారేసుకున్నారని, లండన్‌లో మన దేశ ప్రతిష్టను, గౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరించారని దుయ్యబట్టారు. విదేశీ శక్తులే భారత్‌ను కాపాడాలంటూ రాహుల్ మాట్లాడడం ఏమిటని నిలదీశారు. రాహుల్ వ్యాఖ్యలను లోక్‌సభ మొత్తం ఖండించాలని, ఈ దిశగా చొరవ తీసుకోవాలని స్పీకర్ ఓం బిర్లాకు విజ్ఞప్తి చేశారు. రాహుల్‌ను సభకు రప్పించి, క్షమాపణ చెప్పించాలని అన్నారు. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీ మాట్లాడుతూ.. రాహుల్ గాంధీకి కొంతైనా సిగ్గుంటే సభకు వచ్చి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాహుల్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. స్పీకర్ ఓం బిర్లా స్పందిస్తూ.. మన దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ బలంగా ఉందని, రోజురోజుకూ బలోపేతం అవుతోందని వెల్లడించారు. సభ సజావుగా సాగేలా సభ్యులంతా సహకరించాలని సూచించారు.



నినాదాలు ఆపాలని కోరారు. మన ప్రజాస్వామ్యంపై ప్రజలకు గొప్ప విశ్వాసం ఉందన్నారు. సభను మరుసటి రోజుకు వాయిదా వేస్తున్నట్లు చెప్పారు.

రాజ్యసభలో అదే రగడ

రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై రాజ్యసభలోనూ అధికార, విపక్ష సభ్యుల మధ్య రగడ జరిగింది. ఎవరూ శాంతించకపోవడంతో చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ సభను మంగళవారానికి వాయిదా వేశారు. రాజ్యసభలో కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్ మాట్లాడారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యలను రాజ్యసభ ఖండించాలని డిమాండ్ చేశారు. పీయూష్ గోయెల్ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని ఖర్గే కోరారు.

రాహుల్‌పై దేశద్రోహం కేసు పెట్టాలి

కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ మీడియాతో మాట్లాడారు. తుక్డే–తుక్డే గ్యాంగ్ తరహాలో మాట్లాడిన రాహుల్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. ఆయనపై దేశ ద్రోహం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. భారత ప్రజాస్వామ్యాన్ని రాహుల్ కించపర్చారని కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్ ఆక్షేపించారు. పార్లమెంట్‌కు రాహుల్ క్షమాపణ చెప్పాలన్నారు.

ప్రభుత్వ కమిటీ లేదు

'అదానీ దర్యాప్తు'పై లోక్‌సభలో కేంద్రం

న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ మీద వచ్చిన ఆరోపణలపై విచారణకు ప్రభుత్వపరంగా ఎలాంటి కమిటీనీ వేయలేదని కేంద్రం స్పష్టం చేసింది. వాటిపై నియంత్రణ సంస్థ సెబీ దర్యాప్తు చేస్తోందని గుర్తు చేసింది. ఈ విషయమై లోక్‌సభలో పలువురు ఎంపీలు అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి ఈ మేరకు లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. ''ఇండోనేసియా నుంచి బొగ్గు దిగుమతుల విషయమై కూడా అదానీ కంపెనీపై విడిగా జరుగుతున్న దర్యాప్తు ఇంకా తుది దశకు చేరలేదు. విద్యుదుత్పత్తి, సంపిణీ పరికరాల దిగుమతికి సంబంధించి అదానీ గ్రూప్‌పై వచ్చిన ఆరోపణల మీద డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ దర్యాప్తు పూర్తయింది. నివేదిక కూడా అందింది. హిండెన్‌బర్గ్ నివేదిక వెలుగు చూసిన తర్వాత గత జనవరి 24 నుంచి మార్చి 1 మధ్య అదానీ గ్రూప్‌కు చెందిన 9 లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్‌లో 60 శాతం క్షీణత నమోదైంది'' అని మంత్రి చెప్పారు.

సీనియర్ సిటిజన్లకు రైలు చార్జీల్లో రాయితీ పునరుద్ధరించాలి

రైల్వే శాఖకు పార్లమెంటరీ కమిటీ సిఫారసు

న్యూఢిల్లీ: రైల్వే శాఖ సీనియర్ సిటిజన్లకు చార్జీల్లో అందించే రాయితీని తిరిగి పునరుద్ధరించాలని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ప్రభుత్వానికి సిఫారసు చేసింది. 60 ఏళ్లు పైబడిన పురుషులకు 40 శాతం, 58 ఏళ్లు దాటిన మహిళలకు టికెట్ ధరలో 50 శాతం చొప్పున అన్ని రైళ్లలోని అన్ని తరగతుల్లోనూ రాయితీ ఉండేది. కరోనా నేపథ్యంలో 2020 మార్చి 20 నుంచి దీన్ని రద్దు చేశారు. బీజేపీ ఎంపీ రాధా మోహన్ సింగ్ సారథ్యంలోని రైల్వే శాఖ స్టాండింగ్ కమిటీ డిమాండ్ ఫర్ గ్రాంట్లపై సోమవారం పార్లమెంట్‌కు సమర్పించిన 14వ నివేదికలో దీన్ని ప్రస్తావించింది. ఈ రాయితీని పునరుద్ధరించాలని కోరింది. కనీసం స్లీపర్ క్లాస్, థర్డ్ ఏసీకైనా వర్తింపజేయాలని సూచించింది. అయితే అలాంటి యోచనేదీ లేదని రైల్వే శాఖ గతంలోనే స్పష్టం చేసింది. ప్రయాణికులకు ఇప్పటికే టికెట్ ధరపై 55 శాతం వరకు రాయితీ ఇస్తున్నట్టు తెలిపింది.

వందేభారత్ రైళ్ల ఉత్పత్తిపై ఆందోళన

వందేభారత్ రైళ్ల తయారీ మందగమనంపై కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. ''2022–23లో 35 రైళ్లు తయారవాల్సి ఉండగా ఇప్పటిదాకా కేవలం 8 రైళ్లే సిద్ధమయ్యాయి. లక్ష్యాన్ని చేరుకోవాలన్నా, రైలు ప్రయాణికుల ఆకాంక్షలు నెరవేరాలన్నా వందేభారత్ రైలు ఇంజన్లు, బోగీల తయారీ వేగాన్ని ముమ్మరం చేయాలి. ఇందుకోసం పలు ప్రాంతాల్లోని ఉత్పత్తి కేంద్రాలకు రైల్వేశాఖ సాంకేతిక తోడ్పాటు అందించాలి'' అని సూచించింది.

2022 మార్చికి చలామణిలో రూ.31 లక్షల కోట్ల విలువైన కరెన్సీ: కేంద్రం

న్యూఢిల్లీ: గత సంవత్సరం మార్చి నెలనాటికి దేశంలో రూ.31.33 లక్షల కోట్ల విలువైన కరెన్సీ చలామణిలో ఉందని కేంద్రం ప్రకటించింది. 2014 ఏడాదిలో చలామణిలో రూ.13 లక్షల కోట్ల కరెన్సీ ఉండగా గత మార్చికి ఇంతటి భారీ స్థాయికి పెరిగిందని సోమవారం లోక్‌సభలో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. మంత్రి వెల్లడించిన వివరాల ప్రకారం.. 2014 ఏడాది మార్చిలో డీజీపీలో 11.6 శాతంగా ఉన్న బ్యాంక్ నోట్లు, నాణేల వాటా 2022 మార్చి 25వ తేదీకల్లా 13.7 శాతానికి పెరిగింది. 2016 మార్చి నెలలో రూ.16.63 లక్షల కోట్ల కరెన్సీ చలామణిలో ఉండగా పాత పెద్ద నోట్ల రద్దు కారణంగా 2017 మార్చినాటికి కరెన్సీ చలామణి రూ.13.35 లక్షల కోట్లకు తగ్గింది. ఆ తర్వాత మళ్లీ చలామణిలో ఉన్న కరెన్సీ పెరుగుతూ పోయింది. చలామణిలో ఉన్న కరెన్సీ విలువ 2018 మార్చికి రూ.18.29 లక్షల కోట్లకు, 2019 మార్చినాటికి రూ.21.36 లక్షల కోట్లకు, 2020 మార్చినాటికి రూ.24.47 లక్షల కోట్లకు, 2021 మార్చి నాటికి రూ.28.53 లక్షల కోట్లకు, 2022 మార్చి నాటికి రూ.31.33 లక్షల కోట్లకు ఎగబాకింది. నల్ల ధనం చలామణికి చరమగీతం పాడటంతోపాటు డిజిటల్ ఆర్థికవ్యవస్థను ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం అడుగులువేసిందని మంత్రి ఉద్ఘాటించారు.

దుర్భేద్యమైన ఉక్కు సైన్యం

పూర్తిగా ఆధునీకరిస్తాం: చైనా అధ్యక్షుడు



బీజింగ్: దేశ సార్వభౌమత్వమే పరమావధిగా అత్యంత పటిష్టతర ఉక్కు సైన్యంగా దేశ సాయుధబలగాలను శక్తివంతం చేస్తామని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ప్రకటించారు. ఉప్పు–నిప్పుగా ఉండే సౌదీ అరేబియా, ఇరాన్‌ల మధ్య దౌత్య సంబంధాలను పునరుద్ధరించడంలో సఫలీకృతమై అంతర్జాతీయ సమాజంలో ప్రతిష్టను పెంచుకున్న చైనా.. దేశ సైన్యానికి 'ఆధునిక' జవసత్వాలను అందించడంపై దృష్టిపెట్టింది. చైనాకు మూడోసారి అధ్యక్షుడయ్యాక జిన్‌పింగ్ తొలిసారిగా ప్రసంగించారు. చైనా పార్లమెంట్ సమావేశాల ముగింపు సందర్భంగా ప్రజల నుద్దేశించి మాట్లాడారు. ' అంతర్జాతీయ వ్యవహారాల్లో మరింత క్రియాశీలక పాత్ర పోషించడంతోపాటు అమెరికాసహా పొరుగు దేశాల నుంచి ముప్పు, దేశ సార్వభౌమత్వ సంరక్షణ కోసం సైన్యాన్ని 'గ్రేట్ వాల్ ఆఫ్ స్టీల్(ఉక్కు సైన్యం)'గా మారుస్తాం. చైనా ముందుకుతెచ్చిన గ్లోబల్ డెవలప్‌మెంట్ ఇనీషియేటివ్(జీడీఐ), గ్లోబల్ సెక్యూరిటీ ఇనిషియేటివ్ వంటి కార్యక్రమాల అమలు సహా ప్రపంచ పురోభివృద్ధి, సంస్కరణ పథంలో చైనా ఇకమీదటా గతిశీల పాత్ర పోషించనుంది. దాంతోపాటే దేశ భద్రత, అభివృద్ధి ప్రయోజనాలను కాపాడుకునేందుకు దేశ భద్రత, సాయుధ బలగాలను అజేయశక్తిగా నవీకరించాలి. సుస్థిరాభివృద్ధికి భద్రతే వెన్నుముక' అని జిన్‌పింగ్ వ్యాఖ్యానించారు. 'మీరు నాపై ఉంచిన నమ్మకమే నన్ను ముందుకునడిపే చోదకశక్తి. నా భుజస్కంధాలపై పెద్ద బాధ్యతల్ని మోపారు' అన్నారు. ''పొరుగు ప్రాంతాలతో శాంతియుత అభివృద్ధినే కోరుకుంటున్నాం. తైవాన్ స్వతంత్రత కోరే వేర్పాటువాదులను, బయటి శక్తుల జోక్యాన్ని అడ్డుకుంటున్నాం. చైనా ఆధునీకరణ ప్రక్రియను మరింత ముందుకు తీసుకెళ్దాం' అని పార్లమెంట్‌లో సభ్యులనుద్దేశించి అన్నారు.

'స్వలింగ వివాహం'పై ధర్మాసనం: సుప్రీం

- ఇది తీవ్రమైన అంశమే
- మానవ హక్కులు, ప్రత్యేక వివాహ చట్టం వంటివి ఇమిడి ఉన్నాయని వ్యాఖ్య

న్యూఢిల్లీ: స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కల్పించాలంటూ దాఖలైన పిటిషన్లను ఐదుగురు న్యాయమూర్తుల సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం విచారించనుంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం సోమవారం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ఈ సందర్భంగా ధర్మాసనం పలు వ్యాఖ్యలు చేసింది. ''స్వలింగ వివాహాలకు చట్టబద్ధత ఇవ్వాలా వద్దా అనే అంశానికి ఒకవైపు రాజ్యాంగం ప్రసాదించిన మానవహక్కులు, మరోవైపు ప్రత్యేక శాసనాలు, ఇంకోవైపు ప్రత్యేక వివాహ చట్టం ఉన్నాయి. ఇంతటి ప్రధానమైన అంశాన్ని రాజ్యాంగ ధర్మాసనమే తేల్చాలి'' అని వ్యాఖ్యానించింది. ఇలాంటి వివాహాలను అనుమతించకూడదని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అభిప్రాయాన్ని వెల్లడించడం తెల్సిందే. ''భారతీయ కుటుంబ వ్యవస్థకు స్వలింగ వివాహాలు పూర్తి విరుద్ధం. వ్యక్తిగత చట్టాలు, సామాజిక విలువల సున్నిత సమతుల్యతను ఇవి భంగపరుస్తాయి' అంటూ ఆదివారం కోర్టుకు అఫిడవిట్ సమర్పించింది. ''ఈ అంశంలో శాసన అంశాలు, మానవ హక్కులు ఇమిడి ఉన్నాయి. దీనిని రాజ్యాంగ ధర్మాసనమే పరిష్కరిస్తుంది' అంటూ సుప్రీంకోర్టు ఈ అంశాన్ని ఏప్రిల్ 18వ తేదీకి వాయిదావేసింది. 'స్వలింగ వివాహాలను అనుమతిస్తే ఎదురయ్యే సమస్యల గురించీ ఆలోచించాలి. ఇద్దరు తండ్రులు లేదా కేవలం ఇద్దరు తల్లులు మాత్రమే జంటగా జీవించే కుటుంబంలో ఎదిగే పిల్లల మానసిక స్థితి ఎలా ఉంటుంది ? ప్రజల ఆకాంక్షలకు ప్రతిబింబమైన పార్లమెంట్ ఇలాంటి విషయాలను సమీక్షించాల్సి ఉంది. ఈ కేసు తీర్పు మొత్తం భారతీయ సమాజంపై తీవ్ర ప్రభావం చూపనుంది. అందుకే కేసులో భాగస్వామ్య పక్షాల వాదోపవాదనలను విస్తృతస్థాయిలో వినాలి' అని కేంద్ర ప్రభుత్వం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టును కోరారు. ఈ కేసు విచారణను ప్రత్యక్ష ప్రసారం చేయాలని ఒక న్యాయవాది కోరగా రాజ్యాంగ ధర్మాసనాల విచారణలన్నీ ప్రత్యక్ష ప్రసారాలు అవుతున్నాయని ధర్మాసనం గుర్తుచేసింది.



సాక్షి కరీంనగర్

మంగళవారం । 14 । మార్చి । 2023



ముగిసిన కల్యాణోత్సవాలు

వేములవాడ: రాజన్న సన్నిధిలో కొనసాగుతున్న శివకల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం పూర్ణాహుతి నిర్వహించారు. ఈ కార్యక్రమంతో వేడుకలు ముగిశాయి.



పుష్పయాగం.. ఏకాంతోత్సవం

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి పుష్పయాగం, ఏకాంతోత్సవం వైభవంగా జరిపించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
35.0/19.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం తగ్గుతుంది. పగటి పూట ఎండగా ఉంటుంది.

న్యూస్‌రీల్

'పది' పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి



మాట్లాడుతున్న శ్యామ్‌ప్రసాద్‌లాల్

కరీంనగర్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఏప్రిల్ 3 నుంచి ప్రారంభమవుతాయని, వాటి నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ విభాగాల అధికారులతో సమీక్షించారు. జిల్లాలోని 76 కేంద్రాల్లో పరీక్షకు హాజరయ్యే 6,359 బాలురు, 5,785 బాలికలు మొత్తం 12,144 మంది విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. కేంద్రాల్లో తాగునీరు, టాయిలెట్స్, సరైన వెలుతురు ఉండేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించనున్న పరీక్షలు సదవుగా జరిగేలా చూడడంతోపాటు సకాలంలో విద్యార్థులు పరీక్షా కేంద్రం లోపల ఉండేలా చూడాలన్నారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, ఏదైనా అగ్నిప్రమాదం సంభవిస్తే వెంటనే స్పందించేలా అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు, ఆర్టీసీ జోనల్ మేనేజర్ ఖుస్రో షా ఖాన్, జిల్లా అగ్నిమాపక అధికారి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

క్వింటాల్ పత్తి ధర రూ.7,300



జమ్మికుంట(హుజూరాబాద్): జమ్మికుంట వ్యవసాయ పత్తి మార్కెట్‌లో క్వింటాల్ పత్తికి గరిష్ట ధర రూ.7,300 పలికింది. సోమవారం మార్కెట్‌కు 112 వాహనాల్లో 1,378 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తీసుకురాగా మోడల్ ధర రూ.7,200, కనిష్ట ధర రూ.6,400 చెల్లించారు. గన్నీ సంచుల్లో 21 మంది రైతులు 34 క్వింటాళ్ల పత్తిని అమ్మకానికి తీసుకురాగా క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.7,000, మోడల్ ధర రూ.6,400, కనిష్ట ధర రూ.5,500 ఖరీదు వ్యాపారులు చెల్లించారు. మార్కెట్‌లో క్రయ విక్రయాలను కార్యదర్శి గూగులోతు రెడ్డి నాయక్ పర్యవేక్షించారు.

నృసింహుని హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న వలంటీర్లు

తిమ్మాపూర్(మానకొండూర్): మండలంలోని నల్లగొండ శ్రీసీతారామ లక్ష్మీనరసింహస్వామి హుండీ ఆదాయాన్ని సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో లెక్కించారు. వారం రోజుల జాతర సందర్భంగా స్వామివారికి రూ.15,36,158 నగదు సమకూరిందని ఈవో ఉడుతల వెంకన్న, ఆలయ చైర్మన్ దన్నమనేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. దుకాణాలు, లడ్డూ విక్రయాలు, షాపుల ఏర్పాటుకు నిర్వహించిన వేలంలో రూ.2,50,000, కొబ్బరి కాయలు, కొబ్బరి చిప్పల ఆదాయం రూ.2,20,000, టికెట్ల అమ్మకం ద్వారా రూ.2,32,223, హుండీల ద్వారా రూ.8,33,935 మొత్తం 15, 36,158 ఆదాయం సమకూరినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు, కమిటీ సభ్యులు, మహిళ సంఘం సభ్యులు, దేవాదాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేపు కొత్తపల్లిలో విద్యుత్ వినియోగదారుల సదస్సు

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లి సబ్‌స్టేషన్‌లో బుధవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ వినియోగదారుల సదస్సు నిర్వహించనున్నట్లు టీఎస్ఎన్‌పీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్మన్ పి.సత్యనారాయణగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సులో విద్యుత్ పునరుద్ధరణ, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ల మార్పు, ఓల్టేజీలో హెచ్చు తగ్గులు, డిస్ట్రిబ్యూషన్ సిస్టం పెంపుదల, లోపాలున్న మీటర్లు మార్చడం, నూతన సర్వీసులు మంజూరు చేయడం, అదనపు లోడ్ క్రమబద్ధీకరణ, సర్వీసుల పేరు మార్పు, వాడకానికన్న హెచ్చు మొత్తంతో గల బిల్లులు, కేటగిరీల మార్పు, సర్వీసు రద్దు చేయడం తదితర సమస్యలపై సదస్సులో లోకల్ కోర్టు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులకు సమస్యలుంటే సదస్సుకు హాజరై పరిష్కరించుకోవాలని కోరారు.

టెండర్లు వేయం.. వేయనియ్యం..!



జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం బట్టపల్లి, పోతారం గ్రామాల మధ్య ధ్వంసమైన రోడ్డు



మానకొండూరు మండలం పోచంపల్లి వద్ద కాకతీయ కాలువ సమీపంలో కుంగిన వంతెన

- రోడ్ల మరమ్మతుల్లో కొన్నిచోట్ల కాంట్రాక్టర్ల చేతివాటం
- అధిక ధరలకు టెండర్లు దక్కించుకునేందుకు వ్యూహం
- 210 టెండర్లలో ఒక్కటీ ఆమోదం పొందని వైనం
- పంచాయతీరాజ్ శాఖలో కొందరు అధికారుల సహకారం..?
- ఉమ్మడి జిల్లాలో 506 కి.మీ రోడ్లకు రూ.192 కోట్ల అంచనాతో పనులు

రీజియన్	మొత్తం	బీటీఆర్	ఎఫ్‌డీఆర్	బీటీ కి.మీ	అంచనా వ్యయం రూ.కోట్లల్లో	టెండర్ రిసీవ్డ్	టెండర్ సబ్మిటెడ్
కరీంనగర్	80	24	56	209.23	96.62	77	51
జగిత్యాల	94	28	66	173.81	58.59	94	83
పెద్దపల్లి	15	15	00	36.35	11.59	15	15
రాజన్నసిరిసిల్ల	27	19	08	87.00	25.64	24	19
మొత్తం	216	86	130	506.39	192.44	210	168

(బీటీఆర్ = బ్లాక్ తార్ రోడ్డు, ఎఫ్‌డీఆర్= ఫ్లడ్ డ్యామేజ్ రోడ్డు)
నోట్: ఫిబ్రవరి చివరి నాటికి మరమ్మతుకు సంబంధించి టెండర్ల పురోగతి

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: రోడ్ల మరమ్మతుల్లో కొందరు కాంట్రాక్టర్లు చక్రం తిప్పడానికి సిద్ధమయ్యారని సమాచారం. ఇటీవల వర్షాలకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో రోడ్లు దారుణంగా దెబ్బతిన్నాయి. ఈక్రమంలో ప్రభుత్వం వీటి మరమ్మతులకు నిధులు మంజూరు చేసింది. అందులో భాగంగానే కొత్త జిల్లాల వారీగా ధ్వంసమైన రోడ్లకు అంచనాలు రూపొందించారు. ప్రభుత్వం నుంచి ఆదేశాల రాగానే.. ఆయా పనులకు టెండర్లు పిలిచారు. చాలా ప్రాంతాల నుంచి కాంట్రాక్టర్ల నుంచి స్పందన బాగానే ఉంది. కొన్ని ప్రాంతాల్లో మాత్రం పనులు చేసేందుకు టెండర్లు పిలిచినా.. కాంట్రాక్టర్ల నుంచి స్పందన కరువవడం గమనార్హం. మరమ్మతు పనుల్లో అధిక లాభాలు గడించేందుకు టెండర్లు వేయం.. వేయనీయం అన్నట్లుగా కాంట్రాక్టర్లు వ్యవహరిస్తుండడం గమనార్హం.

రింగైన కాంట్రాక్టర్లు..?

రాష్ట్రవ్యాప్తంగా వరదలు, వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు సంబంధించిన దుస్థితిపై 'సాక్షి' ప్రధాన పత్రికలో 'రోడ్లకు రోగం' పేరిట సమగ్ర కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి వెంటనే సమీక్ష జరిపారు. రోడ్ల మరమ్మతులకు నిధులు విడుదల చేయాలని ఆ సమావేశంలో ఆదేశించారు. అందులో భాగంగా కరీంనగర్ రీజియన్‌లో ఉన్న కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాలకు సంబంధించి దాదాపు రూ.192.44 కోట్ల అంచనాతో మొత్తంగా 506.39 కి.మీల మేర ధ్వంసమైన రోడ్లకు అధికారులు టెండర్లు పిలిచారు. ఇందులో ఉమ్మడి జిల్లా మొత్తం కలిపి ఫిబ్రవరి చివరినాటికి 210 టెండర్లు వచ్చాయి. అందులో నుంచి 168 టెండర్లను చీఫ్ ఇంజినీర్‌కు సమర్పించారు.

ఒక్క టెండరూ ఆమోదం పొందలేదా?

కరీంనగర్ రీజియన్ పరిధిలో మొత్తం వచ్చిన టెండర్లలో 210లో కేవలం 168 టెండర్లు మాత్రం చీఫ్ ఇంజినీర్‌కు వెళ్లాయి. ఇప్పటివరకూ వీటిలో ఒక్క పని కూడా ఆమోదం పొందలేదు. మరోవైపు 2022–23 ఆర్థిక సంవత్సరం నెలాఖరుతో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఒక్క పని కూడా ఆమోదం పొందకపోవడంలో ఆంతర్యం ఏంటన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పనుల ఆమోదంలో జాప్యం వల్ల.. అధిక అంచనాలకు టెండర్లు దాఖలు చేసే కాంట్రాక్టర్లకే లబ్ధి చేకూరుస్తుందని తెలిసినా టెండర్లలో పురోగతి లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఈ విషయంలో అధికారుల తీరుపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

- మరికొన్ని చోట్ల రెండుసార్లు టెండర్లు పిలిచినా ఇంతవరకూ కాంట్రాక్టర్ల నుంచి స్పందన కరువైంది. ఈ నేపథ్యంలో కాంట్రాక్టర్లంతా ముందే రింగయ్యారని, అందుకే కొన్ని చోట్ల టెండర్లు వేసినా ఎలాంటి స్పందన రావడం లేదని పంచాయతీరాజ్ సిబ్బందే వ్యాఖ్యానిస్తున్నారు. మూడోసారి టెండరు పిలిచినప్పుడు ఉన్న ధరకంటే అధికంగా కోట్ చేసినా గత్యంతరం లేక ఆమోదింపజేసుకునేందుకు కాంట్రాక్టర్లు వేసిన ఎత్తుగడగా అభివర్ణిస్తున్నారు. ఇందుకు పంచాయతీరాజ్ శాఖ సిబ్బంది కూడా సహకరిస్తున్నారని ప్రచారం సాగుతోంది.

సీపీఆర్‌పై అవగాహన పెంచుకోవాలి



సీపీఆర్‌పై మంత్రి కమలాకర్‌కు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

- రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్‌రూరల్: క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది తప్పనిసరిగా సీపీఆర్‌పై శిక్షణ పొందడం ద్వారా కొంతమేర గుండెపోటు మరణాలను నియంత్రించే అవకాశముంటుందని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. సోమవారం కరీంనగర్ మండలం నగునూరులోని ప్రతిమ మెడికల్ కళాశాలలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు, పంచాయతీ కార్యదర్శులు, పోలీసు, మున్సిపల్ సిబ్బంది, అంగన్వాడీ సూపర్‌వైజర్లు, పబ్లిక్ హెల్త్ సెంటర్ సిబ్బందికి లైఫ్ సేవింగ్ టెక్నిక్ (సీపీఆర్, ఏఈడీ) ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో ఇటీవల కార్డియాక్ అరెస్టుతో పలువురు యువకులు ఆకస్మికంగా మృతిచెందడం బాధాకరమన్నారు. గుండెపోటుతో ఎవరూ మృతిచెందకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న సిబ్బందికి సీపీఆర్‌పై శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందన్నారు. తెలంగాణలోనే తొలిసారిగా విద్యార్థులకు స్క్రీనింగ్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. వైద్య పరీక్షల్లో బీపీ, షుగర్, ఈసీజీ, 2డీ ఎకో పరీక్షల ఆధారంగా మందులు ఇవ్వడం జరుగుతుందన్నారు. సీపీఆర్‌పై ప్రతి ఒక్కరికి అవగాహన వచ్చినపుడే కార్డియాక్ మరణాలను నియంత్రించేందుకు అవకాశముంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ పాడి కౌశిక్‌రెడ్డి, కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, పోలీసు కమిషనర్ సుబ్బారాయుడు, మేయర్ సునీల్‌రావు, ఎంపీపీ లక్ష్మయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ మధు, గ్రంథాలయ చైర్మన్ అనిల్‌కుమార్, డీఎంహెచ్‌వో జువేరియా, జిల్లా సంక్షేమ అధికారి సబిత, డీపీవో వీరబుచ్చయ్య, మున్సిపల్ కమిషనర్ సేవా ఇస్లావత్, సర్పంచు ఉప్పుల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతమే లక్ష్యంగా పని చేయాలి

కరీంనగర్: బీఆర్ఎస్ బలోపేతమే లక్ష్యంగా పార్టీ కార్యకర్త నుంచి రాష్ట్ర స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధుల మధ్య అనుబంధాన్ని బలోపేతం చేయడానికై ఏప్రిల్ 2 నుంచి 13 వరకు జిల్లాలో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించనున్నట్లు మంత్రి గంగుల కమలాకర్ పేర్కొన్నారు. మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు కరీంనగర్‌లోని కేసీఆర్ రెస్ట్ హౌస్‌లో జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణరావు అధ్యక్షతన జెడ్పీ చైర్‌పర్సన్ విజయ, ప్రభుత్వ విప్ కౌశిక్ రెడ్డి, ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, రవిశంకర్ తదితరులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఈనెల 21న బీఆర్ఎస్ ముఖ్య సమావేశం, ఏప్రిల్‌లో అన్ని నియోజకవర్గాల్లో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పని చేస్తున్న ప్రతీ ఒక్కరినీ ఈ కార్యక్రమంలో భాగస్వాములు చేయాలన్నారు.

నేటి కంటి వెలుగు శిబిరాలు

కరీంనగర్‌టౌన్: జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం కంటి వెలుగు శిబిరాలు నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో జువేరియా ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ నగరంలోని 1,6,8,12,15, 18,41,45,46,49,53,56 డివిజన్‌లలో, హుజురాబాద్ పట్టణం 5,15 వార్డులు, అదే మండలం కాట్రపల్లి, బొత్తలపల్లిలో శిబిరాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. జమ్మికుంట పట్టణం 9,30 వార్డులు, అదే మండలం గండ్రపల్లి, వీణవంక మండలం ఎలబాక, కొండపాక, బేతిగల్, చిగురుమామిడి మండలం రేకొండ, ఇందుర్తి, చొప్పదండి పట్టణం 10వ వార్డు, అదే మండలం వెదురుగట్ట, గుమ్లాపూర్, ఇల్లందకుంట మండలం రాచపల్లి, మల్యాల, గంగాధర మండలం గర్శకుర్తి, చర్లపల్లి (ఎన్), ఉప్పర మల్యాల, రామడుగు మండలం షానగర్, వన్నారం, కొత్తపల్లి మండలం బొమ్మకల్, కమాన్‌పూర్, కరీంనగర్‌రూరల్ మండలం మొగ్దుంపూర్, నగునూర్, మానకొండూరు మండలం ముంజంపల్లి, కొండపల్కల, పచ్చునూర్, సైదాపూర్ మండలం ఎక్లాస్పూర్, అమ్మనగుర్తి, కేశవపట్నం మండలం వంకాయగూడెం, లింగాపూర్, తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్, నల్లగొండ, గన్నేరువరం మండలం మాదాపూర్‌లో కంటి వెలుగు బృందాలు పనిచేస్తాయని పేర్కొన్నారు.

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- డీఐఈవో రాజ్యలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న రాజ్యలక్ష్మి

కరీంనగర్: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేశామని డీఐఈవో రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం డీఐఈవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా ఈనెల 15 నుంచి 29 వరకు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. మొదటి సంవత్సరం పరీక్షలకు 15,952, ద్వితీయ సంవత్సరం 15,503 మొత్తం 31,455 మంది విద్యార్థులు హాజరవుతారని వెల్లడించారు. ప్రభుత్వ, ప్రైవేట్, మోడల్ స్కూల్స్, సోషల్ వెల్ఫేర్, మైనార్టీ వెల్ఫేర్ కళాశాలల్లో 51 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. విద్యార్థుల హాల్‌టికెట్స్‌లో ఏమైనా తప్పులు దొర్లితే ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ నాంపల్లి హైదరాబాద్ ట్రోల్ ఫ్రీ నం.2460 1010, 2465 5027లలో సంప్రదించాలని సూచించారు. ఇంటర్‌నెట్ నుంచి నేరుగా హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, ప్రిన్సిపాల్ సంతకం లేకున్నా పరీక్షకు అనుమతించడం జరుగుతుందని స్పష్టం చేశారు. విద్యార్థులు గంట ముందు కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్ష నిర్వహణకు తనతో పాటు జగన్మోహన్‌రెడ్డి, ఆంజనేయరావు, శశిధర్‌శర్మ, రవీందర్‌రెడ్డి కమిటీ మెంబర్లుగా ఉంటారని పేర్కొన్నారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు, నిరంతర విద్యుత్ సరఫరా, వైద్య శిబిరాల ఏర్పాటు, ఇతరత్రా సౌకర్యాలతో పాటు గ్రామీణ ప్రాంత విద్యార్థుల కోసం ఆర్టీసీ బస్సులను నడుపుతున్నట్లు డీఐఈవో వెల్లడించారు.

సందేహాల నివృత్తికి కంట్రోల్ రూం

కరీంనగర్: ఇంటర్ పరీక్షలకు సంబంధించి సందేహాల నివృత్తికి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ తెలిపారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. కంట్రోల్ రూం నం.96666 88222, డీఐఈవో ఫోన్ నం.98483 09006 ఫోన్ చేసి సందేహాలు నివృత్తి చేసుకోవచ్చన్నారు. విద్యార్థులు ఒత్తిడి, ఆందోళన సమస్యలు ఎదుర్కోవడానికి టోల్‌ఫ్రీ నం.14416కు ఫోన్ చేస్తే సైకాలజిస్ట్ సలహాలు, కౌన్సెలింగ్ ఇస్తారని పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్, డీఐఈవో రాజ్యలక్ష్మి, ఆర్టీసీ ఆర్ఎం ఖుస్రోషా ఖాన్, డీఈవో జనార్దన్‌రావు, డీఎంఅండ్‌హెచ్‌వో జువేరియా, మున్సిపల్ కమిషనర్ ఇస్లావత్ సేవా తదితరులు పాల్గొన్నారు.

వాడీవేడిగా జెడ్పీ సర్వసభ్య సమావేశం

- సమస్యలను ఏకరువు పెట్టిన సభ్యులు
- తాగు, సాగునీరు, విద్య, వైద్యం, పారిశుధ్యం, ధాన్యం కొనుగోళ్లపై చర్చ



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కమలాకర్



పాల్గొన్న ప్రజాప్రతినిధులు

కరీంనగర్: జిల్లా ప్రజాపరిషత్ సమావేశంలో జెడ్పీటీసీలు, ఎంపీపీలు ప్రజాసమస్యలపై గళమెత్తారు. ప్రతిపక్ష నేతల పాత్రను పోషించడంతో గతంలో ఎన్నడూ లేని విధంగా సమావేశం వాడీవేడిగా జరిగింది. సోమవారం చైర్‌పర్సన్ కనుమల్ల విజయ అధ్యక్షతన జరిగిన జెడ్పీ సర్వసభ్య సమావేశానికి బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్, ప్రభుత్వ విప్ పాడి కౌశిక్‌రెడ్డి, కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్, జెడ్పీ సీఈవో ప్రియాంక, అధికారులు హాజరయ్యారు. ఉదయం 11 గంటలకు ఏర్పాటు చేసిన సమావేశం కోరం లేని కారణంగా అరగంట ఆలస్యంగా ప్రారంభమైంది. ఏజెండాలోని సాగు, తాగునీరు, విద్య, వైద్యం, వ్యవసాయం, డీఆర్డీఏ, ధాన్యం కొనుగోళ్ల అంశాలకు పరిమితం చేశారు.

- హుజురాబాద్ మండలం కందుగులలో హరితహారం మొక్కలను తొలగించడంతో పాటు బోర్‌వెల్‌ను పూడ్చివేస్తే ఎందుకు చర్యలు తీసుకోలేదని జెడ్పీటీసీ బక్కారెడ్డి అధికారులను ప్రశ్నించారు.
- సదరం సర్టిఫికెట్ ఉన్నా కొంత మంది దివ్యాంగులకు పెన్షన్‌ను నిలిపివేశారని, వారికి న్యాయం చేయాలని చిగురుమామిడి ఎంపీపీ కొత్త వినీత కోరారు. డీఆర్డీవో శ్రీలత మాట్లాడు తూ ప్రతినెలా నిర్వహించే సదరంలో 40 మంది దివ్యాంగులకు మాత్రమే స్లాట్ బుక్ అవుతుంద ని సంఖ్యను పెంచడం, మండలాల్లో క్యాంపులు నిర్వహించడం తమ పరిధిలో ఉండదన్నారు.
- రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోకుండా చివరి ఆయకట్టు వరకు ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ అధికారులకు సూచించారు.
- తోటపల్లి రిజర్వాయర్ కోసం సేకరించిన భూమిని రైతులకు తిరిగి ఇప్పించాలని చిగురుమామిడి జెడ్పీటీసీ రవీందర్ కోరారు.
- మానకొండూర్ మండలంలోని పలు గ్రామాల్లో ఇసుక క్వారీల ద్వారా రూ.20 నుంచి 40 లక్షల ఆదాయం పంచాయతీలకు వస్తున్నా వాటిని ఆయా గ్రామాల అభివృద్ధికి వెచ్చించేందుకు వీలు లేకుండా ఉన్న నిబంధనలను సడలించాలని జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్ కోరారు. అలాగే పలు మండలాల్లోని సమస్యలపై ప్రజాప్రతినిధులు మాట్లాడారు.

ఆడబిడ్డలు బిందెలతో ఆందోళన చేస్తే అధికారులే బాధ్యులు

ఆడబిడ్డలు మంచినీటి కోసం బిందెలతో ఆందోళన చేస్తే మీరే బాధ్యులని, నీటి ఎద్దడి లేకుండా చూడాలని మిషన్ భగీరథ అధికారులకు మంత్రి గంగుల కమలాకర్ చురకలంటించారు. భగీరథ సెంటర్లకు ఎల్ఎండీ నుంచి ఎంత నీటిని ప్యూరిఫైడ్ చేస్తున్నారు, డిమాండ్, సప్లయ్ ఎలా ఉంది అన్న ప్రశ్నలకు అధికారుల నుంచి సమాధానం లేకపోవడంతో మంత్రి అసహనం వ్యక్తం చేశారు. రబీలో ధాన్యం కొనుగోళ్లపై నిర్లక్ష్యం వద్దని, ఎఫ్‌సీఐ జోక్యం లేకున్నా ధాన్యం కొని రైతులకు ఇబ్బందులు లేకుండా చేస్తామని హామీ ఇచ్చారు. వైస్‌చైర్మన్ పేర్యాల గోపాల్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేణి మధు, పాల్గొన్నారు.

అంబాల్‌పూర్ చెరువుకు గండి



శంకరపట్నం(మానకొండూర్): మండలంలోని అంబాల్‌పూర్ ఊర చెరువుకు గుర్తు తెలియని వ్యక్తులు గండిపెట్టారు. ఆదివారం రాత్రి సమయంలో చెరువుకు గండి పెట్టడంతో నీరు వృథాగా పోతుందని మత్స్యకారులు ఆరోపించారు. మత్స్యకారులు చెరువులో చేపపిల్లల పెంపకం చేపట్టారు. అందులో నీరు ఉంటేనే చేప పిల్లలు పెరుగుతాయని, గండి పడిన ప్రాంతంలో అధికారులు మరమ్మతు చేయాలని కోరారు.

మెడికల్ కాలేజీ ఏర్పాటుకు వేగంగా అడుగులు

- రెండు చోట్ల సందర్శించిన ఎన్ఎంసీ బృందం



ఆసుపత్రిలో వివిధ విభాగాలను పరిశీలిస్తున్న బృందం

కరీంనగర్‌టౌన్: కరీంనగర్‌లో మెడికల్ కాలేజీ ఏర్పాటుకు వేగంగా అడుగులు పడుతున్నాయి. సోమవారం ఎన్ఎంసీ (నేషనల్ మెడికల్ కౌన్సిల్) బృందం పరిశీలన చేపట్టింది. కర్ణాటక ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కు చెందిన ప్రొఫెసర్ డాక్టర్ సుమన్ డంబాల్, ఐజీఎంసీ పాండిచ్చేరికి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ రవీంద్రభట్, వారణాసి ఏజేఐ మోర్‌కు చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రఘునాథ్‌షా ఆధ్వర్యంలో ముగ్గురు సభ్యుల ఎన్ఎంసీ బృందం ఇందులో పాల్గొంది. రెండునెలల క్రితం ఎన్ఎంసీ తనిఖీలు చేపట్టగా, ఇది రెండోసారి. ఇలా నాలుగైదుసార్లు బృందాలు పరిశీలించి సంతృప్తి చెందిన తర్వాతే కళాశాలకు పూర్తిస్థాయిలో అనుమతులు వస్తాయని వైద్యవర్గాలు పేర్కొన్నాయి.

రెండు చోట్ల పరిశీలన

జిల్లాకు మెడికల్ కాలేజీ మంజూరైనా పూర్తిస్థాయిలో కళాశాల నిర్మాణానికి సంబంధించిన పనులు మొదలుకాలేదు. ఇప్పట్లో ఆ అవకాశం లేకపోవడంతో తాత్కాలికంగా జిల్లా ఆస్పత్రిలోనే మెడికల్ కాలేజీ కొనసాగించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనేపథ్యంలో ఎన్ఎంసీ బృందం జిల్లా ఆస్పత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించారు. పేషెంట్ల వద్దకు వెళ్లి వారికి అందుతున్న వైద్యసేవలపై ఆరాతీశారు. వైద్యసిబ్బంది, వైద్యుల వివరాలు, రికార్డులు పరిశీలించారు. మెడికల్ కళాశాల ప్రారంభమయ్యాక అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా కొనసాగించేందుకు వారి సర్టిఫికెట్లు కూడా తనిఖీచేశారు. అనంతరం మెడికల్ కళాశాల నిర్మాణంలో భాగంగా కొత్తపల్లిలోని విత్తనాభివృద్ధి సంస్థ ప్రాంగణంలో మరమ్మతులు చేపడుతున్న గోదాములను సందర్శించారు.

క్లుప్తంగా

రేపు 'బలగం' సక్సెస్ మీట్

విద్యానగర్(కరీంనగర్): హర్షిత్ రెడ్డి, హన్షిత దిల్‌రాజు ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ప్రముఖ నిర్మాత దిల్‌రాజు ప్రియదర్శి, కావ్య, కల్యాణిరామ్, సుధాకర్‌రెడ్డి, మురళీధర్ గౌడ్ ప్రధాన పాత్రధారులుగా వేణు ఎల్దండి దర్శకత్వంలో నిర్మించిన బలగం సినిమా విజయం సాధించింది. బుధవారం సాయంత్రం కరీంనగర్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే గ్రౌండ్‌లో సక్సెస్ మీట్ నిర్వహిస్తున్నట్లు ఆ చిత్ర యూనిట్ తెలిపింది. దీనికి ముఖ్య అతిథిగా రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్, చిత్ర దర్శకుడు వేణు, నటీనటులు, సాంకేతిక సిబ్బంది హాజరవుతారని పేర్కొంది.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు


గాయపడిన అశోక్‌కుమార్

రామడుగు(చొప్పదండి): మండలంలోని షానగర్ మాజీ సర్పంచ్ గునుకొండ అశోక్‌కుమార్ సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. గ్రామస్తుల వివరాలు.. ట్రాక్టర్ వాటర్ ట్యాంక్‌లో నీటిని నింపుకొని వెదిర వైపు వెళ్తుండగా బోల్తా పడింది. ఈ ఘటనలో రోడ్డుపైన పడిపోయిన అశోక్‌కు తీవ్రగాయాలు కాగా కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

గుండెపోటుతో 108 ఉద్యోగి మృతి


రిజ్వాన్ (ఫైల్)

వీణవంక(హుజూరాబాద్): మండల కేంద్రానికి చెందిన రిజ్వాన్(35) అనే 108 ఉద్యోగి గుండెపోటుతో మృతి చెందాడు. గ్రామస్తుల వివరాల ప్రకారం.. రిజ్వాన్ కొంతకాలంగా వీణవంకలో 108 వాహన డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆదివారం రాత్రి హఠాత్తుగా గుండెనొప్పి రావడంతో కుటుంబసభ్యులు జమ్మికుంటలోని ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఈ ఘటనతో మృతుడి కుటుంబసభ్యులు, గ్రామస్తుల రోదనలు మిన్నంటాయి. ప్రభుత్వ విప్ పాడి కౌశిక్‌రెడ్డి, సర్పంచు నీల, ఉపసర్పంచ్ భానుచందర్ సంతాపం తెలిపారు.

లైంగికదాడికి యత్నించిన కేసులో ఒకరికి జైలు

కరీంనగర్ క్రైం: బాలికపై లైంగిక దాడికి యత్నించిన కేసులో నేరస్తుడు వరికోలు లింగమూర్తి అలియాస్ లింగయ్యకు పదేళ్ల జైలుశిక్ష, రూ.4 వేల జరిమానా విధిస్తూ కరీంనగర్ మొదటి అదనపు జిల్లా జడ్జి, పోక్సో కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి శ్రీవాణి తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. కరీంనగర్‌లోని కోతిరాంపూర్‌లో ఉండే దంపతులకు పాప, బాబు సంతానం. భార్య కూలీ పనులకు వెళ్తుండగా, భర్త రిక్షా నడుపుకుంటూ పిల్లలను పోషించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో 2019 ఫిబ్రవరి 1న ఉదయం 10 గంటలకు దంపతులిద్దరూ ఆసుపత్రికి వెళ్లారు. ఆరోజు విద్యాసంస్థలు బంద్ ఉండటంతో పాప, బాబు ఇంట్లోనే ఉన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు బాబు ఆడుకునేందుకు బయటకు వెళ్లగా పాప ఒక్కతే ఇంట్లో ఉంది. ఇది గమనించిన అదే ప్రాంతానికి చెందిన వరికోలు లింగమూర్తి అలియాస్ లింగయ్య ఇంట్లోకి ప్రవేశించి, తలుపులు గడియ వేసి, అమ్మాయిపై లైంగిక దాడికి యత్నించాడు. అదే సమయంలో ఆసుపత్రి నుంచి ఇంటికి వచ్చిన భార్యాభర్తలకు తలుపులు గడియ పెట్టి ఉండటంతో అనుమానం వచ్చింది. బలవంతంగా తలుపులు తెరిచారు. లోపల లింగయ్యను చూసి కేకలు వేయడంతో అతను పరారయ్యాడు. ఈ సంఘటనపై బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు అప్పటి కరీంనగర్ వన్ టౌన్ సీఐ తుల శ్రీనివాసరావు కేసు నమోదు చేయగా ఏసీపీ అశోక్ దర్యాప్తు జరిపారు. సాక్షులను సీఎంఎస్ పీసీ కిశోర్ కుమార్ కోర్టులో ప్రవేశపెట్టగా అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కనుకుల సంజీవరెడ్డి విచారించారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి శ్రీవాణి నిందితుడికి సోమవారం శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారు.

కిసాన్ మాన్‌ధన్.. రైతుకు రూ.3 వేల పింఛన్

- 18–40 ఏళ్ల వయసు, 5 ఎకరాల్లోపు భూమి ఉన్నవారు అర్హులు
- నెలవారీగా చెల్లించాల్సిన ప్రీమియం రూ.55 నుంచి రూ.200


వ్యవసాయ పనుల్లో మహిళా రైతులు

కరీంనగర్ అర్బన్: కర్షకులకు వృద్ధాప్యంలో బాసటగా నిలవాలని కేంద్రం నిర్ణయించింది. నెలనెలా పింఛన్ ఇచ్చేందుకు మార్గదర్శకాలు విడుదల చేయగా అధికార యంత్రాంగం తదనుగుణ చర్యలు చేపడుతోంది. అన్నదాతలకు విస్తృత అవగాహన కల్పించేలా క్షేత్రస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పీఎం కిసాన్ మాన్‌ధన్ యోజనకు కేంద్రం శ్రీకారం చుట్టగా సొంత భూమి ఉన్న సన్న, చిన్నకారు రైతులకు ఆర్థిక భరోసా కలగనుంది. 60 ఏళ్లు దాటిన అన్నదాతలందరికీ స్థిరమైన ఆదాయం అందించేందుకు స్వచ్ఛంద కాంట్రిబ్యూషన్ పింఛన్ పథకాన్ని అమలు చేయనుంది. నెలవారీగా రూ.55 నుంచి రూ.200 వరకు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. ఎంత సొమ్ము చెల్లిస్తే దానికి అంతే మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వం జమ చేస్తుంది. పెన్షన్ చెల్లింపునకు ఎల్ఐసీతో ఒప్పందం చేసుకుంది. సొంత భూమి కలిగిన 18 నుంచి 40 ఏళ్ల వయసు, 5 ఎకరాల వరకు భూమి కలిగిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధు పథకం కింద ఎకరాకు రూ.5 వేలు చొప్పున రెండు విడతలుగా, కేంద్ర ప్రభుత్వం కిసాన్ సమ్మాన్ నిధి కింద ఒక్కో రైతుకు ఏడాదికి రూ.6 వేల చొప్పున సాయం అందిస్తున్నాయి. కిసాన్ సమ్మాన్ నిధికి వర్తించే నిబంధనలే ఈ పథకానికీ వర్తిస్తాయి.

40 ఏళ్లు నిండేవరకు చెల్లించాలి..

కామన్ సర్వీసు సెంటర్ (సీఎస్సీ) లేదా పీఎం కిసాన్ నోడల్ అధికారి ద్వారా అర్హులందరూ ఉచితంగా తమ వివరాలు నమోదు చేసుకోవచ్చు. ఈ పథకం కింద నమోదు చేసుకోవడానికి ఎన్‌రోల్‌మెంట్ కమ్ ఆటో డెబిట్ మ్యాండేట్ ఫాంపై సంతకం చేయాలి. ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా, పట్టాదారు పాసు పుస్తకం, వ్యవసాయ భూమి యాజమాన్య పత్రాలు దరఖాస్తుతో జత చేయాలి. వివరాలు నమోదు చేయగానే పీఎం కిసాన్ మాన్‌ధన్ కార్డును డౌన్‌లోడ్ చేసి, రైతులకు ఇస్తారు. ఒకసారి ప్రీమియం చెల్లించడం ప్రారంభిస్తే.. 40 ఏళ్లు నిండే వరకు చెల్లించాల్సి ఉంటుంది. అనంతరం రైతులు 41 నుంచి 59 ఏళ్ల వరకు వేచి ఉండాలి. వారికి 60 ఏళ్లు వచ్చిన ప్పటి నుంచి ప్రతి నెలా రూ.3 వేలు చొప్పున పింఛన్ చెల్లిస్తారు. పెన్షన్ పొందుతున్న సమయంలో రైతు మరణిస్తే నామినీకి నెలకు రూ.1,500 చొప్పున ఇస్తారు.

అవగాహన లేక దూరం..

కాగా ఈ పథకంపై సరైన ప్రచారం లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సరైన అవగాహన లేక చాలా మంది వివరాల నమోదుకు దూరంగా ఉన్నారు. పేద రైతులకు వద్ధాప్యంలో ఇది ఎంతో ఉపయోగపడనుంది. అవగాహన కల్పించాలి. ఏలాంటి సందేహాలున్నా ప్రతీరోజు అందుబాటులో ఉండే ఏఈవోలు, ఏవోలను సంప్రదించాలని సూచిస్తున్నారు.

ప్రజావాణికి 148 దరఖాస్తులు


అధికారులకు దరఖాస్తులు అందిస్తున్న బాధితులు

కరీంనగర్ అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజలు తరలివచ్చారు. అదనపు కలెక్టర్లు గరిమా అగర్వాల్, జీవీ శ్యాంప్రసాద్‌లాల్‌లు అర్జీలు స్వీకరించారు. ఆయా శాఖలకు సంబంధించి మొత్తం 148 దరఖాస్తులు వచ్చాయని కలెక్టరేట్ ఏవో కన్నం నారాయణస్వామి తెలిపారు. ప్రధానంగా భూ సమస్యలు, పింఛన్, రేషన్ కార్డులు, దళిత బంధు, రెండు పడకల ఇళ్లపైనే వచ్చాయని పేర్కొన్నారు. పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేందుకు ఉన్నతాధికారులు చొరవ చూపారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ లెనిన్ వాత్సల్ టోప్పో, మున్సిపల్ కమిషనర్ సేవా ఇస్లావత్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అర్జీదారుల పడిగాపులు

వేసవికాలం అర్జీ ఇచ్చి, త్వరగా వెళ్లాలనుకునేవారికి నిరాశే ఎదురైంది. ప్రజావాణిలో సమయపాలన అటకెక్కడం, పర్యవేక్షణ కరువవడంతో పరిస్థితి ఇష్టారాజ్యంగా మారింది. సోమవారం జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజలు ఉదయం 9.50 గంటలకే కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ఉదయం 10.15 గంటలు దాటినా రోదులు, రిజిస్ట్రేషన్ విభాగాలు ఖాళీగా కనిపించాయి. ఫలితంగా దరఖాస్తుదారులకు పడిగాపులు తప్పలేదు.

నా భూమి ఇప్పించాలి



కొత్తపల్లి మండలం మల్కాపూర్ గ్రామంలోని సర్వే నంబర్ 159లో మాకు రెండెకరాల భూమి ఉంది. దాన్ని కొందరు వ్యక్తులు దొంగ రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇదే భూమి విషయమై నా కుమార్తె తిరిగి తిరిగి గుండెపోటుతో చనిపోయింది. సమగ్ర విచారణ జరిపి, నా భూమిని నాకు ఇప్పించాలని కోరుతుంటే ఎవరూ పట్టించుకుంటలేరు.

– కలువల రాములు, మల్కాపూర్, కొత్తపల్లి

అధికారులను సస్పెండ్ చేయాలి

కరీంనగర్: కొత్తగట్టు రెవెన్యూ శివారులోని సర్వే నంబర్ 55 వ్యవసాయ భూ వివాదంలో తలదూర్చిన రెవెన్యూ అధికారులపై విచారణ జరిపి, వారిని సస్పెండ్ చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రాహ్మణపల్లి యుగంధర్ కోరారు. ఈ మేరకు సోమవారం అదనపు కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్‌లాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఐలయ్య వాటా భూమిని అతని అన్న కూమారులైన కాసు భీమరాజు, రామరాజుల పేరిట విరాసత్ చేయటంలో అధికారులు లక్షల రూపాయలు దండుకొని, నకిలీ పత్రాలు సృష్టించారని ఆరోపించారు. హసిల్దార్ జగత్ సింగ్, డిప్యూటీ తహసీల్దార్ నాగార్జున, సీనియర్ అసిస్టెంట్ శ్రీలత, గిర్దావర్ అరుణ, వీఆర్‌వో మమతలను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.


అదనపు కలెక్టర్‌తో మాట్లాడుతున్న నాయకులు

రాష్ట్ర ప్రగతిపై గ్రామాల్లో చర్చించాలి

- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్
- గుండ్లపల్లి–గన్నేరువరం రోడ్డు పరిశీలన


రోడ్డును పరిశీలిస్తున్న ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, ఎమ్మెల్యే బాలకిషన్

గన్నేరువరం(మానకొండూర్): రాష్ట్రం అన్ని రంగాల్లో విశేష ప్రగతి సాధించి, ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని, ఈ విషయాన్ని యువత గమనించాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. గుండ్లపల్లి నుంచి పొత్తూరు వరకు వయా గన్నేరువరం డబుల్ రోడ్డు నిర్మాణం కోసం రూ.70 కోట్లు మంజూరు చేసిన నేపథ్యంలో సోమవారం ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌తో కలిసి ఆ రోడ్డును పరిశీలించారు. ఈ దారి పనుల కోసం టెండర్లు వెంటనే పిలవాలని ఈఎన్‌సీ రవీందర్‌రావుకు సూచించారు. తొమ్మిదేళ్లు రాష్ట్రంలో జరిగిన ప్రగతిని, బీజేపీ, కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లోని స్థితిగతులపై గ్రామాల్లో చర్చించాలని కోరారు. దేశంలో రోజు రోజుకు పెరిగిపోతున్న మతోన్మాద రాజకీయాలపై యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. కేవలం ఓట్లు, సీట్లే లక్ష్యంగా మత రాజకీయాలు చేస్తున్న బీజేపీ శక్తులతో జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. రాజకీయ పార్టీలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పోటీ పడాలి తప్ప మతోన్మాద రాజకీయాల్లో కాదన్నారు. స్థానిక నాయకులు శాలువాలతో వారిని సన్మానించారు. జెడ్పీటీసీ సభ్యుడు మాడుగుల రవీందర్‌రెడ్డి, వెలమ సంఘం జిల్లా అధ్యక్షుడు జువ్వాడి మన్మోహన్‌రావు, సర్పంచ్, ఎంపీటీసీ ఫోరంల మండల అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, ఆంజనేయులు, ఏఎంసీ చైర్మన్ కచ్చు రాజయ్య, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వుషు పోటీల్లో సత్తా చాటాలి



కరీంనగర్ స్పోర్ట్స్: నిజామాబాద్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి వుషు పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్లు సత్తా చాటాలని ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్ రెడ్డి ఆకాంక్షించా రు. వుషు సంఘం కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం కరీంనగర్‌లోని ఫండస్ స్కూల్‌లో నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ వుషు జట్ల ఎంపిక పోటీలను ఆయన ప్రారంభించారు. వుషు సంఘం ప్రధాన కార్యదర్శి బారా విద్యాసాగర్ మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి సుమారు 50 మంది క్రీడాకారులు హాజరయ్యారని అన్నారు. జిల్లాస్థాయి పోటీల్లో రాణించిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. పాఠశాల డైరెక్టర్ గోపు శశాంక రెడ్డి, కోచ్‌లు పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు

తిమ్మాపూర్(మానకొండూర్): అలుగునూర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్ వద్ద హిజ్రాల హల్‌చల్ దాడికి కారణమైంది. వివరాల్లోకి వెళ్తే.. అలుగునూర్‌లోని హైదరాబాద్ రాజీవ్ రహదారికి ఆనుకొని ఉన్న ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం సాయంత్రం రిసెప్షన్ జరుగుతోంది. హిజ్రాలు అక్కడికి చేరుకున్నారు. ఫంక్షన్‌హాల్ నిర్వాహకులు వారిని లోపలికి వెళ్లకుండా ఆపేయడంతో ఇరువర్గాల మధ్య గొడవ మొదలైంది. హిజ్రాలు భారీ మొత్తంలో డబ్బులు డిమాండ్ చేయడంతో నిర్వాహకులు ఆగ్రహానికి గురయ్యారు. తోపులాట జరిగి, దాడులు చేసుకున్నారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. సోమవారం హిజ్రాల ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రమోద్ రెడ్డి తెలిపారు. కాగా ప్రతీసారి ఫంక్షన్‌హాల్‌కు వచ్చి, హిజ్రాలు ఇష్టారీతిలో వ్యవహరిస్తున్నందునే తాము ఆగ్రహం వ్యక్తం చేశామని నిర్వాహకులు తెలిపారు. గతంలో పోలీసులు సైతం పలుమార్లు హెచ్చరించారని పేర్కొన్నారు. ఈ విషయమై మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతి

- దేశరాజ్‌పల్లిలో ఘటన
- హత్య కోణంలో విచారణ జరుపుతున్న పోలీసులు


అనిత (ఫైల్)


మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

రామడుగు(చొప్పదండి): దేశరాజ్‌పల్లిలో ఓ వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దేశరాజ్‌పల్లికి చెందిన మామిడిపల్లి అనిత(45)కు భర్త లచ్చయ్య, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. లచ్చయ్య సెంట్రింగ్ పని కోసం కరీంనగర్ వెళ్లాడు. అక్కడి నుంచి భార్యకు సోమవారం పలుమార్లు ఫోన్ చేశాడు. స్పందన లేకపోవడంతో మధ్యాహ్నానికి ఇంటికి వచ్చాడు. ఇంటికి గొళ్లెం పెట్టి ఉండటంతో పక్కంటికి వెళ్లిందనుకొని చూశాడు. చాలా సమయం అవుతున్నా రాకపోవడంతో అనుమానం వచ్చి, గొళ్లెం తీసి చూడగా అనిత బెడ్‌పై చనిపోయి ఉంది. వెంటనే అతను రామడుగు పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు అనిత మృతి విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశారు. దీంతో కరీంనగర్ రూరల్ ఏసీపీ కరుణాకర్ రావు, చొప్పదండి సీఐ రవీందర్, రామడుగు ఎస్సై అంజయ్యలు చేరుకొని, మృతదేహాన్ని పరిశీలించారు. ఈ సంఘటనపై ఏసీపీ కరుణాకర్‌రావు మాట్లాడుతూ.. అనిత హత్యకు గురైనట్లు భావిస్తున్నామని, ఆ కోణంలోనే విచారణ చేస్తున్నట్లు తెలిపారు. పోస్టుమార్టం నివేదిక రాగానే పూర్తి విషయం తెలుస్తుందన్నారు. త్వరలో కేసు విచారణ పూర్తి చేసి, వివరాలను వెల్లడిస్తామన్నారు.

దళితుల హక్కులను కాపాడుకోవాలి



మాట్లాడుతున్న ఏసురత్నం

కరీంనగర్: రాజ్యాంగంలోని చట్టాలను ఉల్లంఘిస్తూ దళితుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై దళితులంతా ఐక్య ఉద్యమాలు నిర్వహించి హక్కులను కాపాడుకోవాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఏసురత్నం పిలుపునిచ్చారు. సోమవారం బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో జిల్లా అధ్యక్షుడు బోయిని తిరుపతి అధ్యక్షతన జరిగిన డీహెచ్‌పీఎస్ జిల్లా రెండో మహాసభలో పాల్గొన్నారు. ముందుగా డీహెచ్‌పీఎస్ పతాకాన్ని అశోక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏసురత్నం మాట్లాడుతూ, కేంద్రంలో బీజేపీ రెండోసారి అధికారంలోకి వచ్చాక మతోన్మాదం పెరిగిపోయిందన్నారు. దళితులు, బడుగు,బలహీన వర్గాలు, మహిళలు, మైనార్టీలు, మేధావులపై దాడులు, హత్యలు ఎక్కువయ్యాయని, అంబేద్కర్ రచించిన రాజ్యాంగంలోని చట్టాలను ఉల్లంఘిస్తూ వాటిని మార్చాలనే కుట్ర చేస్తున్నారన్నారు. దేశంలో మనువాద సిద్ధాంతాన్ని తిరిగి తీసుకవచ్చే ప్రమాదం ఉందని, దానిని తిప్పికొట్టేందుకు దళిత, బహుజనులు ఏకమై ఐక్య ఉద్యమాలు నిర్వహించాలన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి మాట్లాడుతూ, కేంద్రం, రాష్ట్రంలో దళితుల సంక్షేమాన్ని మరచిన పాలకులను నిలదీయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు తాళ్లపెల్లి లక్ష్మణ్, బత్తుల బాబు, గంగిపెల్లి శంకర్, బోయిని పటేల్, బ్రామండ్లపెల్లి యుగేందర్, మంద సుదర్శన్, పర్లపెల్లి రమేష్, గుంటుక తిరుపతి, శనిగరం లక్ష్మణ్, అనిల్, సురేష్, వెంకటేశ్వర్లు, కొమురయ్య, లక్ష్మయ్య, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని విస్మరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం


దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

కరీంనగర్: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా విస్మరిస్తుందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి అన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కమాన్ చౌరస్తాలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేద, మధ్యతరగతి విద్యార్థులు ఉన్నత విద్య చదివేందుకు బాసటగా నిలుస్తున్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను నిర్వీర్యం చేసేలా ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. ఫీజురీయింబర్స్‌మెంట్ ఆధారంగా చదివి ఫీజులు కట్టలేక, సర్టిఫికెట్లు తీసుకోక విద్యార్థులు ఉన్నత చదువులకు వెళ్లలేకపోతున్నారని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్‌కు ఎన్నికల మీద ఉన్న శ్రద్ధ, ఓట్లు, సీట్లపై ఉన్న ప్రేమ విద్యార్థుల సంక్షేమంపై లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని లేకుంటే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులను ఏకం చేసి పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రామారపు వెంకటేష్, రమేష్, సాగర్, సందీప్‌రెడ్డి, వినయ్‌రెడ్డి, సాయిక్రిష్ణ, అశోక్, హనీ, అభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు అమలు చేయండి


ధర్నా చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, నాయకులు

కరీంనగర్: గ్రామ పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్ మాట్లాడుతూ, గ్రామ సర్పంచ్ నుంచి ముఖ్యమంత్రి స్థాయి వరకు జీతాలు పెంచుకున్నారని, కానీ గ్రామాలను శుభ్రం చేసే కార్మికులకు జీతాలు పెంచకుండా, ఉన్నవాటిని ఇవ్వకుండా నెలల తరబడి పెండింగ్ పెడుతూ వారి శ్రమను దోచుకుంటున్నారని మండిపడ్డారు. సఫాయి కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని ఆరోపించారు. వెంటనే పెండింగ్ జీతాలు చెల్లించాలని లేకుంటే నిరవధిక సమ్మెకు వెళ్తామని స్పష్టం చేశారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పుల శంకర్ మాట్లాడుతూ, గత కొన్నేళ్లుగా గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత లేకపోవడం వల్ల సర్పంచులు, అధికారులు వేధింపులకు గురిచేస్తూ అదనపు పనిభారం మోపుతున్నారని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలన్నారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు పరిష్కారం అయ్యేవరకు దశలవారీగా ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాచర్ల మల్లేశం, ఎండిగా రవీందర్‌రావు, ఎడవెల్లి సంపత్, పేరుగు అశోక్, మ్యాకం మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

పేద మహిళకు ఉచితంగా కీలు మార్పిడి


మాట్లాడుతున్న డాక్టర్ బీఎస్ రావు

కరీంనగర్‌టౌన్: బీఎస్ రావు హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఓ నిరుపేద మహిళకు ఉచితంగా రెండు మోకాళ్లకు కీలు మార్పిడి శస్త్రచికిత్స చేశారు. సోమవారం ఆదర్శ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు, ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ బీఎస్ రావు సంబంధిత వివరాలు వెల్లడించారు. హుజూరాబాద్ మండలంలోని సింగాపూర్ గ్రామానికి చెందిన నిరుపేద మహిళ లక్ష్మీనర్సమ్మ కొన్నేళ్లుగా మోకాళ్ల నొప్పులతో బాధ పడుతోంది. ఎన్ని ఆసుపత్రులు తిరిగినా నయం కాలేదు. చివరికి డాక్టర్ బీఎస్ రావును సంప్రదించింది. ఆమెను పరీక్షించిన వైద్యులు రెండు మోకాళ్లు పూర్తిగా అరిగిపోయినట్లు గుర్తించారు. రెండింటికీ కీలు మార్పిడి చేయాలంటే సుమారు రూ.3 లక్షలు ఖర్చవుతుందని తెలిపారు. అయితే ఆర్థిక స్తోమత లేని లక్ష్మీనర్సమ్మకు తన ఫౌండేషన్ తరఫున కీలు మార్పిడి శస్త్రచికిత్స ఉచితంగా చేయించేందుకు నిర్ణయించినట్లు బీఎస్ రావు తెలిపారు. ఆదర్శ ఆసుపత్రి నిర్వాహకులు, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ సత్యనారాయణరెడ్డి సహకారంతో మూడు రోజుల వ్యవధిలో రెండు మోకాళ్లకు శస్త్రచికిత్స చేసినట్లు వెల్లడించారు. ఆమె ఆరోగ్యం పూర్తిగా మెరుగుపడి, స్వతహాగా నడుస్తోందని పేర్కొన్నారు. తనకు ఉచితంగా కీలు మార్పిడి శస్త్రచికిత్స చేసిన బీఎస్ రావు హెల్త్ ఫౌండేషన్‌కు లక్ష్మీనర్సమ్మ కృతజ్ఞతలు తెలిపారు. తాను నడుస్తున్నందుకు సంతోషం వ్యక్తం చేసింది. సమావేశంలో ఐఎంఏ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ వెంకట్‌రెడ్డి, ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ అలీం, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ అనిల్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లిక్కర్ స్కాంలో బీఆర్ఎస్ నాయకుల హస్తం

- వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ నగేశ్


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నగేశ్, నాయకులు

విద్యానగర్(కరీంనగర్): లిక్కర్ స్కాంలో ఎమ్మెల్సీ కవితతోపాటు బీఆర్ఎస్ నాయకుల హస్తం ఉందని వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కె.నగేశ్ ఆరోపించారు. సోమవారం కరీంనగర్‌లోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లిక్కర్ స్కాంలో కవితతోపాటు బీఆర్ఎస్ పార్టీ బడా నాయకుల ప్రమేయం ఉండటం వల్లే అందరూ కలిసి ఢిల్లీ వెళ్లారన్నారు. స్కాంలో ఇరుకున్న బిడ్డను కాపాడుకోవడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ తెగ ఆరాటపడుతున్నాడని, ఇందుకోసం అధికార దుర్వినియోగం చేస్తున్నాడని పేర్కొన్నారు. లిక్కర్ స్కాంలో కవిత పాత్ర గురించి సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులు స్పందించకపోవడం చూస్తుంటే నిజంగానే ఇందులో కవిత పాత్ర పెద్దదే అన్న విషయం స్పష్టవుతోందన్నారు. రాష్ట్ర ప్రజల కోసం అంటూ విచిత్ర పథకాలను తీసుకువస్తున్న కేసీఆర్ ఇంటింటికీ మద్యం, వాడవాడకూ బెల్ట్‌షాపు అమలు చేసినా ఆశ్చర్యం లేదని ఎద్దేవా చేశారు. నాయకులు శివరాం, ఎండీ.మీరజ్, ఊకంటి రవీందర్‌రెడ్డి, దీనాదేశాయి, శ్రీనివాస్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

చేలల్లో విద్యుత్ తీగలు అమర్చితే జైలుకే

- సీఐ రమేశ్
- స్వామిరెడ్డి మృతికి కారణమైన నలుగురి అరెస్టు



చిగురుమామిడి: పంట చేలకు విద్యుత్ తీగలు అమర్చి, ప్రాణనష్టం కలిగిస్తే ఎంతటివారినైనా జైలుకు పంపిస్తామని తిమ్మాపూర్ సీఐ పి.రమేశ్ హెచ్చరించారు. సోమవారం చిగురుమామిడి పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై దాస సుధాకర్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ఆదివారం పీచుపల్లి గ్రామానికి చెందిన గూడూరి స్వామిరెడ్డి పత్తి చేనులో అడవి పందుల కోసం విద్యుత్ తీగను అమర్చి, ఆయన మృతికి కారకులైన చిన్నముల్కనూర్‌కు చెందిన లోకిని రాములు, లోకిని సంపత్, తిమ్మాపూర్ మండలంలోని పర్లపల్లికి చెందిన భూనాద్రి ఐలయ్య, కెమ్మసారం సంపత్‌లను అరెస్టు చేసినట్లు తెలిపారు. వారిని కోర్టులో హాజరుపరిచి, రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

సాలెహ్‌నగర్ సమస్యలు పరిష్కరించాలి



సాలెహ్‌నగర్‌వాసులతో మాట్లాడుతున్న రోహిత్‌రావు

కొత్తపల్లి: కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలోని 18వ డివిజన్‌లో ఉన్న సాలెహ్‌నగర్ సమస్యలు పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ నాయకుడు మెనేని రోహిత్‌రావు అన్నారు. మంగళవారం రాత్రి సాలెహ్‌నగర్‌లో పర్యటించి ప్రజలతో సమస్యలపై చర్చించారు. ప్రధానంగా నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కరించడంలో పాలకులు విఫలమయ్యారని విమర్శించారు. మిషన్ భగీరథ పేరుతో ఇంటింటికీ నీరంటూ చెప్పిన పాలకులకు ఇక్కడి సమస్య కనిపించడం లేదా అని నిలదీశారు. రాజకీయ ప్రకటన మీదున్న శ్రద్ధ అభివృద్ధిపై బీఆర్ఎస్ నాయకులకు ఎందుకు లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ డివిజన్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలు

కరీంనగర్: ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలను నగరంలోని తెలంగాణ చౌక్ వద్ద సోమవారం భారత జాగృతి జిల్లా అధ్యక్షుడు జాడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మేయర్ సునీల్‌రావు పాల్గొని కేక్ కట్ చేశారు. భారత జాగృతి రాష్ట్ర కార్యదర్శి అనంతరావు, స్టూడెంట్ ప్రెసిడెంట్ రాజీ, యూత్ ప్రెసిడెంట్ ఉయ్యాల విష్ణు, జిల్లా కో కన్వీనర్ సంతోష్, తదితరులు పాల్గొన్నారు.అలాగే ఎస్‌ఏపీ టైలరింగ్ ట్రైనింగ్ సెంటర్‌లో మేరు సంఘం జిల్లా అధ్యక్షుడు, పెండ్యాల మహేశ్‌కుమార్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి మహిళలకు స్వీట్లు పంపిణీ చేశారు.

ఆయుష్మాన్ భారత్ కార్డుల పంపిణీ



కరీంనగర్‌టౌన్: నగరంలోని కిసాన్‌నగర్ 25వ వార్డులో సోమవారం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్‌భారత్, ఈ–శ్రామ్ కార్డులను బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌కుమార్ సోమవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. దేశంలోని పేదలకు ఉచితంగా వైద్యం అందించేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకం అమలు చేస్తోందని అన్నారు. అలాగే కార్మికుల భద్రత కోసం ఈ–శ్రమ్ లాంటి పథకాలు వరం లాంటిదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు చేలోజు చీటి బాబు, కైలాష్ నవీన్, పైడి ప్రసాద్, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.


పరామర్శ



గోపాల్‌ను పరామర్శిస్తున్న వినోద్‌కుమార్

కరీంనగర్‌కల్చరల్: వ్యాఖ్యాత, రచయిత మాడిశెట్టి గోపాల్ తల్లి అమృతమ్మ ఇటీవల మరణించగా సోమవారం గోపాల్‌ను రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్, మేయర్ సునీల్‌రావు, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు, కార్పొరేటర్ తోట రాములు పరామర్శించారు. అమృతమ్మ చిత్ర పటం వద్ద పూలు సమర్పించి నివాళులర్పించారు.

ఆస్కార్ ఆర్‌ఆర్‌ఆర్ సైకత శిల్పం



కరీంనగర్ కల్చరల్: కరీంనగర్‌లోని మంకమ్మతోటకు చెందిన సైకత శిల్పి రేవెల్లి శంకర్ సోమవారం తన నివాసంలో ఆస్కార్ ఆర్‌ఆర్‌ఆర్ సైకత శిల్పం రూపొందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్‌ఆర్‌ఆర్ చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు పాటకు, అందులో తెలంగాణ బాణీకి గౌరవం దక్కడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

ఆటల సందడి

- మల్కాపూర్ హైస్కూల్‌లో కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి క్రీడలు ప్రారంభం
- బాల, బాలికలకు వేర్వేరుగా పోటీల నిర్వహణ
- పాల్గొంటున్న 20 జట్లు



కబడ్డీలో తలపడుతున్న బాలికలు



ఖోఖో ఆడుతున్న బాలికలు

కొత్తపల్లి: ఫిజికల్లీ ఫిట్.. మెంటల్లీ పీస్‌ఫుల్.. మోరల్లీ అలర్ట్ ..గా ఉన్నప్పుడే విద్యార్థులు హుషారుగా కనిపిస్తారు. కరోనా మూలంగా కకావికలమైన క్రీడాంశాలను మళ్లీ విద్యార్థులకు పరిచయం చేసేందుకు పాఠశాలలు ఆసక్తి కనబర్చుతున్నాయి. రెండేళ్ల కరోనా కాలంలో ఆదరణ కోల్పోయిన ఆటలపై దృష్టి సారించారు. ఆన్‌లైన్ విద్యతో మానసికంగా, శారీరకంగా ఒత్తిడికి లోనై ప్రస్తుతం ప్రత్యక్ష తరగతులపై దృష్టి సారిస్తున్న విద్యార్థులను క్రీడల్లో సైతం ప్రోత్సహిస్తూ మేధాశక్తిని పెంచేందుకు ప్రయత్నిస్తున్నారు. శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, సామాజికంగా చురుకుదనం సాధించేందుకు క్రీడలు ఒక్కటే మార్గమని భావించి విద్యార్థులను ఆ దిశగా ప్రోత్సహిస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు విద్యతో పాటు క్రీడాంశాల్లో రాణించడం ద్వారా ఉజ్వల భవిష్యత్‌తో పాటు చక్కని కీర్తి ప్రతిష్టలు వస్తాయన్న అవగాహన కల్పించేందుకు ప్రభుత్వ పాఠశాలలు ప్రయత్నిస్తున్నాయి. ఈ దశలోనే కొత్తపల్లి మండలం మల్కాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కరీంనగర్ నియోజకవర్గ క్రీడా పోటీలకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు మల్కాపూర్‌కు చెందిన దాత కాసర్ల జీవన్‌రెడ్డి తన తండ్రి కాసర్ల సుధాకర్‌రెడ్డి స్మారకార్థం క్రీడా టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నారు. ఇదివరకే సుమారు రూ.12 లక్షలతో పాఠశాలకు మరమ్మతు చేపట్టి రంగులు వేయించిన ఆయన క్రీడా పోటీలు నిర్వహించి తన ఉదారతను చాటుతున్నారు. రెండు రోజులు పాటు ఖోఖో, కబడ్డీ క్రీడాంశాల్లో బాల, బాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తున్నారు. తొలిరోజు సోమవారం ఖోఖో, కబడ్డీ క్రీడల్లో బాలికలకు పోటీలు నిర్వహించగా మంగళవారం బాలురకు పోటీలు జరగనున్నాయి.

బాల బాలికలకు వేర్వేరుగా..

మల్కాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న కరీంనగర్ నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో కరీంనగర్ అర్బన్, కరీంనగర్ రూరల్, కొత్తపల్లి మండలాల నుంచి బాల, బాలికలకు వేర్వేరుగా పది జట్ల చొప్పున 20 జట్లు పాల్గొంటున్నాయి. కరీంనగర్ ఓల్డ్ హైస్కూల్, సప్తగిరికాలనీ, మొగ్దుంపూర్, నగునూర్, చామన్‌పల్లి, చెర్లభూత్కూర్, ఎలగందుల, చింతకుంట, కొత్తపల్లి, మల్కాపూర్ ప్రభుత్వ పాఠశాలల జట్లు ఈ పోటీల్లో తలపడుతున్నాయి. చాలా రోజుల తర్వాత ప్రభుత్వ పాఠశాలలో క్రీడా టోర్నమెంట్ జరుగుతుండటంతో పండుగ వాతావరణం నెలకొంది. వేర్వేరు పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరవ్వడంతో వారి స్థితిగతులు, విద్యా ప్రమాణాలపై చర్చించుకోవడం, పరిచయం ఏర్పడటంతో పాటు స్నేహభావం పెంపొందించుకునేందుకు చక్కని వేదికగా నిలిచింది. అయితే క్రీడాంశాల్లో విద్యార్థులకు సరైన శిక్షణ లేక కొంత ఆటల్లో తడబాటు చెందడం కనిపించింది. ఈ పోటీల ప్రారంభోత్సవంలో హెచ్‌ఎంలు స్వదేశీకుమార్, అశోక్‌రెడ్డి, సర్పంచ్ కొట్టె జ్యోతి, ఎంపీటీసీ నర్సవ్వ, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సామర్థ్యం పెంచేందుకు..



ప్రస్తుత పరిస్థితుల్లో సోషల్ మీడియాకు అలవాటుపడ్డ విద్యార్థుల దృష్టి మరల్చి గ్రామీణ క్రీడల వైపు మళ్లిస్తూ వారిలోని క్రీడాసామర్థ్యాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నాం. కరీంనగర్ నియోజకవర్గ క్రీడా పోటీలు నిర్వహించడం తనకెంతో ఆనందంగా ఉంది. విద్యతో పాటు క్రీడల్లో రాణించేలా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నాం. క్రీడలతో మానసిక, శారీరక దారుఢ్యం, పోటీతత్వం, స్నేహభావం పెంపొందుతుంది.

–స్వదేశీ కుమార్, హెచ్‌ఎం, మల్కాపూర్

చదువుతోనే ఉజ్వల భవిష్యత్



పేద విద్యార్థులు సమాజంలో రాణించాలంటే చదువు ఒక్కటే ప్రధానం . చక్కగా చదువుకుంటేనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుంది. తల్లిలాంటి ఊరు రుణం తీర్చుకునేందుకు మల్కాపూర్ పాఠశాల విద్యార్థులకు తోచిన సాయం అందిస్తున్నా. విద్యతో పాటు క్రీడల్లో రాణించడం వల్ల కీర్తి ప్రతిష్టలు వస్తాయని గుర్తు చేసేందుకు ఈ క్రీడాపోటీలు నిర్వహిస్తూ బహుమతులు అందిస్తున్నా.

– కాసర్ల జీవన్‌రెడ్డి, వ్యాపారవేత్త

శిక్షణ ఉంటే రాణించవచ్చు



పాఠశాల స్థాయిలో క్రీడల్లో శిక్షణ ఇస్తే రాణించవచ్చు. కరోనా వల్ల క్రీడలపై ఆదరణ తగ్గింది. మానసిక ప్రశాంతత పొందేందుకు క్రీడలు దోహదపడతాయి. వాటిపై మరింతగా ప్రభుత్వం దృష్టి సారించాలి. పేద విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి క్రీడాంశాలు పునాది కానున్నాయి.

– తేజశ్విని, మొగ్దుంపూర్

పోటీతత్వాన్ని పెంపొందిస్తాయి



క్రీడలు పోటీ తత్వాన్ని పెంపొందిస్తాయి. మల్కాపూర్ పాఠశాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతున్న దాత జీవన్‌రెడ్డికి అభినందనలు. ఎన్నో వ్యయప్రయాసాలకోర్చి పాఠశాలను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దడంతో పాటు తమలోని ప్రతిభను వెలికితీయడానికి క్రీడా పోటీలు నిర్వహిస్తున్న ఆయనకు రుణపడి ఉంటాం.

– సీహెచ్ వినయ్, మల్కాపూర్

పవర్‌కట్ ప్రాంతాలు



కొత్తపల్లి: కరీంనగర్‌లో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు కొనసాగుతున్నందున మంగళవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 11 కేవీ ఇండస్ట్రియల్/పద్మనగర్ ఫీడర్ పరిధిలోని పద్మనగర్, ప్రాస్టాఫ్, ఇండస్ట్రియల్, ప్రగతినగర్, సాయిబాబా ఆలయం ప్రాంతాలు, 11 కేవీ గోదాంగడ్డ, రామచంద్రాపూర్ కాలనీ ఫీడర్ల పరిధిలోని శ్రీనగర్‌కాలనీ, గోదాంగడ్డ, సప్తగిరికాలనీ, భగత్‌నగర్, రామచంద్రాపూర్‌కాలనీ, గోదాం వెనుక ప్రాంతాలతో పాటు 11కేవీ ఆటోనగర్ ఫీడర్ పరిధిలోని అంబేడ్కర్ స్టేడియం, తిరుమల్‌నగర్, హనుమాన్‌నగర్, గణేశ్‌నగర్, కమాన్, దోబీవాడ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–2 ఏడీఈ ఎం.సుధీర్ కుమార్ తెలిపారు. అదేవిధంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 11 కేవీ డాక్టర్స్ స్ట్రీట్, కమాన్ ఫీడర్ల పరిధిలోని గాంధీరోడ్, శనివారం మార్కెట్, సాయినగర్, శర్మనగర్, డాక్టర్ రమణాచారి ఆసుపత్రి లేన్, గాయత్రీనగర్, షాషామహల్, లక్ష్మీనగర్, కోతిరాంపూర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–1 ఏడీఈ ఎస్.నరేందర్ పేర్కొన్నారు.

నేచర్‌క్యూర్ ఫీడర్ పరిధిలో..

విద్యుత్ మరమ్మతు పనులు చేపడుతున్నందున మంగళవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు బొమ్మకల్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ నేచర్ క్యూర్ ఆసుపత్రి ఫీడర్ పరిధిలోని బైపాస్ రోడ్ బ్రిడ్జి, విజయనగర్ కాలనీ, ప్రియదర్శినికాలనీ, రజ్వీచమన్, సిరిపురంకాలనీ, సిటిజన్ కాలనీ, కిసాన్‌నగర్, ఆటోనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కరీంనగర్ రూరల్ ఏడీఈ కొలుపుల రాజు తెలిపారు.

‘కంటివెలుగు’ను సద్వినియోగం చేసుకోవాలి



కంటి వెలుగు శిబిరం ప్రారంభిస్తున్న ఎంపీపీ శ్రీలత

కొత్తపల్లి: అంధత్వ నివారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పిల్లి శ్రీలత మహేష్ అన్నారు. కొత్తపల్లి మండలం కమాన్‌పూర్‌లో 9 రోజుల పాటు జరిగే కంటి వెలుగు శిబిరాన్ని సోమవారం ప్రారంభించారు. ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేని మధు, సర్పంచ్ సంపత్, శిబిరం ఇన్‌చార్జి వైద్యుడు శ్రీకాంత్, ఏఎన్ఎంలు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆడపిల్లలు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న సీడీపీవో ఉమారాణి

కొత్తపల్లి: సామాజిక మాధ్యమాలు, అసాంఘీక శక్తుల పట్ల ఆడపిల్లలు అప్రమత్తంగా ఉండాలని కరీంనగర్ అర్బన్ సీడీపీవో ఉమారాణి అన్నారు. కొత్తపల్లి మండలం చింతకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం కరీంనగర్‌అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహించిన బేటీ బచావో..బేటి పడావో కార్యక్రమంలో పలు అంశాలను బాలికలకు వివరించారు. వాట్సప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, షేర్‌చాట్, స్నాప్‌షాట్ వంటి సామాజిక మాధ్యమాల్లో వస్తున్న ఫొటోలు, వీడియోలకు ఆకర్షితులవుతూ తప్పుదారిన పడొద్దన్నారు. టీవీల్లో వచ్చే సన్నివేశాలను ఊహించుకుంటూ ప్రేమ పేరుతో జీవితాలను నాశనం చేసుకోవద్దని తెలిపారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మార్గదర్శకత్వంలో చక్కగా చదువుతూ ఉన్నత స్థానాల్లో నిలిచేందుకు ప్రయత్నించాలని తెలిపారు. బాలికలు ఆపదలో ఉన్నప్పుడు హైల్ప్‌లైన్ నంబర్లు 1098, 181ను సంప్రదించాలని సూచించారు. హెచ్‌ఎం భూంరెడ్డి అధ్యక్షతన జరిగిన సదస్సులో సూపర్‌వైజర్ రాజమణి, ఎమ్మెస్కే శైలజ, డీసీపీవో శాంత, పోషణ అభియాన్ సతీశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

‘బండి సంజయ్‌పై విమర్శలు తగవు’



మాట్లాడుతున్న బాల్‌రెడ్డి

కరీంనగర్‌టౌన్: బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్సీ కవితను ఈడీ విచారిస్తే టీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు, మహిళా నాయకురాళ్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌పై విమర్శలు చేయడం తగదని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి అన్నారు. సోమవారం రేకుర్తిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తప్పు చేసిన వారు అవసరమైతే జైలుకు కూడా వెళ్లక తప్పదని అన్నారు. సీఎం కేసీఆర్, మంత్రులు, కవిత సంపాదనే ధ్యేయంగా అవినీతికి పాల్పడుతూ బీజేపీపై నిందలు వేయడం తగదన్నారు. ఈ విలేకరుల సమావేశంలో నాయకులు ఎడమ సత్యనారాయణరెడ్డి, గోదావరి నరేశ్, కేసాపురం ఆంజనేయులు, రాములు తదితరులు పాల్గొన్నారు.



అలంకారప్రాయంగా వీల్‌చైర్



చేతులతో నడుస్తూ వచ్చిన సత్యనారాయణ

దివ్యాంగులకు సేవలేవీ?

దివ్యాంగుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన వీల్‌చైర్లు అలంకారప్రాయంగా మిగిలాయి. ప్రజావాణికి వచ్చే దివ్యాంగులకు ఇబ్బంది కలుగకుండా ఉన్నతాధికారుల వద్దకు చేర్చేందుకు వీల్‌చైర్లను ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా సిబ్బందిని కేటాయించారు. సోమవారం నగరానికి చెందిన పెద్దంపాటి సత్యనారాయణ నడవలేని పరిస్థితి చేతులతో నడుస్తూ రాగా 'సాక్షి' చొరవతో వీల్‌చైర్‌ను సమకూర్చారు. తనకెవరూ లేరని వికలాంగుల ఆశ్రమంలో చేర్చాలని ప్రజావాణిలో వాపోయారు.

- కరీంనగర్ అర్బన్

అర్బన్ హెల్త్ సెంటర్స్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం ఇస్తున్న సిబ్బంది

కరీంనగర్‌టౌన్: 20 ఏళ్లుగా కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేస్తున్న అర్బన్ హెల్త్ సెంటర్ సిబ్బంది సమస్యల పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా వైద్యాధికారికి వినతిపత్రం సమర్పించారు. సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ అర్బన్ హెల్త్ సెంటర్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఈనెల 18న విధులు బంద్ చేసి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. జీవో 16 ప్రకారం ఎలాంటి షరతులు, పరీక్షలు లేకుండా రెగ్యులరైజేషన్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎడ్ల రమేశ్, రమాదేవి, బొలవేని రాజు తదితరులు పాల్గొన్నారు.

‘అర్హులకే ఇళ్లు కేటాయించాలి’

విద్యానగర్(కరీంనగర్): అల్గునూరులో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను అర్హులకే కేటాయించాలని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి గూడ కనుకయ్య, తెలంగాణ అంబేడ్కర్ సంఘం ఉపాధ్యక్షుడు సిరిసిల్ల నర్సయ్య, అంబేడ్కర్ సంఘం అల్గునూర్ అధ్యక్షుడు తాటిపెల్లి శంకర్, నాయకులు సిరిసిల్ల చంద్రయ్య, నారాయణ డిమాండ్ చేశారు. సోమవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో వారు మాట్లాడుతూ డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపుల్లో అనేక అవకతవకలు జరిగాయని వెంటనే వాటిని సవరించి అర్హులకు కేటాయించాలన్నారు.

బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

మానకొండూర్: వేగురుపల్లిలో భూలక్ష్మి,మహాలక్ష్మి, బొడ్రాయి ప్రతిష్టాపన మహోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మహిళలు గ్రామ దేవతల విగ్రహాలకు జలాభిషేకం చేశారు. ఎంపీపీ ముద్దసాని సులోచన–శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్ కనుకుంట్ల సంగీత–అభిలాష్ , ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్ — డ్రెయినేజీ నిర్మించాలి



నగర శివారులోని తీగలగుట్టపల్లిలో రోడ్డు ఒక పక్కనే డ్రెయినేజీలు కట్టి మరో పక్క డ్రెయినేజీలు నిర్మించకపోవడంతో మురుగు నీరు నిలిచి దుర్వాసన వస్తోంది. డ్రెయినేజీ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

ప్రశ్నించాల్సిన అధికారి : ఇస్లావత్ సేవా, మున్సిపల్ కమిషనర్, కరీంనగర్
సెల్ నంబర్ : 98499 05876

క్రీడలు వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేస్తాయి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కృష్ణారెడ్డి

జమ్మికుంట: క్రీడలు వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేస్తాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. ఖేలో కరీంనగర్, జీతో కరీంనగర్ కార్యక్రమంలో భాగంగా సోమవారం జమ్మికుంటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో క్రికెట్ పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యువతలో క్రీడా ప్రతిభను ఆవిష్కరించేందుకు ప్రధాని మోదీ సూచన మేరకు దేశ వ్యాప్తంగా ప్రతి పార్లమెంట్ పరిధిలో క్రీడా మహోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో క్రీడా పోటీల కన్వీనర్ వాసుదేవరెడ్డి, జిల్లా ఉపాధ్యాక్షుడు సంపత్‌రావు, నియోజకవర్గ కన్వీనర్ గౌతంరెడ్డి, జమ్మికుంట మున్సిపల్ మాజీ చైర్మన్ శ్రీనివాస్, జిల్లా మోర్చా ప్రధాన కార్యదర్శి రాజేందర్, జిల్లా కార్యదర్శి ప్రవీణ్, సింగిరెడ్డి తిరుపతిరెడ్డి, సత్యనారాయణరెడ్డి, ఎండీ షఫీ, రాజు, తిరుపతి శ్రీనివాస్, శివశంకర్, శ్రీనివాస్, రవి, రాజుకుమార్, కొండల్‌రెడ్డి, బీజేవైఎం నాయకులు సాగర్,శ్రీకాంత్, నవీన్, సురేందర్‌రెడ్డి, రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

స్వప్నకు ఝాన్సీ లక్ష్మీబాయి పురస్కారం



పురస్కారం అందుకుంటున్న స్వప్న

సప్తగిరికాలనీ(కరీంనగర్): అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా కరీంనగర్‌కు చెందిన చకిలం స్వప్న ఝాన్సీ లక్ష్మీబాయి పురస్కారం అందుకుంది. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో భారత్ ఆర్ట్స్, ఏబీసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుభకృతి నామ సంవత్సరం సందర్భంగా ఆదివారం మహిళా హక్కుల కమిషన్ సునీత లక్ష్మారెడ్డి, సప్తపది సినిమా హీరోయిన్ బమ్మిడి పాటి సవితలు ఈ పురస్కారం ప్రదానం చేశారు. మేము సైతం యువసేన ఫౌండేషన్ పేరిట సమాజంలో చేస్తున్న సేవలకు పురస్కారం దక్కింది. ఈ సందర్భంగా స్వప్న మాట్లాడుతూ ఇదే స్ఫూర్తితో భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

చొప్పదండి: పట్టణంలోని సాయిబాబా ఆలయ అభివృద్ధికి కరీంనగర్ రూరల్ మండలం ఎలబోతారంకు చెందిన చల్ల చంద్రారెడ్డి, కవిత దంపతులు సోమవారం రూ. 51,116 విరాళంగా అందించారు.

నల్లబ్యాడ్జీలతో పంచాయతీ కార్మికుల నిరసన

చిగురుమామిడి: నాలుగు నెలలుగా వేతనాలు రావడంలేదని మండలంలోని ఆయా గ్రామాల పంచాయతీ కారోబార్, సిబ్బంది యూనియన్ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. సోమవారం ఇందుర్తి గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ప్రభుత్వ తీరుపై అభ్యంతరం వ్యక్తం చేశారు. వేతనాలు రాకపోవడం వల్ల నిత్యవసరాలకు ఇబ్బందులు పడుతున్నామని రాష్ట్ర పంచాయతీ కారోబార్ సిబ్బంది యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బింగి గణేశ్ ఆరోపించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం సకాలంలో జీతాలు చెల్లించక కామారెడ్డి జిల్లా బీబీపేట్ మండలంలో పంచాయతీ కార్మికుడు కొంగరి బాబు జీపీ కార్యాలయంలోనే ఉరేసుకున్నాడని, ఇంకేంత మంది ప్రాణాలు పోతే సకాలంలో జీతాలు ఇస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో ఇందుర్తి గ్రామ కారోబార్ చెల్పూరి శంకరాచారి, సిబ్బంది బుర్కి లక్ష్మణ్, చింతపూల లక్ష్మణ్, సంపత్, రాయమల్లు, వీరయ్యలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

చందాదారుల సొమ్ముతో దందా!

మొదటి పేజీ తరువాయి



వివరాలు వెల్లడిస్తున్న సీఐడీ అదనపు డీజీ సంజయ్. చిత్రంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ రామకృష్ణ

చెల్లిస్తున్న సొమ్ముకు ఎలాంటి భద్రతా లేదు' అని పేర్కొన్నారు. సోమవారం వెలగపూడిలోని సచివాలయంలో వారు సంయుక్తంగా విలేకరులతో మాట్లాడుతూ మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాలను వివరించారు.

■ చిట్‌ఫండ్ చట్టం సామాజిక, ఆర్థికపరమైన చట్టమని సుప్రీంకోర్టు గతంలోనే స్పష్టం చేసింది. చందాదారుల హక్కుల పరిరక్షణ, చిట్‌ఫండ్ కంపెనీల్లో ఆర్థిక క్రమశిక్షణ కోసమే ఈ చట్టం చేశారని పేర్కొంది. చిట్‌ఫండ్స్ చట్టం–1982 ప్రకారం చిట్‌ఫండ్ కంపెనీ బ్రాంచిలోని మేనేజర్ (ఫోర్‌మేన్) చందాదారులు చెల్లించే సొమ్ముకు పరిరక్షకుడు. చిట్స్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ పర్యవేక్షకుడు. ■ బ్యాంక్ లావాదేవీల నిర్వహణ, నిధుల చెల్లింపులన్నీ ఫోర్‌మేన్ నిర్వహించాలి. రాష్ట్రంలో మార్గదర్శి చిట్‌ఫండ్స్‌కు ఉన్న 37 బ్రాంచీల్లో ఏడు బ్రాంచిలో తనిఖీలు చేశాం. చందాదారులు చెల్లించిన మొత్తం అక్కడి బ్యాంకుల్లో లేదన్న విషయం అందులో వెల్లడైంది. ఆ సొమ్మంతా నిబంధనలకు విరుద్ధంగా పక్క రాష్ట్రానికి తరలించేశారు. ■ మార్గదర్శి ఫోర్‌మేన్‌కు చట్ట ప్రకారం ఉండాల్సిన చెక్ పవర్‌తోసహా ఎలాంటి అధికారాలు లేవు. బ్యాంకు వ్యవహారాలు, చెక్ పవర్ అంతా హైదరాబాద్‌లోని మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఎండీ శైలజతోపాటు ఆ సంస్థ ప్రధాన కార్యాలయంలోని 11 మందికే ఉంది. ■ ఇక్కడున్న చందాదారుల సొమ్ముల భద్రత గురించి అడిగితే తనకు తెలియదని ఫోర్‌మెన్ చెబుతున్నారు. హైదరాబాద్ వెళ్లి అడిగితే తెలంగాణలో ఉన్న ప్రధాన కార్యాలయం ఏపీ అధికారుల పరిధిలోది కాదంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన చందాదారులు చెల్లిస్తున్న డబ్బులకు బాధ్యులెవరని ప్రశ్నిస్తే సమాధానమే లేదు. సొమ్ము రాష్ట్ర ప్రజలది...పెత్తనం పక్క రాష్ట్రంలో వారిది. ■ మార్గదర్శి చిట్‌ఫండ్స్ చందాదారులకు చెందిన సొమ్ములను నిబంధనలకు విరుద్ధంగా మ్యూచువల్ ఫండ్స్, ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్స్, తమ అనుబంధ కంపెనీల్లో పెట్టుబడులుగా పెట్టారు. ఆ సంస్థ బ్యాలన్స్ షీట్, కొన్ని బ్యాంకు ఖాతాలను చార్టెడ్ అకౌంటెంట్ ద్వారా పరిశీలిస్తే ఈ విషయాలు బయటపడ్డాయి. అందుబాటులో ఉన్న కొన్ని బ్యాంకు ఖాతాలను పరిశీలించగా ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మ్యూచువల్ ఫండ్స్‌లో మూడుసార్లు రూ.29 కోట్లు, రూ.10 కోట్లు, రూ.8 కోట్లు చొప్పున, ఎడెల్‌వైజ్ ఆర్బిట్రేడ్ ఫండ్స్‌లో రూ.10 కోట్లు చొప్పున నిబంధనలకు విరుద్ధంగా పెట్టుబడులు పెట్టినట్లు వెల్లడైంది. పూర్తి బ్యాంకు ఖాతాలను పరిశీలిస్తే ఇంకా ఎన్ని పెట్టుబడులు పెట్టారో తెలుస్తుంది. ■ విశాఖపట్నం, రాజమహేంద్రవరం, విజయవాడ, గుంటూరులో మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఫోర్‌మెన్‌లను అరెస్టు చేసి న్యాయస్థానంలో ప్రవేశపెట్టాం. గుంటూరు మినహా మిగతా మూడు చోట్లా న్యాయస్థానాలు నిందితులకు రిమాండ్ విధించాయి. నిందితులపై సీఐడీ మోపిన అభియోగాలకు సంబంధించి ప్రాథమిక ఆధారాలున్నాయని రిమాండ్‌కు అనుమతిస్తూ న్యాయస్థానాలు స్పష్టం చేశాయి. సీఐడీ కేసు డైరీలో పేర్కొన్న అంశాలతో తాము సంతృప్తి చెందినట్లు, వారిని అరెస్టు చేయడం సరైనదేనని పేర్కొన్నాయి. ■ మార్గదర్శి యాజమాన్యం నిధుల ను అక్రమంగా బదిలీ చేస్తూ, చిట్స్ రిజిస్ట్రార్‌కు సహాయ నిరాకరణ కొనసాగిస్తే చందాదారుల ప్రయోజనాల పరిరక్షణ కోసం చర్యలు తీసుకుంటాం. ఇతర రాష్ట్రాల్లో ఏం చేస్తున్నారన్న అంశంతో మాకు నిమిత్తం లేదు. ఏపీ ప్రయోజనాలు, చందాదారుల సొమ్ముకు భద్రత కల్పించడమే మా విధి. ఈ కేసులో విచారణ కొనసాగిస్తాం. కేసు దర్యాప్తులో పురోగతికి అనుగుణంగా ఏ-1 చెరుకూరి రామోజీ రావు, ఏ-2 చెరుకూరి శైలజనూ విచారించడంతోపాటు ఇతర చర్యలను తగిన సమయంలో తీసుకుంటాం.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఇదో.. పోంజీ తరహా స్కామ్

మార్గదర్శి చిట్‌ఫండ్స్‌యాజమాన్యం పోంజీ స్కామ్ తరహా అక్రమాలకు పాల్పడుతోంది. చిట్టీలలో 30 శాతం నుంచి 40 శాతం టికెట్లు (సభ్యత్వాలు) యజమాన్యం పేరిట ఉంచుతోంది. ఆ టికెట్లకు చెల్లించాల్సిన చందాలను చెల్లించడం లేదు. ఇతర చందాదారులు చెల్లించిన చందాలను తాము చెల్లించినట్లు రికార్డుల్లో చూపిస్తోంది. వాటిపై మళ్లీ 5 శాతం కమీషన్ తీసుకుంటోంది. చందాదారుల సొమ్మును వ్యక్తిగత ప్రయోజనాలకు వాడుకుంటోంది.

ఇక్కడెందుకీ పిటిషన్?

మార్గదర్శిని ప్రశ్నించిన తెలంగాణ హైకోర్టు

- ఏపీలో హైకోర్టు ఉంది కదా..?
- కేసులు, దర్యాప్తు అంతా అక్కడే..
- అలాంటప్పుడు వీటిని విచారించే పరిధి ఈ కోర్టుకు ఉందా?
- దీనిపై తేలకుండా దర్యాప్తులో జోక్యం చేసుకోలేం
- విచారణ ఈ నెల 20వతేదీకి వాయిదా
- నిందితులు ఏ రాష్ట్రంలో ఉన్నా అరెస్టు అధికారం పోలీసులకు ఉంది
- వారిపై నమోదైనవి 10 ఏళ్ల పైగా శిక్ష పడే కేసులే
- ఏపీలో నమోదైన కేసుల్లో ఇక్కడ ఉపశమనం కోరలేరు
- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ న్యాయవాది వాదనలు

సాక్షి, హైదరాబాద్: 'ఆంధ్రప్రదేశ్‌లో హైకోర్టు ఉంది కదా..? మరి ఇక్కడెందుకీ పిటిషన్ దాఖలు చేశారు..?' అని మార్గదర్శి చిట్‌ఫండ్స్ యాజమాన్యాన్ని తెలంగాణ హైకోర్టు ప్రశ్నించింది. కేసులు ఏపీలో నమోదయ్యాయి.. విచారణ అధికారులూ ఏపీ వారే.. బ్రాంచ్‌లు ఉన్నది కూడా అక్కడే.. అలాంటప్పుడు ఈ పిటిషన్‌పై విచారణ జరిపే పరిధి ఈ కోర్టుకు ఉందా? అని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. దీనిపై తేలకుండా దర్యాప్తులో తాము జోక్యం చేసుకోవడం సరికాదని అభిప్రాయపడింది. ఏదేమైనా విచారణను వచ్చే సోమవారానికి వాయిదా వేస్తున్నామని, అలోగా పరిధిపై నిర్ణయిస్తామని స్పష్టం చేసింది. మార్గదర్శిపై ఏపీలో నమోదైన కేసుల దర్యాప్తులో భాగంగా అరెస్టు సహా బలవంతపు చర్యలు చేపట్టకుండా, హైదరాబాద్‌లోని తమ ప్రధాన కార్యాలయంలో తనిఖీలు నిర్వహించకుండా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్, చెరుకూరి రామోజీరావు, శైలజ తరఫున లంచ్‌మోషన్ పిటిషన్లు దాఖలయ్యాయి. దీనిపై తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి సోమవారం విచారణ చేపట్టారు. వాదనలు విన్న అనంతరం తదుపరి విచారణను ఈ నెల 20వ తేదీకి వాయిదా వేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున స్పెషల్ జీపీ గోవిందరెడ్డి, మార్గదర్శి తరఫున న్యాయవాది దుర్గాప్రసాద్ వాదనలు వినిపించారు.

అక్కడి కేసులపై.. ఇక్కడ విచారణా?

'409, 477(ఏ), 420 సహా పలు సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. ఇవన్నీ 10 ఏళ్లకు పైగా శిక్ష పడే కేసులే. కాగ్నిజబుల్ నేరాల కిందికే వస్తాయి. ఏపీలో నమోదైన కేసులపై ఇక్కడ ఉపశమనం కోరలేరు. ఈ కోర్టుకు అక్కడి కేసులపై విచారణ జరిపే పరిధి లేదు. గతంలో పిటిషన్‌పై విచారణ సందర్భంగా తెలంగాణలోని మార్గదర్శి కార్యాలయాల్లో తనిఖీలపై కోర్టు స్టే ఇచ్చింది. అయితే అప్పటికే స్వాధీనం చేసుకున్న డాక్యుమెంట్లను, రిజిస్టర్లను పరిశీలించగా అనేక అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. ఈ క్రమంలో కేసులు నమోదు చేశారు. అక్రమాలు నిగ్గు తేలినప్పటికీ కేసులు నమోదు చేయవద్దని, ఎఫ్ఐఆర్ దాఖలు చేయవద్దని కోర్టు ఉత్తర్వుల్లో ఆదేశించలేదు. చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌పై తీవ్ర ఆరోపణలున్నాయి. మొత్తం బ్రాంచ్‌లకు వారే బాధ్యులు. ఖాతాదారుల నుంచి వసూలు చేసిన నగదును మ్యూచ్‌వల్ ఫండ్స్, షేర్ మార్కెట్లలోకి అక్రమంగా మళ్లిస్తున్నారు. చట్టాలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తూ చందాదారుల హక్కులకు విఘాతం కలిగిస్తున్నారు. ఒకటి రెండు అంశాల్లో మినహా ఏపీ హైకోర్టు పరిధిలోని విషయాలపై తెలంగాణ హైకోర్టు కలుగజేసుకునే అవకాశం లేదు. ఇది ఏపీ పునర్విభజన చట్టంలో స్పష్టంగా ఉంది. ప్రత్యేకంగా ఏపీకి హైకోర్టు ఏర్పాటైన తర్వాత తెలంగాణ హైకోర్టుకు అక్కడి అంశాలపై పరిధి ఉండదని చట్టం చెబుతోంది. ఒక్క డెట్ రిలీఫ్ ట్రిబ్యునల్(డీఆర్‌టీ)కి సంబంధించి డీఆర్‌టీ-2 రాయలసీమ పరిధి వరకు జోక్యం చేసుకోవచ్చని చట్టం చెబుతోంది. కేసులు నమోదు చేసిన నేరాలన్నీ ఏపీలోనే జరిగాయి. దర్యాప్తు చేస్తున్న పోలీసులూ అక్కడి వారే. అలాంటప్పుడు అరెస్టులు చేయవద్దని ఇక్కడ కోరడం చట్ట విరుద్ధం. అసలు అలా పిటిషనే వేయలేరు. హైకోర్టుల పరిధికి సంబంధించి సుప్రీంకోర్టు కూడా పలు సందర్భాల్లో స్పష్టంగా పేర్కొంది. ఏపీ హైకోర్టు పరిధిలో కలుగజేసుకోలేమని ఇదే హైకోర్టు పలు తీర్పులను ఇచ్చింది. నిందితులు ఏ రాష్ట్రంలో ఉన్నా అరెస్టు చేసే అధికారం పోలీసులకు ఉంటుంది. అది వారికున్న చట్టబద్ధమైన అధికారం. ఏపీలో హత్య చేసి వచ్చి తెలంగాణలో దాక్కుని అరెస్టు చేయవద్దని ఇక్కడి కోర్టును కోరడం ఎలా చట్టవిరుద్ధమో.. ఇదీ అంతే' అని గోవిందరెడ్డి నివేదించారు. ''పోలీసులు హైదరాబాద్ వస్తున్నారా?'' అని న్యాయమూర్తి ప్రశ్నించగా.. ప్రాథమికంగా నేరం జరిగింది.. అక్రమాలు జరిగాయని నిరూపణ అయితే అరెస్టు చేయవచ్చని గోవిందరెడ్డి నివేదించారు. ఇదో భారీ వైట్ కాలర్ నేరమన్నారు.

ముందుగా 'పరిధి' తేలుద్దాం..

'ఖాతాదారుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదు. అయినా తనిఖీలు చేస్తున్నారు. ఎఫ్ఐఆర్‌లో ఏ-1గా రామోజీరావు, ఏ-2గా శైలజ పేర్లు చేర్చారు. మార్గదర్శి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ తెలంగాణలో నివసించడం, తెలంగాణలోని బ్రాంచ్‌ల్లోనూ తనిఖీలు చేసే అవకాశం ఉన్నందున ఈ హైకోర్టులో పిటిషన్ వేశాం. ఏపీలో పలు బ్రాంచ్ మేనేజర్లను అరెస్టు చేసి కేసులు నమోదు చేశారు. తనిఖీలపై స్టే విధిస్తూ ఇదే కోర్టు గతంలో మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ఇప్పుడు తనిఖీలు చేపడితే అది కోర్టు ఆదేశాలను ఉల్లంఘించడమే అవుతుంది' అని మార్గదర్శి తరఫు న్యాయవాది దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. ఈ సమయంలో న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ మిగతా అంశాల జోలికి ఇప్పుడు వెళ్లకుండా అసలు ఈ కోర్టుకు పరిధి ఉందా? లేదా? అన్న విషయాన్ని ముందుగా తేలుద్దామని స్పష్టం చేశారు.

+ తెలంగాణ ప్రభుత్వం తరఫున న్యాయవాది రూపేందర్ వాదనలు వినిపించారు. తెలంగాణ డీజీపీని ప్రతివాదిగా చేర్చారని, అసలు ఈ పిటిషన్ విచారణార్హం కాదన్నారు. వచ్చే సోమవారం వరకు పిటిషనర్లపై అరెస్టులు లాంటి చర్యలు తీసుకోబోమని గోవిందరెడ్డి తెలియచేయడంతో న్యాయమూర్తి విచారణను ఈ నెల 20వ తేదీకి వాయిదా వేశారు.

అవినాశ్‌పై ఎలాంటి చర్యలొద్దు

అరెస్టు సహా ఎలాంటి బలవంతపు చర్యలు చేపట్టొద్దు

- సీబీఐకి తెలంగాణ హైకోర్టు ఆదేశం.. మధ్యంతర ఉత్తర్వులు జారీ
- సునీత పిటిషన్ వెనుక సీబీఐ హస్తం ఉంది
- ఏడాది తర్వాత ఆమె మాట మార్చారు..
- ఆ అభియోగాల వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయి
- వివేకా అల్లుడు, షమీమ్ పాత్రపై సీబీఐ విచారణ చేయడం లేదు
- అన్ని అంశాలపై దర్యాప్తు సాగేలా ఆదేశించండి
- హైకోర్టులో అవినాశ్‌రెడ్డి తరపు న్యాయవాది వాదనలు



సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై వాదనలు విన్న అనంతరం అరెస్టు సహా ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోవద్దని సీబీఐని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. తాము తీర్పు వెలువరించే వరకు ఈ మధ్యంతర ఆదేశాలు అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది. వివేకా హత్య కేసులో సీబీఐ తనను విచారణకు హాజరు కావాలని ఆదేశించడంపై స్టే విధించాలని కోరుతూ అవినాశ్‌రెడ్డి తెలంగాణ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఒకవేళ విచారణ చేపట్టినా ఆడియో, వీడియో రికార్డింగ్‌తోపాటు దర్యాప్తు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా సాగేలా సీబీఐని ఆదేశించాలని అభ్యర్థించారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ సోమవారం మరోసారి విచారణ చేపట్టారు. ఎంపీ అవినాశ్‌రెడ్డి(పిటిషనర్) తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. వాదనలు విన్న న్యాయమూర్తి తీర్పు రిజర్వు చేశారు. తదుపరి విచారణపై స్టే ఇవ్వాలన్న పిటిషన్‌పైనా తీర్పు రిజర్వు చేస్తున్నట్లు న్యాయస్థానం పేర్కొంది.

రాజకీయ ఒత్తిళ్లతోనే అభియోగాలు..

'సునీత పిటిషన్ వెనుక సీబీఐ హస్తం ఉంది. కొందరు రాజకీయ నేతల ఒత్తిళ్లతోనే ఆమె పిటిషనర్ (అవినాశ్‌రెడ్డి)పై అభియోగాలు మోపారు. తన తండ్రి పిటిషనర్ గెలుపు కోసం తీవ్రంగా శ్రమించారని, ఇంటింటికి తిరిగారని హత్య జరిగిన అనంతరం కూడా చెప్పిన సునీత ఏడాది తర్వాత మాట మార్చారు. ఆ తర్వాత నుంచి పిటిషనర్‌పై ఆరోపణలు చేయడం ప్రారంభించారు. వివేకా హత్య కేసులో అల్లుడు రాజశేఖర్‌రెడ్డి, హతుడి రెండో భార్య షమీమ్ పాత్రపై సీబీఐ విచారణ సాగించడం లేదు. వివేకా 2010లో రెండో పెళ్లి చేసుకున్నారు. వారికి ఓ కుమారుడు జన్మించాడు. రెండో పెళ్లి కారణంగానే వివేకా కుటుంబంలో విభేదాలు వచ్చాయి. ఆర్థిక లావాదేవీల విషయంలో మనస్పర్థలు తలెత్తాయి. ఈ క్రమంలో తన పేరుతో ఉన్న ఆస్తులను రెండో భార్య పేరుతో రాయాలని వివేకా భావించారు. ఆస్తుల గొడవల వల్లే వివేకా హత్య జరిగింది. ఈ కేసులో రెండో పెళ్లి కూడా కీలక అంశం. సీబీఐ ఆ దిశగా విచారణ చేయాలి. వివేకాది గుండెపోటని పిటిషనర్ ఎక్కడా చెప్పలేదు. స్థానిక రాజకీయ నాయకురాలు శశికళతో పిటిషనర్ అసలు మాట్లాడనే లేదు. ఆమె కూడా ఇదే విషయాన్ని సీబీఐకి చెప్పింది. ఇదే కోర్టులో సీబీఐ దాఖలు చేసిన కౌంటర్ మీడియాలో విస్తృతంగా ప్రచారమైంది. అందులో శశికళ గురించి కూడా ప్రస్తావించారు. ఇప్పటివరకు సీబీఐ రెండు చార్జిషీట్లు దాఖలు చేసినా ఎక్కడా ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) దర్యాప్తు నివేదికను కనీసం పరిగణలోకైనా తీసుకోలేదు. నిష్పాక్షిక దర్యాప్తు చేసేలా సీబీఐని ఆదేశించాలి. పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో 14న సీబీఐ విచారణకు పిటిషనర్ హాజరుకాకుండా ఆదేశాలు ఇవ్వాలి' అని న్యాయస్థానానికి నిరంజన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

సీల్డ్ కవర్‌లో వివరాలు...

వివేకా హత్య కేసు డైరీని సీబీఐ సీల్డ్ కవర్‌లో హైకోర్టుకు సమర్పించింది. 35 మంది సాక్షుల వాంగ్మూలం, 10 డాక్యుమెంట్లు, కొన్ని ఫొటోలు, హార్డ్‌డిస్క్‌లను న్యాయస్థానం ముందు ఉంచింది. వివేకా హత్య జరిగిన ప్రాంతంలో దొరికిన లేఖ, ఎఫ్ఎస్ఎల్ నివేదికను సైతం కోర్టుకు సమర్పించింది. కేసుకు సంబంధించి ఆధారాలను ధ్వంసం చేసినట్లు పిటిషనర్‌పై ఆరోపణలున్నాయని, ఆయనపై తీవ్ర చర్యలు తీసుకోకుండా ఆదేశాలు జారీ చేయవద్దని న్యాయస్థానాన్ని సీబీఐ కోరింది. సీబీఐ కార్యాలయం ఎదుట మీడియాకు వివరాలను ఎంపీ వెల్లడించడం సరికాదని న్యాయస్థానం పేర్కొంది. ఈనెల 14న (మంగళవారం) విచారణ హాజరు నుంచి మినహాయింపు కోరే అంశంపై సీబీఐనే ఆశ్రయించాలని సూచించింది. ఈ కేసు విచారణ హైదరాబాద్‌కు బదిలీ అయిన తర్వాత పిటిషనర్ తండ్రి భాస్కర్‌రెడ్డిని కడపలో హాజరు కావాలని ఎందుకు పిలిచారని న్యాయమూర్తి సీబీఐని ప్రశ్నించారు. అయితే తాము పిలవలేదని సీబీఐ కోర్టుకు తెలిపింది. ఇదిలా ఉండగా తన మీద, తన కుటుంబంపైనా ఆరోపణలు చేశారని అందుకే ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశానని ఈ సందర్భంగా వైఎస్ సునీత కోర్టుకు నివేదించారు.

కార్మికులకు రెండేసి ఓట్లు !

- ఒకటి ఏరియా, మరొకటి కంపెనీ స్థాయిలో
- గుర్తింపు సంఘం కాల పరిమితి రెండేళ్లు
- మే తర్వాత ఎన్నికల నిర్వహణకు మొగ్గు
- రిటర్నింగ్ ఆఫీసర్‌తో కార్మిక నాయకుల చర్చలు



డిప్యూటీ లేబర్ కమిషనర్, రిటర్నింగ్ ఆఫీసర్‌తో సమావేశమైన కార్మిక సంఘాల నేతలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: సింగరేణి కార్మిక గుర్తింపు సంఘం ఎన్నికలు మే లేదా జూన్‌లో జరిగే అవకాశాలు ఉన్నాయి. గెలిచిన గుర్తింపు సంఘం కాలపరిమితి రెండేళ్లు మాత్రమే ఉండాలని కోరారు. ఈ ఎన్నికల నుంచే కార్మికులు రెండేసి ఓట్లు వేయాలని నిర్ణయించారు. ఒకటి ఏరియా, మరొకటి కంపెనీ స్థాయిలో తమ ప్రతినిధులను ఎన్నుకునేందుకు ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంటుంది. ఈ మేరకు కార్మిక సంఘాల విజ్ఞప్తి మేరకు రిటర్నింగ్ ఆఫీసర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు కీలక అంశాలు చర్చకు వచ్చాయి. సోమవారం హైదరాబాద్‌లో డిప్యూటీ లేబర్ కమిషనర్(కేంద్ర), ఎన్నికల రిటర్నింగ్ అధికారి డి.శ్రీనివాసులు 14కార్మిక సంఘాల ప్రతినిధులతో త్వరలో నిర్వహించబోయే కార్మిక గుర్తింపు సంఘం ఎన్నికల రహస్య బ్యాలెట్ పద్ధతి, ఎన్నికల నియమావళిపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కంపెనీ నుంచి జీఎం పర్సనల్, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వీ.సీతారామయ్య, అదనపు ప్రధాన కార్యదర్శి శేషయ్య, టీబీజీకేఎస్ అధ్యక్షుడు బి.వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ బి.జనక్‌ప్రసాద్, హెచ్ఎమ్మెస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్, సీఐటీయూ కార్యదర్శి మంద నర్సింహారావు, బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, తదితర సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. గత ఏడాది అక్టోబర్‌లో హైకోర్టు ఆదేశాల మేరకు ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు కార్మిక సంఘాలతో పలు అంశాలపై చర్చించారు. వచ్చే నెల 2న మరోసారి ఎన్నికల నిర్వహణపై సమావేశం కావాలని నిర్ణయించారు.

రెండేళ్ల కాలపరిమితికి పట్టు

ఎన్నికల్లో గెలిచిన సంఘం కాల పరిమితి రెండేళ్లు ఉండాలని పట్టుబట్టారు. నిర్ణీత గడువు అనేది ఎన్నికలకు ముందే స్పష్టం చేయాలని, గతంలో రెండేళ్ల వ్యవధికి గెలిచి, తర్వాత కాలపరిమితి పొడగింపు జరిగిందని, ఈ నేపథ్యంలో గుర్తింపు సంఘానికి నిర్ణీత కాల పరిమితి ఉండాలని పట్టుబట్టారు. ఎన్నికలు మే తర్వాతనే నిర్వహించాలని, ఈవీఎం పద్ధతిలో ఓటింగ్ జరపడంపై ప్రతినిధులు అభ్యంతరం తెలిపారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న రహస్య బ్యాలెట్ పద్ధతిలోనే కొనసాగించాలని కోరారు. ఇక నుంచి ప్రతీ కార్మిక సంఘాన్ని సమానంగానే చూడాలని కోరారు. కంపెనీలో రెగ్యులర్ కార్మికులతో సమానంగా కాంట్రాక్టు కార్మికులకు ఓటు హక్కు ఇవ్వాలని కోరారు. ఈ విషయం తమ పరిధిలో లేదని, యాజమాన్యం, కార్మికుల సంఘాలు చర్చించుకుని ఎన్నికల నియమావళి ప్రకారం ప్రకటించాల్సి ఉందని రిటర్నింగ్ ఆఫీసర్ స్పష్టం చేశారు.

మొదలైన ఎన్నికల కోడ్

గుర్తింపు ఎన్నికల నిర్వహణ కోసం రిటర్నింగ్ ఆఫీసర్ నియామకం నుంచే ఎన్నికల కోడ్ మొదలైనట్లుగా కార్మిక సంఘాల నాయకులు చెబుతున్నారు. గత కొంతకాలంగా సింగరేణిలో కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికలు జరపడంలో జాప్యంపై తరచూ ప్రతిపక్ష నాయకులు ఆందోళనలు చేస్తున్న విషయం తెలిసిందే. చివరకు హైకోర్టు ఆదేశాలతో దిగివచ్చిన యాజమాన్యం ఎన్నికలు నిర్వహించేందుకు సానుకూలంగా స్పందించి ఈ మేరకు ప్రక్రియ ప్రారంభించింది. కాల పరిమితి ముగిసి మూడేళ్లు అవుతున్నా ఇంకా గుర్తింపు కార్మిక సంఘంగా అధికార బీఆర్ఎస్ పార్టీ అనుబంధ కార్మిక సంఘం టీబీజీకేఎస్ అనధికారింగా కొనసాగింది. దీనిపై తీవ్ర అభ్యంతరాలు తెలుపుతూ ప్రతిపక్ష నాయకులు ఫిర్యాదులు చేశారు. ఎన్నికలు జరపకపోవడంతో కొన్ని కీలక నిర్ణయాల్లో టీబీజీకేఎస్‌కే యాజమాన్యం ప్రాధాన్యత ఇచ్చింది. తాజాగా ఎన్నికలు వచ్చే రెండు నెలల్లో జరగనున్న నేపథ్యంలో నాయకులు గనులపై తమ ప్రచారంలో మరింత దూకుడు పెంచారు.

కరీంనగర్ డెయిరీ కొత్త రుచులు..!

- మార్కెట్‌లోకి 16 రుచుల ఐస్‌క్రీమ్ విడుదల



ఉత్పత్తులను ఆవిష్కరిస్తున్న బోయినపల్లి వినోద్‌కుమార్

కరీంనగర్ అర్బన్: ఉత్పత్తులను ఎప్పటికప్పుడు విస్తరిస్తున్న కరీంనగర్ మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న తన డెయిరీ పార్లర్లలో ఐస్‌క్రీం విక్రయాలను ప్రారంభించిందని రాష్ట్ర ప్రణాళిక మండలి వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్ తెలిపారు. సోమవారం కరీంనగర్‌లోని డెయిరీలో ఉత్పత్తులను ప్రారంభించారు. డెయిరీ బిస్కెట్లు, రస్క్ బిస్కెట్లు, మనైర్ పెరుగును ప్రారంభించారు. కరీంనగర్ డెయిరీ బట్టర్‌స్కాచ్, వనిల్లా, మామిడి, చాక్లెట్, కుల్ఫీ, ఇతర రకాల రుచుల్లో కప్పులు, కోన్‌లు, బార్, ఇతర ఆకృతుల్లో 16 రకాల ఐస్‌క్రీమ్‌లను విక్రయించనుందని డెయిరీ చైర్మన్ సీహెచ్.రాజేశ్వర్ రావు వివరించారు. డెయిరీ సలహాదారు వి హనుమంతరెడ్డి, ఎండీ పి.శంకర్ రెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ టి.రాజశేఖర్ రెడ్డి, డైరెక్టర్లు ఎం.ప్రభాకర్ రావు, ఎం.సుధాకర్ రావు, నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మక ఎన్‌పీడీడీ కైవసం

నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్ (ఎన్‌డీడీబీ) ద్వారా జపాన్ ఇంటర్నేషనల్ కో–ఆపరేషన్ ఏజెన్సీ (జెఐసీఏ) ఆర్థిక సహాయంతో కరీంనగర్ డెయిరీ ప్రతిష్టాత్మకమైన నేషనల్ ప్రాజెక్ట్ ఫర్ డెయిరీ డెవలప్‌మెంట్ (ఎన్‌పీడీడీ)ని కైవసం చేసుకుందని డెయిరీ చైర్మన్ రాజేశ్వర్‌రావు తెలిపారు. ఈశాన్య రాష్ట్రాలు, ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాల్లో డెయిరీ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ఈ ప్రాజెక్టును తొలుత నిర్ణయించారని, తర్వాత మధ్యప్రదేశ్, పశ్చిమబెంగాల్, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణ, ఉత్తరాఖండ్, పంజాబ్ రాష్ట్రాలకు విస్తరించారని వివరించారు. ఈ పథకం 2022-2023 ఆర్థిక సంవత్సరం నుంచి 2025-26 వరకు అమలు చేయబడుతుందని, 2027-28 వరకు కొనసాగుతుందని అన్నారు. తెలంగాణలో ఒక్క కరీంనగర్ డెయిరీ రూ.90.70 కోట్లతో ప్రాజెక్టును కైవసం చేసుకుందని పేర్కొన్నారు. అందులో రూ.71.52 కోట్లు లోన్ కాంపోనెంట్ కాగా రూ.12.46 కోట్లు గ్రాంట్, కరీంనగర్ డెయిరీ సహకారం రూ.6.72 కోట్లని తెలిపారు.

నిజాం గుండెల్లో అన'భేరి'

- సాయుధ పోరులో ఒరిగిన తొలిదళ నాయకుడు
- రజాకార్లను మట్టుబెట్టిన పొలంపెల్లి ముద్దుబిడ్డ
- నేడు ప్రభాకర్‌రావు 75వ వర్ధంతి



కరీంనగర్‌లోని కూరగాయల మార్కెట్ వద్ద అనభేరి విగ్రహం (ఫైల్)



ప్రభాకర్‌రావు (ఫైల్)

కరీంనగర్: నిజాం నిరంకుశ పాలన నుంచి తెలంగాణ ప్రజలకు విముక్తి కలిగించాలన్న లక్ష్యంతో సాయుధ పోరాటాన్ని ఎంచుకున్నారు.. నిజాం గుండెల్లో రణభేరి మోగించిన అనభేరి ప్రభాకర్‌రావు 1910 ఆగస్టు 15న తిమ్మాపూర్ మండలం పొలంపెల్లిలో జన్మించారు. ప్రాథమిక విద్య మచిలీపట్నం, ఉన్నత విద్య హైదరాబాద్‌లో అభ్యసించారు. సీపీఐ జిల్లా తొలి కార్యదర్శిగా ఎన్నికైన ఆయన భూమి కోసం, భుక్తి కోసం, బానిస సంకెళ్ల విముక్తి కోసం, భూస్వామ్య వ్యవస్థ నిర్మూలన కోసం, జాగీర్‌దారీ వ్యవస్థకు వ్యతిరేకంగా గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తూ ప్రజలను జాగృతం చేశారు. తెలంగాణ విముక్తి కోసం జీవితాన్ని త్యాగం చేసిన తొలి తెలంగాణ సాయుధ దళ నాయకునిగా చరిత్రకెక్కారు. ప్రభాకర్‌రావుపై నిజాం ప్రభుత్వం 'నజర్ బంద్' హుకుం జారీ చేసి, తీవ్ర నిర్బంధం కొనసాగించింది. అయినా అజ్ఞాతంలో ఉంటూనే నిజాం నవాబు, భూస్వాముల దురాగతాలను వ్యతిరేకిస్తూ పోరాటం సాగించారు. చేనేత కార్మికుల అభ్యున్నతి కోసం చేనేత పారిశ్రామిక సంఘాన్ని స్థాపించి, ఆనాడే 30 వేల మందికి ఉపాధి కల్పించారు.

మహ్మదాపూర్ గుట్టల్లో అమరత్వం..

ప్రభాకర్‌రావును పట్టుకునేందుకు నిజాం ప్రభుత్వం ప్రత్యేక మిలటరీ ఫోర్స్ ఏర్పాటు చేసింది. 1948 మార్చి 14న ఆయన సాయుధ దళాన్ని కరీంనగర్ (ప్రస్తుతం సిద్దిపేట) జిల్లా పరిధిలోని హుస్నాబాద్ మండలం మహ్మదాపూర్ పోలీస్ పటేల్ భోజనానికి పిలిచి, ఆ సమాచారాన్ని నిజాం ప్రభుత్వానికి తెలియజేశాడు. దీంతో మహ్మదాపూర్ గుట్టలను మిలటరీ, రజాకార్లు చుట్టుముట్టారు. అనభేరి గెరిల్లా దళంపై పోలీసులు కాల్పులు జరిపారు. వారి తూటాలకు ఎదురొడ్డి పోరాడి 'అనభేరి'తోపాటు సింగిరెడ్డి భూపతిరెడ్డి, ముస్కు చొక్కారెడ్డి, ఏలేటి మల్లారెడ్డి, అయిరెడ్డి భూంరెడ్డి, తూమేజు నారాయణ, బి.దామోదర్‌రెడ్డి, ఇల్లందుల పాపయ్య, పోరెడ్డి రాంరెడ్డి, నల్గొండ రాజరాం, చిక్కుడు సాయిల్, రొండ్ల మాధవరెడ్డి బలయ్యారు.

వర్ధంతిని జయప్రదం చేయాలి

స్వాతంత్ర్య సమరయోధుడు, నిజాం గుండెల్లో రణభేరి మోగించిన అనభేరి ప్రభాకర్‌రావు 75వ వర్ధంతిని మంగళవారం నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి తెలి పారు. కరీంనగర్‌లోని కూరగాయల మార్కెట్ వద్ద గల ప్రభాకర్‌రావు విగ్రహం వద్ద, మహ్మదాపూర్‌లో నిర్వహించే వేడుకలకు సీపీఐ నాయకులు, కార్యకర్తలు, ప్రజాసంఘాల నాయకులు పెద్ద ఎత్తున హాజరై, జయప్రదం చేయాలని కోరారు.

విద్యుత్ షాక్‌తో బాలుడి మృతి

- వివాహ వేడుకలో విషాదం



హిమన్షు(ఫైల్)

కడెం: మండలంలోని కొత్త మద్దిపడగ గ్రామానికి చెందిన మార్కరి హిమాన్షు(2) విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మార్కరి సతీశ్–తిరుమల దంపతులకు కూతురు, కుమారుడు ఉన్నారు. సతీశ్ ఉపాధి నిమిత్తం నెల క్రితం దుబయ్ వెళ్లాడు. ఉట్నూర్‌లో బంధువుల ఇంట్లో వివాహం ఉండడంతో తిరుమల తన ఇద్దరు పిల్లలతో ఆదివారం వెళ్లింది. సాయంత్రం హల్దీ వేడుకల్లో పాల్గొన్న సందర్భంగా హిమాన్షు విద్యుత్ షాక్‌తో అక్కడిక్కడే మృతి చెందాడు. అందరూ సంతోషంగా గడుపుతున్న పెళ్లింట బాలుడి మరణం విషాదం నింపింది. బాలుడి మరణవార్త తెలుసుకున్న తండ్రి సతీశ్ హుటాహుటిన స్వగ్రామానికి వచ్చాడు. ఈనెల 27న తన కొడుకు పుట్టిన రోజు వేడుక ఉందని, బర్త్ డే గ్రాండ్‌గా చేయాలని అనుకుంటున్న సమయంలో ఈ సంఘటన జరిగిందని సతీశ్ కన్నీటిపర్యంతమయ్యాడు.

కానిస్టేబుల్ అదృశ్యం



భీమేశ్వర్(ఫైల్)

ఖానాపూర్: ఖానాపూర్ పోలీస్‌స్టేషన్‌లో కోర్టు కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న జి.భీమేశ్వర్ ఈనెల 9 నుంచి కనిపించడం లేదు. ఉదయం ఇంటి నుంచి వెళ్లిన భీమేశ్వర్ మూడు రోజులైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఆరా తీశారు. విధులకు కూడా రాలేదని చెప్పడంతో తెలిసినవారిని అడిగారు. అయినా ఆచూకీ లేకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు కానిస్టేబుల్ కోసం గాలిస్తున్నామని ఎస్సై ఆర్.శంకర్ తెలిపారు. భీమేశ్వర్ ఆచూకి తెలిస్తే 8712659524, 8712659523 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఎస్సై సూచించారు.

సాక్షి
ఫ్యామిలీ
కరీంనగర్
మంగళవారం ॥ 14-3-2023



'ఆర్‌ఆర్‌ఆర్'లో నాటు నాటు పాట... ఎన్టీఆర్, రామ్‌చరణ్



● కీరవాణి, చంద్రబోస్

ఊర నాటు ఆస్కార్ హిట్టు



- బెస్ట్ ఒరిజినల్ సాంగ్ విభాగంలో 'నాటు నాటు'కు అవార్డు
- 'ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్' చిత్రానికి ఏడు అవార్డులు
- 'ఆల్ క్వైట్ ఆన్ ది వెస్ట్రన్ ఫ్రంట్'కి నాలుగు అవార్డులు

'నే పాడితే లోకమే పాడదా.. నే ఆడితే లోకమే ఆడదా...' పాటలో దమ్ముంటే లోకం పాడుతుంది.. ఆడుతుంది.. ఆ పాట విశ్వ విజేత అవుతుంది. 'నాటు నాటు...' అందుకో ఉదాహరణ. క్లాస్, మాస్ తేడా లేకుండా నాటు బీటు అందరి మనసుల్లోకి చొచ్చుకుపోయింది. తెలుగు పరిశ్రమ తొలి ఆస్కార్ ఆనందాన్ని చవి చూసేలా చేసింది. 'ఆర్‌ఆర్‌ఆర్' హీరోలు ఎన్టీఆర్, రామ్‌చరణ్, దర్శకుడు రాజమౌళి, డాల్బీ థియేటర్‌లో ఇతరుల కరతాళ ధ్వనుల మధ్య చిత్రసంగీత దర్శకుడు కీరవాణి, రచయిత చంద్రబోస్ ఆస్కార్‌ని అందుకున్నారు. దేశం మురిసిన వేళ.. తెలుగు స్క్రీన్ ఆనందించిన వేళ 95వ ఆస్కార్ అవార్డు విశేషాలు తెలుసుకుందాం...

అంతర్జాతీయ వేదికపై తెలుగోడి 'నాటు నాటు' మారుమోగిపోయింది. ఆస్కార్ వేదికపై నాటు నాటు స్టెప్పులు అదిరిపోయాయి. 'బెస్ట్ ఒరిజినల్ సాంగ్' విభాగంలో 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రంలోని 'నాటు నాటు' పాటకు ఆస్కార్ అవార్డు దక్కింది. దాదాపు 80 పాటలను పరిశీలించి 15 పాటలను బెస్ట్ ఒరిజినల్ స్కోర్ విభాగంలో అవార్డు కోసం షార్ట్‌లిస్ట్ చేసింది ఆస్కార్ కమిటీ. ఈలోపు 'ఆర్‌ఆర్‌ఆర్' టీమ్ ప్రమోషన్స్‌తో 'నాటు నాటు..' విదేశీయులకు కూడా మరింత చేరువైంది. ఈ క్రమంలోనే జనవరి 24న వెల్లడైన ఆస్కార్ నామినేషన్స్‌లో 'బెస్ట్ ఒరిజినల్ సాంగ్' విభాగంలో 'నాటు నాటు..'కు చోటు దక్కింది. 'నాటు నాటు' పాటతో పాటు 'టెల్ ఇట్ లైక్ ఏ ఉమెన్' చిత్రంలోని 'అప్లాజ్', 'బ్లాక్‌పాంథర్: వకాండ ఫరెవర్'లోని 'లిఫ్ట్ మీ అప్', 'ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్' చిత్రంలోని 'దిస్ ఈజ్ ఏ లైఫ్', 'టాప్‌గన్: మ్యావరిక్'లోని 'హోల్డ్ మై హ్యాండ్' పాటలు బరిలో నిలిచాయి. అయితే వీటన్నింటినీ దాటుకుని తెలుగు 'నాటు నాటు' ఆస్కార్ అవార్డును తెచ్చింది. ప్రపంచ సినిమా చరిత్రలో సరికొత్త చరిత్రకు పునాది వేసింది. ఇలా దేశానికి ఆస్కార్ తెచ్చిన తొలి చిత్రంగా, తొలి తెలుగు చిత్రంగా 'ఆర్‌ఆర్‌ఆర్' నిలిచింది (గతంలో కొందరు భారతీయులు, ఇండో–అమెరికన్స్ ఆస్కార్ అవార్డులు సాధించినప్పటికీ అవి భారతీయ చిత్రాలు కావు). ఒక ఏషియన్ చిత్రం (ఆర్‌ఆర్‌ఆర్) నుంచి ఓ పాటకు (నాటు నాటు) అవార్డు రావడం ఇదే తొలిసారి. అలాగే నాన్–ఇంగ్లిష్ పాటల్లో ఆస్కార్ అవార్డు సాధించిన నాలుగో పాటగా 'నాటు నాటు' నిలిచింది. ఇక ఆస్కార్ అవార్డు సాధించిన తొలి తెలుగు వ్యక్తులుగా కీరవాణి, చంద్రబోస్ రికార్డు సృష్టించారు. అలాగే బెస్ట్ ఒరిజినల్ సాంగ్ విభాగంలో ఆస్కార్ అవార్డు సాధించిన రెండో భారతీయుడుగా కీరవాణి, రెండో గీత రచయితగా చంద్రబోస్ నిలిచారు. 2009లో జరిగిన 81వ ఆస్కార్ అవార్డ్స్‌లో ఇంగ్లిష్ చిత్రం 'స్లమ్‌డాగ్ మిలియనీర్'కి గాను 'బెస్ట్ ఒరిజినల్ సాంగ్' విభాగంలో ఏఆర్ రెహమాన్, రచయిత గుల్జార్ ఆస్కార్ అవార్డులను అందుకున్నారు.

ఇక 95వ ఆస్కార్ అవార్డ్స్‌లో ప్రకటించిన మొత్తం 23 విభాగాల జాబితాల్లోకి వస్తే...

ఉత్తమ చిత్రం: ఎవ్రీవేర్ ఎవ్రీథింగ్ ఆల్ ఎట్ వన్స్
ఉత్తమ దర్శకుడు: డానియల్ క్వాన్, డానియల్ స్కీనెర్ట్ (ఎవ్రీవేర్ ఎవ్రీథింగ్ ఆల్ ఎట్ వన్స్)
ఉత్తమ నటుడు: బ్రెండెన్ ఫ్రాసెర్ (ది వేల్)
ఉత్తమ నటి: మిషెల్ యో (ఎవ్రీవేర్ ఎవ్రీథింగ్ ఆల్ ఎట్ వన్స్)
ఉత్తమ ఒరిజినల్‌సాంగ్: 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రంలోని 'నాటు నాటు'(మ్యూజిక్ డైరెక్టర్ కీరవాణి, లిరిక్ రైటర్ చంద్రబోస్)
ఉత్తమ సహాయ నటుడు: కి హుయ్ క్వాన్ (ఎవ్రీవేర్ ఎవ్రీథింగ్ ఆల్ ఎట్ వన్స్)
ఉత్తమ సహాయ నటి: జామి లీ కర్టిస్ (ఎవ్రీవేర్ ఎవ్రీథింగ్ ఆల్ ఎట్ వన్స్)
ఉత్తమ క్యాస్ట్యూమ్ డిజైన్: రూథ్ కార్టర్(బ్లాక్ పాంథర్: వకండా ఫరెవర్)
ఉత్తమ స్క్రీన్ ప్లే: డానియల్ క్వాన్, డానియల్ స్కీనెర్ట్ (ఎవ్రీవేర్ ఎవ్రీథింగ్ ఆల్ ఎట్ వన్స్)
ఉత్తమ సినిమాటోగ్రఫీ: జేమ్స్‌ఫ్రెండ్ (ఆల్ క్వైట్ ఆన్ ది వెస్టన్ ఫ్రంట్)
ఉత్తమ ఎడిటర్: పాల్ రోజర్స్ (ఎవ్రీవేర్ ఎవ్రీథింగ్ ఆల్ ఎట్ వన్స్)
ఇంటర్‌నేషనల్ ఫీచర్ ఫిల్మ్: ఆల్ క్వైట్ ఆన్ ది వెస్టంట్ ఫ్రంట్ (జర్మనీ)
బెస్ట్ డాక్యుమెంటరీ ఫీచర్ ఫిల్మ్: నవాల్నీ
బెస్ట్ డాక్యుమెంటరీ షార్ట్ సబ్జెక్ట్: ది ఎలిఫెంట్ విస్పరర్స్
బెస్ట్ ప్రొడక్షన్ డిజైన్: క్రిస్టియన్ ఎం గోల్డ్ బెక్ (ఆల్ క్వైట్ ఆన్ ది వెస్టంట్ ఫ్రంట్)
బెస్ట్ విజువల్ ఎఫెక్ట్స్: అవతార్: ది వే ఆఫ్ వాటర్ (అవతార్ 2)
బెస్ట్ సౌండ్: టాప్‌గన్: మ్యావరిక్
బెస్ట్ మేకప్ అండ్ హెయిర్ స్టయిల్: ది వేల్
బెస్ట్ యానిమేటెడ్ ఫీచర్ ఫిల్మ్: పినాషియో
లైవ్ యాక్షన్ షార్ట్ ఫిల్మ్: ఏన్ ఐరిస్ గుడ్ బై
యానిమేటెడ్ షార్ట్ ఫిల్మ్: ద బాయ్, ద మోల్, ద ఫాక్స్ అండ్ ది హార్స్
బెస్ట్ అడాప్టెడ్ స్క్రీన్ ప్లే: షెరా పాల్లే (ఉమెన్ టాకింగ్)
బెస్ట్ ఒరిజినల్ స్కోర్: బ్రెటెల్‌మాన్ (ఆల్ క్వైట్ ఆన్ ది వెస్టంట్ ఫ్రంట్)



● ఆస్కార్ వేడుకలో 'ఆర్‌ఆర్‌ఆర్' టీమ్



● ప్రేమ్ రక్షిత్, కాలభైరవ, రాహుల్ సిప్లిగంజ్

హోస్ట్ జిమ్మిపై నెటిజన్ల ఆగ్రహం

ఆస్కార్ వేడుక ప్రారంభంలో 'ఆర్‌ఆర్‌ఆర్' ప్రస్తావన వచ్చినప్పుడు హోస్ట్ జిమ్మి 'ఆర్‌ఆర్‌ఆర్' బాలీవుడ్ మూవీ అన్నట్లుగా చెప్పారు. దీంతో నెటిజన్లు జిమ్మి కిమ్మెల్‌ను తప్పపడుతూ కామెంట్ల వర్షం కురిపించారు. ప్రపంచవ్యాప్తంగా 'ఆర్‌ఆర్‌ఆర్' తెలుగు సినిమా అని గుర్తింపు పొందిన నేపథ్యంలో ఆస్కార్‌లాంటి ప్రతిష్ఠాత్మక అవార్డుకు హోస్ట్ అయిన జిమ్మీ బాలీవుడ్ మూవీ అనడం సరికాదని పలువురు నెటిజన్లు సోషల్ మీడియాలో విమర్శించారు.

డు యూ నో నాటు?

'నాటు నాటు' పాట ఎంత పాపులరో ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. కానీ ఆస్కార్ వేదికపై 'డు యూ నో నాటు?.. ఒకవేళ తెలియకపోతే ఇప్పుడు తెలుసుకుంటారు'.. అంటూ దేశం నుంచి ఆస్కార్ అవార్డ్స్‌కి ఓ ప్రెజెంటర్‌గా వెళ్లిన దీపికా పదుకోన్ 'నాటు నాటు' పాటను పరిచయం చేశారు. వేదికపై రాహుల్ సిప్లిగంజ్, కాలభైరవ 'నాటు నాటు' పాటను పాడగా, వెస్ట్రన్ డ్యాన్సర్స్ కాలు కదిపారు. ఈ వేడుకలో వీక్షకుల్లో 'నాటు నాటు..' పాట ఎంత జోష్ నింపిందంటే.. పాట పూర్తయ్యాక అందరూ స్టాండింగ్ ఓవేషన్ ఇచ్చారు.



● వేడుకలో ఒక దృశ్యం



● ఎన్టీఆర్



● రామ్‌చరణ్

నేను కార్పెంటర్స్ (అమెరికన్ మ్యూజిక్ బ్యాండ్) వింటూ పెరిగాను. ఇప్పుడు ఇక్కడ ఆస్కార్‌తో ఉన్నాను. నా మదిలో ఒకే ఒక కోరిక ఉండేది అంటూ 1970లలో హిట్ అయిన పాప్ సాంగ్ 'టాప్ ఆఫ్ ది వరల్డ్'ని తన స్టయిల్‌లో పాడారు కీరవాణి. "నా మదిలో ఒకే ఒక కోరిక ఉండేది. అదేంటంటే.. రాజమౌళి, నా కుటుంబం, 'ఆర్‌ఆర్‌ఆర్' ఆస్కార్ కైవసం చేసుకోవాలని. ప్రతి భారతీయుడికి గర్వకారణం కావాలని, నన్ను ప్రపంచ శిఖరాగ్రాన నిలబెట్టాలని... థ్యాంక్యూ కార్తికేయ" అని పాడారు.

ఆస్కార్ అవార్డు అందుకున్న 'నాటు నాటు..' పాట రచయిత చంద్రబోస్ 'నమస్తే' అంటూ తెలుగులో మాట్లాడి, తన సంతోషం వ్యక్తం చేశారు.

నాటు నాటు... 17 రోజుల కష్టం

'**నా**టు నాటు' పాటను ఉక్రెయిన్‌లో చిత్రీకరించారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ భవన ప్రాంగణంలో ఈ పాటను షూట్ చేశారు. పక్కనే పార్లమెంట్ భవనం కూడా ఉంది. అయితే ఇలాంటి ప్రదేశంలో ఓ సినిమా షూటింగ్ అంటే చాలా అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ జెలెన్‌స్కీ ఒకప్పుడు టెలివిజన్ యాక్టర్ అట. సో.. ఆర్ట్ గురించి ఆయనకు అవగాహన ఉండటంతో పాటను చిత్రీకరించేందుకు అనుమతి ఇచ్చారు. 'నాటు నాటు..' పాటను 17 రోజుల పాటు షూట్ చేశారు. సెట్స్‌లో ప్రతి రోజూ 150మంది డ్యాన్సర్లు పాల్గొన్నారు. 200మంది సాంకేతిక నిపుణులు ఈ పాట కోసం లొకేషన్‌లో హాజరయ్యారు. ఇక ఈ పాటలో ప్రత్యేకించి చెప్పుకోవాల్సింది 'హుక్ స్టెప్' గురించి. దాదాపు 80 రకాల స్టెప్స్‌ను కంపోజ్ చేశాక ఈ పాట కొరియోగ్రాఫర్ ప్రేమ్ రక్షిత్ అండ్ టీమ్ ఆ స్టెప్‌ను ఫైనలైజ్ చేశారు. ఈ స్టెప్ కూడా ఊరికే పూర్తి కాలేదు. డ్యాన్స్‌లో మంచి ప్రావీణ్యం ఉన్న ఎన్టీఆర్, రామ్‌చరణ్‌లు 18 టేక్స్ తీసుకున్నారు. ఎన్టీఆర్, చరణ్‌ల మధ్య సింక్ రావడానికి ఎక్కువ సమయం పట్టిందట. ఇలా వీరందరి కష్టం ఇప్పుడు ఆస్కార్ అవార్డు రూపంలో ఫలించింది. అలాగే ఈ పాట కోసం దాదాపు రూ. 15 కోట్లు అయింది. నిజానికి ఈ పాటను ముందుగా ఇండియాలోనే షూట్ చేయాలనుకున్నారు. ఢిల్లీలోని ఎర్రకోట లొకేషన్‌ను అనుకున్నారు. కానీ ఆ సమయానికి వర్షాకాలం కావడంతో ఇతర దేశాల్లో తీయాలనుకున్నారు రాజమౌళి. సెట్ అయితే సహజంగా ఉండదని భావించారు. ఆ సమయంలోనే జెలెన్‌స్కీ భవనం లొకేషన్ రాజమౌళి కంట పడింది. అక్కడే పాటను చిత్రీకరించాలని అనుకున్నారు. కానీ అనుమతులు దొరకవని అనుకున్నారు. అయితే ఉక్రెయిన్ టీమ్ వల్ల అది సాధ్యమైంది. అలాగే పాట సమయంలో ఎన్టీఆర్, రామ్‌చరణ్‌లతో పాటు సైడ్ డ్యాన్సర్స్‌కు కూడా రెండు, మూడు కాస్ట్యూమ్స్‌ను రెడీగా ఉంచారు. ఎందుకంటే సాంగ్‌ను దుమ్ములో తీశారు. కాస్ట్యూమ్స్ పాడైతే షూటింగ్ లేట్ అవుతుందని. ఈ సినిమాకు రాజమౌళి భార్య రమా రాజమౌళి కాస్ట్యూమ్ డిజైనర్‌గా వర్క్ చేశారు.

భారతదేశం చాలా బలమైన సాంస్కృతిక నేపథ్యం ఉన్న వైవిధ్యమైన దేశం. 'ఆర్‌ఆర్‌ఆర్'లో మీరు చూసింది అదే. ప్రపంచానికి చెప్పాల్సిన కథలు ఇండియాలో చాలా ఉన్నాయి. చాలా తీవ్రమైన, బలమైన, భావోద్వేగ, నాటకీయ యాక్షన్‌తో కూడిన సినిమాలు ఇండియా నుంచి వస్తాయి. ఇప్పుడు భారతీయులకు పూర్తి నమ్మకం కలిగింది.

- ఎన్టీఆర్

మనం గెలిచాం. మన ఇండియన్ సినిమా గెలిచింది. యావత్ దేశమే గెలిచింది. ఆస్కార్‌ను ఇంటికి తెచ్చేస్తున్నాం. మా జీవితాల్లోనే కాకుండా భారతీయ చలన చిత్ర పరిశ్రమలో 'ఆర్‌ఆర్‌ఆర్' ఎంతో ప్రత్యేకమైనది. ఆస్కార్ అవార్డు సొంతమయ్యేలా చేసిన ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్. నేనింకా కలలోనే ఉన్నట్లు అనిపిస్తోంది. రాజమౌళి, కీరవాణిగార్లు భారత చలనచిత్రపరిశ్రమలో అత్యంత విలువైన రత్నాలు. ఈ అద్భుత కళాఖండంలో నన్ను భాగం చేసినందుకు కృతజ్ఞతలు. ప్రపంచవ్యాప్తంగా 'నాటు నాటు..' అనేది ఒక భావోద్వేగం. ఆ భావోద్వేగానికి రూపమిచ్చిన చంద్రబోస్, రాహుల్ సిప్లిగంజ్, కాలభైరవ, ప్రేమ్‌రక్షిత్‌లకు థ్యాంక్స్. నా బ్రదర్ ఎన్టీఆర్, కో స్టార్ ఆలియాభట్‌కు థ్యాంక్స్. తారక్.. కుదిరితే నీతో మళ్లీ డ్యాన్స్ చేసి రికార్డులు సృష్టించాలనుంది. ఈ అవార్డు భారతీయ నటీనటులు, సాంకేతిక నిపుణులందరి సొంతం. నా భార్య (ఉపాసన)కు ఆరో నెల. మా బేబీయే మాకీ అదృష్టాన్ని తెచ్చిందనుకుంటున్నాను.

- రామ్‌చరణ్

ప్రముఖుల శుభాకాంక్షలు

"**నా**టు నాటు పాట పాపులారిటీ ప్రపంచవ్యాప్తమైనది. భవిష్యత్తులో కూడా గుర్తుపెట్టుకునే పాట అది. ఎమ్ఎమ్ కీరవాణి, చంద్రబోస్, 'ఆర్‌ఆర్‌ఆర్' టీమ్ అందరికీ నా శుభాకాంక్షలు. భారతదేశం గర్వపడుతోంది.

– నరేంద్ర మోదీ, భారత ప్రధానమంత్రి

ఉత్తమ ఒరిజినల్ సాంగ్ కేటగిరీలో ఆస్కార్ అవార్డు సాధించిన 'ఆర్‌ఆర్‌ఆర్' సినిమా టీమ్‌కు అభినందనలు. **– అబ్దుల్ నజీర్, ఆంధ్రప్రదేశ్ గవర్నర్**

"**ఈ**రోజు భారతీయ జెండా రెపరెపలాడుతోంది. మన అందమైన వారసత్వ జానపద పాటకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించడం గర్వంగా ఉంది. చరిత్రను తిరగరాసిన రాజమౌళి, ఎన్టీఆర్, రామ్‌చరణ్, కీరవాణిలకు అభినందనలు. నాతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది తెలుగు ప్రజలతో పాటు భారతీయులందరూ గర్వపడేలా చేసిన రాజమౌళి, ఎన్టీఆర్, రామ్‌చరణ్, కీరవాణి, చంద్రబోస్, ప్రేమ్ రక్షిత్, కాలభైరవ, రాహుల్ సిప్లిగంజ్‌తో పాటు మొత్తం 'ఆర్‌ఆర్‌ఆర్' టీమ్‌కు కంగ్రాట్స్.

– వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి

విశ్వ సినీ యవనికపై తెలుగు సినిమా సత్తా చాటింది. ప్రతిష్ఠాత్మక ఆస్కార్ అవార్డు గెలుచుకోవడం తెలుగువారికి గర్వకారణం. 'నాటు నాటు' పాట తెలంగాణ సంస్కృతి, తెలుగు ప్రజల అభిరుచికి నిదర్శనం. తెలుగు మట్టి వాసనలను వెలుగులోకి తీసుకువచ్చిన చంద్రబోస్, సంగీత దర్శకుడు కీరవాణి, చిత్ర దర్శకుడు రాజమౌళి, నటీనటులందరికీ అభినందనలు.

– కేసీఆర్, ముఖ్యమంత్రి, తెలంగాణ

మా అబ్బాయి కీరవాణికి మూడో ఏట నుంచే సంగీతం నేర్పించా. అతడి కడుపునిండా సంగీతమే. అసాధారణ ప్రజ్ఞావంతుడు. నేను తాళాలు తెరిచానంతే. కీరవాణి సాధిస్తున్న విజయాలకు ముగ్ధుడిని అవుతూనే ఉన్నా. ఇప్పుడు ఆస్కార్ తెచ్చి నన్నెంతో ఆనందపరిచాడు. ఓ తండ్రిగా గర్వపడుతున్నాను. **– శివశక్తి దత్త**

మన దేశంలో ప్రతిభకు కొదవ లేదు. అందరూ వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి. 'నాటు నాటు..'కు ఆస్కార్ అవార్డు అందుకున్న 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రబృందానికి శుభాకాంక్షలు. **– విజయేంద్ర ప్రసాద్**

ఇంకా రజనీకాంత్, చిరంజీవి, నాగార్జున, వెంకటేశ్, ప్రభాస్, మహేశ్ బాబు, అల్లు అర్జున్, ఏఆర్ రెహమాన్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

నాకు అవార్డు ఇచ్చిన ఆస్కార్ కమిటీకి, ఇలాంటి ఓ బోల్డ్ ఫిల్మ్‌లో నటించే అవకాశం కల్పించినవారికి ప్రత్యేక ధన్యవాదాలు. 'ది వేల్' సినిమాలో భాగమైన వారిని గుర్తు చేసుకోకుండా ఉండలేను. బెస్ట్ యాక్టర్‌గా నాకు అవార్డు రావడాన్ని చాలా గౌరవంగా ఫీల్ అవుతున్నాను. నటుడిగా నేను 30 ఏళ్లుగా ఇండస్ట్రీలో ఉన్నాను. కొన్ని సందర్భాల్లో నాకు గుర్తింపు వస్తుందా? అని ఆలోచించాను. అలా ఆలోచించినప్పుడు చాలా కష్టంగా అనిపించింది. కేవలం తిమింగలాలు మాత్రమే లోలోతుల్లో ఈదగలవు. సినిమా ఇండస్ట్రీలో నేనూ అంతే. నాకు హెల్ప్‌గా ఉన్న నా కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు.

– ఉత్తమ నటుడు బ్రెండెన్ ఫ్రాజెర్
(చెమర్చిన కళ్లతో...)


కలలు కనండి. నిజం అవుతాయనడానికి నేను ఈ అవార్డును ఓ ప్రూఫ్‌గా చూపిస్తున్నాను. మహిళలకు నేను ఒక్కటే చెప్పాలనుకుంటున్నాను. ఎవరైనా మీ ప్రైమ్ టైమ్‌ను మీరు దాటిపోయారు అంటే నమ్మొద్దు. ఈ అవార్డుని నేను మా అమ్మకు... ప్రపంచంలో ఉన్న అమ్మలందరికీ అంకితం ఇస్తున్నాను. ఎందుకంటే వారే నిజమైన సూపర్‌హీరోస్. వీరే లేకపోతే ఇప్పుడు ఇక్కడ ఎవరూ ఉండి ఉండేవారు కాదు. మా అమ్మగారికి 84 ఏళ్లు. కుటుంబసభ్యులు, స్నేహితులతో కలిసి ఇప్పుడు మలేసియాలో ఆమె ఈ వేడుకను చూస్తున్నారు. నేను ఈ అవార్డును ఇంటికి తీసుకువస్తున్నాను (కుటుంబ సభ్యులను ఉద్దేశించి). అలాగే నా కెరీర్ హాంకాంగ్‌లో స్టార్ట్ అయ్యింది. అక్కడ నాకు హెల్ప్‌గా ఉన్నవారికి ధన్యవాదాలు. అలాగే నెవర్ గివప్. డానియల్ డ్యూయో, ఏ 24 షూటింగ్ స్టూడియో, 'ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్..' నటీనటుల సహాయం లేకపోతే నేను ఇప్పుడు ఇక్కడ ఈ వేదికపై ఉండేదాన్ని కాదు.

– ఉత్తమ నటి, మిషెల్ యో




● మిషెల్ యో, బ్రెండెన్ ఫ్రాజెర్

షూటింగ్‌కి వెళ్లడానికి పదేళ్లు!



మిషెల్ యో, స్టెఫానీ, కే హుయ్ క్వాన్, జెన్నీ స్లాట్, జామి లీ కర్టిస్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ఎవ్రీవేర్ ఎవ్రీథింగ్ ఆల్ ఎట్ వన్స్': డేనియల్ క్వాన్, డేనియల్ స్కీనెర్ట్ సంయుక్త దర్శకత్వంలో రూపొందిన ఈ సైన్స్ ఫిక్షన్ మూవీ గత ఏడాది బాక్సాఫీస్ వద్ద సూపర్ బంపర్‌హిట్ కొట్టింది. 25 మిలియన్ డాలర్ల బడ్జెట్‌తో రూపొందిన ఈ చిత్రం అంతకు నాలుగు రెట్లు అంటే వంద మిలియన్ డాలర్లకుపైగా వసూలు చేసింది. ఇక ఏడు ఆస్కార్ అవార్డులను సాధించిన ఈ చిత్రకథ విషయానికి వస్తే... చైనా నుంచి అమెరికాకు వలస వచ్చిన ఎవిలిన్ క్వాడ్ కుటుంబం అక్కడ లాండ్రీషాపు పెట్టుకుని జీవనం సాగిస్తుంటుంది. వీరు ఒక ప్రపంచంలో జీవిస్తున్నట్లే మరో ప్రపంచంలో వీరిలాంటి వారే ఉంటారు. వీరు ఒకరికొకరు తారసపడినప్పుడు ఎలాంటి విపత్కర పరిస్థితులు ఏర్పడతాయి అన్నదే కథ. ఈ మల్టీవర్స్ కాన్సెప్ట్ ప్రేక్షకులను బాగా మెప్పించింది. ఈ చిత్రదర్శకులు డేనియల్ క్వాన్, స్కీనెర్ట్ 2010 లోనే 'ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్' చిత్రకథను స్టార్ట్ చేశారు. కానీ షూటింగ్‌కి వెళ్లడానికి పదేళ్లు పట్టింది. రెండేళ్లకు పైగా షూటింగ్ జరుపుకున్న ఈ చిత్రం 2022 లో విడుదలై అఖండ విజయాన్ని అందుకుంది.

అంబారీ ఎక్కి ఆస్కార్ వచ్చింది



విఘ్నాలు తొలగిపోయాయి. పూర్తిగా ఇండియాలో నిర్మితమైన డాక్యుమెంటరీకి తొలి ఆస్కార్ అందింది. ఇది స్త్రీల ద్వారా జరిగింది. 'ది ఎలిఫెంట్ విస్పరర్స్'కు దర్శకత్వం వహించింది కార్తికి గోంజాల్వేజ్. నిర్మించింది గునీత్ మోంగా. వీరికి ఈ అవార్డు రావడానికి కారణం రఘు అనే అనాథ ఏనుగు పిల్ల. ఆ ఏనుగు పిల్లను సాకిన ఆదివాసి దంపతులు. మనుషులకు అడవి జంతువులకు మధ్య ఉండే అనుబంధం ఈ డాక్యుమెంటరీలో ఎంతో అద్భుతంగా వ్యక్తమైంది. అందుకే అంబారీ ఎక్కి వచ్చినట్టుగా మనకు ఆస్కార్ ఘనంగా దక్కింది.

ఏనుగులు– మావటీలు మన దేశంలో ఎప్పటి నుంచో ఉన్నారు. కాని వారి మధ్య ఉన్నది ఒక రకమైన ప్రొఫెషనల్ స్నేహం. కాని కొన్ని సందర్భాలలో అనాథలైన ఏనుగు పిల్లలను కాపాడే పని ఆదివాసీలు తీసుకుంటారు. వారిది పెంచిన మమకారం. ఆ మమకారమే 'ది ఎలిఫెంట్ విస్పరర్స్' కథాంశం. దర్శకురాలు కార్తికీది ఊటీ. అక్కడే పుట్టి పెరిగింది. ఊటీకి అరగంట ప్రయాణ దూరంలో 'తెప్పకాడు ఎలిఫెంట్ క్యాంప్' ఉంది. అక్కడ ఏనుగులను సంరక్షిస్తుంటారు. కార్తికి గోంజాల్వేజ్ చిన్నప్పటి నుంచి ఆ క్యాంప్‌కు వెళ్లి ఏనుగులను చూసేది. ఆ తర్వాత ఆమె పెరిగి పెద్దదయ్యి ఫొటోగ్రాఫర్‌గా మారినా, కెమెరా ఉమన్‌గా తనకున్న వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రఫీ మీద ఇష్టం వల్ల యానిమల్ ప్లానెట్, డిస్కవరీ చానల్స్‌లో పని చేసినా ఎప్పుడూ తన ప్రాంత ఏనుగుల మీద ఏదైనా ఫిల్మ్ చేయాలని అనిపించలేదు. కాని 2017లో అందుకు బీజం పడింది.

అతడు - ఆ ఏనుగు పిల్ల

కార్తికి గోంజాల్వేజ్ 2017లో బెంగళూరు నుంచి కారులో ఊటీకి వెళుతోంది. ఊటీ చేరుకుంటూ ఉండగా ఒక మనిషి చిన్న ఏనుగు పిల్లను నడిపించుకుంటూ వెళుతూ ఆమె కంట పడ్డాడు. కార్తికి వెంటనే కారు ఆపి ఈ మనిషి ఈ ఏనుగు పిల్లను ఎక్కడకు తీసుకువెళుతున్నాడు అని వెంబడించింది. వారిద్దరూ దగ్గరిలోని ఏటికి వెళ్లారు. ఆ మనిషి ఆ ఏనుగు పిల్లకు చంటి పిల్లలకు మల్లే స్నానం చేయించాడు. దానితో ఎన్నో కబుర్లు చెప్పాడు. 'అరె.. ఈ బంధం భలే ఉందే' అనిపించింది కార్తికికి. అతణ్ణి పలకరించింది. పేరు బొమ్మన్. ఆ ఏనుగు పిల్ల పేరు రఘు. ఆ ఏనుగు పిల్ల ఇటీవలే అనాథ అయ్యింది. పంటలను కాపాడుకోవడానికి పెట్టిన కరెంటు తీగల బారిన పడి రఘు తల్లి మరణించింది. అనాథ అయిన రఘు తల్లి వియోగంతో కృశించి చావుకు దగ్గరగా ఉండగా బొమ్మన్‌కు కనిపించాడు. దానిని ఇంటికి తీసుకెళ్లాడు. బొమ్మన్ భార్య బెల్లి రఘుకు తల్లిలా మారింది. ఆ ముగ్గురు ఒక కుటుంబం అయ్యారు.

ఇలాంటి అనుబంధాలు చూపితే మనిషి, జంతువు కలిసి మెలిసి మనుగడ సాగించాల్సిన అవసరాన్ని చూపినట్టు అవుతుందని కార్తికి అనుకుంది. వెంటనే డాక్యుమెంటరీ నిర్మించడానికి నెట్‌ఫ్లిక్స్‌ను సంప్రదించింది. నెట్‌ఫ్లిక్స్ తన కో ప్రొడ్యూసర్‌గా నిర్మాత మోంగాను సంప్రదించింది. అలా 'ది ఎలిఫెంట్ విస్పరర్స్' డాక్యుమెంటరీ నిర్మాణం మొదలైంది.

ఢిల్లీకి చెందిన గునీత్ దాదాపు పదేళ్లుగా అంతర్జాతీయ దృష్టి పడే సినిమాల నిర్మాణంలో భాగస్వామి అవుతోంది. ఆమె నిర్మాణ భాగస్వామి అయిన 'కవి' (2010) బెస్ట్ లైవ్ యాక్షన్ షార్ట్‌లో ఆస్కార్ నామినేషన్ పొందగా, 'పీరియడ్: ఎండ్ ఆఫ్ సెంటెన్స్' (2018) బెస్ట్ డాక్యుమెంటరీ షార్ట్‌గా ఆస్కార్ అవార్డ్ పొందింది. అయితే 'పీరియడ్'కు పని చేసిన సాంకేతిక నిపుణులు భారతీయులు కారు. 'ది ఎలిఫెంట్ విస్పరర్స్'ను తీయాలనుకుంటున్న కార్తికితో పని చేయడం వల్ల ఈసారి పూర్తి భారతీయ నిర్మాణంతో ప్రపంచం దృష్టిని ఆకర్షించవచ్చని గునీత్ భావించింది. అలా వీరిద్దరు కలిసి పూర్తి చేసిన ఈ డాక్యుమెంటరీ నెట్‌ఫ్లిక్స్‌లో డిసెంబర్ 8, 2022న విడుదలైంది.

ఇది డాక్యుమెంటరీ వేవ్

'ఇప్పుడు ఇండియాలో నడుస్తున్నది డాక్యుమెంటరీ వేవ్. ఫీచర్ ఫిల్మ్స్‌లో కన్నా డాక్యుమెంటరీలో భారతీయ దర్శక నిర్మాతలు వినూత్నమైన కథాంశాలను చెబుతున్నారు' అంటుంది గునీత్. కార్తికి మాట్లాడుతూ– 'ఏనుగులు ఎంత తెలివైనవో ఎంత భావోద్వేగంతో బంధంతో ఉంటాయో నా డాక్యుమెంటరీలో చూపించాను. ఇక మీదటైనా అవి వేరు మనం వేరు అనుకోకపోతే చాలు' అంది. 'నేను తీసే ఫిల్మ్స్ ఇకపై కూడా ఇలాంటి కథాంశాలతో ఉంటాయి' అన్నారు.

39 నిమిషాల డాక్యుమెంటరీ

'ది ఎలిఫెంట్ విస్పరర్స్' నిడివి 39 నిమిషాలు. రెండు ఏనుగు పిల్లలు, నీలగిరి అడవుల్లో ఉండే 'కట్టు నాయకర్' అనే తెగకు చెందిన ఆదివాసీ భార్యాభర్తలు ఈ డాక్యుమెంటరీలో కనిపిస్తారు. ఆ భార్యాభర్తల పేర్లు బొమ్మన్, బెల్లి. ఏనుగు పిల్లల్లో ఒకదాని పేరు రఘు, మరోదాని పేరు అమ్ము. కరెంటు తీగలు తగిలి తల్లి ఏనుగులు మరణించడంతో బొమ్మన్, బెల్లిలు రఘుని, అమ్ముని సాకుతారు. అయితే డాక్యుమెంటరీలో ఎక్కువ భాగం రఘుతో బొమ్మన్, బెల్లిలకు ఉండే అనుబంధం చూపుతుంది. అయితే నేపథ్యంలో అందమైన అడవులు, వాగులు, ఆదివాసీల క్రతువులు ఇవన్నీ దర్శకురాలు కార్తికి చూపడంతో డాక్యుమెంటరీకి ఒక సంపూర్ణత్వం వచ్చింది. బొమ్మన్ ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగి. ఇప్పుడు రఘు, అమ్ములను అటవీ శాఖ వారు 'ముదుమలై టైగర్ రిజర్వ్'కు మార్చారు. దాంతో రఘుతో ఆ దంపతుల బంధం తెగింది.



● కార్తీకి (దర్శకురాలు), గునీత్ మోంగ (నిర్మాత)



క్వార్టర్ ఫైనల్లో మనిక జోడీ

ప్రపంచ టేబుల్ టెన్నిస్ సింగపూర్ స్మాష్ టోర్నమెంట్ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో మనిక బత్రా–సత్యన్ జ్ఞానశేఖరన్ (భారత్) జోడీ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. సింగపూర్‌లో సోమవారం జరిగిన రెండో రౌండ్ మ్యాచ్‌లో మనిక–సత్యన్ ద్వయం 11–7, 12–10, 9–11, 11–3తో జెంగ్ జియాన్–క్లారెన్స్ చ్యూ (సింగపూర్) జోడీపై గెలిచింది. మనిక–సత్యన్ జోడీకి తొలి రౌండ్‌లో 'బై' లభించింది. నేడు జరిగే క్వార్టర్ ఫైనల్లో జపాన్‌కు చెందిన హరిమోతో–హినా హయాటా ద్వయంతో మనిక–సత్యన్ ఆడతారు.

నేటి నుంచి ఆల్ ఇంగ్లండ్ టోర్నీ

ప్రతిష్టాత్మక ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ నేడు బర్మింగ్‌హామ్‌లో మొదలుకానుంది. 2001లో పుల్లెల గోపీచంద్ తర్వాత మరో భారత ప్లేయర్ ఈ టోర్నీ టైటిల్‌ను సాధించలేకపోయాడు. మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు, సైనా నెహ్వాల్... పురుషుల సింగిల్స్‌లో శ్రీకాంత్, లక్ష్య సేన్, ప్రణయ్ టైటిల్ కోసం తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. 2009 తర్వాత తొలిసారి భారత క్రీడాకారులెవరికీ సీడింగ్ లభించలేదు.





సిరీస్ మనదే

- ఆస్ట్రేలియాతో చివరి టెస్ట్ 'డ్రా'
- సిరీస్ 2–1తో భారత్ వశం
- డబ్ల్యూటీసీ ఫైనల్‌కు టీమిండియా

ఆఖరి రోజు ఏ మలుపూ లేదు. ఆలౌట్ చేయడం మన బౌలర్ల వల్ల కాలేదు. బ్యాటర్ల జోరులో ఏ మార్పూ లేదు. చివరకు ఎలాంటి డ్రామా లేకుండా నాలుగో టెస్టు 'డ్రా' అయింది. ఆసీస్ ఓపెనర్ ట్రావిస్ హెడ్ ఓ పది పరుగులు చేసుంటే ఇంకో ఈ టెస్ట్‌లో ఐదో సెంచరీ అయ్యేది. ఐదు రోజుల పాటు రోజుకో సెంచరీ చొప్పున ఈ మ్యాచ్‌కు అపూర్వ ఘనత దక్కేది. మరోవైపు క్రైస్ట్‌చర్చ్‌లో న్యూజిలాండ్ చేతిలో తొలి టెస్ట్‌లో శ్రీలంక ఓడిపోవడంతో ఈ మ్యాచ్ తుది ఫలితంతో సంబంధం లేకుండానే భారత్ ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌కు అర్హత సాధించింది.

అహ్మదాబాద్: భారత్, ఆస్ట్రేలియాల మధ్య మూడు రోజుల్లో ముగిసిన గత టెస్టులకు భిన్నంగా ఆఖరి మ్యాచ్ 'డ్రా' అయ్యింది. 2–1తో సిరీస్‌ను వశం చేసుకున్న టీమిండియా 'బోర్డర్–గావస్కర్ ట్రోఫీ'ని వరుసగా నాలుగోసారి చేజిక్కించుకుంది. నాలుగో టెస్టు చివరి రోజు కూడా బ్యాటర్స్ హవానే కొనసాగింది. దీంతో భారత బౌలర్లు శక్తికి మించి శ్రమించినా రెండు వికెట్లే పడగొట్టగలిగారు. ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో 78.1 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 175 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. ట్రావిస్ హెడ్ (163 బంతుల్లో 90; 10 ఫోర్లు, 2 సిక్సర్లు), లబుషేన్ (213 బంతుల్లో 63 నాటౌట్; 7 ఫోర్లు) రాణించారు. ఫలితానికి అవకాశం లేకపోవడంతో గంట ముందే 'డ్రా'కు ఇరుజట్ల కెప్టెన్లు అంగీకరించారు. విరాట్ కోహ్లికి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించగా... స్పిన్‌తో భారత్‌కు సిరీస్ విజయాన్నిచ్చిన బౌలింగ్ ద్వయం అశ్విన్–రవీంద్ర జడేజాలకు సంయుక్తంగా 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డు ఇచ్చారు. ఇరు జట్ల మధ్య మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ ఈనెల 17న ముంబైలో జరిగే తొలి మ్యాచ్‌తో మొదలవుతుంది.

హెడ్ సెంచరీ మిస్...

ఆఖరి రోజు ఓవర్‌నైట్ స్కోరు 3/0తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆస్ట్రేలియా కాసేపటికే ఓపెనర్ కునెమన్ (6) వికెట్‌ను కోల్పోయింది. జట్టు స్కోరు 14 పరుగుల వద్ద అతని వికెట్‌ను అశ్విన్ పడగొట్టగానే భారత శిబిరం సంబరపడింది. ఇక మ్యాజిక్ షురూ అనుకుంటే... అక్కడి పిచ్ 'అంతలేదు' అన్నట్లుగా బ్యాటర్లకే సహకరించింది. దీంతో హెడ్, వన్‌డౌన్ బ్యాటర్ లబుషేన్ నింపాదిగా ఆడుకున్నారు. రిస్క్ తీసుకోకుండా 'డ్రా' కోసమే వాళ్లిద్దరు క్రీజుకు అతుక్కుపోయారు. దీంతో భారత బౌలర్లు ఎంత చెమటోడ్చినా తొలి సెషన్‌లో మరో వికెట్ దొరకలేదు. 73/1 స్కోరు వద్ద లంచ్ విరామానికెళ్లారు. అనంతరం రెండో సెషన్‌లో హెడ్ 112 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసుకోగా... మరికాసేపటి ఆసీస్ స్కోరు 100 పరుగులు దాటింది. హెడ్ అడపాదడపా బౌండరీలతో పరుగులు సాధించడంతో ఐదో రోజు కూడా సెంచరీ ఖాయమనిపించింది. కానీ హెడ్ అహ్మదాబాద్ టెస్టుకు ఆ అరుదైన అవకాశం ఇవ్వకుండా 90 పరుగుల వద్ద అక్షర్ బౌలింగ్‌లో అవుటయ్యాడు. లబుషేన్ 150 బంతుల్లో అర్ధసెంచరీ సాధించగా, 158/2 వద్ద రెండో సెషన్ ముగిసింది. 'డ్రా' దిశగా సాగడంతో మూడో సెషన్‌లో 11 ఓవర్ల ఆటే ఆడారు. సిరీస్‌లో జరిగిన మూడు టెస్టుల్లోనూ 30 పైచిలుకు వికెట్లు మూడు రోజుల్లోనే రాలితే... ఆఖరి టెస్టు ఐదు రోజులు జరిగినా బౌలర్లు 22 వికెట్లను మించి పడగొట్టలేకపోయారు.

మరో మ్యాచ్ మిగిలుంది... అదే ఫైనల్!

భారత్, ఆస్ట్రేలియాల మధ్య ద్వైపాక్షిక టెస్టు సిరీస్ అయితే ముగిసింది. కానీ ఇరుజట్ల మధ్య మరో 'టెస్టు' మిగిలుంది! అదేనండి... డబ్ల్యూటీసీ ఫైనల్. ఇక్కడ బోర్డర్–గావస్కర్ ట్రోఫీ విజేతను తేల్చినట్లే ఇంగ్లండ్‌లో ప్రపంచ టెస్టు చాంపియన్ ఎవరో కూడా తేలుతుంది. ఈ ఏడాది జూన్‌లో 7 నుంచి 11 వరకు లండన్‌లోని ది ఓవల్ మైదానంలో డబ్ల్యూటీసీ ఫైనల్ మ్యాచ్ జరుగుతుంది.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 480; **భారత్ తొలి ఇన్నింగ్స్:** 571; **ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్:** కునెమన్ (ఎల్బీడబ్ల్యూ) అశ్విన్ 6; హెడ్ (బి) అక్షర్ పటేల్ 90; లబుషేన్ (నాటౌట్) 63; స్టీవ్ స్మిత్ (నాటౌట్) 10; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (78.1 ఓవర్లలో 2 వికెట్లకు డిక్లేర్డ్)** 175. **వికెట్ల పతనం:** 1–14, 2–153. **బౌలింగ్:** అశ్విన్ 24–9–58–1, రవీంద్ర జడేజా 20–7–34–0, షమీ 8–1–19–0, అక్షర్ పటేల్ 19–8–36–1, ఉమేశ్ యాదవ్ 5–0–21–0, గిల్ 1.1–0–1–0, పుజారా 1–0–1–0.

16 సొంతగడ్డపై భారత జట్టుకిది వరుసగా 16వ టెస్ట్ సిరీస్ విజయం.

1 మూడు ఫార్మాట్‌లలో (టెస్ట్, వన్డే, టి20) కనీసం 10 చొప్పున 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డులు గెల్చుకున్న తొలి క్రికెటర్‌గా కోహ్లి ఘనత.

50 భారత్ తరఫున తక్కువ బంతుల్లో టెస్టుల్లో 50 వికెట్లు పూర్తి చేసుకున్న బౌలర్‌గా అక్షర్ పటేల్ గుర్తింపు పొందాడు. కెరీర్‌లో 12 టెస్టులు ఆడిన అక్షర్ 2,205 బంతుల్లో 50 వికెట్ల మైలురాయి అందుకున్నాడు. బుమ్రా (2,465 బంతులు) పేరిట ఉన్న రికార్డును అక్షర్ సవరించాడు.

2 టెస్టుల్లో అత్యధిక 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు గెల్చుకున్న ఆటగాళ్ల జాబితాలో అశ్విన్ రెండో స్థానానికి చేరుకున్నాడు. అశ్విన్ 37 సిరీస్‌లలో 10 సార్లు ఈ పురస్కారం గెల్చుకున్నాడు. ముత్తయ్య మురళీధరన్ (62 సిరీస్‌లలో 11 సార్లు) అగ్రస్థానంలో ఉండగా... జాక్వస్ కలిస్ (61 సిరీస్‌లలో 9 సార్లు) మూడో స్థానానికి పడిపోయాడు.

'టాప్'లోకి భారత్

విశ్వవిజేత జర్మనీపై 6–3తో విజయం



రూర్కెలా: ప్రో హాకీ లీగ్‌లో భాగంగా ప్రపంచ చాంపియన్ జర్మనీ జట్టుతో సోమవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో భారత్ 6–3 గోల్స్‌తో గెలిచింది. మూడు రోజుల వ్యవధిలో జర్మనీపై భారత్‌కిది రెండో గెలుపు కావడం విశేషం. ఈ విజయంతో భారత్ 17 పాయింట్లతో 'టాప్'లోకి వచ్చింది. భారత్ తరఫున సెల్వం కార్తీ (24వ, 46వ ని.లో), అభిషేక్ (22వ, 51వ ని.లో) రెండు గోల్స్ చొప్పున సాధించగా... కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ (26వ ని.లో), జుగ్‌రాజ్ (21వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. జర్మనీ తరఫున గ్రామ్‌బుష్ (3వ ని.లో), పీలాట్ (23వ ని.లో), హెల్‌విగ్ (33వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు.

బెంగళూరు ఐదో 'సారీ'

- మళ్లీ ఓడిన స్మృతి మంధాన జట్టు
- ఢిల్లీ క్యాపిటల్స్‌కు నాలుగో గెలుపు



ముంబై: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) వేలంలో అత్యధిక ధర పలికిన స్మృతి మంధాన సారథ్యంలో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టు వరుసగా ఐదో మ్యాచ్‌లోనూ పరాజయం పాలైంది. సోమవారం జరిగిన పోరులో ఢిల్లీ క్యాపిటల్స్ 6 వికెట్ల తేడాతో ఆర్‌సీబీపై గెలిచింది. ఈ టోర్నీలో ఢిల్లీకిది నాలుగో విజయం. మొదట ఆర్‌సీబీ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 150 పరుగులు చేసింది. స్మృతి (15 బంతుల్లో 8; 1 ఫోర్) నిరాశపరచగా... ఎలీస్ పెరీ (52 బంతుల్లో 67 నాటౌట్; 4 ఫోర్లు, 5 సిక్సర్లు) అర్ధసెంచరీ సాధించింది. రిచా ఘోష్ (16 బంతుల్లో 37; 3 ఫోర్లు, 3 సిక్సర్లు) ధాటిగా ఆడింది. ఢిల్లీ బౌలర్లలో శిఖా పాండే 3 వికెట్లు తీసింది. అనంతరం ఢిల్లీ 19.4 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 154 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్ షఫాలీ వర్మ (0) ఆడిన తొలి బంతికే మేగన్ షుట్ బౌలింగ్‌లో బౌల్డ్ అయి పెవిలియన్ చేరుకుంది. అయితే అలైస్ క్యాప్సీ (24 బంతుల్లో 38; 8 ఫోర్లు), జెమీమా రోడ్రిగ్స్ (28 బంతుల్లో 32; 3 ఫోర్లు), మరిజన్ కాప్ (32 బంతుల్లో 32 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్), జెస్ జొనాసెన్ (15 బంతుల్లో 29 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్) సమష్టిగా రాణించి ఢిల్లీ క్యాపిటల్స్ విజయాన్ని ఖాయం చేశారు. ఇప్పటి వరకు ఐదు మ్యాచ్‌లు ఆడిన ఢిల్లీ నాలుగు విజయాలతో ఎనిమిది పాయింట్లు సాధించి ముంబై ఇండియన్స్‌తో సంయుక్తంగా అగ్రస్థానానికి చేరుకుంది. బెంగళూరు పాయింట్ల ఖాతా తెరవలేదు.

నేడు జరిగే మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌తో గుజరాత్ జెయింట్స్ ఆడుతుంది.

హైదరాబాద్ ఎఫ్‌సీ ఓటమి

కోల్‌కతా: ఇండియన్ సూపర్ లీగ్ టోర్నీలో డిఫెండింగ్ చాంపియన్ హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) పోరాటం సెమీఫైనల్లో ముగిసింది. సోమవారం హైదరాబాద్ ఎఫ్‌సీ, ఏటీకే మోహన్ బగాన్ క్లబ్ మధ్య జరిగిన రెండో సెమీఫైనల్ కూడా తొలి సెమీఫైనల్ మాదిరిగానే 0–0తో 'డ్రా'గా ముగిసింది. దాంతో విజేతను నిర్ణయించడానికి షూటౌట్ నిర్వహించారు. 'షూటౌట్'లో మోహన్ బగాన్ 4–3తో హైదరాబాద్‌ను ఓడించింది. షూటౌట్‌లో హైదరాబాద్ తరఫున జావో, డాను, రీగన్ సఫలంకాగా... సివెరియో, ఒగ్‌బెచె విఫలమయ్యారు. ఈనెల 18న గోవాలో జరిగే ఫైనల్లో బెంగళూరు ఎఫ్‌సీతో మోహన్ బగాన్ ఆడుతుంది.



చివరి బంతికి న్యూజిలాండ్ విజయం

- విలియమ్సన్ వీరోచిత సెంచరీ
- తొలి టెస్టులో ఓడిన శ్రీలంక


విలియమ్సన్

క్రైస్ట్‌చర్చ్: కేన్ విలియమ్సన్, నీల్ వాగ్నర్ ఆఖరి బంతికి 'బై' రూపంలో పరుగు సాధించి... శ్రీలంకతో జరిగిన తొలి టెస్ట్‌లో న్యూజిలాండ్ జట్టుకు రెండు వికెట్ల తేడాతో విజయాన్ని అందించారు. శ్రీలంక నిర్దేశించిన 285 పరుగుల లక్ష్యాన్ని న్యూజిలాండ్ 70 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి ఛేదించింది. విలియమ్సన్ (121 నాటౌట్; 11 ఫోర్లు, 1 సిక్స్) వీరోచిత సెంచరీ సాధించి న్యూజిలాండ్‌ను విజయతీరానికి చేర్చాడు. చివరిరోజు వర్షంతో తొలి రెండు సెషన్‌లు ఆట సాధ్యం కాలేదు. వర్షం వెలిశాక మూడో సెషన్‌ను పొడిగించి కనీసం 52 ఓవర్లు ఆడించాలని అంపైర్లు నిర్ణయించారు. దాంతో ఓవర్‌నైట్ స్కోరు 28/1తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన న్యూజిలాండ్ 'డ్రా' కోసం కాకుండా విజయం కోసం పోరాడింది. 90 పరుగుల వద్ద మూడో వికెట్ కోల్పోయిన న్యూజిలాండ్‌ను విలియమ్సన్, డర్లై మిచెల్ (81; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) నిలబెట్టారు. వీరిద్దరు నాలుగో వికెట్‌కు 142 పరుగులు జోడించారు. ఇన్నింగ్స్ 62వ ఓవర్లో అసిత ఫెర్నాండో బౌలింగ్‌లో మిచెల్ బౌల్డయ్యాడు. అప్పటికి న్యూజిలాండ్ విజయానికి 48 బంతుల్లో 53 పరుగులు అవసరం. మిచెల్ అవుటయ్యాక విలియమ్సన్ జట్టును లక్ష్యం దిశగా తీసుకుపోగా... బ్రేస్‌వెల్, కెప్టెన్ టిమ్ సౌతీ పెవిలియన్ చేరారు. ఆఖరికి న్యూజిలాండ్ విజయానికి చివరి ఓవర్‌లో 8 పరుగులు అవసరమయ్యాయి. అసిత ఫెర్నాండో వేసిన ఈ ఓవర్‌లో తొలి రెండు బంతులకు సింగిల్స్ రాగా... మూడో బంతికి హెన్రీ అవుటయ్యాడు. నాలుగో బంతిని విలియమ్సన్ బౌండరీ దాటించాడు. ఐదో బంతికి పరుగు రాలేదు. చివరి బంతికి విలియమ్సన్ సింగిల్ తీసి కివీస్ విజయాన్ని ఖాయం చేశాడు.

సాగుబడి
పూర్వాభాద్ర కార్తె: మార్చి 5 నుంచి

- అతి తక్కువ వర్షంతో పండే ఎడారి పంట.. ఎరువులు, పురుగుమందులు అక్కర్లేదు
- పశువులు, పక్షులు, అడవి జంతువుల బాధ లేదు
- 30 ఏళ్లుగా.. 30 ఎకరాల్లో జీవీ కొండయ్య అశ్వగంధ సాగు

అశ్వగంధ.. మెట్ట రైతుకు అండ..


అశ్వగంధ పొలంలో కొండయ్య

కింగ్ ఆఫ్ ఆయుర్వేదగా పేరొందిన ఔషధ పంట అశ్వగంధ మెట్ట రైతులకు లాభాల సిరులను కురిపిస్తోంది. తీవ్రమైన వర్షాభావ పరిస్థితుల్లో సంప్రదాయ పంటలను నమ్ముకొని ఏటా పంట నష్టంతో కుదేలైన జీవీ కొండయ్య అనే రైతు వినూత్నంగా ఆలోచించారు. అనంతపురం జిల్లా గుంతకల్లు మండలం జీ.కొట్టాల గ్రామంలోని తన పొలంలో 30 ఏళ్ల క్రితం అశ్వగంధ సాగుకు శ్రీకారం చుట్టి లాభాలు గడిస్తూ రైతులకు ఆదర్శంగా నిలిచారు. కొండయ్యను ఆదర్శంగా తీసుకొని కర్నూలు, అనంతపురం, కడప జిల్లాల్లో ఎందరో రైతులు అశ్వగంధ సాగు చేపట్టారు. ఆయన సలహాలు, సూచనలు పాటిస్తూ లాభాలు గడిస్తున్నారు. అశ్వగంధ పంటపై హైదరాబాదు బోడుప్పల్‌లోని కేంద్రీయ ఔషధ, సుగంధ మొక్కల పరిశోధనా కేంద్రం (సీమాప్)లో జరిగిన అవగాహన సదస్సు పాల్గొన్నారు. శాస్త్రవేత్తలు చెప్పింది శ్రద్ధగా విన్న కొండయ్య ఆ సీజన్‌లోనే ఎకరాకు రూ.6 వేల ఖర్చుతో 5 ఎకరాల్లో అశ్వగంధను సాగు చేశారు. అతి తక్కువ వర్షపాతంలోనే పండే పంట ఇది. ఎటువంటి క్రిమి సంహారక మందులుగానీ, ఎరువులు గానీ వాడాల్సిన అవసరం లేదు. తక్కువ ఖర్చుతోనే మంచి దిగుబడి సాధించారు. ఎకరాకు 3 క్వింటాళ్ల అశ్వగంధ వేర్ల దిగుబడి రావడంతో క్వింటాకు రూ.40 వేల వరకూ ఆదాయం పొందారు. నాటి నుంచి కొండయ్య వెనుతిరిగి చూడలేదు. 5 ఎకరాలతో ప్రారంభించి 30 ఎకరాలకు విస్తరించారు. తనకున్న 8 ఎకరాలతో పాటు ఇతర రైతుల భూమిని కౌలుకు తీసుకొని, ప్రతి ఏడాదీ భూమి మారుస్తూ. అశ్వగంధను సాగు చేస్తున్నారు. అశ్వగంధ సాగులో మంచి దిగుబడి సాధించడంతోపాటు, నాణ్యమైన దిగుబడితో ప్రశంసలు అందుకుంటున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర మెడిషినల్ బోర్డు నుంచి, లక్నోలోని 'సీమాప్'తో పాటు ఢిల్లీ, జైపూర్‌లలో కూడా అవార్డులు సొంతం చేసుకున్నారు. 2 ఎకరాల్లో ఫారం పాడ్లు నిర్మించి, వర్షాభావ పరిస్థితుల్లోనూ మంచి దిగుబడులు సాధిస్తూ వచ్చారు. కొండయ్యను చూసి సొంత గ్రామంతోపాటు రాయలసీమ జిల్లాల రైతులు పలువురు అశ్వగంధ సాగు చేస్తూ లాభాలు గడిస్తుండటం విశేషం.

– యం.మనోహర్,
సాక్షి, గుంతకల్లు రూరల్,
అనంతపురం జిల్లా

మార్కెటింగ్ సమస్య లేదు

అశ్వగంధ పంటను జూలైలో విత్తితే జనవరిలో పంట చేతికి వస్తుంది. వర్షపాతం అతితక్కువ ఉన్న ప్రాంతాలకే ఈ పంట అనుకూలం. వర్షాలు ఎకువైతే వేరు కుళ్లిపోయి పంట పాడైపోతుంది. పెట్టుబడి పెద్దగా అవసరం లేదు. కిలో రూ.200 చొపున ఎకరాకు 3 కేజీల విత్తనం వేస్తే సరిపోతుంది. పంటకు చీడపురుగుల బెడదగానీ, తెగుళ్ల బెడద గానీ ఏమీ ఉండవు. పశువులు, పక్షులు, జింకల నుంచి కూడా ముప్పు ఉండదు. పశువుల పేడను ఎరువుగా వేస్తే సరిపోతుంది. విత్తిన నెల తరువాత ఒకసారి, 3 నెలల తరువాత మరోసారి కలుపు తీయాలి. పంట పీకిన రోజే వేరును, కాండాన్ని, కాయలను వేరు చేసి ఆరబెడతాం. వేరు నాణ్యతను బట్టి 6 భాగాలుగా విభజించి ప్యాకింగ్ చేసి పెడతాం. కాయను నూర్పిడి చేసి విత్తనాలు తీస్తాం. ఎకరాకు 50 నుండి 100 కేజీల వరకూ విత్తనం వస్తుంది. అదే విత్తనాన్నే తిరిగి పంట సాగుకు ఉపయోగిస్తాం. మిగిలిన విత్తనాన్ని కావాల్సిన రైతులకు కిలో రూ.200 చొప్పున విక్రయిస్తాం. అశ్వగంధ విత్తనం వేశాక తరువాత నెలరోజుల పాటు వర్షం రాకపోయినా విత్తనం ఏమీ కాదు. అశ్వగంధ పంట సాగు చేసే రైతులకు ప్రభుత్వం సబ్సిడీ రూపంలో ప్రోత్సాహం కూడా అందుతుంది. పంటను నిల్వ చేసేందుకు స్టోరేజీ రూముల నిర్మాణానికి డబ్బు కూడా ఇస్తుంది. వ్యాపారులు పొలం వద్దకే వచ్చి కొంటున్నారు. మార్కెటింగ్ సమస్య లేదు.

– జీవీ కొండయ్య (94415 35325),
అశ్వగంధ రైతు, జీ.కొట్టాల, గుంతకల్లు మం.,
అనంతపురం జిల్లా


అశ్వగంధ పంట కోత

18న బోడుప్పల్‌లో రైతు మేళా

సుగంధ, ఔషధ మొక్కల సాగుపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల రైతులకు అవగాహన కల్పించేందుకు ఈ నెల 18 (శనివారం ఉ. 10–5 గం.)న సికింద్రాబాద్ సమీపంలోని బోడుప్పల్‌లోని కేంద్రీయ ఔషధ–సుగంధ మొక్కల సంస్థ (సీమాప్) పరిశోధనా కేంద్రం ఆవరణలో రైతు మేళాను నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ శాస్త్రవేత్త డా. జి.డి. కిరణ్ బాబు చెప్పారు. పాల్గొనదలచిన వారు తప్పనిసరిగా రిజిస్టర్ చేసుకోవాలి. వివరాలకు.. 040–29301131, 78298 11050, 94910 43252.

మీకు మిద్దెతోట ఉందా?

మిద్దె తోటల్లో కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, పూలు వంటి ఇంటిపంటలు పండిస్తున్న వారు తెలుగు రాష్ట్రాల్లో చాలా మంది ఉన్నారు. అయితే, వారి సంఖ్య ఎంత? ఎన్ని చదరపు అడుగుల్లో వారి మిద్దె తోట ఉంది? వంటి విషయాలు తెలుసుకోవడానికి మిద్దెతోట ఫౌండేషన్ సర్వే చేయదలచింది. మీరు మిద్దె తోటలు/ఇంటిపంటల సాగుదారులైతే ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి గూగుల్ ఫాంలో మీ వివరాలను పొందుపరచండి. సందేహాలుంటే.. గుంటూరు మిద్దెతోటల పెంపకందారుల సంఘం అధ్యక్షురాలు కొల్లి కృష్ణకుమారి (94906 02366)ని సంప్రదించవచ్చు.

సుందర రామన్ సదస్సులు

తమిళనాడుకు చెందిన ప్రకృతి వ్యవసాయ నిపుణులు, రైతు శాస్త్రవేత్త ఎస్.ఆర్. సుందర రామన్ తెలుగు రాష్ట్రాల్లో ఈ నెలలో అనేక చోట్ల రైతు సదస్సుల్లో ప్రసంగించనున్నారు. ఈ నెల 15న ముచ్చింతల్, 16న కల్వకుర్తి, 17న అహోబిలం, 19–20న గుంటూరు రైతునేస్తం ఫౌండేషన్, 21న వినుకొండ, 22న వరగాని, 23న మండలపల్లిలో ప్రసంగిస్తారు. వివరాలకు.. కిశోర్ – 99490 94370.

- శ్రీగంధం, టేకు చెట్లకు ప్రూనింగ్ మరణ శాసనమే
- 'సాక్షి సాగుబడి'తో శాస్త్రవేత్త డా. సుందరరాజ్

శ్రీగంధం, టేకు చెట్ల కొమ్మలు కత్తిరిస్తున్నారా?


ప్రూనింగ్ చేసిన శ్రీగంధం చెట్టు.. ప్రూనింగ్ గాయం


ప్రూనింగ్ చేసిన టేకు చెట్టు.. ప్రూనింగ్ గాయం

శ్రీగంధం (చందనం), టేకు వంటి అధిక విలువైన కలప తోటల సాగుకు దక్షిణాది రాష్ట్రాలు పెట్టింది పేరు. ప్రైవేటు భూముల్లో సాగుకు ప్రభుత్వం అనుమతించడంతో ముఖ్యంగా శ్రీగంధం తోటల సాగు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో గత 20 ఏళ్లలో బాగా పెరిగింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో ఈ మధ్యనే సాగు విస్తరిస్తోంది. శ్రీగంధం,టేకు సాగు రైతులకు అధికాదాయాన్నిచ్చే కలప తోటలు. శ్రీగంధం చెట్లను 15 ఏళ్లు శ్రద్ధగా పెంచితే ఒక్కో చెట్టుపై రూ. లక్ష వరకూ కూడా ఆదాయం రావటానికి అవకాశం ఉందని బెంగళూరులోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(ఐ.డబ్ల్యు.ఎస్.టి.) శాస్త్రవేత్త చెబుతున్నారు. ఏపీ, తెలంగాణ సహా 5 దక్షిణాది రాష్ట్రాల్లో శ్రీగంధం, టేకు తోటల సాగుపై ఈ సంస్థ పరిశోధనలు చేస్తోంది. ఐ.డబ్ల్యు.ఎస్.టి. శాస్త్రవేత్త డా. ఆర్.సుందరరాజ్ శ్రీగంధం, టేకు తోటల సాగులో సాధారణంగా రైతులు చేసే తప్పుల గురించి 'సాక్షి సాగుబడి'తో పంచుకున్నారు.

ప్రూనింగ్‌తో నష్టాలు

మామిడి, దానిమ్మ, మునగ, మల్బరీ వంటి తోటల్లో పంటకోతలు పూర్తయ్యాక కొమ్మ కత్తిరింపులు చేస్తుంటారు. ఈ తోటల్లో ప్రూనింగ్ వల్ల అనేక రకాలుగా వెసులుబాటు కలుగుతుంది. దిగుబడి పెరగడంతో పాటు చెట్ల కొమ్మలు మరీ ఎత్తుగా పెరగనీయకుండా ఉండటం వల్ల పంటకోత సులువు అవుతుంది. ఈ అలవాటు కొద్దీ శ్రీగంధం, టేకు చెట్లకు కూడా ప్రూనింగ్ చేస్తున్నారు. ఇది పెద్ద తప్పు. మేలు కన్నా కీడు ఎక్కువగా జరుగుతోందని డా. సుందర్‌రాజ్ అంటున్నారు.

శ్రీగంధం, టేకు చెట్ల కాండం లోపలి కలపను, మధ్యలోని చేవను చీడపీడల నుంచి రక్షించేది కాండం పైన ఉండే బెరడే. కొమ్మలు కత్తిరించినప్పుడు బెరడు దెబ్బతిని, ఎండిపోతుంది. కొమ్మను నరికిన చోట కాండం లోపలి పొరలు బయటపడతాయి. ఆ విధంగా కలపను కుళ్లింపజేసే శిలీంధ్రాలు, నష్టం చేసే కాండం తొలిచే పురుగులు ప్రూనింగ్ జరిగిన చోటు నుంచి చెట్టు లోపలికి ప్రవేశిస్తాయి. తద్వారా చెట్టు బలహీనపడుతుంది. ఆకుల పెరుగుదల మందగిస్తుంది. కాయలు రాలిపోతాయి. ప్రూనింగ్ గాయాలు కొమ్మల సహజ పెరుగుదలను దెబ్బతీస్తాయి. చెట్టు సమతుల్యత దెబ్బతిని గాలుల వల్ల నష్టం కలుగుతుంది. చాలా సందర్భాల్లో చెట్లు ప్రూనింగ్ జరిగిన కొద్దికాలంలోనే చనిపోతాయి కూడా అంటున్నారు డా. సుందర్‌రాజ్.

15 ఏళ్ల చెట్టుకు 10 కిలోల చేవ

ఒక రైతు ఇంటి దగ్గర పెరుగుతున్న ఈ మూడు శ్రీగంధం చెట్ల వయస్సు 15 సంవత్సరాలు. ఈ మూడిటికీ కొమ్మలు కత్తిరించారు. తక్కువ ప్రూనింగ్ వల్ల రెండు చెట్లు కోలుకున్నాయి. కానీ మూడో చెట్టుకు అతిగా ప్రూనింగ్ చేయటం వల్ల కోలుకోలేకపోయింది. మేం ఈ చెట్లకు చేవ (హార్ట్‌వుడ్) ఎంత ఉందో పరీక్షించాం. మొదటి రెండు చెట్ల కాండంలో మాత్రమే హార్ట్‌వుడ్ కనిపించింది. బలహీనంగా ఉన్న మూడో చెట్టులో అసల్లేదు. చెట్టు మీ కోసమో, నా కోసమో చేవదేలదు. తన బలం కొద్దీ చేవదేలుతుంది. కాబట్టి ఏ చెట్టు నాణ్యతైనా, చేవ పరిమాణమైనా అది ఎంత ఆరోగ్యకరంగా పెరుగుతున్నదన్నదానిపై ఆధారపడి ఉంటుంది. నా అనుభవం ప్రకారం, 15 సంవత్సరాలు ఆరోగ్యంగా పెరిగిన చందనపు చెట్టుకు కనీసం 10 కిలోల చేవ ఉంటుంది. దాన్ని బట్టే రైతుకు ఆదాయం వస్తుంది.

– డా. ఆర్.సుందరరాజ్
(97404 33959),
శాస్త్రవేత్త, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ,
బెంగళూరు




ప్రూనింగ్ చేసిన 3 శ్రీగంధం చెట్లు ఇవే

కలప మన్నికకు గొడ్డలిపెట్టు


టేకు కలప పదికాలాల పాటు చెక్కుచెదరకుండా ఉంటుంది. టేకు కలప జీవక్షీణతకు గురిచేసే సూక్ష్మజీవరాశిని అరికట్టే రక్షక పదార్థాలు (మెటబాలిటీస్ లేదా ఎక్స్‌ట్రాక్టివ్స్) చెట్టు కాండం లోపలి పొరల్లో ఉండబట్టే టేకు కలపకు ఈ గట్టితనం వచ్చింది. ప్రూనింగ్ చేసిన టేకు చెట్లలో ఈ పదార్థాలు లోపించటం వల్ల ఆ కలప మన్నిక కాలం తగ్గిపోతుంది. ఐ.డబ్ల్యు.ఎస్.టి. నిపుణుల అధ్యయనంలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. ఇంటర్నేషనల్ బయోడిటీరియోరేషన్ అండ్ బయోడిగ్రేడేషన్ జర్నల్‌లో ప్రచురితమైన వ్యాసంలో ఈ విషయాలు పొందుపరిచారు. శ్రీగంధం చెట్లకు ప్రూనింగ్ చేస్తే ఎత్తు పెరగొచ్చు గానీ కాండం చుట్టుకొలత పెరగదు. ప్రూనింగ్ గాయాల దగ్గర సుడులు ఏర్పడటం వల్ల చెక్క అందం పాడవుతుంది.

ప్రూనింగ్ చేయటం వల్ల శ్రీగంధం, టేకు చెట్లకు నష్టం జరగటమే కాదు దాని చుట్టూ ఉండే పర్యావరణ వ్యవస్థకు తెలియకుండానే పెద్ద నష్టం జరుగుతుందట. ప్రూనింగ్ చేసిన చెట్లకు గాయాలపై బోర్డెక్స్ పేస్ట్ వంటి శిలీంధ్ర నాశనులను పూస్తుంటారు. అయితే, ఇది పూర్తి రక్షణ ఇస్తుందని చెప్పలేమని డా. సుందరరాజ్ తెలిపారు. రసాయనాల ప్రతికూల ప్రభావాలు శ్రీగంధం చెట్లపై చాలా ఉంటుంది. ఎవరో చెప్పిన మాటలు విని శ్రీగంధం, టేకు చెట్లకు ప్రూనింగ్ చేయొద్దని, చెట్లను సహజంగా పెరగనిస్తూ ప్రకృతి సేద్య పద్ధతులను అనుసరించాలని డా. సుందరరాజ్ సూచిస్తున్నారు.

– పంతంగి రాంబాబు,
సాక్షి సాగుబడి డెస్క్

క్లుప్తంగా...

పోడు భూముల పంపిణీపై స్టేకు నిరాకరణ



సాక్షి, హైదరాబాద్: పోడు భూముల పంపిణీపై స్టే ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. పోడు భూముల క్రమబద్ధీకరణలో చట్టం, నిబంధనలు పాటించాలని అధికారులను ఆదేశించింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ, తదుపరి విచారణను జూన్ 22 కు వాయిదా వేసింది. పోడు పట్టాల పంపిణీలో అనేక అక్రమాలు జరుగుతున్నాయని, వాటిని అడ్డుకునేందుకు ఆ ప్రక్రియపై స్టే ఇవ్వాలని కోరుతూ ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ పద్మనాభరెడ్డి హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం విచారణ చేపట్టింది. పోడు భూములకు నిబంధనలు పాటించకుండా పట్టాలివ్వడం చట్టవిరుద్ధ మని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. అటవీ హక్కుల చట్టం, నిబంధనలు, సుప్రీం తీర్పునకు విరుద్ధంగా ప్రభుత్వ మెమో ఉందన్నారు. కాగా, పట్టాలు పంపిణీని అడ్డుకోవద్దని కోరుతూ ఇందులో తుడుందెబ్బ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రవణ్‌కుమార్ ఇంప్లీడ్ పిటిషన్ వేశారు. ఈయన తరఫున న్యాయవాది ప్రభాకర్ వాదనలు వినిపిస్తూ, షెడ్యూల్ తెగల వారికి పథకాలు అందడం లేదన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. పోడు భూములకు పట్టాల పంపిణీపై స్టే ఇవ్వడానికి నిరాకరిస్తూ, విచారణను వాయిదా వేసింది.

నగల దుకాణం శాఖలపై ఐటీ దాడులు

పరిగి/షాద్‌నగర్/జడ్చర్ల: మహబూబ్‌నగర్, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో సోమవారం ఆదాయపన్ను అధికారులు ఒక నగల దుకాణం శాఖలపై ఏక కాలంలో దాడులు నిర్వహించారు. షాద్‌నగర్ పట్టణానికి చెందిన పలభట్ల సతీష్‌కుమార్ పరిగిలో నిర్వహిస్తున్న వెంకటరమణ జ్యువెలర్స్ దుకాణంలో మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి వరకు ఐటీ దాడులు నిర్వహించారు. ఆ జ్యువెలర్స్ బ్రాంచ్‌లపై ఏకకాలంలో దాడులు జరుగుతున్నాయి. ఆరుగురు ఉన్నత ఐటీ అధికారుల బృందం సోదాల్లో కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.

నోట్ల రద్దు పూర్తిగా విఫలమైంది: ఎంపీ ఉత్తమ్



సాక్షి, న్యూఢిల్లీ: 2016 నవంబర్‌లో అమలు చేసిన నోట్ల రద్దు లక్ష్యాలన్నింటినీ సాధించడంలో విఫలమయ్యామని కేంద్ర ప్రభుత్వమే అంగీకరించిందని కాంగ్రెస్ ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. లోక్‌సభలో సోమవారం తాను అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అందించిన గణాంకాలు.. నోట్ల రద్దు లక్ష్యాలేవీ కేంద్ర ప్రభుత్వం సాధించలేదని స్పష్టంగా చూపిస్తున్నాయని చెప్పారు. దేశంలో నల్ల ధనం చలామణీని తగ్గించడం, డిజిటల్ ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యం అని ఆర్థిక మంత్రి తన లిఖితపూర్వక సమాధానంలో తెలిపారని ఆయన పేర్కొన్నారు. అయితే, నోట్ల రద్దు తర్వాత చెలామణీలో ఉన్న కరెన్సీ (సీఐసీ), చెలామణిలో ఉన్న నోట్ల విలువ (ఎన్‌ఐసీ) దాదాపు రెట్టింపు అయ్యాయని ఉత్తమ్ వివరించారు. చెలామణీలో ఉన్న కరెన్సీ 2016 మార్చిలో రూ.16,63,300 కోట్లు కాగా.. అది కాస్తా 2022 మార్చి నాటికి రూ.31,33,691 కోట్లు అయిందన్నారు. విధ్వంసకర పథకాన్ని అమలు చేసి సామాన్యులను ఇబ్బందులకు గురిచేసినందుకు గానూ ప్రధాని దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

అదో గుట్ట.. దానిపై ఉన్న గుండ్లనే కాన్వాస్‌గా మలచి ఆదిమానవులు దానిపై పురివిప్పి నర్తించిన నెమలిని గీశారు.. ఫీంకరిస్తూ కదలాడిన ఏనుగును సాక్షాత్కరింపజేశారు.. భారీ అడవిదున్నలను నియంత్రించిన తమ సహచరుల వీరత్వాన్ని చూపారు. సుమారు పదివేల ఏళ్ల నాటి ఈ చిత్రాలు పాత రాతియుగం మొదలు క్రీ.పూ.2 వేల ఏళ్ల క్రితం విలసిల్లిన తొలి చారిత్రక యుగం వరకు వివిధ కాలాల్లో ఆదిమానవులు గీసినవి. కానీ ఇప్పుడు వాటిని రియల్ ఎస్టేట్ వెంచర్లు మింగేస్తున్నాయి.

చరిత్రను చెరిపేస్తున్నారు



- ఆదిమానవులు గీసిన చిత్రాలపై రియల్ ఎస్టేట్ విధ్వంసం!
- రాజధాని శివారు గుండ్లపోచంపల్లి వద్ద వెంచర్ల కోసం గుట్ట తొలగింపు.. ఇప్పటికే రెండు పెయింటింగ్ షెల్టర్లు కనుమరుగు
- అదృశ్యం అంచున మరో మూడు..
- ఆ స్థలాన్ని రక్షిత ప్రాంతంగా పురావస్తు శాఖ గుర్తించకపోవడం వల్లే ఈ దుస్థితి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర రాజధానికి కూతవేటు దూరంలో చారిత్రక విధ్వంసం జరుగుతోంది. హైదరాబాద్‌కు 30 కి.మీ. దూరంలోని మేడ్చల్ జిల్లా గుండ్లపోచంపల్లిలో ఆదిమానవుల కాలం నాటి చిత్రకళ కనుమరుగవుతోంది. రియల్ ఎస్టేట్ వెంచర్లలో భాగంగా ఆదిమానవులు గీసిన చిత్రాలున్న గుట్ట శిథిలమవుతోంది. ఇప్పటికే రెండు కాన్వాస్‌లు మాయమవగా మరో మూడు విధ్వంసం అంచున నిలిచాయి. వాటిని పురావస్తు శాఖ రక్షిత ప్రాంతంగా గుర్తించకపోవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తింది.

30 అడుగుల భారీ కాన్వాస్..

గుట్టమీద ఎక్కువ చిత్రాలున్న గుండు ఓ కాన్వాస్‌లాగా కనిపిస్తోంది. దాదాపు 30 అడుగుల పొడవు, 6 అడుగుల ఎత్తుతో ఈ కాన్వాస్ నిండా ఆదిమానవులు ఎరుపురంగుతో గీసిన చిత్రాలే కనిపిస్తున్నాయి. క్రీ.పూ.10 వేల ఏళ్ల నుంచి 4 వేల ఏళ్ల మధ్యలో విలసిల్లిన పాత రాతియుగం, క్రీ.పూ.4 వేల ఏళ్ల నాటి కొత్త రాతియుగం, ఆ తర్వాతి తొలి చారిత్రక యుగం.. ఇలా మూడు కాలాల్లో ఈ చిత్రాలు గీసినట్టు పరిశోధకులు అభిప్రాయపడుతున్నారు. వీటిల్లో ఎక్కువగా అడవి దున్నల చిత్రాలున్నాయి. ఒక దున్న విడిగా ఉండగా, మరోచోట లావుగా ఉన్న దున్న ముందు మనిషి చేతిలో ఆయుధం పట్టుకుని నిలబడి ఉన్నాడు. దానికి ఓ పక్కన ఏనుగు చిత్రం కనిపిస్తోంది. దానికి దిగువన భారీ పింఛాన్ని విప్పిన నెమలి చిత్రం ఉంది. ఈ చిత్రం కొంత అస్పష్టంగా ఉంది. దాన్ని జిరాఫీ లేదా నీల్గాయ్ లాంటి జంతువుగా కూడా పరిశోధకులు భావిస్తున్నారు. వాటి చుట్టూ మరిన్ని చిత్రాలున్నాయి. వాటిలో పక్షులు, చెట్లు, చేపలు తదితర ఆకృతులున్నాయని అంటున్నారు. మరోపక్కన మనిషి రెండు చేతులతో రెండు భారీ జంతువుల మెడలు పట్టుకొని గాలిలో ఎత్తి పట్టుకున్నట్లు ఉంది. మరో కోణంలో చూస్తే మనుషులు చేతులను జతగా పట్టుకొని నర్తిస్తున్న అనుభూతి కూడా కలుగుతోంది.

2016లో చిత్రాల గుర్తింపు..

రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు దాదాపు 80 ప్రాంతాల్లో ఆదిమానవుల చిత్రాలు వెలుగుచూశాయి. 2016లో గుండ్ల పోచంపల్లికి చెందిన సాయికృష్ణ అనే రీసెర్చ్ స్కాలర్ గ్రామానికి 2 కి.మీ. దూరంలో ఉన్న మల్లన్నగుట్ట, చిత్రాలగుట్టలో ఆదిమానవులు గీసిన చిత్రాలతో ఉన్న ఐదు ప్రాంతాలను గుర్తించారు.

ప్రస్తుతం హైదరాబాద్ విస్తరించిన ప్రాంతంలో ఒకప్పుడు ఏనుగులు తిరిగేవనడానికి ఆదిమానవులు గీసిన ఈ చిత్రమే సాక్ష్యం.



▲ ఆదిమానవులు గీసిన చిత్రాల్లో ఏనుగు బొమ్మ ఉందంటే అప్పుడు, అక్కడ ఏనుగులు తిరగాడాయని స్పష్టమవుతోంది. ఇప్పటివరకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని పోతనపల్లిలో తొలి చారిత్రక కాలానికి చెందిన చిత్రాల్లో, సిద్దిపేట సమీపంలోని దాసర్లపల్లిలో చారిత్రక యుగానికి చెందిన చిత్రాల్లో ఏనుగులు ఉన్నాయి. తాజాగా గుండ్లపోచంపల్లిలో ఆదిమానవులు గీసిన చిత్రాల్లోనూ అవి కనిపించడం విశేషం.

చట్టం ఏం చెబుతోంది? ప్రభుత్వ స్థలం కానప్పటికీ చరిత్రలో కీలక ప్రాధాన్యం ఉన్న ఆధారాలు ఉంటే ఆ ప్రాంతాన్ని పురావస్తు శాఖ రక్షిత ప్రాంతంగా గుర్తించే వీలుంది.

పురావస్తు శాఖ పరిరక్షించాలి..

పురాతన స్థలాలు, రక్షిత కట్టడాల పరిరక్షణ చట్టం ప్రకారం చారిత్రక ఆధారాలున్న స్థలాన్ని సేకరించి రక్షిత కట్టడంగా ప్రకటించొచ్చు. లేదా ప్రైవేటు వ్యక్తుల అధీనంలోనే ఉంచుతూ దాన్ని రక్షిత కట్టడంగా ప్రకటించొచ్చు. ఇలాంటి ప్రాంతాలు ప్రమాదంలో పడ్డప్పుడు పురావస్తు శాఖ వెంటనే స్వాధీనం చేసుకొని పరిరక్షించాలి. వాటిని ధ్వంసం చేయకుండా స్థల యజమానులతో మాట్లాడాలి.

– డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ

అవి ధ్వంసమైతే ఆధారాలు దొరకవు..

గుండ్లపోచంపల్లిలో వెలుగుచూసిన ఆదిమానవుల చిత్రాలు అరుదైనవే. ఏనుగు, నెమలి బొమ్మలు రెండు, మూడుచోట్లనే కనిపించాయి. వాటి ఆధారంగా ఆదిమానవులకు సంబంధించి మరింత ఆసక్తి కలిగించే సమాచారం తెలుసుకునే వీలుంటుంది. అవి ధ్వంసమైతే అత్యంత విలువైన సమాచారాన్ని మనం చేజేతులా నాశనం చేసుకున్నట్టే. ప్రభుత్వం పరిరక్షణకు కదలాలి.

– బండి మురళీధర్‌రెడ్డి, ఆదిమానవుల రాతిచిత్రాల నిపుణుడు



ఆది మానవుల చిత్రాలు ఉన్నది ఈ గుట్టలోనే..

టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలో పోలింగ్ 90%

అత్యధికంగా గద్వాలలో 97.15, అత్యల్పంగా హైదరాబాద్‌లో 82.25 శాతం



హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో ఓ పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు

సాక్షి, హైదరాబాద్/నాగర్‌కర్నూల్: మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ స్థానానికి సోమవారం జరిగిన ఎన్నికలో 90.40 శాతం పోలింగ్ జరిగింది. ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు నెమ్మదిగా సాగిన పోలింగ్ ఆ తర్వాత ఊపందుకుంది. సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ముగిసే సమయానికి 9 జిల్లాల పరిధిలో సగటున 90.40 శాతం ఓటింగ్ నమోదైనట్లు అధికారులు పేర్కొన్నారు. అత్యధికంగా గద్వాల జిల్లాలో 97.15 శాతం, అత్యల్పంగా హైదరాబాద్ జిల్లాలో 82.25 శాతం పోలింగ్ నమోదైంది.

జిల్లాల వారీగా పోలింగ్ శాతం వివరాలిలా ఉన్నాయి

జిల్లా	పోలింగ్ శాతం
మహబూబ్‌నగర్	87.75
నాగర్‌కర్నూలు	93.96
వనపర్తి	93.48
గద్వాల్	97.15
నారాయణపేట్	93.77
రంగారెడ్డి	86.90
వికారాబాద్	94.76
మేడ్చల్	83.54
హైదరాబాద్	82.25

అరుణ్ పిళ్లై ఈడీ కస్టడీ పొడిగింపు


- కీలకవ్యక్తికి నోటీసులు ఇవ్వగానే ఈయన మాట మార్చారు
- బుచ్చిబాబుతో కలిసి విచారించాలి
- ప్రత్యేక కోర్టుకి విన్నవించిన ఈడీ న్యాయవాదులు



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో హైదరాబాద్ వ్యాపారవేత్త అరుణ్ పిళ్లై ఈడీ కస్టడీని ప్రత్యేక కోర్టు పొడిగించింది. పిళ్లై కస్టడీ ముగియడంతో ఈడీ అధికారులు సోమవారం రౌజ్ అవెన్యూ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి జస్టిస్ వికాస్ ముందు హాజరుపరిచారు. ఈడీ తరఫున న్యాయవాదులు నవీన్‌కుమార్, జోహబ్ హొస్సైన్ వాదనలు వినిపిస్తూ సౌత్‌గ్రూపులో కీలక వ్యక్తికి నోటీసులు జారీ చేయగానే తన వాంగ్మూలం ఉపసంహరణ పిటిషన్ దాఖలు దాఖలు చేశారని పరోక్షంగా కవితకు నోటీసులు జారీ అయిన తదుపరి ఇలా జరిగిందని ధర్మాసనానికి వివరించారు. సీసీ టీవీ సమక్షంలోనే పిళ్లైను విచారించామన్నారు. కేసు కీలక దశలో ఉందని ఆడిటర్ బుచ్చిబాబుతో కలిసి పిళ్లైని విచారించాల్సి ఉన్న కారణంగా కస్టడీని పొడిగించాలని కోరారు. మద్యం పాలసీ ముసాయిదా ఫోన్‌లోకి రావడం, హోటల్ సమావేశాలపై సౌత్‌గ్రూపులోని వారిని ప్రశ్నించాల్సి ఉందని తెలిపారు. తనని టార్చర్ చేశారని పిళ్లై ఆరోపిస్తున్నారని ఒకవేళ అలా చేస్తే మరో 12 సార్లు స్టేట్‌మెంట్లు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. విచారణ తర్వాతే పిళ్లై స్టేట్‌మెంట్లు రూఢీ చేసుకున్నామన్నారు. ఈడీ వాదనలతో పిళ్లై న్యాయవాదులు విభేదించారు. అనంతరం ఈ నెల 16 వరకూ పిళ్లైని ఈడీ కస్టడీకి న్యాయమూర్తి అనుమతించారు. ఈ నెల 15న విచారణకు రావాలని ఆడిటర్ బుచ్చిబాబుకు ఈడీ అధికారులు నోటీసులు ఇచ్చారు. గతంలో 9న విచారణకు రావాలని కోరగా బుచ్చిబాబు 13న వస్తానని అంగీకరించారని అయితే పిళ్లైను కోర్టులో హాజరు పరచాల్సి ఉండడంతో తేదీ మార్చినట్లు ఈడీ అధికారులు పేర్కొన్నారు. ఈ నెల 15న పిళ్లై, బుచ్చిబాబులను కలిపి ఈడీ విచారించనుండగా 16న విచారణకు రావాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు గత విచారణ సమయంలో ఈడీ స్పష్టం చేసిన విషయం విదితమే.

దర్యాప్తు సంస్థల దుర్వినియోగం

- పార్లమెంటులో బీఆర్ఎస్ ఆందోళన
- సభలో వాయిదా తీర్మానాలు.. కార్యక్రమాల స్తంభన
- ప్రతిపక్ష పార్టీలతో కలిసి నినాదాలు
- గాంధీ విగ్రహం వద్ద నిరసన
- రాజకీయం చేసేందుకే లిక్కర్ కేసు పొడిగింపు: కేకే



సాక్షి, న్యూఢిల్లీ: దర్యాప్తు సంస్థలను అడ్డం పెట్టుకొని దేశంలో బీజేపీ రాజకీయం చేస్తోందని బీఆర్ఎస్ ఎంపీలు మండిపడ్డారు. బీజేపీయేతర పాలిత రాష్ట్రాల్లోని ప్రభుత్వాలే లక్ష్యంగా ఈడీ, సీబీఐ లాంటి వాటిని ఉసిగొల్పుతున్నారని విమర్శించారు. ఈ మేరకు సోమవారం పార్లమెంటులో ఆందోళన చేపట్టారు. తొలుత పార్లమెంటు ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద దర్యాప్తు సంస్థల తీరుపై నిరసన తెలిపారు. ఆ తర్వాత ఉభయ సభల్లో కార్యకలాపాలను స్తంభింపజేసే ప్రయత్నం చేశారు. ఆయా అంశాలపై ఇచ్చిన వాయిదా తీర్మానాలపై చర్చించాలని పట్టుబట్టారు. ఇతర ప్రతిపక్ష పార్టీలతో కలిసి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో ఉభయ సభలను తొలుత మధ్యాహ్నం 2 గంటలకు, అనంతరం మంగళవారం ఉదయం 11 గంటలకు రాజ్యసభ చైర్మన్, లోక్‌సభ స్పీకర్‌లు వాయిదా వేశారు. అనంతరం విజయ్‌చౌక్‌లో పార్టీ ఎంపీలు జోగినపల్లి సంతోష్‌కుమార్, బడుగుల లింగయ్య యాదవ్‌లతో కలిసి బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కె.కేశవరావు మీడియాతో మాట్లాడారు.

రాజకీయం చేసేందుకే ఢిల్లీలో తమాషా

సీబీఐ, ఈడీలతో పాటు గవర్నర్లను తమకు అనుకూలంగా మార్చుకొని రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్రం వేధింపులకు గురిచేస్తోందని కేకే ఆరోపించారు. వీటిని అడ్డుకునేందుకు ప్రతిపక్ష పార్టీలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేపడతామని చెప్పారు. బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను పార్లమెంటులో ఎండగడతామని అన్నారు. ఢిల్లీ మద్యం కుంభకోణంలో గత ఏడాది సెప్టెంబర్‌లోనే తొలి అరెస్టు జరిగినప్పటికీ, కావాలని రాజకీయం చేసేందుకు కేంద్రం కేసును పొడిగిస్తోందని ఆరోపించారు. ఈ కేసులో దర్యాప్తు, విచారణల గురించి ఎవరూ భయపడట్లేదని..కానీ సీబీఐ, ఈడీ లాంటి సంస్థలు చట్ట ప్రకారం పని చేయాల్సిన అవసరం ఉందని అన్నారు.

కేసీఆర్ ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసే ఆలోచన

గత తొమ్మిదేళ్లగా కేంద్ర ప్రభుత్వం బీజేపీ పాలిత రాష్ట్రాలను ఒక మాదిరిగా.. బీజేపీయేతర పాలిత రాష్ట్రాలను మరో మాదిరిగా చూస్తోందని లింగయ్య యాదవ్ విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా సహా ఇతర అంశాలను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో, మా నిధులు మాకు కావాలంటూ సీఎం కేసీఆర్ గళం విప్పారన్నారు. అప్పటినుంచి ప్రధాని మోదీ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. కేసీఆర్ ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయాలన్న ఆలోచనతోనే ఎమ్మెల్సీ కవితపైకి ఈడీని ఉసిగొల్పారని ఆరోపించారు. తమ పోరాటం ప్రజాస్వామ్యయుతంగా, న్యాయబద్ధంగా కొనసాగుతుందని స్పష్టం చేశారు.

అసిస్టెంట్ ఇంజనీర్ పరీక్ష రద్దు!

పరీక్ష పేపర్ల లీకేజీని ప్రాథమిక దర్యాప్తులో తేల్చిన పోలీసులు

సాక్షి, హైదరాబాద్: వివిధ ప్రభుత్వ ఇంజనీరింగ్ విభాగాల్లో అసిస్టెంట్ ఇంజనీర్, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్, టెక్నికల్ ఆఫీసర్, జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ ఉద్యోగాల భర్తీకి సంబంధించి ఈనెల 5న టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన అర్హత పరీక్ష రద్దు కానుంది. ఈ పరీక్ష ప్రశ్నపత్రాలు లీకైనట్టు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో బయటపడిన నేపథ్యంలో.. రద్దు చేయడమే మేలని టీఎస్‌పీఎస్సీ భావిస్తున్నట్టు తెలిసింది. మంగళవారం కమిషన్ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తోంది. కమిషన్ చైర్మన్ జనార్దనరెడ్డితోపాటు సభ్యులు, కమిషన్ కార్యదర్శి, సంబంధిత అధికారులు ఇందులో పాల్గొననున్నారు. ప్రధానంగా అసిస్టెంట్ ఇంజనీర్ పరీక్షకు సంబంధించిన అంశాలపైనే చర్చించనున్నారు. ప్రశ్నపత్రం లీకేజీ జరిగిన నేపథ్యంలో అభ్యర్థులకు ఇబ్బంది అయినా కూడా పరీక్షను రద్దు నిర్ణయమే సరైనదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. సమావేశం తర్వాత దీనిని అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

837 పోస్టులు.. 54,917 మంది అభ్యర్థులు..

టీఎస్‌పీఎస్సీ గత ఏడాది మొత్తం 837 అసిస్టెంట్ ఇంజనీర్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చింది. 74,478 మంది దరఖాస్తు చేసుకోగా.. ఈ నెల 5న ఉదయం, మధ్యాహ్నం రెండు పరీక్షలు జరిగాయి. 54,917 మంది పరీక్షలు రాశారు.

ఏఈ పేపర్ లీక్

ఈ నెల 5న జరిగిన పరీక్ష రెండు పేపర్లు ముందే లీక్

ఈ రెండింటి ప్రశ్నపత్రాలను డౌన్‌లోడ్ చేసుకున్న ప్రవీణ్

- ఏఈ పేపర్ పలువురికి విక్రయం..
- టీచర్ రేణుక, ఆమె భర్తతో కలసి వ్యవహారం
- స్కామ్‌లో తొమ్మిది మంది అరెస్టు.. వీరిలో ఒకరు పోలీస్ కానిస్టేబుల్
- ఫోరెన్సిక్ విశ్లేషణ తర్వాతే స్పష్టత: డీసీపీ కిరణ్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ఈ నెల 5న నిర్వహించిన అసిస్టెంట్ ఇంజనీర్స్ (ఏఈ సివిల్) పరీక్ష పేపర్లు లీకైనట్టు పోలీసులు తేల్చారు. టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి వ్యక్తిగత సహాయకుడైన పి.ప్రవీణ్‌కుమార్ ఈ ప్రశ్నపత్రాలనే టీచర్ రేణుక, ఆమె భర్త లవుడ్యావత్ డాక్యాకు అందించాడని గుర్తించారు. వీటితోపాటు ప్రవీణ్‌కు చెందిన పెన్‌డ్రైవ్‌లో టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీర్ పరీక్ష పేపర్ కూడా ఉందని, దాన్ని విక్రయించేందుకు అతను ఒప్పందం చేసుకున్నాడని ఆధారాలు సేకరించారు. హైదరాబాద్ సౌత్‌వెస్ట్ జోన్ డీసీపీ కిరణ్ సోమవారం రాత్రి టాస్క్‌ఫోర్స్ ఓఎస్డీ పి.రాధాకిషన్‌రావుతో కలసి లీకేజీ వ్యవహారం వివరాలను వెల్లడించారు.

కారుణ్య నియామకం కింద వచ్చి..

ఏపీలోని రాజమండ్రికి చెందిన పి.హరిశ్చంద్రరావు కుమారుడు ప్రవీణ్‌కుమార్. హరిశ్చంద్రరావు ఉమ్మడి రాష్ట్రంలో డీజీపీ కార్యాలయం ప్రెస్‌కు అదనపు ఎస్పీగా పనిచేశారు. ఆయన ఉద్యోగంలో ఉండగానే అనారోగ్యంతో మరణించడంతో కారుణ్య నియామకం కింద ప్రవీణ్‌కుమార్‌కు జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం వచ్చింది. బీటెక్ పూర్తిచేసిన ప్రవీణ్ 2017 నుంచి టీఎస్‌పీఎస్సీలో పనిచేస్తూ ప్రస్తుతం అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ హోదాలో కమిషన్ కార్యదర్శికి వ్యక్తిగత సహాయకుడిగా వ్యవహరిస్తున్నాడు. ఇక మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన రేణుక 2018లో టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన పరీక్ష ద్వారా గురుకుల హిందీ టీచర్‌గా ఎంపికై .. ప్రస్తుతం వనపర్తిలో విధులు నిర్వర్తిస్తోంది. ఆమె భర్త లవుడ్యావత్ డాక్యా వికారాబాద్‌లోని డీఆర్‌డీఏలో పనిచేస్తున్నాడు. టీఎస్‌పీఎస్సీ పరీక్షకు సిద్ధమైన నాటి నుంచీ రేణుక, ప్రవీణ్ మధ్య సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఆమె తరచూ కమిషన్ కార్యాలయానికి వచ్చి ప్రవీణ్‌ను కలిసేది.

ల్యాన్ ద్వారా యాక్సెస్ చేసి..

టీఎస్‌పీఎస్సీ ఉద్యోగ పరీక్షల పేపర్లు లీక్ చేసేందుకు రేణుక, లవుడ్యావత్ డాక్యా పథకం వేశారు. పేపర్లను తమకు ఇవ్వాలని ప్రవీణ్‌ను రేణుక కోరింది. టీఎస్‌టీఎస్‌లో ఔట్ సోర్సింగ్ విధానంలో నెట్‌వర్క్ అడ్మిన్‌గా పనిచేస్తున్న అట్ల రాజశేఖర్‌తో ప్రవీణ్ కలిసి పేపర్ లీకేజీకి మార్గాలు అన్వేషించాడు. పరీక్ష పేపర్లన్నీ కమిషన్ కాన్ఫిడెన్షియల్ సెక్షన్‌లోని కంప్యూటర్‌లో ఉంటాయి. ఈ సెక్షన్‌కు నేతృత్వం వహించే కస్టోడియన్ శంకరలక్ష్మి తన కంప్యూటర్ పాస్‌వర్డ్, యూజర్ ఐడీలను నిత్యం వినియోగించే పుస్తకం చివరి పేజీలో రాసి పెట్టుకున్నారు. ఈ విషయం తెలిసిన ప్రవీణ్ ఆమె కార్యదర్శి పేషీకి వచ్చినప్పుడు.. ఆమె పుస్తకం నుంచి తస్కరించాడు. ప్రవీణ్ కంప్యూటర్ నుంచే శంకరలక్ష్మి కంప్యూటర్‌ను యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌తో యాక్సెస్ చేశాడు. ఇద్దరూ కలిసి ఆ కంప్యూటర్‌లో నుంచి ఏఈ పరీక్షకు సంబంధించిన జనరల్ స్టడీస్, సివిల్ పేపర్లను, టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీర్ పరీక్ష పేపర్‌ను కాపీ చేసుకున్నారు. ప్రవీణ్ వీటిని తన పెన్‌డ్రైవ్‌లో వేసుకున్నాడు. ఏఈ పరీక్ష ప్రశ్నపత్రాలను ప్రింట్ ఔట్ తీసుకున్నాడు.



ప్రవీణ్

ఇంట్లోనే చదివించి, దగ్గరుండి పరీక్ష రాయించి..

మరోవైపు టీచర్ రేణుక, లవుడ్యావత్ డాక్యా ఏఈ పరీక్ష పేపర్లు విక్రయించేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. రేణుక సోదరుడు, మాన్సూర్‌పల్లి తండా సర్పంచ్ కుమారుడైన కేతావత్ రాజేశ్వర్‌నాయక్‌ను.. అతడి ద్వారా మేడ్చల్ ఠాణాలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కేతావత్ శ్రీనివాస్ (రాజేశ్వర్ సోదరుడు)ను సంప్రదించి ఏఈ పేపర్ విషయం చెప్పారు. ఎస్సై పరీక్షకు సిద్ధమవుతున్న శ్రీనివాస్.. తనకు ఏఈ పేపర్ వద్దని చెప్పి, పరిచయస్తులైన కేతావత్ నీలేశ్‌నాయక్, పత్లావత్ గోపాల్‌నాయక్‌ల పేర్లు చెప్పాడు. దీనితో వారిని సంప్రదించిన రేణుక, డాక్యా రూ.13.5 లక్షలకు ఒప్పందం కుదుర్చుకుని అడ్వాన్స్ తీసుకున్నారు. ఏఈ పేపర్లు ప్రింట్ తీసుకున్న ప్రవీణ్.. ఈ నెల 2న రేణుక, డాక్యాలకు ఫోన్ చేసి చెప్పాడు. అప్పుడు మహబూబ్‌నగర్‌లో ఉన్న వారిద్దరూ వెంటనే బాలాపూర్ వరకు వచ్చి ప్రవీణ్‌ను కలిశారు. ఏఈ పరీక్ష పేపర్లు తీసుకుని రూ.5 లక్షలు ఇచ్చారు. నీలేశ్, గోపాల్‌తో పాటు నీలేశ్ సోదరుడు రాజేంద్రనాయక్‌లను గండీడ్ మండలం పంచగల్ తండాలోని తమ ఇంటికి తీసుకువెళ్లారు. 5న ఉదయం డాక్యా అభ్యర్థులను వెంటపెట్టుకుని సరూర్‌నగర్‌లోని పరీక్ష కేంద్రం వరకు వచ్చి.. పరీక్ష రాయించాక విడిచిపెట్టాడు.

టీఎస్‌పీఎస్సీ ఉద్యోగులు ఇద్దరిపై వేటు

అసిస్టెంట్ ఇంజనీర్ పేపర్ల లీక్ వ్యవహారంలో ఇద్దరు ఉద్యోగులపై టీఎస్‌పీఎస్సీ వేటు వేసింది. అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్‌ను సస్పెండ్ చేయడంతోపాటు శాఖాపరమైన విచారణకు ఆదేశించింది. ఔట్‌సోర్సింగ్ విధానంలో కంప్యూటర్ నెట్‌వర్క్ ఎక్స్‌పర్ట్‌గా పనిచేస్తున్న రాజశేఖర్‌రెడ్డిని ఉద్యోగం నుంచి శాశ్వతంగా తొలగించింది. ఇక ఈ వ్యవహారంలో భాగస్వాములైన గురుకుల టీచర్ రేణుక, పంచాయతీ రాజ్ శాఖ ఉద్యోగి, పోలీస్ కానిస్టేబుల్ ముగ్గురూ ప్రభుత్వ ఉద్యోగులే కావడంతో.. వారిపైనా చర్యలు తీసుకునేందుకు సంబంధిత శాఖలు సిద్ధమయ్యాయి.

మరికొన్ని పేపర్ల లీకేజీపై అనుమానాలు

6న తేదీన మళ్లీ ప్రవీణ్‌ను కలిసిన రేణుక, ఆమె భర్త ప్రశ్నపత్రాల కాపీలతోపాటు మరో రూ.5 లక్షలు ఇచ్చారు. పేపర్ల లీకేజీపై అనుమానం వచ్చిన టీఎస్‌పీఎస్సీ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రఘునాథ్ నేతృత్వంలోని బృందం.. ప్రవీణ్, రాజశేఖర్, రేణుక, లవుడ్యావత్ డాక్యా, రాజేశ్వర్, నీలేశ్, గోపాల్, శ్రీనివాస్, రాజేందర్‌లను అరెస్టు చేసింది. వారి నుంచి పెన్‌డ్రైవ్‌లు, ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకుంది. ప్రవీణ్ పెన్‌డ్రైవ్‌ను పరిశీలించిన పోలీసులు.. అందులో టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీర్ పరీక్ష పేపర్ ఉందని, దాన్ని విక్రయించడానికి ప్రయత్నించాడని గుర్తించారు. ప్రవీణ్ కంప్యూటర్‌ను ఫోరెన్సిక్ పరీక్షలకు పంపారు. ఆ నివేదిక అందిన తర్వాత.. అతను, రాజశేఖర్ ఎవరెవరి కంప్యూటర్లను యాక్సస్ చేశారు? ఏమేం పేపర్లు డౌన్‌లోడ్ చేశారనేది తెలుతుందని డీసీపీ వెల్లడించారు.

ఏ బోర్డు.. ఎంత భద్రం!

నియామక సంస్థల పరిస్థితిపై ప్రభుత్వం దృష్టి

- టీఎస్‌పీఎస్సీ వ్యవహారం నేపథ్యంలో లోతైన పరిశీలనకు నిర్ణయం
- ఉద్యోగులు, సాంకేతికత, గోప్యత తదితరాలపై సమీక్ష
- నేడు చైర్మన్లు, ఉన్నతాధికారులతో సీఎస్ ప్రత్యేక సమావేశం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ)లో కంప్యూటర్ల నుంచి ప్రశ్నపత్రాల తస్కరణ వ్యవహారంతో రాష్ట్ర సర్కారు అప్రమత్తమైంది. ఈ వ్యవహారం ప్రభుత్వానికి మచ్చగా మారుతుందేమోనన్న ఉద్దేశంతో ముందు జాగ్రత్తగా వాస్తవ పరిస్థితుల విశ్లేషణకు ఉపక్రమించింది. వివిధ ప్రభుత్వ శాఖల్లో 80 వేలకు పైగా ఉద్యోగ ఖాళీల భర్తీని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రభుత్వం.. ఆ మేరకు నియామక సంస్థలకు బాధ్యతలు అప్పగించింది. రాష్ట్రంలో నాలుగు నియామక సంస్థలున్నాయి. టీఎస్‌పీఎస్సీ, తెలంగాణ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (టీఎస్ఎల్‌పీఆర్‌బీ), తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్ రిక్రూట్‌మెంట్ బోర్డు (టీఆర్ఈఐఆర్‌బీ), తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (టీఎంహెచ్ఎస్ఆర్‌బీ)ల ద్వారా ఉద్యోగ నియామకాలు కొనసాగుతున్నాయి. తాజా పరిణామాల నేపథ్యంలో వాటి పనితీరును సమీక్షించాలని, ఏ బోర్డు..ఎంత భద్రమో క్షుణ్ణంగా పరిశీలించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా మంగళవారం నియామక సంస్థల చైర్మన్లు, సంబంధిత ఉన్నతాధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించనుంది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధ్యక్షతన సమావేశం జరగనుంది.

మానవ వనరులపై నిఘా...?

ప్రస్తుతం చాలా ఉద్యోగ ప్రకటనలకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ పూర్తికాగా, కొన్నింటికి ప్రాథమిక పరీక్షలు నిర్వహించడంతో తదుపరి దశకు చేరుకున్నాయి. నియామక సంస్థల్లో మానవ వనరులు, సాంకేతిక పరిజ్ఞానం, గోప్యత అనేవి అత్యంత కీలకం. ఆయా అంశాల్లో ఎలాంటి పొరపాట్లు జరిగినా నియామక సంస్థల ప్రతిష్ట దెబ్బతినడంతో పాటు, ఎన్నో ఆశలతో, కఠోర దీక్షతో సన్నద్ధమైన అభ్యర్థులకు అన్యాయం జరుగుతుంది. తాజాగా టీఎస్‌పీఎస్సీ ఉద్యోగులే కంప్యూటర్లు హ్యాక్ చేయడంతో పాటు ప్రశ్నపత్రాన్ని బయటకు లీక్ చేశారనే అభియోగాలున్నాయి. ఈ నేపథ్యంలో మిగతా బోర్డుల్లో మానవ వనరుల పరిస్థితి, సాంకేతిక పరిజ్ఞానం తీరును సమీక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉపక్రమించింది. బోర్డుల వారీగా ఉద్యోగులు, వారి అర్హతలు, బాధ్యతలు, అధికారాలపై పూర్తిస్థాయి నివేదికలు తెప్పించుకోవాలని నిర్ణయించింది. ప్రస్తుతం టీఎస్‌పీఎస్సీలో శాశ్వత ప్రాతిపదికన పనిచేసే ఉద్యోగుల సంఖ్య తక్కువగా ఉండటంతో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను నియమించుకున్నట్లు తెలుస్తోంది. ఇతర బోర్డుల పరిస్థితిని కూడా సమీక్షించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తగిన సూచనలు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలుస్తోంది. మరోవైపు నియామక సంస్థలు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎక్కడ్నుంచి తీసుకుంటున్నాయి? బయటి నుంచి ఈ మేరకు సహకారం తీసుకుంటున్నాయనే కోణంలో ప్రభుత్వం పరిశీలించనుంది.

క్లుప్తంగా...

బుద్ధవనానికి రండి

దలైలామాకు ఆహ్వానం



దలైలామాకు జ్ఞాపిక అందిస్తున్న లక్ష్మయ్య

సాక్షి, హైదరాబాద్: నాగార్జునసాగర్ తీరంలో ప్రతిష్టాత్మకంగా రూపొందించిన బుద్ధవనాన్ని సందర్శించాలని ఆ ప్రాజెక్టు ప్రత్యేకాధికారి మల్లేపల్లి లక్ష్మయ్య బౌద్ధ ఆధ్యాత్మికవేత్త దలైలామాను ఆహ్వానించారు. సోమవారం హిమాచల్‌ప్రదేశ్‌లోని ధర్మశాలలో ఆయన, బౌద్ధ విషయ నిపుణుడు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి తదితరులతో కలిసి దలైలామాతో భేటీ అయ్యారు. 2006లో జరిగిన కాలచక్ర మహా సమ్మేళనంలో పాల్గొనేందుకు వచ్చినప్పుడు దలైలామా బుద్ధవనం ప్రాంగణంలో నాటిన బోధి మొలక ప్రస్తుతం పెద్ద వృక్షంగా మారిన ఫొటోలను ఆయనకు చూపించారు.

అమ్మకోసం ఉద్యోగం వదిలి

తల్లితో కలిసి స్కూటర్‌పై తీర్థయాత్రలు



నిజామాబాద్ సిటీ: అమ్మకోసం లక్ష రూపాయల జీతం వదిలిపెట్టి తండ్రి స్కూటర్‌పై తల్లితో తీర్థయాత్రలకు బయలుదేరాడు ఓ కొడుకు. యాత్రలో భాగంగా సోమవారం తల్లీకొడుకులు నిజామాబాద్‌కు చేరుకున్నారు. కర్ణాటక రాష్ట్రం మైసూర్‌కు చెందిన దక్షిణామూర్తి కృష్ణకుమార్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసేవాడు. తల్లికి చిన్నప్పటి నుంచి దేశంలోని పుణ్య క్షేత్రాలన్నీ చూడాలని కోరిక. దీంతో ఆమె కుమారు డు ఉద్యోగం వదులుకుని తండ్రి జ్ఞాపకార్థంగా ఉంచుకున్న స్కూటర్‌పై 2018 జనవరి 16న తీర్థయాత్ర మొదలుపెట్టాడు. ఇప్పటివరకు కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, పశ్చిమ బంగ్లా, సిక్కిం, గోవా, కేరళ, మేఘలయా, త్రిపుర, మణిపూర్, మిజోం నేపాల్, భూటాన్, మయన్మార్ దేశాలలో పుణ్యక్షేత్రాలను తల్లికి చూపించాడు. తల్లి కోరికను నెరవేరుస్తున్న కొడుకు ప్రేమను.. చూసిన వారు మెచ్చుకుంటున్నారు.

చల్లగరిగలో ఆస్కార్ పండుగ

- 'నాటు..నాటు' రచయిత చంద్రబోస్ స్వగ్రామంలో వేడుకలు
- బాణసంచా పేల్చి, మిఠాయిలు పంచిన స్నేహితులు, గ్రామస్తులు
- పుస్తక పఠనం, భజన పాటలతోనే ఈ స్థాయికి..



చంద్రబోస్ ఇల్లు.. పక్కనే గ్రంథాలయం, శివాలయం



చల్లగరిగ గ్రామం



వరంగల్ డెస్క్: పాఠశాల.. గ్రంథాలయం.. శివాలయం.. ఈ మూడూ ఒకరి జీవితంతో ఎంతో ముడిపడి ఉన్నాయి. చదువు నేర్పింది పాఠశాల అయితే.. భాష, యాసను నేర్పింది గ్రంథాలయం.. ఆధ్యాత్మికతను ఒంటబట్టించింది శివాలయం. ఈ మూడింటినీ, ఆయన్ను వేర్వేరుగా చూడలేం అంటున్నారు ఆ గ్రామస్తులు. ఆయన ఎవరో కాదు.. విశ్వ వేదికపై చెలరేగి బెస్ట్ ఒరిజినల్ సాంగ్ కేటగిరీలో ఆస్కార్ అవార్డు దక్కించుకున్న 'నాటు. నాటు' పాట రచయిత చంద్రబోస్. 'మౌనంగానే ఎదగమనీ.. మొక్క నీకు చెబుతుంది.. ఎదిగిన కొద్దీ ఒదగమనీ..అర్థమందులో ఉంది..' అన్న పాటలో ఆయన వ్యక్తిత్వం ఇమిడి ఉందంటూ గుర్తు చేసుకుంటున్నారు ఆయన బాల్య స్నేహితులు. చంద్రబోస్ పాటకు ఆస్కార్ అవార్డు దక్కడంతో ఆయన స్వగ్రామం జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం చల్లగరిగ సోమవారం పండుగ చేసుకుంది. బాణసంచా కాల్చి వేడుకలు జరుపుకొంది.

గ్రంథాలయంలో పఠనం.. శివాలయంలో భజనలు

చంద్రబోస్‌గా సుపరిచితమైన కనుకుంట్ల సుభాష్ చంద్రబోస్ తండ్రి నర్సయ్య ఉపాధ్యాయుడు. తల్లి మదనమ్మ గృహిణి. వీరికి నలుగురు (రాజేందర్, కోటేశ్వర్‌రావు, స్వరూప, చంద్రబోస్) సంతానం కాగా చంద్రబోస్ ఆఖరివాడు. ఒకటినుంచి పదో తరగతి వరకు స్వగ్రామమైన చల్లగరిగలోనే చదివాడు. గ్రామంలో చంద్రబోస్ ఇంటిని ఆనుకునే గ్రంథాలయం, దానికి ఆనుకుని శివాలయం ఉంటాయి. పాఠశాల ముగియగానే గ్రంథాలయానికి వెళ్లేవాడు. చందమామ, బొమ్మరిల్లు, పురాణ గాథలు.. ఇలా గ్రంథాలయంలోని ప్రతి పుస్తకాన్ని చదివేవాడు. ఆ సమయంలోనే చిన్న చిన్న కవితలు, కథలు రాసి గ్రంథాలయంలో ఉంచేవాడని, తను రాసినవి ఎవరైనా చదువుతున్నారా.. లేదా అన్నది కిటికీలోనుంచి చూసేవాడని బాల్య మిత్రుడు దావు వీరారెడ్డి తెలిపారు. ఇక ప్రతి సోమవారం శివాలయంలో భజనలు చేసేవారు. ఇందులో చంద్రబోస్ లేకుండా భజన సాగేది కాదు. తండ్రి తబలా కొడుతుంటే చంద్రబోస్ పాటలు, కీర్తనలు పాడేవాడని, ఇంటిల్లిపాదికీ ఆధ్యాత్మిక భావన ఎక్కువని గ్రామస్తులు చెప్పుకొచ్చారు. హార్మోనియం, కంజర బాగా కొట్టేవాడని తెలిపారు. చంద్రబోస్‌లో సాహిత్య కాంక్ష పెరగడానికి, పాటల రచయితగా ఎదగడానికి గ్రంథాలయం, శివాలయమే కారణమని, ఇవి లేకుండా చంద్రబోస్ ప్రస్థానాన్ని ఊహించుకోలేమని గ్రామానికి చెందిన రాజమౌళి చెప్పారు. హైదరాబాద్‌లో డిప్లొమా, ఇంజనీరింగ్ చదివి..ఆ తర్వాత సినీ రంగ ప్రవేశం చేశారని తెలిపారు.

విశ్వవేదికపై గ్రామ ప్రతిష్ట

మారుమూల గ్రామమైన చల్లగరిగకు చెందిన చంద్రబోస్ పేరు విశ్వవేదికపై మారుమోగడంతో యావత్ గ్రామం సంబరాల్లో మునిగిపోయింది. చంద్రబోస్ వేదికపై నిల్చుని ఆస్కార్ అవార్డు అందుకున్న క్షణాలను టీవీల్లో చూసిన గ్రామస్తులు పులకించిపోయారు. ఏదో ఒకరోజు చంద్రబోస్ గ్రామానికి పేరు ప్రఖ్యాతులు తెస్తారని ఆశించిన బాల్య స్నేహితులు, గ్రామస్తులు అది నిజం కావడంతో.. చంద్రబోస్ ఇంటి ముందు బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకున్నారు.

మార్గదర్శి మదనమ్మే..

చంద్రబోస్‌కు అన్నివిధాలా మార్గదర్శి ఆయన తల్లి మదనమ్మేనని చెప్పొచ్చు. భర్త టీచర్ అయినా.. వచ్చేది కొద్దిపాటి జీతమే. పెద్ద కుటుంబానికి అది ఎటూ సరిపోకపోయేది. దీంతో ఆమె ఉదయం కూలి పనులకు వెళ్లేవారని, సెలవు రోజుల్లో చంద్రబోస్ కూడా తల్లితో కలిసి వెళ్లేవాడని గ్రామస్తులు తెలిపారు. మదనమ్మ ఎంతో క్రమశిక్షణతో పిల్లల్ని పెంచారని, అందుకే నలుగురు పిల్లల్లో ఎవరికీ కించింత గర్వం కనిపించదని చెప్పారు. మదనమ్మ మూడేళ్ల క్రితం మరణించగా.. నర్సయ్య ప్రస్తుతం హైదరాబాద్‌లోనే కుమారుల వద్ద ఉంటున్నారు.

ఏ కార్యక్రమమైనా బోస్ పాట పాడాల్సిందే



గ్రామంలో కానీ, పాఠశాలలో కానీ ఏదైనా కార్యక్రమం జరిగితే చంద్రబోస్ పాట పాడాల్సిందే. తోటి విద్యార్థులందరూ బోస్ ఎక్కడంటూ వెతికేవాళ్లు. మా ఇద్దరిదీ పక్కపక్క ఇళ్లే. పదవ తరగతి వరకు కలిసి చదువుకున్నాం. తర్వాత ప్రాణస్నేహితులమయ్యాం. ఇప్పుడు ఆ స్థాయిలో ఉన్నా ఫోన్ చేసి గ్రామ విషయాలు మాట్లాడతాడు. నాటు నాటు పాటకు తప్పకుండా ఆస్కార్ అవార్డు వస్తుందని కూడా ఫోన్ చేసి చెప్పాడు. ఇప్పుడు అవార్డు రావడం.. నా స్నేహితుడు అందుకోవడంతో మాటలు రావడం లేదు.

– దావు వీరారెడ్డి, బాల్య స్నేహితుడు

క్రమశిక్షణకు మారు పేరు



నేను చంద్రబోస్‌ను చిన్నప్పటి నుంచి చూస్తున్నా. క్రమశిక్షణకు మారు పేరుగా ఉండేవాడు. పాఠశాల నుంచి రాగానే గ్రంథాలయంలో పుస్తకాలు చదివేవాడు. గ్రామంలో జరిగే ప్రతి కార్యక్రమంలో పాల్గొనేవాడు. భజన పాటలు ఎంతో హృద్యంగా ఆలపించేవాడు.

– రాజమౌళి, గ్రామ గ్రంథాలయ కమిటీ చైర్మన్

సైన్యానికి దన్నుగా స్వయ

దేశంలోనే తొలిసారి నాలుగు కాళ్ల రోబో, ఎక్సోస్కెలిటన్ నమూనాలు సిద్ధం

- డీఆర్‌డీవో అనుబంధ సంస్థలతో కలసి రూపొందించిన స్వయ రొబోటిక్స్
- నమూనాల పనితీరును పరిశీలించిన రక్షణశాఖ సలహాదారు డాక్టర్ జి.సతీశ్‌రెడ్డి
- రక్షణ రంగంలో రానున్న కాలం రోబోలదే



రొబోటిక్స్ నమూనాలను పరిశీలిస్తున్న డాక్టర్ సతీశ్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రక్షణరంగ అవసరాల కోసం దేశంలోనే తొలిసారిగా నాలుగు కాళ్ల రోబో, సైనికులు ధరించగల ఎక్సోస్కెలిటన్ నమూనాలు సిద్ధమయ్యాయి. డీఆర్‌డీవో అనుబంధ సంస్థలైన రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్, డిఫెన్స్ బయో–ఇంజనీరింగ్ అండ్ ఎలక్ట్రో మెడికల్ లేబొరేటరీల సహాయ సహకారాలతో హైదరాబాద్‌కు చెందిన స్టార్టప్ సంస్థ స్వయ రొబోటిక్స్ వీటిని రూపొందించింది. ఈ నమూనాలను రక్షణశాఖ సలహాదారు, డీఆర్‌డీవో మాజీ చైర్మన్ డాక్టర్ జి.సతీశ్‌రెడ్డి సోమవారం ఆయన పరిశీలించారు. రక్షణ, డీఆర్‌డీవో వర్గాలతో కలసి రోబో తయారీ అభివృద్ధి పనులను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్షణ రంగంలో రానున్న కాలంలో రోబోలదే కీలకపాత్రని స్పష్టం చేశారు. ప్రతికూల భౌగోళిక పరిస్థితులను అధిగమించి నిఘా పనులు చేసేందుకు, సైనికుల మోతబరువును తగ్గించడంలోనూ రోబోల సేవలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ''అతితక్కువ కాలంలో స్వయ రొబోటిక్స్ వీటిని (రోబో, ఎక్సోస్కెలిటన్లను) రూపొందించడం హర్షణీయం. దేశ రొబోటిక్స్ రంగం పురోగతికి ఇలాంటి భాగస్వామ్యాలు ఎంతో ఉపయోగపడతాయి. క్షేత్ర పరీక్షలు వేగంగా పూర్తి చేసి అటు రక్షణ, ఇటు పరిశ్రమ వర్గాలకు ఉపయోగపడే ఈ రకమైన రోబోలను వేగంగా అభివృద్ధి చేయాలని అనుకుంటున్నాం'' అని సతీశ్‌రెడ్డి చెప్పారు. డీఆర్‌డీవో 'మేకిన్ ఇండియా' కార్యక్రమంలో భాగంగా స్వయ రొబోటిక్స్ వంటి ప్రైవేటు సంస్థలతో రోబోలను తయారు చేయడం ఇదే మొదటిసారి. ప్రస్తుతం ఇలాంటి సైనిక రోబోలను అమెరికా, స్విట్జర్లాండ్‌ల నుంచి దిగుమతి చేసుకుంటుండగా లేహ్, లద్దాఖ్ లాంటి ప్రాంతాల్లో అవి పనిచేయలేవు. ఎందుకంటే వాటిని నిర్దిష్ట పరిసరాల్లోనే పనిచేసేలా రూపొందించారు. పైగా వాటిల్లో ఫీచర్లు కూడా తక్కువ. ఈ ఇబ్బందులను అధిగమించేందుకు స్వయ రోబోలు ఉపయోగపడతాయని అంచనా.



రెండేళ్లలో మిలటరీకి: విజయ్ శీలం

రక్షణ శాఖ అవసరాలకోసం సిద్ధం చేసిన రోబో నమూనా తొలి తరానిదని.. మరిన్ని ఫీచర్లు, సామర్థ్యాలను జోడించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని స్వయ రొబోటిక్స్ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ విజయ్ ఆర్. శీలం తెలిపారు. అమెరికాలో బోస్టన్ డైనమిక్స్‌తో పాటు ఇతర దేశాల్లోని కొన్ని సంస్థలు కూడా ఇలాంటి రోబోలు తయారు చేస్తున్నా... మిలటరీ అవసరాల కోసం తామే తొలిసారి తయారు చేశామని ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ చెప్పారు. సైనికులు వాడే ఆయుధాలు, సమాచార పరికరాలను ఈ రోబో సునాయాసంగా మోసుకెళ్లగలదని, ప్రమాదకర పరిస్థితుల్లోనూ శత్రు స్థావరాలను పరిశీలించి రాగలదని ఆయన తెలిపారు. జమ్మూకశ్మీర్ సరిహద్దులపై నిఘా ఉంచే రోబోలను ఇతర ప్రాంతాల నుంచి కూడా నియంత్రించొచ్చని వివరించారు. తొలి తరం నమూనాలో నడక మాత్రమే సాధ్యమవుతుందని, సమీప భవిష్యత్తులోనే వాటికి చూపును కూడా అందించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. అన్నీ సవ్యంగా సాగితే ఇంకో రెండేళ్లలో ఈ రోబో సైన్యానికి సేవలందించే అవకాశం ఉందన్నారు. పాదాల్లో ఏర్పాటు చేసిన సెన్సర్లు, ఇతర పరికరాల ద్వారా ఈ రోబో నేల, కాంక్రీట్, రాయిల మధ్య తేడాలను గుర్తించి నడకను నియంత్రించుకోగలదని వివరించారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.